
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 8.00 సంపుటి: 16 సంచిక: 280
SUNDAY Special ఆదివారం 23-6-2024
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'



బంగ్లాపై విజయ భేరి

టి20 ప్రపంచ కప్ సూపర్-8 దశలో భారత్ వరుసగా రెండో విజయాన్ని సాధించింది. శనివారం జరిగిన పోరులో టీమిండియా 50 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసి దాదాపు సెమీస్‌లోకి అడుగు పెట్టింది. హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించాడు. కుల్దీప్ యాదవ్‌కు 3 వికెట్లు దక్కాయి. - వివరాలు 12లో





'పరీక్షల'పై ఉన్నతస్థాయి కమిటీ

ఎన్‌టీఏ పరీక్షల ప్రక్రియ సజావుగా సాగేందుకు కేంద్ర విద్యాశాఖ ఇస్రో మాజీ ఛైర్మన్ కె.రాధాకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేసింది.

వివరాలు 6లో ▸



అభివృద్ధి భాగస్వామి బంగ్లాదేశ్

ఇరు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి ప్రణాళిక రూపొందించుకోవాలని భారత్, బంగ్లాదేశ్ నిర్ణయించుకున్నాయి.

వివరాలు 6లో ▸



'అయోధ్య' ప్రధాన పూజారి మృతి

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రధాన పూజారి ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ పరమపదించారు.

వివరాలు 6లో ▸



ఇరాన్‌లో ఎన్నికలకు వేళాయె

ఇరాన్‌లో 28న అధ్యక్ష ఎన్నిక జరగనుంది. సుప్రీం లీడర్ అయతొల్లా అభీష్టానుసారం ఎంపికైన ఆరుగురు రేసులో ఉన్నారు.

వివరాలు 6లో ▸

పతాకస్థాయికి టీడీపీ కక్షసాధింపు

పార్టీ ఆఫీసు కూల్చేశారు

తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయం కూలగొట్టిన బాబు సర్కార్

- శనివారం ఉదయం 5:30 గంటలకు పొక్లెయిన్‌లు, బుల్‌డోజర్లతో కూల్చివేసిన సీఆర్‌డీఏ అధికారులు
- అంతకుముందే శుక్రవారం హైకోర్టును ఆశ్రయించిన వైఎస్సార్‌సీపీ
- చట్టాన్ని మీరి వ్యవహరించ వద్దని హైకోర్టు ఆదేశం
- ఆ సమాచారాన్ని సీఆర్‌డీఏ కమిషనర్‌కు తెలియజేసిన వైఎస్సార్‌సీపీ న్యాయవాది
- అయినప్పటికీ ప్రొసీడింగ్స్ అందలేదన్న పేరుతో కూల్చివేత

2లో


తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని పొక్లెయిన్‌లతో కూల్చివేయిస్తున్న అధికారులు

మరోస్థాయికి చంద్రబాబు దమనకాండ

- పూర్తికావొచ్చిన వైఎస్సార్‌సీపీ కార్యాలయం కూల్చివేశారు
- హైకోర్టు ఆదేశాలు బేఖాతరు.. రాజకీయ కక్ష సాధింపు చర్యలు
- న్యాయం కనుమరుగు.. హింసాత్మక ఘటనలతో రక్తం పారిస్తున్నారు
- ఈ బెదిరింపులు, కక్షసాధింపు చర్యలకు తలొగ్గేది లేదు
- ప్రజాస్వామ్యవాదులంతా ఈ దుశ్చర్యల్ని ఖండించాలి
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్

2లో

వైఎస్సార్‌సీపీ కార్యాలయాలు కూల్చేస్తాం

- రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో సర్కార్ నోటీసులు

2లో

నేటి నీట్- పీజీ పరీక్ష వాయిదా

ఎన్‌టీఏ డీజీ సుబోధ్‌పై వేటు



- పేపర్ లీకేజీ ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో కేంద్ర ప్రభుత్వం నీట్, నెట్ పరీక్షలను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ సుబోధ్ సింగ్‌పై వేటు వేసింది. వైద్య విద్యలో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆదివారం జరగాల్సిన నీట్–పీజీ పరీక్షను కేంద్ర ఆరోగ్య శాఖ శనివారం ఆఖరి నిమిషంలో వాయిదా వేసింది. 6లో

డయేరియాతో ఆరుగురు మృతి

- ఎన్టీఆర్ జిల్లాలో నలుగురు దుర్మరణం
- నంద్యాల జిల్లాలో ఒకరు.. కాకినాడ జిల్లాలో మరొకరు మృతి
- మూడుచోట్లా 85 మందికి పైగా బాధితులు 5లో

భారీగా ఐఏఎస్‌ల బదిలీ



- రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం 18 మంది ఐఏఎస్‌లను బదిలీ చేసింది. వారిలో ఏడుగురిని సాధారణ పరిపాలన విభాగానికి అటాచ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. 3లో

అసెంబ్లీ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు

ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ బుచ్చయ్యచౌదరి ప్రకటన



సాక్షి, అమరావతి: రాష్ట్ర 16వ శాసనసభ స్పీకర్‌గా నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శాసనసభ ఆఖరిరోజైన శనివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రకటించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రులు సత్యకుమార్, అచ్చెన్నాయుడులు అయ్యన్నకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అయ్యన్నను తోడ్కొని వెళ్లి స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టారు. స్పీకర్‌ను అభినందిస్తూ సీఎంతో పాటు మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. ఉ.10:32 గంటలకు శాసనసభ సమావేశం ప్రారంభం అయిన అనంతరం శుక్రవారం ప్రమాణస్వీకారం చేయకుండా మిగిలిపోయిన వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, కాకినాడ ఎమ్మెల్యే

మిగతా 10వ పేజీలో ▸

రాజ్యాంగ వ్యవస్థలపై రాజకీయ దాడి

- ఏపీపీఎస్సీ సభ్యులు రాజీనామా చేయాలని ఒత్తిడి
- జీఏడీ కార్యదర్శి (సర్వీసెస్) పోలా భాస్కర్ మితిమీరిన స్వామి భక్తి
- సర్వీస్ కమిషన్ సభ్యులు ఆరేళ్లు లేదా 62 ఏళ్ల వయసు వరకు కొనసాగే అవకాశం
- కానీ సభ్యులకు ఫోన్లు చేసి బెదిరింపులు
- ఐఏఎస్‌లే విస్తుపోతున్న వైనం
- రాజీనామా చేయకుంటే తప్పుడు కేసులు పెట్టి ఒత్తిడి తేవాలని కుట్ర
- సమాచార హక్కు కమిషనర్లు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌పై కూడా ఒత్తిడి
- గతంలో టీడీపీ పాలనలో వచ్చిన సభ్యులు జగన్ ప్రభుత్వంలోనూ కొనసాగింపు

14లో

హత్యాచారం కేసులో ముగ్గురి అరెస్ట్

- గంజాయి మత్తులో యువతిపై ఇద్దరు యువకుల అత్యాచారం
- అనంతరం మొహంపై కొట్టి.. ముక్కు, నోరు మూసి హత్య
- వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందాల్

13లో



- బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెం సీతారాంపేటకు చెందిన యువతిపై హత్యాచారం కేసును పోలీసులు ఛేదించారు. అదే గ్రామానికి చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఈపూరుపాలెం గ్రామానికే చెందిన దేవరకొండ విజయ్, కారంకి మహేష్, దేవరకొండ శ్రీకాంత్ ఈ దురాగతానికి పాల్పడినట్టు తెలిపారు.



పులివెందులలో జగన్‌కు అఖండ స్వాగతం

- క్యాంపు కార్యాలయంలో ప్రజలతో మమేకం
- జననేతను కలిసేందుకు ఎగబడిన అభిమానులు
- తొలిరోజంతా కార్యకర్తలతోనే..
- టీడీపీ దాడుల్లో గాయపడ్డ వారిని పరామర్శిస్తానని వెల్లడి

3లో



పెట్రో జీఎస్టీ ఎంతన్నది రాష్ట్రాలే నిర్ణయించుకోవాలి

- ఆర్థిక మంత్రి నిర్మల వ్యాఖ్యలు
- ప్లాట్‌ఫాం టికెట్లకు ఇక నో జీఎస్టీ
- పలు రకాల రైల్వే సేవలపై కూడా..
- సోలార్ కుక్కర్లు, పాల క్యాన్లపై 12%
- జీఎస్టీ కౌన్సిల్ భేటీలో నిర్ణయం

6లో

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ కార్యాలయం కూల్చివేత కక్ష సాధింపే

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరాజు, మత్స్యలింగం




సాక్షి, అమరావతి: తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూల్చివేయటం కక్ష సాధింపే అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వర రాజు, రేగం మత్స్యలింగం ధ్వజమెత్తారు. వారు శనివారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు ప్రభుత్వ భూమిని లీజుకు తీసుకొని పార్టీ ఆఫీస్ కట్టుకోవచ్చని 2016లో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో 340 ప్రకారమే వైఎస్సార్‌సీపీ తాడేపల్లిలోని సీతానగరంలో 2 ఎకరాలు లీజుకు తీసుకొని పార్టీ కార్యాలయం కడుతోందని తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఈ భవనాన్ని కూల్చివేయాలన్న సీఆర్‌డీఏ ప్రిలిమినరీ ప్రొసీడింగ్స్‌ని సవాల్ చేస్తూ వైఎస్సార్‌సీపీ హైకోర్టును ఆశ్రయించిందని, చట్టాన్ని మీరి వ్యవహరించవద్దని కోర్టు సూచించినా కూల్చివేత చేపట్టడం అనైతికమన్నారు. నోటీసులు కూడా ఇవ్వకుండా భవనాన్ని కూల్చారని మండిపడ్డారు. న్యాయబద్ధంగా వ్యవహరిస్తామని శాసన సభలో ప్రమాణం చేసిన 24 గంటల్లోనే చంద్రబాబు కూటమి దౌర్జన్యాలకు పాల్పడటం ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పారు.

బ్యాలెట్ విధానమే మంచిది : చింతామోహన్



నెల్లూరు (మినీబైపాస్): ఈవీఎంలపై సందేహాలు వస్తున్న నేపథ్యంలో పాత బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు కొనసాగించడం మంచిదని కేంద్ర మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు చింతా మోహన్ అభిప్రాయపడ్డారు. నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ విలేకరి ఇటీవలి ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందన్న వాదనలను ప్రస్తావించగా.. ఆయన పైవిధంగా స్పందించారు. ప్రపంచవ్యాప్తంగా ఈవీఎంల ట్యాంపరింగ్‌పై చర్చ నడుస్తోందన్నారు.

పార్టీ కార్యాలయం కూల్చివేత దుర్మార్గం

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండిపాటు



సాక్షి, అమరావతి: ప్రతిపక్షం అనేది ఉండకూడనే లక్ష్యంతో రాజకీయ పార్టీల కార్యాలయాలు, ఆస్తులను ధ్వంసం చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నౌడు వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తాడేపల్లిలో సీతానగరం సమీపాన నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయ నిర్మాణాన్ని పూర్తిగా నేలమట్టం చేశారని మండిపడ్డారు. అధికారం చేతుల్లో ఉందని ఏదైనా చేయొచ్చనుకుంటే కుదరదని.. 13 ఏళ్ల చరిత్ర కలిగిన వైఎస్సార్‌సీపీ పట్ల ఈ తరహా తీరు సరికాదని హెచ్చరించారు. అధికారం చేపట్టిన నాటినుంచి టీడీపీ ప్రభుత్వం విధ్వంసకాండను కొనసాగిస్తోందని మండిపడ్డారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం కూల్చివేత సక్రమమే

రాష్ట్ర హోం మంత్రి అనిత



రేణిగుంట (తిరుపతి జిల్లా): వైఎస్సార్‌సీపీ కార్యాలయం కూల్చివేత సక్రమమేనని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాలను ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా కట్టారని అన్నారు. ఆమె శనివారం రేణిగుంట విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కోర్టు ఆదేశాలను తామెక్కడా అతిక్రమించలేదన్నారు. స్కూల్లో 5 ,6 తరగతి చదివే పిల్లలు కూడా గంజాయి మత్తుకు బానిసై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని అన్నారు. దీని కోసం నార్కోటిక్ సెల్‌ను బలోపేతం చేసి గంజాయి మూలాలను పూర్తిగా నిర్మూలిస్తామని చెప్పారు.

బ్యాలెట్ ఓటింగే బెటర్

నటుడు మన్సూర్ అలీఖాన్



తమిళ సినిమా: 'ఈవీఎం విధానమంతా మోసం. బ్యాలెట్ ఓటింగ్ విధానం ద్వారానే సమన్యాయం జరుగుతుంది' అని సినీ నటుడు మన్సూర్ అలీఖాన్ అన్నారు. ఆయన చెన్నైలో జరిగిన ఒక సినిమా వేడుకలో పాల్గొని మాట్లాడారు. 'ఇటీవల ఎన్నికలు ఎందుకు జరిగాయో అర్థం కావడం లేదు. ఈవీఎం ఓటింగ్ విధానమంతా మోసం. ఈ ఎన్నికల్లో భారీగా ఈవీఎంలు మాయమయ్యాయి. వాటి గురించి ఎందరికి తెలుసు? మళ్లీ బ్యాలెట్ ఓటింగ్ విధానం వస్తేనే సమన్యాయం జరుగుతుంది' అని చెప్పారు.

పతాకస్థాయికి టీడీపీ కక్షసాధింపు

పార్టీ ఆఫీసు కూల్చేశారు

తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయం కూలగొట్టిన బాబు సర్కార్

సాక్షి ప్రతినిధి, గుంటూరు/మంగళగిరి: తెలుగుదేశం ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన పది రోజుల్లోనే కక్ష సాధింపు చర్యలకు దిగింది. గుంటూరు జిల్లా తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ నిర్మిస్తున్న పార్టీ కార్యాలయాన్ని శనివారం తెల్లవారుజామున పొక్లయిన్లు, బుల్‌డోజర్లతో కూల్చి వేసింది. దీనిపై శుక్రవారం హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, వాటిని ధిక్కరించి పార్టీ కార్యాలయాన్ని కూల్చేయడం చర్చనీయాంశంగా మారింది. పార్టీ కార్యాలయ నిర్మాణంపై ప్రొసీజర్ ప్రకారం వ్యవహరించాలని కోర్టు చెప్పింది. దీని ప్రకారం మరో రెండుసార్లు నోటీసులు ఇవ్వాల్సి ఉండగా, కోర్టు ప్రొసీడింగ్ అందలేదంటూ కూల్చి వేయడం ప్రభుత్వ కక్ష సాధింపుకు నిదర్శనం. నిర్మాణంలో ఉన్న పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం నుంచే పొక్లయిన్లు, బుల్‌డోజర్లతో మోహరించారు. భవనం కూల్చివేతకు బందోబస్తు కావాలని పోలీసులను కోరగా, అసెంబ్లీ విధుల్లో ఉన్నందున తమ వద్ద తగిన సిబ్బంది లేరని వారు సమాధానం ఇచ్చారు. అయితే ఎట్టి పరిస్థితుల్లో శనివారం ఉదయానికి పార్టీ కార్యాలయాన్ని కూల్చి వేయాలని సీఎంఓ నుంచి ఒత్తిడి రావడంతో శనివారం ఉదయం ఐదున్నర గంటలకు ప్రారంభించి ఏడున్నర గంటలలోపు పార్టీ కార్యాలయాన్ని కూల్చివేశారు. సీఆర్‌డీఏ అధికారులు, మున్సిపల్ అధికారులు ఈ కూల్చివేతను పర్యవేక్షించారు.



నిర్మాణ దశలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని జేసీబీతో కూల్చివేస్తున్న దృశ్యం

పక్కాగా లీజున్నా దౌర్జన్యం

గుంటూరు జిల్లా తాడేపల్లి గ్రామంలోని బోట్ యార్డు వద్ద సర్వే నంబర్ 202/ఎ-1లోని రెండు ఎకరాల స్థలాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ భవన నిర్మాణం కోసం 33 ఏళ్లకు లీజుకు ఇస్తూ గత ఏడాది ఫిబ్రవరి 16వ తేదీన ఆదేశాలు జారీ అయ్యాయి. 2012లో రాష్ట్రంలో పార్టీ కార్యాలయాలకు భూ కేటాయింపులకు సంబంధించి విడుదల చేసిన జీవో నంబర్ 571 ఆధారంగా ఈ కేటాయింపులు జరిగాయి. స్థలం కేటాయించిన మూడేళ్లలో దేనికి కేటాయించారో ఆ విధంగా ఉపయోగించని పక్షంలో రద్దు చేస్తామని పేర్కొన్నారు. దీనికి భిన్నంగా భూమిని ఖాళీగా ఉంచితే ఆ భూమి కేటాయింపును జిల్లా కలెక్టర్ రద్దు చేసి వెనక్కు తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి. సాయిప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది మార్చి 31న జీవో-52 ప్రకారం కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఈ భూమిని అప్పటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాదరావుకు అప్పగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. భూమిని కేటాయించినందుకు ప్రభుత్వానికి గత ఏడాది జూలై 26న రూ.66 వేలు చలానా కట్టారు. మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌కు ఈ నెల 15న రూ.4,44,312 ఆస్తి పన్ను కూడా చెల్లించారు. ఈ మేరకు అన్ని వివరాలతో సీఆర్‌డీఏకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో మొదటి అంతస్తు శ్లాబ్ పూర్తి అయ్యి, రెండో అంతస్తు శ్లాబ్ వేసే సమయంలో ఈ నెల 10న సీఆర్‌డీఏ అధికారులు నోటీసు జారీ చేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ శుక్రవారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. పార్టీ తరఫున పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ ప్రొసీజర్ పాటించాలని, తొందరపాటు చర్యలు వద్దని ఆదేశాలు జారీ చేసింది. ఈ సమాచారాన్ని వెంటనే సీఆర్‌డీఏ న్యాయవాదులతో పాటు సీఆర్‌డీఏ కమిషనర్‌కు వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ రెడ్డి ఫోన్ ద్వారా చేరవేశారు. దీంతో కోర్టు ఆదేశాలు తమకు అందడానికి ముందే పడగొట్టాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో శుక్రవారం సాయంత్రం నుంచే అక్కడ బుల్‌డోజర్లను మోహరించారు. దీనిపై సీఆర్‌డీఏ అధికారులతో మాట్లాడటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రయత్నించినా వారు అందుబాటులోకి రాలేదు. శనివారం ఉదయం 5.30 గంటలకు అధికారులు కూల్చి వేశారు.

మరో స్థాయికి చంద్రబాబు దమనకాండ

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దిగిన చంద్రబాబు తన దమనకాండను మరో స్థాయికి తీసుకెళ్లారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తాడేపల్లిలో దాదాపు పూర్తికావొచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఒక నియంత బుల్డోజర్లతో కూల్చి వేయించారు. హైకోర్టు ఆదేశాలనూ బేఖాతరు చేశారు. రాష్ట్రంలో చట్టం, న్యాయం పూర్తిగా కనుమరుగైపోయాయి. ఎన్నికల తర్వాత చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలతో రక్తాన్ని పారిస్తున్న చంద్రబాబు, ఈ ఘటన ద్వారా ఈ ఐదేళ్లపాటు పాలన ఏవిధంగా ఉండబోతుందనే హింసాత్మక సందేశాన్ని ఇవ్వకనే ఇచ్చారు. ఈ బెదిరింపులకు, ఈ కక్ష సాధింపు చర్యలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తలొగ్గేది లేదు. వెన్నుచూపేది అంతకన్నా లేదు. ప్రజల తరఫున ప్రజల కోసం ప్రజలకు తోడుగా గట్టి పోరాటాలు చేస్తాం. దేశంలోని ప్రజాస్వామ్యవాదులంతా చంద్రబాబు దుశ్చర్యల్ని ఖండించాలని కోరుతున్నా' అంటూ శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేశారు.

రైతుల నుంచి లాక్కున్న భూమిలో టీడీపీ కార్యాలయం నిర్మాణం

గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని ఆత్మకూరులో జాతీయ రహదారిని ఆనుకుని కాలువ పోరంబోకు భూమిలో రైతులకు ఇచ్చిన పట్టా భూమిని ఆక్రమించుకుని టీడీపీ రాష్ట్ర కార్యాలయాన్ని నిర్మించారు. ఆత్మకూరులో 1974లో రైతులు బొమ్మి రామిరెడ్డి (0.65 ఎకరం), కొల్లు రాఘవరావు (1.75 ఎకరాలు), కొల్లు భాస్కరరావు (1.75 ఎకరాలు)లకు ప్రభుత్వం మొత్తం 4.15 ఎకరాలకు డీకేటీ పట్టాలు ఇచ్చింది. టీడీపీ ఆ భూముల్ని స్వాధీనం చేసుకుని, ఇది సరిపోదన్నట్టు పక్కనే ఉన్న రెండెకరాల కాల్వ పోరంబోకును ఆక్రమించుకుని పార్టీ కార్యాలయాన్ని నిర్మించింది. మొత్తంగా 6.15 ఎకరాల భూమిని అక్రమంగా దక్కించుకుంది. ఏటా ఎకరాకు రూ. వెయ్యి చొప్పున 99 ఏళ్ల పాటు ప్రభుత్వానికి లీజు చెల్లించేలా జీవో జారీ చేయించుకుంది. ఈ భూమి ధర దాదాపు రూ.100 కోట్లకు పైమాటే. టీడీపీ భూదందాపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటి తహసీల్దారు జి.వి.రామ్‌ప్రసాద్.. ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలపై నోటీసులు జారీ చేశారు. కేవలం రోడ్డును ఆక్రమించి నిర్మించిన రేకుల షెడ్డను మాత్రమే తొలగించారు. కానీ నేడు వైఎస్సార్‌సీపీ నిర్మిస్తున్న కార్యాలయం మొత్తం కూల్చేయడం చంద్రబాబు కక్షపూరిత చర్యలకు అద్దం పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



టీడీపీ రాష్ట్ర కార్యాలయం

అంబేడ్కర్ రాజ్యాంగం కాదు..

లోకేశ్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

- హైకోర్టు ఆదేశాలున్నా.. తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూల్చేశారు
- విశాఖ కార్యాలయం కోసం వీఎంఆర్‌డీఏకు రూ.15 లక్షలు చెల్లించాం
- అనకాపల్లి కార్యాలయం కోసం రూ.38 లక్షలు చెల్లించాం
- ఇప్పుడు వీఎంఆర్‌డీఏ కాదు జీవీఎంసీ అనుమతులివ్వాలంటే ఎలా?
- వీటిపై న్యాయ పోరాటం చేస్తాం
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి గుడివాడ, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి తదితరులు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం అమలవడం లేదని, లోకేశ్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. ఆయన శనివారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణితో కలిసి మీడియాతో మాట్లాడారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన మరుక్షణం నుంచి ఈరోజు వరకు రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కూటమి దమనకాండ చూస్తూనే ఉన్నామన్నారు. హైకోర్టు ఆదేశాలున్నప్పటికీ, తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూల్చివేయడం కూటమి నేతల విధ్వంసకాండకు పరాకాష్టగా చెప్పారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల వైఎస్సార్‌సీపీ కార్యాలయాలకు అనుమతులున్నప్పటికీ, జీవీఎంసీ అధికారులతో నోటీసులు జారీ చేయించారన్నారు. వీటిపై న్యాయ పోరాటం చేస్తామని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, తమ పార్టీ దేవాలయాలను రక్షించుకుంటామని అన్నారు.

అనుమతులున్నా.. లేవంటూ నోటీసులు

విశాఖ, అనకాపల్లి పార్టీ కార్యాలయాలకు విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) అనుమతులున్నప్పటికీ, జీవీఎంసీ అనుమతుల్లేవంటూ నోటీసులు జారీ చేశారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే 33 ఏళ్లకు డబ్బు చెల్లించి పార్టీ కార్యాలయానికి స్థలాలు లీజుకు తీసుకున్నామన్నారు. విశాఖ కార్యాలయానికి రూ.15 లక్షలు, అనకాపల్లి కార్యాలయానికి రూ.38 లక్షలు వీఎంఆర్డీఏకి చెల్లించి గతేడాది ఫిబ్రవరి నెలలోనే అనుమతి కోరామన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు తీసుకొచ్చిన జీవో ప్రకారమే ఏదైనా పార్టీ కార్యాలయాలకు లీజు పద్ధతిలో ప్రభుత్వ స్థలాన్ని తీసుకోవచ్చనేది ఉందని, దాని ప్రకారమే 33 ఏళ్లకు లీజుకు తీసుకొని, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పార్టీ కార్యాలయాలు నిర్మిస్తున్నామని తెలిపారు. గజాల్లో స్థలం ఉంటే జీవీఎంసీ అనుమతి కావాలని, కానీ 2 ఎకరాల స్థలంలో నిర్మాణం చేయాలంటే వీఎంఆర్‌డీఏ అనుమతి తీసుకోవాలన్నారు. దాని ప్రకారమే డబ్బులు చెల్లించి వీఎంఆర్‌డీఏ అనుమతి కోరామన్నారు. సెప్టెంబర్‌లో మార్టగేజ్ కూడా చేశామని తెలిపారు. ఈ నిర్మాణాలు తమ పరిధిలోకి రావని వీఎంఆర్‌డీఏ చెప్పి ఉంటే అప్పుడే జీవీఎంసీ అనుమతి కోరేవాళ్లమని అన్నారు. రూల్ ప్రకారం వీఎంఆర్‌డీఏ ద్వారానే జీవీఎంసీకి కూడా అనుమతికి పంపిస్తారని తెలిపారు.

విశాఖ టీడీపీ కార్యాలయాన్ని అక్రమ పద్ధతుల్లో నిర్మించారు

విశాఖలో టీడీపీ కార్యాలయానికి నిర్మాణం చేపట్టిన 16 ఏళ్ల వరకు అనుమతే తీసుకోలేదని, అనుమతుల్లేకుండా అక్రమ పద్ధతిలో దాన్ని నిర్మించారని చెప్పారు. తాము అధికారంలో ఉన్న సమయంలో అక్రమంగా నిర్మించిన టీడీపీ కార్యాలయాలను కూల్చడం క్షణాల్లో పని అని, కానీ తాము ఆ పని చేయలేదని అన్నారు. 2015-19 మధ్య ఏపీలో 10 టీడీపీ కార్యాలయాల కోసం లీజు పద్ధతిలో స్థలం తీసుకుని నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ఇది బుల్డోజర్ల ప్రభుత్వమని, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఈ ప్రభుత్వం అక్రమాలతో పాలన సాగిస్తోందని శుక్రవారం తమ పార్టీకి చెందిన 4వ వార్డు కార్పొరేటర్ కొండబాబు ఇంటిపై రాళ్లతో టీడీపీ మూకలు దాడి చేశాయన్నారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని చెప్పారు.

ఇది ప్రజాస్వామ్యమేనా?

హైకోర్టు ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తూ అధికార బలంతో తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూల్చేయడం కక్ష సాధింపు చర్యేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మండిపడ్డారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా అన్న అనుమానాలు కలుగుతున్నాయని చెప్పారు. దేవాలయం లాంటి పార్టీ కార్యాలయాన్ని బుల్డోజర్లతో కూల్చివేశారని మండిపడ్డారు. ఎన్‌డీఏ ప్రభుత్వం నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ కాదని, నారా డిస్ట్రక్టివ్ అలయన్స్ అని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నివసిస్తున్న కరకట్ట బిల్డింగ్ కూడా అక్రమ నిర్మాణమేనన్నారు. టీడీపీ కార్యాలయాలు చాలా వరకు అనుమతుల్లేకుండా నిర్మించినవేనని తెలుసుకుని, అప్పుడు తమ పార్టీ ఆఫీస్‌కి నోటీసులిస్తే బెటర్ అని సూచించారు.

బాబు దుష్ట పాలనకు

నిదర్శనమిది

- వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూల్చబోమని నిన్న హైకోర్టులో చెప్పారు
- ఈవాళ నేల మట్టం చేశారు
- ఇది కోర్టు ధిక్కరణే.. కోర్టులోనే తేల్చుకుంటాం
- కక్ష సాధింపు చర్యలను ఏ రాజకీయ పార్టీలూ క్షమించకూడదు
- మాజీ మంత్రి అంబటి రాంబాబు
- తాడేపల్లిలో కూల్చిన పార్టీ ఆఫీస్ ప్రాంతాన్ని పరిశీలించిన వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, అమరావతి: తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం భవనాన్ని బుల్డోజర్లతో నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం చంద్రబాబు కూటమి దుష్ట పాలనకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. తాడేపల్లిలోని సీతానగరంలో బాబు ప్రభుత్వం కూల్చివేసిన వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ప్రాంతాన్ని పార్టీ నేతలు లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు తదితరులతో కలిసి పరిశీలించారు. అనంతరం రాంబాబు మీడియాతో మాట్లాడారు. పార్టీ కార్యాలయాలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెచ్చిన విధానం కాదని, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు తెచ్చిందేనని, అప్పట్లోనే టీడీపీకి ప్రభుత్వ స్థలాలను కేటాయించుకున్నారని గుర్తు చేసారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయం కూడా ప్రభుత్వ స్థలంలో నిర్మించినదేనని తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయం కూడా ప్రభుత్వ స్థలంలోనే నిర్మిస్తున్నామని, ఇందులో తప్పేముందని ప్రశ్నించారు. ఈ భవనాన్ని కూల్చబోమని నిన్న కోర్టులో చెప్పి, ఇవాళ ఉదయాన్నే కూల్చి వేసి కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని అన్నారు. నియమ నిబంధనల ప్రకారం భవనం నిర్మాణం చేపట్టిన విషయాన్ని న్యాయస్థానానికి తాము వివరించామన్నారు. అయితే శని, ఆదివారాల్లో అప్పీలు చేసుకునే అవకాశం లేదనే తెల్లవారుజామునే పార్టీ కార్యాలయం కూల్చివేత చేపట్టారన్నారు. ఈ దుర్మార్గ చర్యను దేశంలోని ప్రజాస్వామ్య వాదులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఖండించాలని కోరారు. అధికారంలో ఉన్నాం కదా అని కూల్చివేయడం సరికాదని, అధికారం ఎవరికి శాశ్వతం కాదని అన్నారు. చట్టబద్ధ పాలన చేస్తామని, కక్ష సాధింపులు ఉండవని చెప్పిన సీఎం చంద్రబాబు.. అధికారాన్ని చేపట్టిన రోజుల వ్యవధిలోనే విధ్వంస పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి దుర్మార్గ పాలనను రాజకీయ పక్షాలు క్షమించకూడదన్నారు. ప్రభుత్వం తమ కట్టడాలను కూల్చివేయాలంటే చట్టపరంగా రావాలని, న్యాయ స్థానాల్లో అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకాలపాలపై కోర్టులో పోరాడుతామని, ఇప్పటికే ఈ వ్యవహారం కోర్టులో ఉందని చెప్పారు. కేబినెట్ ఆమోదించాకే ఇక్కడ స్థలాన్ని తీసుకొని, పార్టీ కార్యాలయం నిర్మిస్తున్నామని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. నిర్మాణంలో ఉన్న కట్టడాన్ని 2 గంటల్లో నేలమట్టం చేశారన్నారు. ఇది కచ్చితంగా కక్ష సాధింపేనని, ఈ చర్యను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని అన్నారు.



కూల్చివేయబడిన పార్టీ ఆఫీస్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి అంబటి తదితరులు

వైఎస్సార్‌సీపీ కార్యాలయాలు కూల్చేస్తాం

- రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో సర్కారు నోటీసులు
- అనుమతి లేకుండా నిర్మిస్తున్నారని బెదిరింపు
- వీఎంఆర్‌డీఏ అనుమతులున్నప్పటికీ విశాఖ, అనకాపల్లిలో విడ్డూరం
- జీవీఎంసీ ఇవ్వలేదంటూ వింతగా నోటీసులు జారీ
- నెల్లూరులో కూలదోస్తామని అధికారుల హడావుడి
- 'అనంత'లో ఆఫీస్ బాయ్‌కి నోటీసు ఇచ్చి వెళ్లిన నగర పాలక సంస్థ సిబ్బంది
- రాజమహేంద్రవరంలో పార్టీ కార్యాలయానికి నోటీసు



నెల్లూరులో నిర్మిస్తున్న పార్టీ జిల్లా కార్యాలయ భవనం

సాక్షి, విశాఖపట్నం/నెల్లూరు (వీఆర్సీసెంటర్)/అనంతపురం కార్పొరేషన్/సాక్షి, రాజమహేంద్రవరం : రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటై వారం రోజులైనా గడవక ముందే కక్ష సాధింపు చర్యలకు దిగింది. ప్రజలేమనుకుంటారోననే భయం ఇసుమంతైనా లేకుండా వైఎస్సార్‌సీపీ కార్యాలయాలను కూలదోయడానికి పూనుకుంది. హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ శనివారం తెల్లవారుజామున తాడేపల్లిలో పార్టీ కేంద్ర కార్యాలయాన్ని కూల్చేసింది. ఇంతటితో ఆగక రాష్ట్ర వాప్తంగా పలు జిల్లా కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాలకు నోటీసులు జారీ చేసింది. పార్టీ కార్యాలయాలన్నింటినీ అక్రమంగా నిర్మిస్తున్నారని, వారం రోజుల్లో సరైన సమాధానం ఇవ్వకపోతే ఎందుకు కూల్చకూడదని ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో విశాఖ, అనకాపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాలకు జీవీఎంసీ అధికారులు శనివారం నోటీసులు జారీచేశారు. వాస్తవానికి వీఎంఆర్డీఏకు అనుమతుల కోసం విశాఖ కార్యాలయం కోసం రూ.15.63 లక్షలు, అనకాపల్లి పార్టీ కార్యాలయం కోసం రూ.35.60 లక్షలు చెల్లించినా.. అనుమతుల్లేవంటూ శనివారం జీవీఎంసీ అధికారులు నోటీసులు కార్యాలయాల వద్ద అతికించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే విశాఖపట్నం జిల్లా విశాఖ రూరల్ మండల పరిధిలోని ఎండాడ గ్రామంలో 2 ఎకరాల ప్రభుత్వ భూమిని 33 ఏళ్ల పాటు లీజు పద్ధతిన ఎకరాకు రూ.1000 చొప్పున చెల్లించే విధంగా 2016 ఏడాదిలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. గతేడాది ఫిబ్రవరి నెలలో వీఎంఆర్‌డీఏ అనుమతి కోరుతూ రూ.15.63 లక్షలు చెల్లించారు. 2023లో సెప్టెంబర్ 25న ఫస్ట్ ఫ్లోర్‌లో 120.34 స్క్వేర్ యార్డ్స్ ప్రపోజ్ చేస్తూ మార్టగేజ్ చేశారు. గతేడాది వీఎంఆర్‌డీఏ అనుమతులు కోరిన 21 రోజుల్లో ఏదైనా అభ్యంతరం ఉంటే చెప్పాల్సి ఉంటుంది. ఎటువంటి అభ్యంతరం లేకపోయినా..ఆటోమెటిక్‌గా ప్లాన్ అప్రూవల్ అయినట్లు పరిగణిస్తారు. వీఎంఆర్‌డీఏ ద్వారా జీవీఎంసీ అనుమతుల కోసం డీడీ తీసి ఆరు నెలలు కావస్తున్నా, ఎటువంటి అభ్యంతరం చెప్పలేదు. అయితే ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే అనుమతుల్లేవని చెప్పటం పట్ల వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కేవలం కక్ష సాధింపు చర్యలేనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, విశాఖ, అనకాపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయాల్లో ఎవరూ లేని సమయంలో జీవీఎంసీ అధికారులు నోటీసులు అతికించి వెళ్లిపోయారు.

బుల్డోజర్‌తో కూల్చేస్తామంటూ..

నెల్లూరులోని 54వ డివిజన్ జనార్దనరెడ్డి కాలనీలో నిర్మిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయాన్ని బుల్‌డోజర్స్‌తో కూల్చేస్తామని నెల్లూరు టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం హడావుడి చేశారు. అక్కడ 2 ఎకరాల్లో పార్టీ కార్యాలయ భవనం నిర్మాణంలో ఉంది. సమాచారం అందుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు సిటీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్ అక్కడికి చేరుకుని టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం వద్ద 33 ఏళ్ల పాటు లీజుకు తీసుకుని, లీజు నగదునూ చెల్లించామని, అన్ని అనుమతులు తీసుకున్నామని, నిబంధనల మేరకు ఈ నిర్మాణం జరుగుతోందని చెప్పారు. ఈ భవనం ఒక వ్యక్తికి సంబంధించినది కాదని, జిల్లా పార్టీ కార్యాలయం కాబట్టి దీని డాక్యుమెంట్లు తెప్పించేందుకు 2 రోజులు కావాలని చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా కూల్చేసామని చెప్పారు. ఏ క్షణంలోనైనా ఈ భవనాన్ని కూల్చేస్తామని చెప్పి వెళ్లారు. శనివారం రాత్రి కార్పొరేషన్ సిబ్బంది పార్టీ కార్యాలయం వద్ద నోటీసు అంటించి వెళ్లారు. 7 రోజుల్లో రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

ఎందుకు చర్యలు తీసుకోకూడదంటూ..

అనంతపురం నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో డిప్యూటీ సిటీ ప్లానర్ మారుతీ హరిప్రసాద్ శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి నోటీసులిచ్చారు. అనంతపురం హెచ్‌ఎల్‌సీ కాలనీలో 1.50 ఎకరాల్లో పార్టీ కార్యాలయాన్ని అనధికారికంగా నిర్మిస్తున్నారని నోటీసులో పేర్కొన్నారు. 7 రోజుల్లో నోటీసుకు సమాధానం ఇవ్వాలని, అంతవరకు నిర్మాణాలు చేపట్టకూడదని, ఇప్పటివరకు అనధికారికంగా నిర్మాణం చేపట్టినందున చర్యలు ఎందుకు తీసుకోకూడదని ప్రశ్నించారు. స్థానిక రెండో రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆఫీస్ బాయ్ శ్రీనివాసులుకు నోటీసు అందించారు.

ఇది అనధికారిక కట్టడం

రాజమహేంద్రవరంలోని వైఎస్సార్‌సీపీ తూర్పు గోదావరి జిల్లా కార్యాలయం అక్రమ కట్టడమని, వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని, పార్టీ జిల్లా అధ్యక్షుడి పేరుతో నగర పాలక సంస్థ అధికారులు శనివారం నోటీసులిచ్చారు. సువిశేషపురంలో రెండెకరాల్లో పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణానికి 2023 జూన్ 10న అప్పటి రాష్ట్ర మంత్రులు చెల్లుబోయిన వేణు, తానేటి వనిత, పార్టీ జిల్లా అధ్యక్షుడు, నాటి రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, అప్పటి ఎంపీ మార్గాని భరత్‌రామ్ శంకుస్థాపన చేశారు. ఇప్పటికే కార్యాలయ పనులు సింహభాగం పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ఇది అనధికారిక కట్టడమంటూ రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ నోటీసు జారీ చేశారు. ఏడు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు. నోటీసు ప్రతిని నిర్మాణంలో ఉన్న పార్టీ కార్యాలయానికి అతికించారు. భవన నిర్మాణ పనులు తక్షణం నిలిపివేయాలని సూచించారు. ఇదంతా టీడీపీ నేతల కుట్రలో భాగమేనని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

క్లుప్తంగా...

చంద్రబాబుది రాక్షస పాలన

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఇసాక్ బాషా



బొమ్మలసత్రం: రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఆస్తుల విధ్వంసాలకు పాల్పడుతూ రాక్షసపాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మండిపడ్డారు. ఆయన శనివారం నంద్యాల పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా ప్రమాణస్వీకారం చేసి 24 గంటలు కాక ముందే తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయాన్ని ధ్వంసం చేయటం ఆయన రాక్షస పాలనకు నిదర్శనమన్నారు. హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ భవనాన్ని కూల్చారన్నారు. శని, ఆది వారాల్లో కోర్టు సెలవులు కావడంతో తెల్లవారుజామునే దొంగల్లా అక్కడికి చేరుకుని పోలీసుల సమక్షంలో కార్యాలయాన్ని ధ్వంసం చేశారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ మేలు చేశారని చెప్పారు. టీడీపీ నేతలతోపాటు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎటువంటి విద్వేషాలకు పోమని ఓవైపు చెబుతూనే మరోవైపు ప్రజలపై దాడులు, ఆస్తుల విధ్వంసంతో అరాచక పాలన చేస్తున్నారని మండిపడ్డారు. విధ్వంసాలను మీడియాలో ప్రచారం కాకుండా వారి గొంతు నొక్కుతున్నారన్నారు. మంత్రి లోకేశ్ రెడ్ బుక్ రాజ్యాంగంతోనే ఇలాంటి చర్యలకు దిగుతున్నారని విమర్శించారు.

'ఈడబ్ల్యూఎస్'లో కాపులకు 5% రిజర్వేషన్ ఇవ్వాలి

- డీఎస్సీలో అమలుచేయకపోతే కాపు యువతకు నష్టం
- కాపు, బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు హరిరామ జోగయ్య

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులస్తులు చాలా కాలంగా విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కోరుతున్నందున ఈడబ్ల్యూఎస్ కేటగిరి రిజర్వేషన్లలో ఐదు శాతం కాపులకు వర్తింపజేయాలని కాపు, బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు హరిరామ జోగయ్య శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డీఎస్సీ నియామకాల్లో ఈ రిజర్వేషన్ల సౌకర్యం అమలుచేయని పక్షంలో కాపు యువత నష్టపోతుందన్నారు. గతంలో ఈడబ్ల్యూఎస్ కోటా కింద అగ్రవర్ణాల పేదలకు కేటాయించిన 10 శాతం రిజర్వేషన్లలో ఐదు శాతం కాపులకు కలుగజేస్తూ అప్పటి చంద్రబాబు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసినందున ఇప్పుడు కాపుల రిజర్వేషన్ల అంశంపై వినతిపత్రం ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ఇప్పటికే కోరినట్లు హరిరామజోగయ్య ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ముద్రగడను అవమానిస్తే రిజర్వేషన్లు వస్తాయా...?

వైఎస్సార్‌సీపీ నేత పోతిన మహేష్



వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభంను కాపాడుకోలేకపోతే ఆ సామాజిక వర్గ ప్రయోజనాలు ప్రమాదంలో పడతాయని వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ అన్నారు. తన కార్యాలయం నుంచి శనివారం విడుదల చేసిన వీడియోలో మహేష్ మాట్లాడారు. దూరదృష్టి లేని చోట జనం నేలపాలవుతారన్నారు. ముద్రగడకు అండగా ఉండి సంఘీభావం తెలియజేయాల్సిన సమయంలో వారిని అవమానిస్తే కాపు సామాజిక వర్గానికి రిజర్వేషన్లు వస్తాయా? అని ప్రశ్నించారు. ఉద్యమ నాయకుడ్ని కాపాడుకోలేకపోతే ఆ సామాజిక వర్గం ప్రయోజనాలు ప్రమాదంలో పడతాయన్నారు. 'ఉద్యమ నాయకులు అరుదుగా పుడతారు. రాజకీయ నాయకులు ఈ రోజు వస్తారు రేపు వెళ్లిపోతారు. ఏ సామాజిక వర్గ ప్రయోజనాల కోసం ముద్రగడ నిరంతరం పోరాటం చేశారో.. నేడు వారి చేతిలోనే ఘోరంగా అవమానించబడడం చాలా బాధాకరం. రాజకీయాల ప్రయోజనం కోసం ఉద్యమ నేత ముద్రగడను పలు అవమానాలతో ఉరి తీస్తున్నారు' అని మహేష్ ఆవేదన వ్యక్తంచేశారు.

స్టీల్‌ప్లాంట్‌కు వెంటనే వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వాలి

కేంద్ర సహాయ మంత్రికి స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకుల వినతి



శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్‌ను ఆదుకునేందుకు వెంటనే రూ.10 వేల కోట్ల వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మను కోరారు. శనివారం భీమవరంలో మంత్రిని నాయకులు కలిశారు. కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించడాన్ని పురస్కరించుకుని అభినందనలు తెలిపారు. అనంతరం సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం వల్ల రెండు సంస్థలకు లాభదాయకమని, వెంటనే ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. యూనియన్ నేతలు మంత్రి రాజశేఖర్, బి.ఎన్.రాజు, అశోక్‌రాజు, సుబ్బయ్య, రమణమూర్తి, అవతారం పాల్గొన్నారు.

పులివెందులలో జగన్‌కు అఖండ స్వాగతం



ప్రేమతో చిన్నారిని ఎత్తుకున్న వైఎస్ జగన్



పులివెందులలో భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

క్యాంపు కార్యాలయంలో ప్రజలతో మమేకం

- జననేతను కలిసేందుకు ఎగబడిన అభిమానులు
- తొలిరోజంతా కార్యకర్తలతోనే..
- టీడీపీ దాడుల్లో గాయపడ్డ వారిని పరామర్శిస్తానని వెల్లడి

సాక్షి కడప/రాయచోటి/కడప అర్బన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం సాయంత్రం 4.30గంటల ప్రాంతంలో పులివెందులకు చేరుకున్నారు. పుట్టినగడ్డలో ఆయన అడుగుపెట్టగానే జనం ఘనంగా స్వాగతం పలికారు. అడుగడుగునా మాజీ సీఎంకు హారతులు పడుతూ మహిళలు దిష్టితీయగా, మరికొందరు పుష్పగుచ్ఛాలు అందించారు. ఆ తర్వాత పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజలతో మమేకమయ్యారు. జగన్‌ను చూడగానే జనమంతా ఒక్కసారిగా 'సీఎం సీఎం'.. అంటూ ఈలలు, కేకలతో ఉత్సాహం ప్రదర్శించారు. కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరిని జగన్ కలుస్తూ అడిగిన వారికి ఫొటో తీసుకునే అవకాశమిస్తూ వారిని ఆప్యాయంగా పలకరించారు. పులివెందుల పర్యటనలో భాగంగా జగన్ తొలిరోజంతా కార్యకర్తలతోనే గడిపారు.

జగన్‌ను కలిసిన పలువురు నేతలు

ఇక మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శనివారం పలువురు నేతలు కలిశారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జగన్ వెన్నంటే ఉంటూ కార్యకర్తల సమస్యల పరిష్కారంపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వచ్చారు. ఎంపీతో పాటు రాజంపేట, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్నాథరెడ్డి, చంద్రశేఖర్.. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, 'మండలి' మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్‌వి సతీష్‌కుమార్‌రెడ్డి తదితరులు కూడా పాల్గొన్నారు. రాజకీయాలకు సంబంధించిన అంశాలతో పాటు ఇతర అనేక విషయాలపై వారు సుదీర్ఘంగా మాట్లాడారు.

టీడీపీ దాడులపై జగన్ ఆరా

మరోవైపు.. అన్నమయ్య జిల్లా రాయచోటిలో వైఎస్సార్‌సీపీ మున్సిపల్ కౌన్సిలర్లపై టీడీపీ రౌడీమూకలు చేసిన దాడులపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరా తీశారు. రాయచోటి 4వ వార్డు కౌన్సిలర్ హరూన్ బాషా, స్థానిక మైనార్టీ నేతలు దాడి సంఘటనను ఆయనకు వివరించారు. ఈ దాడిలో 7వ వార్డు కౌన్సిలర్ భర్త ఇర్ఫాన్ బాషా కత్తిపోట్లకు గురికాగా, హరూన్ బాషా ఇంటి ముంగిట ఉన్న బైకును బండరాళ్లతో బాది ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై తీవ్రంగా స్పందించిన వైఎస్ జగన్ దాడిలో గాయపడిన వారికి ధైర్యాన్నిచ్చారు. త్వరలో బాధిత కుటుంబాలను పరామర్శించి అండగా నిలుస్తామన్నారు.

కాన్వాయ్‌లో వాహనాల ఢీ అవాస్తవం..

ఇదిలా ఉంటే.. కడప విమానాశ్రయంలో దిగిన జగన్ తన కాన్వాయ్‌లో పులివెందులకు బయల్దేరారు. రామరాజుపల్లె వద్ద వేచి ఉన్న అభిమానులను కలిసేందుకు ఆయన వాహనాన్ని ఆపమన్నారు. అదే సమయంలో కాన్వాయ్‌తో సంబంధంలేని వ్యక్తి తమ కుటుంబ సభ్యులతో వేరే కారులో పులివెందుల వైపు వెళ్తున్నారు. ఈ కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో కాన్వాయ్‌లో చివరగా ఉన్న అగ్నిమాపక వాహనాన్ని వెనుకవైపు ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, కేవలం కారు ముందు భాగం పాక్షికంగా దెబ్బతిందని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ తెలిపారు. కానీ, మాజీ సీఎం కాన్వాయ్‌లోని వాహనాలు ఢీకొన్నాయని వెలువడిన వార్తలు పూర్తిగా అవాస్తవమన్నారు. ఈ సంఘటనపై పోలీసులు సమగ్రంగా విచారిస్తున్నారన్నారు.

పచ్చ మీడియాలో దుష్ప్రచారం

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు, ఆయన్ను పలకరించేందుకు పెద్దఎత్తున ప్రజానీకం పులివెందుల చేరుకున్నారు. మ.2 గంటలకు పులివెందులకు వస్తారనుకున్న ఆయన ఐదు గంటలకు చేరుకున్నారు. అప్పటికే పెద్దఎత్తున అభిమానులు అక్కడకు తరలివచ్చారు. బారులు తీరిన జనాన్ని కలుస్తూ, వారిని ఊరడిస్తూ అధినేత వైఎస్ జగన్ ఉండిపోయారు. అంతేకాక.. తమ అభిమాన నేతను కలిసేందుకు కార్యకర్తలు ఎగబడ్డారు. ఈ క్రమంలో అభిమానుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. తోపులాటలో నగిరిగుట్టకు చెందిన ఓ యువకుడు క్యాంపు కార్యాలయం కిటికీ అద్దాలపై పడ్డాడు. అద్దాలు పగిలి చేతికి గాయం కూడా అయ్యింది. వాస్తవం ఇలా ఉంటే, జగన్‌కు పులివెందులలోనే ప్రతిఘటన.. జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలంటూ పచ్చమీడియాలో తెగ దుష్ప్రచారం చేశారు. దీనిపై పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్‌రెడ్డి వివరణ ఇస్తూ.. మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న సమయంలో కార్యకర్తల తోపులాట జరిగి కిటికీ అద్దాలు పగిలాయి కానీ, ఎలాంటి రాళ్లదాడి జరగలేదని, ఎవరూ నినాదాలు చేయలేదని స్పష్టంచేశారు. కేవలం వైఎస్ జగన్‌ను చూసేందుకు ప్రజలు ఉత్సాహం చూపడంతో ఒకరిపై ఒకరు పడి తోపులాట మాత్రమే జరిగిందన్నారు.



వైఎస్సార్‌సీపీ నేతలతో మాట్లాడుతున్న వైఎస్ జగన్



వృద్ధురాలితో ఆప్యాయంగా..

హైకోర్టు ఆదేశాలు ఉన్నా కూల్చేస్తారా?

మాజీ మంత్రి అప్పలరాజు మండిపాటు



కాశీబుగ్గ: హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఎలా కూల్చివేస్తారని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మండిపడ్డారు. రాష్ట్ర చరిత్రలోనే దుర్దినమని అన్నారు. ఆయన శనివారం పలాసలో విలేకరులతో మాట్లాడుతూ.. విశాఖపట్నం, అనకాపల్లి, ఇతర వైఎస్సార్‌సీపీ కార్యాలయాలకు నోటీసులు పంపిస్తున్నారని అన్నారు. 'మీ పార్టీ కార్యాలయాలకు ఒక తీరు. వేరే పార్టీలకు ఒక తీరా? అలాంటి వాటిపై మాట్లాడితే కేసులు పెడతారా' అని ప్రశ్నించారు. కూల్చివేతలు మొదలైన చోటే పునర్నిర్మాణాలు మొదలవుతాయని, ఎక్కడైతే వినాశనం మొదలవుతుందో అక్కడే పునఃసృష్టి జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో ఇండియన్ పీనల్ కోడ్ తీసేసి యెల్లో పీనల్ కోడ్ తెచ్చారన్నారు. 10 శాతం ఓట్లతో పార్లమెంట్‌లో ఇందిరాగాంధీకి ప్రతిపక్ష హోదా కల్పించారని, 40 శాతం ఓట్లు ఉన్న తమకు ప్రతిపక్ష హోదా కల్పించకపోవడం దుర్మార్గమని అన్నారు. అసెంబ్లీలో గొంతు విప్పడానికి అవకాశం లేకుండా చేస్తున్నారన్నారు. 12వ తేదీన ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ఒకటో తేదీన పింఛన్లు, జీతాల కోసం అప్పులకు తిరుగుతున్నారని అన్నారు. వైఎస్ జగన్ పరిపాలన విధానాల వల్ల రాష్ట్రానికి రావాల్సిన రూ.5,340 కోట్లు విడుదలయ్యాయని గుర్తు చేశారు. 'జగన్ ఓడిపోయాడు.. చచ్చి పోలేదు' వంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అయ్యన్నపాత్రుడికి స్పీకర్ పదవి ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. బూతులు మాట్లాడటంలో అయ్యన్న టాప్ ర్యాంకులో ఉన్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలతో రైతుల వద్దకే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు వస్తున్నాయని రైతులు సంతృప్తి చెందుతున్నారని, అలాంటి రైతుల గుండెల్లో వైఎస్ జగన్ స్థానాన్ని తీసేయలేరని అన్నారు. వైఎస్ జగన్ నిర్మించిన ఆర్బీకేల వద్దే టీడీపీ వారు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తున్నారని అన్నారు. గతంలో చంద్రబాబు హయాంలో పీఏసీఎస్‌ల వద్ద రేయింబవళ్లు వేచి ఉండి పోలీసుల సమక్షంలో పంపిణీ చేసేవారని, విత్తనాల కోసం యుద్ధాలే జరిగేవని, రైతులకు ఆ పరిస్థితులు మళ్లీ తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు.

ఉన్నతస్థాయి నిపుణుల కమిటీ ఏర్పాటు అభినందనీయం

సాక్షి, అమరావతి: జాతీయ స్థాయిలో వివిధ ప్రవేశ పరీక్షలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు డాక్టర్ కె.రాధాకృష్ణన్ చైర్మన్‌గా ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమని యూజీసీ చైర్మన్ ఎం.జగదీశ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షల ప్రక్రియలో సంస్కరణలు, డేటా భద్రత, ప్రొటోకాల్‌ను మెరుగుపర్చడం ద్వారా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) పనితీరు మెరుగవుతుందన్నారు. తద్వారా జాతీయ ప్రవేశ పరీక్ష వ్యవస్థను బలోపేతం చేయవచ్చునని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల ఆసక్తిని, వారి భవిష్యత్తును పరిరక్షించడం యూజీసీ ప్రాధాన్యతగా పేర్కొన్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇల్లు ముట్టడి.. ఉద్రిక్తత

కాచిగూడ (హైదరాబాద్): నీట్ పరీక్షను రద్దుచేసి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ బర్కత్‌పురలోని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఇంటిని ముట్టడించారు. విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కేంద్రంలోని బీజేపీ ఎన్‌డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నీట్ సమస్య పరిష్కారానికి కిషన్‌రెడ్డి చొరవ చూపాలని, నష్టపోయిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు న్యాయం చేయలేకపోతే తన పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. కిషన్‌రెడ్డికి గనుల వేలం పాటపై ఉన్న శ్రద్ధ, లక్షలాది మంది విద్యార్థులపై లేకపోవడం సిగ్గు చేటన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతికే ఉందా?

- కూటమి ప్రభుత్వం చట్టాన్ని లెక్క చేయడంలేదు
- హైకోర్టు ఆదేశాలను ఖాతరు చేయకుండా వైఎస్సార్‌సీపీ ఆఫీసు భవనం కూల్చేశారు
- వైఎస్సార్‌సీపీ నేత టీజేఆర్ సుధాకర్‌బాబు ధ్వజం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చట్టాన్ని లెక్క చేయడంలేదని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతికే ఉందా అన్న ప్రశ్న తలెత్తుతోందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు ధ్వజమెత్తారు. హైకోర్టు ఆదేశాలను కూడా ఖాతరు చేయకుండా నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయం భవనాన్ని కూల్చేశారని మండిపడ్డారు. ఆయన శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు పాలన తొలిరోజు నుంచే నియంతృత్వ ధోరణితో సాగుతోందని అన్నారు. చంద్రబాబు నివసిస్తున్నదే అక్రమంగా కట్టిన కరకట్ట నివాసంలో అని, దాన్ని కూల్చేస్తామని గతంలో అదే పార్టీ ప్రభుత్వంలో మంత్రిగా చేసిన దేవినేని ఉమా చెప్పారని తెలిపారు. అదే అక్రమ కట్టడంలో ఉంటూ చంద్రబాబు నీతులు వల్లిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన దగ్గర నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టీడీపీ కూటమి నేతలు హింసాకాండకు పాల్పడటం ఈ ప్రభుత్వ ఉద్దేశాలను చెప్పకనే చెప్తున్నాయన్నారు. ఇప్పుడు ప్రభుత్వమే వైఎస్సార్‌సీపీ కార్యాలయాల ధ్వంసానికి దిగిందన్నారు. రాష్ట్రంలో అసలు రాజ్యాంగం ఉందా? చట్టం పనిచేస్తోందా? వ్యవస్థలు ఉన్నాయా? అన్న సందేహాలు కలుగుతున్నాయన్నారు. శనివారం అసెంబ్లీలో చంద్రబాబు, అచ్చెన్నాయుడు తేనె పలుకులు పలికారని, బయట మాత్రం కత్తులతో ప్రత్యర్థి రాజకీయ పార్టీ గొంతు కోయాలని చూస్తున్నారని చెప్పారు.

సభ ఎలా జరుపుతారో అయ్యన్న నియామకమే చెబుతుంది

ఎక్కువ బూతులు మాట్లాడేదెవరని యూట్యూబ్‌లో సెర్చ్ చేస్తే అయ్యన్నపాత్రుడినే చూపిస్తోందని, అలాంటి వ్యక్తిని స్పీకర్‌గా నియమించారంటే సభను ఎలా జరపాలనుకుంటున్నారో అర్థమవుతోందని సుధాకర్‌బాబు అన్నారు. తన స్నేహితుడితో అయ్యన్నపాత్రుడు మాట్లాడిన మాటలు ప్రజలందరికీ తెలియాలంటూ సుధాకర్‌బాబు ఆ వీడియోను ప్రదర్శించారు. జగన్ కేవలం ఓడిపోయాడు కాని, చావలేదు, చచ్చేవరకూ కొట్టాలంటూ అత్యంత దారుణంగా మాట్లాడిన వ్యక్తిని స్పీకర్ స్థానంలో కూటమి పార్టీలు కూర్చోపెట్టాయని ధ్వజమెత్తారు. ఇలాంటి మనస్తత్వం ఉన్న స్పీకర్ విపక్ష వైఎస్సార్‌సీపీ సభ్యులను మాట్లాడనిస్తారా.. అని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌ను అవమానించటానికి, ఆయన ఆస్తులను ధ్వంసం చేయడానికే చంద్రబాబు సీఎం అయ్యారా అని ప్రశ్నించారు.

భారీగా ఐఏఎస్‌ల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. 18 మంది ఐఏఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం.. వారిలో ఏడుగురిని సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ)కి అటాచ్ చేసింది. విశాఖ, బాపట్ల జిల్లా కలెక్టర్ల బాధ్యతలను అక్కడి జాయింట్ కలెక్టర్లకు అప్పగించింది.

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
ఎస్.నాగలక్ష్మి	విజయనగరం కలెక్టర్	గుంటూరు కలెక్టర్
ఎం.వేణుగోపాల్‌రెడ్డి	గుంటూరు కలెక్టర్	జీఏడీ
ఎ.మల్లికార్జునరావు	విశాఖ కలెక్టర్	జీఏడీ
ఏఎస్ దినేష్‌కుమార్	ప్రకాశం కలెక్టర్	అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్
ఎం.విజయసునీత	అల్లూరి కలెక్టర్	జీఏడీ
సగిలి షాన్‌మోహన్	చిత్తూరు కలెక్టర్	కాకినాడ కలెక్టర్
జె.నివాస్	కాకినాడ కలెక్టర్	జీఏడీ
వెట్రిసెల్వి కె	మహిళా,శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్	ఏలూరు జిల్లా కలెక్టర్
ఎస్. ప్రసన్న వెంకటేష్	ఏలూరు కలెక్టర్	జీఏడీ
పి.ప్రశాంతి	డైరెక్టర్, వ్యవసాయ మార్కెటింగ్	తూర్పు గోదావరి కలెక్టర్
కె.మాధవీలత	తూర్పు గోదావరి కలెక్టర్	జీఏడీ
బీఆర్ అంబేద్కర్	డైరెక్టర్, మిడ్ డే మీల్స్	విజయనగరం కలెక్టర్
సి.నాగరాణి	డైరెక్టర్, సాంకేతిక విద్య	పశ్చిమ గోదావరి కలెక్టర్
సుమిత్‌కుమార్	పశ్చిమ గోదావరి కలెక్టర్	చిత్తూరు కలెక్టర్
గుమ్మళ్ల సృజన	కర్నూలు కలెక్టర్	ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్
ఎస్. ఢిల్లీరావు	ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్	జీఏడీ
ఎ.తమీమ్ అన్సారియా	శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్	ప్రకాశం కలెక్టర్
పి.రంజిత్ బాషా	బాపట్ల కలెక్టర్	కర్నూలు కలెక్టర్

అమ్మో.. ఆపరేషనా!

కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలకు పురుషులు దూరం

- అవగాహన ఉన్నా అపోహలతో వెనుకంజ
- గతేడాది ఉమ్మడి జిల్లాలో 50 మందికి వేసక్టమీ ఆపరేషన్లు
- ట్యూబెక్టమీ చేయించుకుంది 9,279 మంది మహిళలు



పాలకోడేరు పీహెచ్‌సీలో వేసక్టమీ ఆపరేషన్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఆకివీడు: జనాభాను నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుటుంబం నియంత్రణను ప్రోత్సహిస్తున్నాయి. మహిళలకు ట్యూబెక్టమీ, పురుషులకు వేసక్టమీ ఆపరేషన్లు చేస్తున్నారు. అయితే కుటుంబ నియంత్రణ(కు.ని) శస్త్రచికిత్స అంటే మహిళలే చేయించుకోవాలి అనేది సమాజంలో బలంగా పాతుకుపోయింది. ప్రసవం అనంతరం ట్యూబెక్టమీ చేయించుకోవడం దశాబ్దాలుగా వస్తోంది. ఇంటి పట్టునే ఉండే మహిళలు ఈ ఆపరేషన్ చేయించుకుంటే మంచిదని, వృత్తి, వ్యాపార, ఉద్యోగాల రీత్యా శ్రమించే పురుషులు చేయించుకుంటే బలహీనపడతారనేది మరో అపోహ కూడా ఉంది. ఆయా కారణాలతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వేసక్టమీ ఆపరేషన్లు చేయించుకునే పురుషుల సంఖ్య ఏటేటా తగ్గుతోంది.

ఆమెకే ఆ'పరేషాన్'

ట్యూబెక్టమీ ఆపరేషన్ల సంఖ్య ఏడాదికి వేలల్లో ఉంటుండగా.. వేసక్టమీ ఆపరేషన్లు మాత్రం పదుల సంఖ్యలో కూడా ఉండటం లేదు. వేసక్టమీ ఆపరేషన్ల ఆవశ్యకతపై క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నా వెనుకడుగు వేస్తున్నారు. తమ వ్యాపారాలు, ఉపాధి అవకాశాలకు ఆటంకం కలుగుతుందని, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయనే అపోహలతో పురుషులు వెనుకంజ వేస్తున్నారు. ఆరోగ్యపరంగానూ మహిళలు కంటే పురుషులు కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేయించుకుంటే మంచిదని వైద్యులు చెబుతున్నా పెద్దగా స్పందన ఉండటం లేదు.

సులభంగా శస్త్రచికిత్స

కుటుంబ నియంత్రణలో మహిళలకు చేసే ట్యూబెక్టమీ కన్నా పురుషులకు చేసే వేసక్టమీ ఆపరేషనే సులభమని వైద్యులు చెబుతున్నారు. ఆపరేషన్ చేయించుకున్న 36 గంటల్లో మహిళలు ఇంటికి వెళ్లిపోవచ్చని అదే పురుషులైతే గంటల్లోనే లేచి ఇంటికి వెళ్లవచ్చని అంటున్నారు. వేసక్టమీ ఆపరేషన్లపై వైద్య సిబ్బంది అవగాహనా సదస్సుల్లో వివరిస్తున్నా పురుషులు ముందుకు రావడం లేదు. దీంతో వేసక్టమీ ఆపరేషన్ల సంఖ్య ఏడాదికి పదుల్లోనే ఉంటోంది. 2022–23 సంవత్సరం నుంచి ఇప్పటివరకు పశ్చిమగోదావరి జిల్లాలో 103 మంది, ఏలూరు జిల్లాలో 52 మంది పురుషులు మాత్రమే వేసక్టమీ ఆపరేషన్ చేయించుకోగా.. ట్యూబెక్టమీ ఆపరేషన్లను పశ్చిమలో 12,352 మంది, ఏలూరు జిల్లాలో 22,576 మంది మహిళలు చేయించుకున్నారు.

కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు

సంవత్సరం	ట్యూబెక్టమీ	వేసక్టమీ
పశ్చిమగోదావరి జిల్లా		
2022-2023	6,507	59
2023-2024	5,001	31
2024-2025 (ఇప్పటివరకు)	844	13
ఏలూరు జిల్లా		
2022-2023	5,306	24
2023-2024	4,278	19
2024-2025 (ఇప్పటివరకు)	640	09

గిరిజన ప్రాంతాల్లోనే అధికంగా..

నిరక్షరాస్యులైన గిరిజన ప్రాంతంలోని పురుషులు పలువురు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. ఆపరేషన్ చేయించుకున్న తర్వాత రోజే వారు పనులకు వెళుతున్నట్టు వైద్య సిబ్బంది చెబుతున్నారు. గిరిజనుల నివసించే ప్రాంతాల్లోనే ఎక్కువ వేసక్టమీ ఆపరేషన్లు జరుగుతున్నాయని అంటున్నారు.

ముందుకు రావడం లేదు



కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునేందుకు పురుషులు ముందుకు రావడంలేదు. ఆపరేషన్ వల్ల ఎలాంటి ఇబ్బందీ ఉండదని వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నా ఫలితం ఉండటం లేదు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో గత రెండున్నరేళ్లలో 103 మంది పురుషులకు మాత్రమే వేసక్టమీ చేశాం. మరింత మంది ముందుకు రావాలి.

–డాక్టర్ మహేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ, భీమవరం

శక్తి సామర్థ్యాలు తగ్గవు



వేసక్టమీ చేయించుకుంటే పురుషుల్లో శక్తి, లైంగిక సామర్థ్యం తగ్గిపోతుందనే అపోహలు, అనుమానాలు చాలా మందిలో ఉన్నాయి. ఇది వాస్తవం కాదు. కుట్లు లేకుండా అతి చిన్న ఆపరేషన్‌తో ముగిస్తారు. రీ ఆపరేషన్ కూడా చేయించుకోవచ్చు. వేసక్టమీపై మరింత అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది.

–డాక్టర్ బాలు, సివిల్ అసిస్టెంట్ సర్జన్, ద్వారకాతిరుమల



ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో నున్నవారందరు ఆయన శబ్దము విని, మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: బ.పాడ్యమి ఉ.5.41 వరకు, తదుపరి విదియ తె.4.35 (తెల్లవారితే సోమవారం).
నక్షత్రం: పూర్వాషాఢ సా.6.25 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: రా.2.12 నుండి 3.45 వరకు, దుర్ముహూర్తం: సా.4.50 నుండి 5.42 వరకు, అమృతఘడియలు: ప.1.34 నుండి 2.54 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం : 6.33
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

సురేష్ గోపీ (త్రిశ్శూర్ బీజేపీ ఎంపీ)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

"మోదీజీ మీ పట్ల ఒక మంచి అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు సురేష్" అన్నారు సురేంద్రన్!

సురేంద్రన్ కేరళ బీజేపీ అధ్యక్షులు. ఆయన పక్కనే పార్టీ సీనియర్ లీడర్ మురళీ ధరన్ ఉన్నారు.

"అవును సురేష్, మోదీజీ మీ పట్ల ఒక మంచి అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు" అన్నారు మురళీధరన్.

నవ్వాన్నేను.

"నిజం సురేష్, మీ పరమత సహనం మోదీ జీకి నచ్చింది" అన్నారు సురేంద్రన్!

"అవును సురేష్, మీ పరపార్టీ సహనం కూడా" అన్నారు మురళీధరన్!

ఈసారి పెద్దగా నవ్వాన్నేను.

"ఎందుకు నవ్వుతున్నారు! చర్చికి వెళ్లి స్తుతులు చెల్లించారు. బంగారు జపమాలను విరాళంగా ఇచ్చారు. ఇఫ్తార్ విందులకు వెళ్లారు. దగ్గర కూర్చొని వడ్డించారు. క్యాథలిక్ కెథడ్రాల్ చర్చికి వెళ్లారు. బంగారు కిరీటం కానుకగా ఇచ్చారు. ఇవన్నీ కూడా మోదీజీ దృష్టిలో మిమ్మల్ని ప్రత్యేకమైన నాయకుడిగా నిలబెట్టాయి" అన్నారు సురేంద్రన్.



"అంతేకాదు సురేష్... దివంగత సీపీఐ (ఎం) నేత ఇ.కె.నయనార్ ఇంటికి వెళ్లి మీరు ఆయన కుటుంబ సభ్యుల్ని పరామర్శించటం, దివంగత కాంగ్రెస్ నేత కె.కరుణాకరన్ సమాధిని సందర్శించటం, వారిద్దరినీ మీ రాజకీయ గురువులుగా మీరు కీర్తించటం పైన కూడా మోదీజీ పూర్తి సంతృప్తితో ఉన్నారు" అన్నారు మురళీధరన్!

"ఇందులో నన్ను అభినందించటానికి కానీ, నన్నొక ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టటానికి గానీ ఏముంది?!" అన్నాను.

"లేకేం సురేష్, ఇవన్నీ కూడా పైనుంచి ఒకరు మిమ్మల్ని ఆదేశించకుండానే మీ అంతట మీరు చొరవ తీసుకుని చేసినవి! ఒక బీజేపీ లీడర్ త్రిశ్శూర్‌లో 14 శాతం ఉన్న ముస్లిం ఓటర్ల ఇఫ్తార్ విందుకు వెళ్లటం, 21 శాతం ఉన్న క్రిస్టియన్ ఓటర్ల చర్చిలకు విరాళాలు ఇవ్వటం మంచి విషయమే కదా" అన్నారు సురేంద్రన్!

నాక్కొంచెం అర్థమైంది.

"ఒక బీజేపీ లీడర్ సీపీఐ(ఎం), కాంగ్రెస్ లీడర్‌లను కొనియాడటం కూడా మంచి సంప్రదాయమే. కానీ ఇందిరాగాంధీని 'మదర్ ఆఫ్ ది నేషన్' అనటాన్నే మోదీజీ ఎలా తీసుకొని ఉంటారో తెలీదు. ఒకటైతే నిజం. రాష్ట్రపతి నామినేట్ చేసిన రాజ్యసభ సభ్యుడిగా 2016 నుంచి 2022 వరకు మీరెలాగైతే స్వతంత్రంగా ఉన్నారో, బీజేపీ లోక్ సభ సభ్యుడిగా 2024 జూన్ 4 నుంచి అంతే స్వతంత్రంగా ఉన్నారని మోదీజీ అనుకునే ఉంటారు" అన్నారు మురళీధరన్.

నాకు మరికొంచెం అర్థమైంది.

"ఇందిరాగాంధీని నేను 'మదర్ ఆఫ్ ది నేషన్' అనటంలోని నా ఆంతర్యం మీడియాకు అర్థం కాలేదు సురేంద్రన్. కాంగ్రెస్‌కి కరుణాకరన్ ఎలాగైతే ఫాదర్ ఆఫ్ కేరళనో, అలాగే కాంగ్రెస్‌కి ఇందిరాగాంధీ మదర్ ఆఫ్ నేషన్ అని నా ఉద్దేశం" అన్నాను.

"మీ ఉద్దేశాన్ని మోదీజీ చక్కగా అర్థం చేసుకున్నారు సురేష్. కానీ కేరళ బీజేపీలోని వాళ్లే ఇంకోలా అర్థం చేసుకుంటారేమోనని ఆయనకు సందేహం కలగకుండా ఉంటుందంటారా?" అన్నారు మురళీధరన్.

"కేరళలో బీజేపీకి ఇప్పుడున్న 16.68 శాతం ఓటు షేరును మరింతగా పెంచే బాధ్యతను మీరు తీసుకుంటారని మోదీజీ భావిస్తున్నారు సురేష్. మీరు ఎక్కడికైనా వెళ్లండి. కానీ బీజేపీ నుండి వెళ్లిపోలేదని మాత్రం మర్చిపోకండి. మీరెన్నైనా కానుకలు ఇవ్వండి. కానీ స్టేట్‌మెంట్‌లు మాత్రం ఇవ్వకండి. రాజకీయ మనోభావాలు కేరళలో మత విశ్వాసాల కంటే పార్టీ విశ్వాసాల్నే తేలిగ్గా మండించేస్తాయి" అన్నారు సురేంద్రన్!

ఇది మాత్రం నాకు అర్థం కాలేదు!

పార్టీలను గానీ, మత విశ్వాసాలను గానీ తేలిగ్గా మండించే స్వభావం కలిగి ఉండే రాజకీయ మనోభావాలను తేలిగ్గా చల్లార్చే అగ్నిమాపకాలుగా మార్చుకోలేమా?!

ఏ ఫర్ ఎటాక్... పీ ఫర్ పొక్లెయిన్?



జనతంత్రం

వర్ధెల్లి మురళి

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈమధ్య ఓ కొటేషన్ చెప్పారు. 'ఏ ఫర్ అమరావతి, పీ ఫర్ పోలవరం'. ఈ రెండూ తన ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ముఖ్యమైనవనే ఉద్దేశంతో ఆ మాట చెప్పారు. ఎన్నికలకు ముందు ఆయన ఎక్కువ ప్రచారం చేసింది మాత్రం సూపర్ సిక్స్ హామీలు, మేనిఫెస్టోలోని ఇతర హామీల గురించే! ఈ నేపథ్యంలోంచి చూసినప్పుడు 'ఏ ఫర్ ఆల్, పీ ఫర్ పీపుల్' అనే కొటేషన్ ఆయన నోటినుంచి రావాల్సింది. విభజిత రాష్ట్రానికి తొలిదఫా ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటి ప్రాధాన్యతలనే ఇప్పుడాయన పునరుద్ఘాటించారు.

నిజమే, ఆర్థిక రంగానికి గ్రోత్ ఇంజన్ లాంటి ఒక మహానగరం ఏ రాష్ట్రాభివృద్ధికైనా అవసరమే. అలాగే పోలవరం కూడా! పోలవరం ఆంధ్రుల జీవనాడి అనే సెంటిమెంట్ కూడా బలపడిపోయింది. ఈ సెంటిమెంట్ వయసు డెబ్బయ్ అయిదు పైనే ఉంటుంది. ఈ రెండు అంశాలపై ఎవరికీ పేచీ ఉండదు. కానీ, మహానగర అభివృద్ధికోసం తొలి ఐదేళ్ల కాలంలో ఆయన ఎంచుకున్న మార్గం గమ్యం చేర్చేదేనా? పోలవరం నిర్మాణంపై ఆయన అనుసరించిన పద్ధతి సమర్థనీయమేనా అన్న ప్రశ్నలు చర్చనీయాంశాలవుతున్నాయి.

గడిచిన డెబ్బయ్యేళ్ల ప్రపంచ చరిత్రలో నిర్మాణమైన ఏ ఒక్క గ్రీన్ ఫీల్డ్ నగరం కూడా ఆశించిన స్థాయిలో విజయవంతం కాలేదు. షెన్‌జెన్ (చైనా), నవీ ముంబై (ఇండియా) మాత్రమే అంచనాలను సగం మేరకు అందుకోగలిగాయి. ఇక దేశ రాజధాని నగరాల కోసం నిర్మాణమైన గ్రీన్‌ఫీల్డ్ నగరాల కథలన్నీ ఫెయిల్యూర్ స్టోరీలే. మయన్మార్ నిర్మించుకున్న రాజధాని నగరం నేపిడా ఒక నిర్జన కాంక్రీట్ జంగిల్‌ను తలపిస్తున్నది. పుత్రజయ (మలేషియా), కాన్‌బెర్రా (ఆస్ట్రేలియా), ఆస్థానా (కజికిస్థాన్), డొడోమా (టాంజానియా) నగరాల్లో ఇప్పటికీ ప్రభుత్వ పీఠాలు, అధికార యంత్రాంగ కార్యకలాపాలు తప్ప జనజీవన ప్రవంతులు కనిపించడం లేదు.

అమరావతి నిర్మాణం కోసం చంద్రబాబు గత ప్రభుత్వం ఎంచుకున్న రియల్ ఎస్టేట్ మోడల్ కూడా సాధారణ ప్రజలు ఇక్కడ నివసించడానికి అనువైనది కాదు. ఈ మోడల్ వల్ల పెరిగే అద్దెలను, భూముల ధరలను మధ్యశ్రేణి ఉద్యోగులు సైతం భరించలేరు. వారంతా విజయవాడ, మంగళగిరి, గుంటూరు వంటి ప్రాంతాల్లో నివసిస్తూ ఉద్యోగం కోసం వచ్చిపోవలసిందే. అటువంటి పరిస్థితి ఏర్పడితే మరో పుత్రజయ అనుభవమే మనకు మిగులుతుంది.

అలా జరగకూడదనే మనం కోరుకుంటాము. జన సమ్మర్దంతో అమరావతి కిటకిటలాడాలనే కోరుకుంటాము. రాయల కాలం నాటి విజయనగరంలా వీధులన్నీ రతనాల రాశులతో తులతూగాలనే ప్రార్థిస్తాము. 'చెరువులో చేపల్ని నింపినట్టు నా నగరాన్ని మనుషులతో నింపు దేవుడా' అని హైదరాబాద్ నిర్మాత కులీ కుతుబ్‌షా అల్లాను వేడుకున్నట్టుగానే మనమూ వేడుకోవచ్చు. కానీ అందుకు అనువైన పరిస్థితులు ఉండవనే నిపుణులు చెబుతున్నారు. గ్రీన్‌ఫీల్డ్ మహానగరాలు అవాంఛనీయమని పర్యావరణ నిపుణులు కూడా హెచ్చరిస్తున్నారు. కానీ మనం మనకు నచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తున్నాము.

పోలవరం విషయంలోనూ చంద్రబాబు గత ప్రభుత్వం వేసింది తప్పటడుగేనని నిష్పాక్షిక పరిశీలన జరిపితే ఎవరికైనా అర్థమవుతుంది. జాతీయ హోదా లభించిన ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతను కేంద్రానికే వదిలేసి ఉంటే రాష్ట్రానికి మేలు జరిగేది. అలాకాకుండా, అడిగి మరీ భుజాన వేసుకొని ఆపసోపాలు పడవలసిన పరిస్థితిని ఎదుర్కొంటున్నాము. డయాఫ్రమ్ వాల్‌కు సంబంధించిన సంక్షోభంలో ఇప్పుడు రాష్ట్రం ఇరుక్కొని పోయింది. ఇది తేలితే తప్ప ప్రాజెక్టు ముందుకు కదలదు.

ప్రధాన డ్యామ్‌కు పునాదిగా వేసేదాన్ని డయాఫ్రమ్ వాల్ అంటారు. ఇది దృఢంగా ఉండటమే ప్రాజెక్టుకు కీలకం. అందుకని వరద కోతకు గురికాకుండా ఉండటం కోసం ముందుగానే ఎగువభాగం నుంచి నది ప్రవాహాన్ని పక్కకు మళ్లించి కొంత దూరం ప్రధాన నదికి సమాంతరంగా పారించి దిగువన మళ్లీ నదిలో కలిపేస్తారు. ఈ ప్రవాహ నియంత్రణ కోసం చేసే ఏర్పాట్లను అప్రోచ్ చానల్, స్పిల్ చానల్, స్పిల్ వేలుగా వ్యవహరిస్తారు. ఆ తర్వాత ప్రధాన డ్యామ్‌కు ఎగువన, దిగువన రెండు మట్టి కట్టలను ప్రవాహానికి అడ్డంగా నిర్మిస్తారు. వీటినే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లుగా వ్యవహరిస్తారు.

గడిచిన డెబ్బయ్యేళ్ల ప్రపంచ చరిత్రలో నిర్మాణమైన ఏ ఒక్క గ్రీన్ ఫీల్డ్ నగరం కూడా ఆశించిన స్థాయిలో విజయవంతం కాలేదు. షెన్‌జెన్ (చైనా), నవీ ముంబై (ఇండియా) మాత్రమే అంచనాలను సగం మేరకు అందుకోగలిగాయి. ఇక దేశ రాజధాని నగరాల కోసం నిర్మాణమైన గ్రీన్‌ఫీల్డ్ నగరాల కథలన్నీ ఫెయిల్యూర్ స్టోరీలే. మయన్మార్ నిర్మించుకున్న రాజధాని నగరం నేపిడా ఒక నిర్జన కాంక్రీట్ జంగిల్‌ను తలపిస్తున్నది. పుత్రజయ (మలేషియా), కాన్‌బెర్రా (ఆస్ట్రేలియా), ఆస్థానా (కజికిస్థాన్), డొడోమా (టాంజానియా) నగరాల్లో ఇప్పటికీ ప్రభుత్వ పీఠాలు, అధికార యంత్రాంగ కార్యకలాపాలు తప్ప జనజీవన ప్రవంతులు కనిపించడం లేదు. అమరావతి నిర్మాణం కోసం చంద్రబాబు గత ప్రభుత్వం ఎంచుకున్న రియల్ ఎస్టేట్ మోడల్ కూడా సాధారణ ప్రజలు ఇక్కడ నివసించడానికి అనువైనది కాదు. ఈ మోడల్ వల్ల పెరిగే అద్దెలను, భూముల ధరలను మధ్యశ్రేణి ఉద్యోగులు సైతం భరించలేరు. వారంతా విజయవాడ, మంగళగిరి, గుంటూరు వంటి ప్రాంతాల్లో నివసిస్తూ ఉద్యోగం కోసం వచ్చిపోవలసిందే. అటువంటి పరిస్థితి ఏర్పడితే మరో పుత్రజయ అనుభవమే మనకు మిగులుతుంది.

ఈ పనులన్నీ పూర్తయిన తర్వాతనే డయాఫ్రమ్ వాల్ కడతారని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్న మాట. కాఫర్ డ్యామ్‌లను పూర్తిగా కట్టాలంటే అవి ప్రవాహాన్ని అడ్డుకునేంత మేర ఎగువ జనావాస ప్రాంతాలను ఖాళీ చేసి ప్రజలకు పునరావాసం కల్పించాలి. ఆ పని చేయలేదు కానీ, కాఫర్ డ్యామ్‌లను సగం కట్టి వదిలేశారు. స్పిల్‌వే, స్పిల్ ఛానల్ పనులను పునాది స్థాయిలోనే వదిలేశారు. డయాఫ్రమ్ వాల్‌ను మాత్రం రికార్డు సమయంలో నిర్మించామని అప్పట్లో బాబు ప్రభుత్వం ఓ వేడుకను కూడా జరిపినట్టు గుర్తు. 2018 జూన్ 11 నాటికి డయాఫ్రమ్ వాల్ పూర్తయినట్టు అక్కడో పైలాన్‌ను ఆవిష్కరించారు.

ఆ తర్వాత దాదాపు సంవత్సర కాలానికి అంటే 2019 మే 30న రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. జూన్, జూలై మాసాల్లో వచ్చిన భారీ వరదలకు డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నట్టుగా కొంతకాలం తర్వాత వెల్లడైంది. 'రికార్డు' సమయంలో డయాఫ్రమ్ వాల్ కట్టిన తర్వాత కూడా కాఫర్ డ్యామ్‌లు పూర్తిచేయడానికి, స్పిల్ చానల్ పునాదులు పూర్తిచేయడానికి బాబు ప్రభుత్వానికి ఏడాది సమయం మిగిలింది. కాని నెల రోజుల సమయం మాత్రమే ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ పనులు చేయకపోవడం వల్లనే డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నదని టీడీపీ ప్రచారంలో పెట్టింది.

ముందు చేయవలసిన పనులు చేయకుండా ఎకాఎకిన డయాఫ్రమ్ వాల్ ఎందుకు కట్టవలసి వచ్చిందన్న ప్రశ్నకు టీడీపీ నుంచి ఇప్పటివరకు స్పష్టమైన సమాధానం రాలేదు. కమీషన్లు భారీగా ముట్టే పనులనే ముందుగా చేపట్టారు తప్ప ప్రోటోకాల్ పాటించలేదన్న వైసీపీ వారి విమర్శకు కూడా కచ్చితమైన సమాధానం రాలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాఫర్ డ్యామ్‌లను పూర్తిచేయడంతోపాటు ప్రవాహాన్ని సమాంతరంగా మళ్లించే పనిని పూర్తి చేశారు. ప్రాజెక్టు కుడి ఎడమ కాలువలను జలాశయంతో అనుసంధానించే పనిని కూడా పూర్తి చేశారు. డ్యామ్ నిర్మాణ స్థలంలో ఏర్పడిన అగాధాలను పూడ్చి పూర్వపు స్థితికి తీసుకొచ్చారు. ఇక మిగిలిన డయాఫ్రమ్ వాల్ విషయంలో ఏం చేయాలో చెబితే శరవేగంగా పనులు పూర్తి చేస్తామని జగన్ ప్రభుత్వం కేంద్రాన్ని 2022 డిసెంబర్ నుంచి కోరుతూ వస్తున్నది.

మొన్నటి పోలవరం పర్యటనలో చంద్రబాబు కూడా ఇదే విషయాన్ని చెప్పారు. రిపేర్లు చేయాల్సి వస్తే 400 కోట్లకు పైగా ఖర్చవుతుందనీ, కొత్తగా కట్టాలంటే 900 కోట్లు అవుతుందనీ, ఏ సంగతీ కేంద్రం తేల్చాలని చెప్పారు. కనుక పోలవరం విషయంలో జరిగిన వ్యవహారాలన్నీ గమనంలోకి తీసుకుంటే మాటల్లో చెప్పేంత ప్రాధాన్యత వారి మస్తిష్కంలో లేదనే సంగతి స్పష్టమవుతుంది. 'ఏ ఫర్ ఆల్, పీ ఫర్ పీపుల్' అనేది వారి విధానం కాదు. 'ఏ ఫర్ అమరావతి, పీ ఫర్ పోలవరం' అనే మాటల వెనుక అర్థాలు వేరు. ప్రత్యర్థుల మీద 'ఏ ఫర్ ఎటాక్, పీ ఫర్ పొక్లెయిన్' విధానాన్ని మాత్రం కొత్త ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తున్నదని చెప్పవచ్చు.

శుక్రవారం నాడు ఆంధ్రప్రదేశ్ పదహారో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సభ్యులందరూ పదవీ ప్రమాణాలు చేశారు. అసెంబ్లీ ఆవరణలోకి ఆయన కారును అనుమతించడం ద్వారా జగన్‌మోహన్‌రెడ్డికి తాము చాలా మర్యాద ఇచ్చామని ప్రభుత్వ సభ్యులు మీడియాతో చెబుతున్నారు. ఔను, నోటితో నవ్వి నొసటితో వెక్కిరించారు. ఆయనను ప్రతిపక్ష నాయకుడిగా తాము గుర్తించబోవడం లేదనే స్పష్టమైన సంకేతాలను వారు పంపించారు. ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించే ఉద్దేశం ప్రభుత్వానికి ఉంటే సభా నాయకుడు ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన వెంటనే జగన్‌మోహన్‌రెడ్డిని పిలిచేవారు. ఇది సంప్రదాయం. కానీ, మంత్రిమండలి సభ్యులందరి ప్రమాణాలు పూర్తయ్యాకనే ఆయన్ను పిలిచారు.

ప్రతిపక్షంగా గుర్తింపు పొందాలంటే పది శాతం సభ్యులుండాలన్న చట్టపరమైన నిబంధన ఏదీ లేదు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీలకు సమయాన్ని కేటాయించడం, ఆ పార్టీ సభ్యులకు గదులను కేటాయించడం కోసం తొలి లోక్‌సభ స్పీకర్ జీ.వీ. మావలంకర్ పెట్టిన 10 శాతం నిబంధనను ప్రతిపక్ష నాయకుడి గుర్తింపుకోసం తప్పుగా అన్వయిస్తున్నారు. పది శాతం సభ్యులున్న పార్టీని పార్లమెంటరీ పార్టీగా, అంతకంటే తక్కువమంది సభ్యులున్న పార్టీలను పార్లమెంటరీ గ్రూపులుగా మావలంకర్ వర్గీకరించారు. అంతే తప్ప ప్రతిపక్ష నాయకుని ప్రస్తావనే ఆ నిబంధనలో లేదు. 1977లో చేసిన చట్టంలోనే ప్రతిపక్ష నాయకుని ప్రస్తావన వచ్చింది. ప్రతిపక్షాల్లో పెద్ద పార్టీగా అవతరించిన పార్టీ నాయకుడిని ఈ చట్టం ప్రతిపక్ష నేతగా గుర్తిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభలో ఉన్న ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ ఒక్కటే. ఆ పార్టీకి లభించిన సీట్లు పదకొండే కావచ్చు. కానీ 40 శాతం ఓట్లు వచ్చాయి. ఈ ఓట్లను దామాషా పద్ధతిలోకి అనువదిస్తే 70 సీట్లు గెలిచినట్టు లెక్క.

ప్రతిపక్షంగా గుర్తింపు పొందాలంటే పది శాతం సభ్యులుండాలన్న చట్టపరమైన నిబంధన ఏదీ లేదు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీలకు సమయాన్ని కేటాయించడం, ఆ పార్టీ సభ్యులకు గదులను కేటాయించడం కోసం తొలి లోక్‌సభ స్పీకర్ జీ.వీ. మావలంకర్ పెట్టిన 10 శాతం నిబంధనను ప్రతిపక్ష నాయకుడి గుర్తింపుకోసం తప్పుగా అన్వయిస్తున్నారు. పది శాతం సభ్యులున్న పార్టీని పార్లమెంటరీ పార్టీగా, అంతకంటే తక్కువమంది సభ్యులున్న పార్టీలను పార్లమెంటరీ గ్రూపులుగా మావలంకర్ వర్గీకరించారు. అంతే తప్ప ప్రతిపక్ష నాయకుని ప్రస్తావనే ఆ నిబంధనలో లేదు. 1977లో చేసిన చట్టంలోనే ప్రతిపక్ష నాయకుని ప్రస్తావన వచ్చింది. ప్రతిపక్షాల్లో పెద్ద పార్టీగా అవతరించిన పార్టీ నాయకుడిని ఈ చట్టం ప్రతిపక్ష నేతగా గుర్తిస్తున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభలో ఉన్న ప్రతిపక్షం వైఎస్సార్ సీపీ ఒక్కటే. ఆ పార్టీకి లభించిన సీట్లు పదకొండే కావచ్చు. కానీ 40 శాతం ఓట్లు వచ్చాయి. ఈ ఓట్లను దామాషా పద్ధతిలోకి అనువదిస్తే 70 సీట్లు గెలిచినట్టు లెక్క. ప్రతిపక్ష నేతను నిర్ణయించడం కోసం చట్టంలో మూడు నిబంధనలు పెట్టారు. ఒకటి – లోక్‌సభ / శాసనసభలో సభ్యుడై ఉండాలి. రెండు – ఎక్కువ మంది సభ్యులున్న ప్రతిపక్ష పార్టీ నాయకుడై ఉండాలి. మూడు – స్పీకర్ గుర్తించాలి. ఈ స్పీకర్ గుర్తింపును తప్పుగా వ్యాఖ్యానిస్తున్నారు. ప్రతిపక్షాల్లో రెండు పార్టీలకు సమానంగా సభ్యులున్నప్పుడు ఉత్పన్నమయ్యే పరిస్థితుల్లో స్పీకర్ ఆ పార్టీల ఓట్ల శాతాన్ని, ఇతర విషయాలను పరిగణనలోకి తీసుకుంటారు. అంతవరకే ఆయన విచక్షణాధికారం. ఎక్కువ సభ్యులున్న ఒకే పార్టీ ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకుడిని ప్రతిపక్ష నేతగా గుర్తించడమే చట్టం సారాంశం.

ఈ స్ఫూర్తిని అధికార పార్టీ ప్రదర్శించలేదనే చెప్పాలి. శాసనసభను గౌరవ సభగా మారుస్తామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలకూ, ఆచరణకూ మధ్యన లంకె కుదరడం లేదు. శాసనసభ వ్యవహారాలను పక్కనబెడితే, రాష్ట్రంలో అలుముకుంటున్న రాజకీయ వాతావరణం ప్రజాస్వామ్య ప్రియులను కలవరానికి గురిచేస్తున్నది. ఓట్ల లెక్కింపు రోజున ప్రారంభమైన దాడులు మూడు వారాలుగా ప్రతిపక్ష కార్యకర్తలపై యథేచ్ఛగా జరుగుతూనే ఉన్నాయి. పోలీసుల ప్రేక్షక పాత్ర షరా మామూలే. తాజాగా వైఎస్సార్‌సీపీ గుంటూరు కార్యాలయాన్ని కూడా పొక్లెయిన్లతో నేలమట్టం చేశారు. ఇది అధికారిక కూల్చివేత. ఈ అధికారిక కూల్చివేతలు ఇంకా ఉంటాయట! అనుమతుల్లేవనే ఒక ముద్ర వేసి, కూల్చేస్తారట! ఒక అక్రమ భవంతిలో నివాసముండే ముఖ్యమంత్రి ప్రతిపక్ష కార్యాలయాలను అక్రమం అనే ముసుగేసి కూల్చివేయడం సమంజసమేనా?

vardhelli1959@gmail.com

పొంతన లేని వాదంతో దుష్ప్రచారాలు



సందర్భం

వి.వి.ఆర్. కృష్ణంరాజు

'సృజనశీలతను అందరూ అభినందిస్తారు... కానీ అనాగరికులు మాత్రమే విధ్వంసంలో అందాన్ని చూస్తారు' అంటాడు కందియ కమలేశ్వరన్ అనే మలేషియన్ గాయకుడు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ పాలనతో పాటు విధ్వంసమూ ప్రారంభమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యర్థులపై హత్యాకాండ, గృహ దహనాలు కొనసాగుతున్నాయి. దీనికి తోడు కొత్తగా యూపీ తరహా బుల్డోజర్ సంస్కృతికి తెరతీశారు. తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని హైకోర్టు ఆదేశాలు ఖాతరు చేయకుండా ఆగమేఘాల మీద కూల్చేశారు. 2022 జూన్ 17వ తేదీన 'యూపీ గవర్నమెంట్ వర్సెస్ జమాతే ఇస్లామీ' కేసులో సుప్రీం కోర్టు... కూల్చి వేతలు ఒక వర్గాన్ని లక్ష్యం చేసేవిగా ఉండకూడదని పేర్కొంది. కానీ ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వ ఆదేశంతో సీఆర్‌డీఏ అధికారులు వైఎస్సార్ కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని పార్టీ కార్యాలయాన్ని కూల్చేశారు. సీఆర్‌డీఏ చట్టంలోని 115 సెక్షన్ ప్రకారం ఫైనల్ కన్ఫర్మేషన్ ఆర్డర్ ఇవ్వలేదు. 137 సెక్షన్ ప్రకారం ఇచ్చిన నోటీసులకు సమాధానం పొందడానికి సహేతుక సమయం ఇవ్వలేదు.

కృష్ణా కరకట్ట వద్ద నదీతీరాన చంద్రబాబు నిర్మించిన ప్రజావేదిక కూల్చి వేతను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ కూల్చివేతతో ముడి పెడుతున్నారు. నిజానికి రాష్ట్ర క్యాబినెట్ తీర్మానంతో జీఓ ద్వారా పొందిన భూమిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని అన్ని అనుమతులతో నిర్మిస్తున్నారు. కానీ ప్రజా వేదికను ప్రభుత్వ భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించారు. నదీ తీరాన నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనంలో నివసిస్తున్న చంద్రబాబు నిర్మించిన ఈ ప్రజా వేదిక వల్ల కరకట్టపై తమ రాకపోకలకు అంతరాయం కలుగుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. 2019లో చంద్రబాబు ఓడిపోయిన తర్వాత ప్రజా వేదిక వద్దకు ప్రజలు రావడం లేదు, దీంతో కొత్త ప్రభుత్వం ఈ అక్రమ కట్టడాన్ని కూల్చేసింది.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. 'ఓటుకు నోటు' కేసు తర్వాత చంద్రబాబు నాయుడు హడావిడిగా హైదరాబాద్ విడిచి కృష్ణా బరాజ్‌కు కుడివైపున కరకట్ట– నదీ ప్రాంతానికి మధ్యలోని ఫ్లడ్ బ్యాంక్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనం (లింగమనేని ఎస్టేట్) లోకి మకాం మార్చారు. కృష్ణా కరకట్ట ప్రాంతంలో గుంటూరు జిల్లా పరిధిలో 48 భవనాలు, కృష్ణా జిల్లా పరిధిలో 18 భవనాలతో పాటు ప్రకృతి వైద్యశాల కూడా 'నదీ పరిరక్షణ చట్టం–1884' నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినవేనని స్వయానా అప్పటి రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు 2015 జనవరిలో చెప్పడమే కాక, వివిధ శాఖల నుంచి నోటీసులు కూడా ఇప్పించారు. ఇవన్నీ బడాబాబులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినవేననీ, వీటిని కూల్చి వేస్తామనీ హడావిడి చేశారు. ఈ కూల్చివేసే భవనాల లిస్టులో లింగమనేని ఎస్టేట్ కూడా ఉంది.



తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

వీటి నిర్మాణంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఈ అక్రమ నివాసంతో పాటు మిగిలిన అక్రమ కట్టడాలను కూడా సక్రమం చేయడానికి, ఫ్లడ్ బ్యాంక్ పరిధిని మార్చడానికి హడావిడిగా చంద్రబాబు ప్రభుత్వం జీఓలు తెచ్చింది. అయితే ఇవేమీ చట్టం ముందు నిలబడేవి కాదు. కృష్ణా బరాజ్‌కు కుడివైపున నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనంలో ముఖ్యమంత్రి నివసించడం 'రివర్ కన్సర్వెన్సీ యాక్ట్'ను ఉల్లంఘించడమే. ఈ యాక్ట్ ప్రకారం నదిని ఆనుకుని 500 మీటర్ల వరకూ ఎటువంటి నిర్మాణాలనూ చేయకూడదు. కాని ముఖ్యమంత్రి నివసిస్తున్న భవనం నదికి వందమీటర్ల దూరంలోనే ఉంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ నాలుగేళ్ళ క్రితం ఉత్తర్వులు ఇస్తూ, నది తీరాన 200 మీటర్ల వరకూ నిషేధిత ప్రాంతంగా, 500 మీటర్ల వరకూ నియంత్రణ ప్రాంతంగా ప్రకటించింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ 1996 మార్చి ఎనిమిదో తేదీన విడుదల చేసిన జీఓ నం. 111 ప్రకారం నదికి సమీపాన ఎటువంటి నిర్మాణాలు చేయకూడదు, ఎటువంటి వ్యర్థ పదార్థాలూ నదిలో వదల కూడదు. ఈ ప్రాంతంలో ఉన్న ముఖ్యమంత్రి నివాసంతో పాటు ఏ కట్టడానికీ డ్రైనేజ్ సదుపాయం లేదు. అక్కడి రోగులు, స్థానికులు విసర్జించే మలినం కృష్ణానీటిలో కానీ, నదీ సమీపాన బహిరంగ ప్రదేశాలకు కానీ చేరుతోంది.

కేంద్ర పొల్యూషన్ బోర్డు నివేదిక ప్రకారం నదీజలాల్లో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) ఐదు రోజుల సగటు విశ్లేషణల్లో లీటర్‌కు రెండు మిల్లీ గ్రాముల కన్నా తక్కువ ఉండాలి. గుంటూరు జిల్లా అమరావతి వద్ద కృష్ణా జలాల్లో బీఓడీ 1.4 మిల్లీగ్రాములుండగా... అదే నీటిలో కరకట్ట వద్ద బీఓడీ 2.6 మిల్లీ గ్రాములకు పెరిగిపోయింది. ప్రమాదకర బాక్టీరియా, వైరస్‌లు, ప్రోటోజోవా యూనిట్లు కరకట్ట జలాల వద్ద చాలా ఎక్కువగా ఉన్నాయి. కంటికి కనిపించని ఈ క్రిములతో కూడిన కాలనీ ఫార్మింగ్ యూనిట్స్ మోస్ట్ ప్రాబబుల్ నంబర్ ప్రతి వంద మిల్లీ లీటర్లకు అమరావతి వద్ద కృష్ణా జలాల్లో 150గా నమోదు కాగా... అది కరకట్ట వద్ద 210 గా నమోదైంది. ఈ కలుషిత జలాలనే విజయవాడ, గుంటూరు ప్రజలు తాగవలసి వస్తోంది. ఈ నీటిని యథాతథంగా తాగిన అనేక మంది అస్వస్థులవుతున్నారు.

కరకట్ట వాస్తవాలు విజయవంతంగా మరుగున పడేసిన పాలకులు రుషికొండ టూరిజం ప్రాజెక్టును మాత్రం ఒక పెద్ద వార్తాంశంగా మార్చేశారు. కొండను తొలిచేసి, పర్యావరణానికి పాతరేసి అక్కడ రూ. 500 కోట్లతో జగన్ మోహనరెడ్డి తనకోసం ప్యాలస్ నిర్మించుకుంటున్నా రంటూ ప్రచారం చేశారు. నిజానికి విశాఖను ఒక అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడానికి జగన్ మోహన్ రెడ్డి ప్రయత్నించారు. దీనిలో భాగంగానే పర్యాటక శాఖ రుషికొండపై అన్ని హంగులతో నిర్మాణాలు చేపట్టింది. విశాఖలో 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్' నిర్వహణకు సుమారు రూ. 150 కోట్లు వ్యయం చేశారు. దీనిలో అత్యధిక భాగం విశాఖ స్టార్ హోటళ్ళకు చెల్లించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆ హోటళ్ళకు ధీటుగా రిసార్ట్స్ నిర్మిస్తున్నారు. ఇక్కడ వేంగి ఏబీ; కళింగ గజపతి, విజయనగర ఏబీసీ బ్లాక్‌లనూ; వాటిలో సువిశాల సమావేశ మందిరాలు, పెద్ద రెస్టారెంట్, ప్రీమియం విల్లా సూట్స్, ఫిట్‌నెస్ సెంటర్లు నిర్మిస్తున్నారు. సమావేశ మందిరాలు, రెస్టారెంట్, ఫిట్‌నెస్ సెంటర్లు ఉన్న చోట ఏ ముఖ్యమంత్రి అయినా ఎలా నివాసముంటారు? ఇవేమీ గమనించకుండా అది జగన్ నివాసమంటూ ప్రచారం చేశారు.

విశాఖలో తూర్పు నావికా దళం కార్యాలయంతో పాటు అనేక కేంద్ర సంస్థలున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో విదేశాల నుంచి వాణిజ్య నౌకలు వస్తుంటాయి. దేశ విదేశాల నుంచి అధికారులు, నిపుణులు వస్తుంటారు. దీనికి తోడు రాష్ట్రపతి, ప్రధాన మంత్రి వంటివారు వస్తే వారి అవసరాలు తీర్చే విధంగా విలాసవంతమైన విల్లా సూట్స్ నిర్మించారు. ఇవి పూర్తయితే విశాఖలో ఒక వర్గానికి చెందిన స్టార్ హోటళ్ళ టర్నోవర్ దెబ్బతింటుందనే భయంతోనే ఈ రిసార్ట్స్‌పై ప్రతికూల ప్రచారం చేస్తూ జగన్‌మోహన్ రెడ్డిపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు కూడా వచ్చాయి. కొందరు ఫేక్ న్యూస్‌ను ఒక పెద్ద ఆయుధంగా చేసుకుని వ్యక్తిత్వ హననాలకు పాల్పడుతున్నారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకోకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

వ్యాసకర్త ఎ.పి. ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు | 89859 41411

నారసింహుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



నరసింహస్వామి పల్లకి మోస్తున్న జస్టిస్ మన్మథరావు

సింగరాయకొండ: ప్రకాశం జిల్లా పాతసింగరాయకొండ శ్రీవరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు శనివారం హాజరయ్యారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు ఆధ్వర్యంలో జస్టిస్ మన్మథరావుకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి గరుడ వాహనంపై ఊరేగుతున్న నారసింహస్వామి పల్లకిని మోశారు. ఆయన వెంట ఒంగోలు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు ఉన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని దర్శించుకున్న జస్టిస్ సుమతి



నాగపుట్టలో పాలుపోస్తున్న జస్టిస్ సుమతి దంపతులు

మోపిదేవి: కృష్ణాజిల్లా మోపిదేవిలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతి జగడం దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన వీరు నాగపుట్టలో పాలుపోసి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

వైభవంగా పౌర్ణమి గరుడ సేవ



తిరుమల: తిరుమలలో శనివారం రాత్రి పౌర్ణమి గరుడ సేవ వైభవంగా జరిగింది. శనివారం రాత్రి 7 గంటలకు గరుడ వాహన సేవ ప్రారంభమైంది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామి గరుత్మంతుడి వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. వాహన సేవలో తిరుమల పెద్ద జీయర్, చిన్న జీయర్, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

మరో ఇద్దరు మృతదేహాలు లభ్యం

వేటపాలెం/పెదవేగి: విహార యాత్ర కోసం వచ్చిన నలుగురు యువకులు సముద్రంలో మునిగి గల్లంతైన ఘటనలో శనివారం ఇద్దరి యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ ప్రమాదంలో ఇప్పటికే ఇద్దరి మృతదేహాలు లభ్యమవ్వగా, తాజాగా శనివారం మరో ఇద్దరి మృతదేహాలు తీరానికి కొట్టుకొచ్చాయి. పశ్చిమ గోదావరి జిల్లా, పెదవేగి మండలం, దుగ్గిరాల గ్రామానికి చెందిన 12 మంది శుక్రవారం రామాపురం విహార యాత్రకి వచ్చారు. వీరిలో గొటికల తేజ, జాల కిశోర్, చక్కమాల నితిన్, కోరు అమలరాజు సముద్రం నీటిలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరి మృతదేహాలు అప్పుడే తీరానికి కొట్టుకొచ్చాయి. చుక్కమాల నితిన్ (18), అమల రాజు మృతదేహాలు శనివారం ఉదయం తీరానికి కొట్టుకొచ్చాయి. వీరి మృతదేహాలను చీరాల ఏరియా వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

'శోధ్‌గంగా'లో ఏయూకు 6వ స్థానం



గ్రంథాలయ ఉద్యోగులతో ఏయూ వీసీ ప్రసాద రెడ్డి తదితరులు

ఏయూక్యాంపస్: జాతీయ స్థాయిలో శోధ్‌గంగాలో ఏయూకు 6వ స్థానం లభించింది. అయితే కొద్దికాలంగా ఏయూ 8వ స్థానంలో కొనసాగుతుండగా, ఇప్పుడు ఏకంగా రెండుస్థానాలు ఎగబాకి ఆరోస్థానంలో చేరింది. శనివారం ఏయూ గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో ఏయూ గ్రంథాలయం ఈ ఘనత సాధించిందన్నారు. శతాబ్ది వేడుకలకు చేరువవుతున్నవేళ మరొక మైలురాయిని అధిగమించిందన్నారు. గ్రంథాలయం మరమ్మతులు పూర్తిచేసి, అదనపు రీడింగ్ రూమ్, టాయిలెట్స్ బ్లాక్‌లను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ వి.ఎస్. గ్రంథాలయం చీఫ్ లైబ్రేరియన్ ఆచార్య పి.వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే వికసిత్ భారత్ సాధ్యం

నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్



డిగ్రీలు అందుకున్న విద్యార్థులతో వీకే సారస్వత్, తదితరులు

కర్నూలు (సెంట్రల్): రాబోయే 25 ఏళ్లు భారత్‌కు అత్యంత కీలకమని, యువత సవాళ్లకు సిద్ధమైతే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని నీతి ఆయోగ్ సభ్యుడు, జేఎన్‌యూ చాన్స్‌లర్ డాక్టర్ వీకే సారస్వత్ అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలను సాధిస్తే ప్రపంచంలో భారత్ అభివృద్ధి చెందిన దేశంగా పేరు ప్రఖ్యాతులు సాధిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. శనివారం కర్నూలు ఐఐఐటీడీఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్) సంస్థలో ఆరో కాన్వొకేషన్ జరిగింది. 2020–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీటెక్ కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేశారు. సారస్వత్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నిర్ణయించిన వికసిత్ భారత్ లక్ష్యం యువతతోనే సాధ్యమన్నారు. యువతే దేశానికి పునాదులని, వారు తలుచుకుంటే సాధ్యం కాని లక్ష్యాలు ఉండవన్నారు. భారతదేశంలో యువత అధికంగా ఉండడం గొప్ప వరమన్నారు. యువతీ, యువకులు దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. శాస్త్ర సాంకేతిక, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అప్పటికప్పుడు ఎదురయ్యే సవాళ్లను సాధించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఆయా కోర్సుల్లో ఉత్తమ సీజీపీఏ మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్‌ను అందజేశారు.143 మంది విద్యార్థులకు ఐఐఐటీడీఎం బోర్డు ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్, డైరెక్టర్ బీఎస్ మూర్తి డిగ్రీలను ప్రదానం చేశారు.

డయేరియాతో ఆరుగురు మృత్యువాత

ఎన్టీఆర్ జిల్లాలో నలుగురు దుర్మరణం
నంద్యాల జిల్లాలో ఒకరు.. కాకినాడ జిల్లాలో మరొకరు మృతి
మూడుచోట్లా 85 మందికి పైగా బాధితులు





గుగులోతు జమ్మా, మంగతాయారు (ఫైల్)



జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో డయేరియా బాధితులను పరామర్శిస్తున్న జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, నందిగామ ఆర్డీవో ఎ.రవీంద్ర

జగ్గయ్యపేట/జూపాడుబంగ్లా/సామర్లకోట: రాష్ట్రంలో డయేరియా విజృంభిస్తోంది. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలో డయేరియా బారినపడి నలుగురు, నంద్యాల జిల్లాలో ఒకరు, కాకినాడ జిల్లాలో మరొకరు మృత్యువాతపడ్డారు. మూడు జిల్లాల్లోనూ 85 మందికి పైగా బాధితులు వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని ఇండోర్ స్టేడియం సమీపంలో ఉంటున్న ఉమ్మినేని రంగయ్య (60), జగ్గయ్యపేట మండలం గండ్రాయి గ్రామానికి చెందిన తురక మంగతాయారు (55), బూదవాడ గ్రామానికి చెందిన గుగులోతు జమ్మా (60), వేదాద్రి గ్రామానికి చెందిన పసుమర్తి సత్యవతి (75) వాంతులు, విరోచనాలతో జగ్గయ్యపేట, విజయవాడ ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు. జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో 19 మంది డయేరియా బాధితులకు వైద్యసిబ్బంది చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించనున్నారు.

నంద్యాల జిల్లాలో..

నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలం పోతులపాడు శివారు చాబోలులో శుక్రవారం 30 మంది వాంతులు, విరేచనాలతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. వారిలో కొంతమంది నందికొట్కూరు, కర్నూలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. శనివారం మరో నలుగురు వాంతులు, విరేచనాలతో నీరసించిపోయారు. వారిలో నడిపి నాగన్న (45) అనే వ్యక్తిని నందికొట్కూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా.. కొద్దిసేపటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. డయేరియా బాధితుల్లో రంగమ్మ, మరియమ్మ పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని తాగునీటి ట్యాంకులో కొంగపడి చనిపోయి దుర్వాసన వస్తున్నా సిబ్బంది పట్టించుకోలేదని, అందువల్లే డయేరియా ప్రబలిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటుచేసినా, సరైన చికిత్స అందించకపోవటం వల్లే తన అన్న నాగన్న చనిపోయాడని ఆయన తమ్ముడు చిన్ననాగన్న కన్నీటి పర్యంతమయ్యారు. అదనపు జిల్లా వైద్యాధికారిణి శారదాబాయి మాత్రం నడిపినాగన్నకు చికిత్స అందించామని, ఆయన డయేరియాతో కాకుండా గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నామని తెలిపారు. మరోవైపు నడిపినాగన్న మృతికి కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం ఎదుట కేజే రోడ్డు పక్కన మృతదేహంతో ప్రజాసంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు.

వేట్లపాలెంలో మహిళ మృతి

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని జొన్నలదొడ్డి ప్రాంతంలో డయేరియా వ్యాపించింది. గ్రామంలో ఈ నెల 19న డయేరియా కేసు గుర్తించారు. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోకపోవడంతో బాధితుల సంఖ్య 36కు పెరిగింది. ఆరుగురిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో కొమ్మోజు సత్యవేణి (42) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కాకినాడ ఆర్‌డీవో ఇట్ల కిషోర్, డీఎంహెచ్‌వో జె.నరసింహ నాయక్, డీపీవో సౌజన్య శనివారం వేట్లపాలెంలో పర్యటించారు. జొన్నలదొడ్డి, వేట్లపాలెం పీహెచ్‌సీలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు

పుంగనూరు(చిత్తూరు జిల్లా): పుంగనూరు మండల పరిషత్ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగి సునిల్ రూ.1.36 కోట్లు స్వాహా చేసిన వ్యవహారంలో ముగ్గురు అధికారులకు ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీచేశారు. మండల పరిషత్ కార్యాలయంలో 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ నిధులు మొత్తం రూ.1.36 కోట్లను సునీల్ తన బినామీ ఖాతాలకు బదిలీ చేసుకున్నాడు. మజ్జిగ రామయ్య అనే బోగస్ పేరుతో సునిల్ ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు, ఎస్‌బీఐలో ఖాతాలు తెరిచి ఏడాది నుంచి నిధులు బదిలీ చేసుకున్నట్లు రికార్డుల ద్వారా గుర్తించారు. ఇందుకు బాధ్యులుగా గతంలో ఎంపీడీవోలుగా పనిచేసిన రామనాథరెడ్డి, నారాయణ, ఏవో రాజేశ్వరిలకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని జెడ్పీ సీఈవో గ్లోరియా ఆదేశించారు. ఈ మేరకు ఎంపీడీవో వెంగమునిరెడ్డి శుక్రవారం వారికి నోటీసులు జారీచేశారు. ఈ ముగ్గురు అధికారుల సమాధానం మేరకు శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. అయితే, దాదాపు ఏడాది పాటు సునీల్ ప్రభుత్వ సొమ్మును తన బినామీ ఖాతాలకు మళ్లిస్తున్నా ఎంపీడీవో కార్యాలయ అధికారులు గుర్తించకపోవడం, ఇప్పటికీ అయనపై పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం పట్ల పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అన్నదాతపై అధికారుల జులుం

- వైఎస్సార్‌సీపీ నాయకుడు కావడమే కారణం

ప్రొద్దుటూరు: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలంలోని కాకిరేనిపల్లెలో జిల్లా సహకార బ్యాంకు అధికారులు ఓ రైతుపై జులుం ప్రదర్శించారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన రామమోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకుడు. అందరి రైతుల మాదిరిగానే ఆయన, వారి కుటుంబ సభ్యులు పలుమార్లు బ్యాంకు నుంచి పంట రుణాలు తీసుకోవడం, చెల్లించడం జరుగుతోంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. రామమోహన్‌రెడ్డి భార్య పద్మావతి పేరుపై గతేడాది రూ.20 లక్షల రుణం తీసుకోగా తొలి ఏడాది కిస్తీ చెల్లించారు. ఈ ఏడాది మాత్రమే బకాయి ఉంది. కాగా.. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డీజీఎం వెంకటేశ్వర్లు, సుమారు 20 మంది సిబ్బంది శనివారం గ్రామానికి వచ్చి రైతుపై జులుం ప్రదర్శించారు. తాను ఏనాడూ బ్యాంకు నుంచి తీసుకున్న అప్పు ఎగ్గొట్టలేదని, కంతుల వారీగా చెల్లిస్తున్నానని రామమోహన్‌రెడ్డి తెలిపారు. ఒకేసారి ఇంతమంది అధికారులు తమ ఇంటి వద్దకు రావడం ఏమిటని ప్రశ్నించారు. కొంత సమయం ఇస్తే ధాన్యం అమ్మి డబ్బు చెల్లిస్తానన్నారు. అయినా అధికారులు వినకుండా గట్టిగా వాదించారు. ఏనాడూ అధికారులు ఈ విధంగా వ్యవహరించలేదని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమపై జులుం ప్రదర్శించడం ఏంటని రామమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. తమ భూములకు సంబంధించిన పత్రాలను పెట్టుకునే రుణం మంజూరు చేశారని తెలిపారు. తాను వైఎస్సార్‌సీపీ నాయకుడి కావటం వల్లే అధికారులు ఈ విధంగా చేస్తున్నారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. తాను, బకాయి ఉన్న వారి పేర్లు చెబుతానని, వారితోనూ ఇలాగే వ్యవహరిస్తున్నారా అని ప్రశ్నించారు. దీంతో అధికారులు వెళ్లిపోయారు.

కిడ్నీ వ్యాధిని జయించాడు

- 10.02 నుంచి 2.7కు దిగివచ్చిన సీరం క్రియాటినిన్ లెవెల్
- ఆశ్చర్యపోయిన వైద్యులు, కుటుంబ సభ్యులు
- చక్కటి డైట్‌తో పాటు పలాస కిడ్నీ ఆస్పత్రి మందులతోనే ఈ ఫలితం





క్రియాటినిన్ లెవెల్స్ నాడు, నేడు ఇలా



పలాస ప్రభుత్వ కిడ్నీ పరిశోధన కేంద్రం వారు ఇచ్చిన ఉచిత మందులతో అప్పలస్వామి

కాశీబుగ్గ: పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం పరిధిలో ఓ అరుదైన సంఘటన చోటు చేసుకుంది. సీరం క్రియాటినిన్ లెవెల్ పది పాయింట్లు దాటి డయాలసిస్ చేయాల్సిన ఓ కిడ్నీ వ్యాధి బాధితుడికి డయాలసిస్ అవసరమే లేకుండా రెండు నెలల్లోనే సీరం క్రియాటినిన్ లెవెల్లు రెండున్నరకు దిగిపోయాయి. బతకడం కష్టమే అనుకున్న దశ నుంచి ఆ వ్యక్తి సాధారణ స్థితికి వచ్చాడు. కిడ్నీ వ్యాధిని జయించి ఆస్పత్రి వైద్యులను ఆశ్చర్యపరిచాడు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి గ్రామానికి చెందిన ఉంగ అప్పలస్వామి(48)ని రెండున్నర నెలల కిందట కడుపు ఉబ్బిపోయి, కాళ్లు, చేతులు, ముఖం పొంగిపోయి రెండు మూడు రోజుల్లో మరణిస్తాడనే మాటలతో పలాస కిడ్నీ పరిశోధన కేంద్రానికి తీసుకువచ్చారు. అన్ని పరీక్షలు చేశాక రెండు కిడ్నీలు పాడైపోయిన దశలో ఉన్నాయని ఏప్రిల్ 12న వైద్యులు నిర్ధారించారు. సీరం క్రియాటినిన్ 10.02 పాయింట్లు ఉందని, తీవ్రమైన అనారోగ్యంతో ఉన్నావని డయాలసిస్ చేసుకోవాలని అతనికి సూచించారు. డయాలసిస్ చేయించుకోవడానికి ఇష్టపడని అప్పలస్వామి వైద్యులు ఇచ్చిన ఉచిత మందులతో ఇంటికి చేరుకున్నాడు. అప్పటి నుంచి రెండు పూటలు చప్పటి ఇడ్లీలు, మధ్యాహ్నం చప్పటి పప్పుతో కూడిన భోజనం తీసుకున్నాడు. మూడు పూటలు భోజనానికి ముందు, తర్వాత కలిపి 23 రకాల మాత్రలు వేసుకున్నాడు. అలా సుమారు రెండు నెలలు ఆహార నియమం పాటించాడు. మధ్యలో ఏప్రిల్ 19న ఆస్పత్రికి మందులకు వెళ్లినప్పుడు పరీక్షిస్తే సీరం క్రియాటినిన్ 8.04కు వచ్చింది. ఆ తర్వాత మళ్లీ జూన్ 18వ తేదీన పరీక్ష చేయించుకుంటే 2.7 గా సీరం క్రియేటిన్ నమోదైంది. పల్లె ఆహార అలవాట్లే తనను కాపాడాయని, పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ కిడ్నీ పరిశోధన కేంద్రంలోనే వైద్య సేవలు పొందానని అప్పలస్వామి ఆనందంగా చెప్పాడు. ఈ ప్రత్యేకమైన కేసుకు సంబంధించి పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం కిడ్నీ స్పెషలిస్ట్ డాక్టర్ యర్ర రాకేష్‌ను వివరణ కోరగా కిడ్నీ వ్యాధి సోకినపుడు ఆయా శరీర తత్వాలను బట్టి వారిలో మార్పులు వస్తాయని తెలిపారు. అనేక మంది చనిపోతారని, ఆహార అలవాట్లతో కొందరు నెగ్గుకురాగలరని వివరించారు. కిడ్నీ వ్యాధి బాధితునికి పూర్తిగా నయం కావడం తమకు సంతోషంగా ఉందన్నారు.

దర్శనాల కోసం దళారులను సంప్రదించొద్దు

- శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం, లడ్డూ ధరల్లో మార్పు లేదు
- భక్తులకు టీటీడీ విజ్ఞప్తి



తిరుమల: శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనాల కోసం దళారులను సంప్రదించవద్దని టీటీడీ ఒక ప్రకటనలో భక్తులకు విజ్ఞప్తి చేసింది. తిరుమల దర్శనానికి సంబంధించి అధిక ధరలకు ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు పొంద వచ్చునని కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో కొంతమంది ఫోన్ నంబర్లతో కూడిన సమాచారంతో ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనానికి సంబంధించి టీటీడీ వెబ్‌సైట్ ద్వారానే కాకుండా వివిధ రాష్ట్రాలకు సంబంధించిన టూరిజం విభాగాలకు టీటీడీ కొన్ని టికెట్లను కేటాయించింది. భక్తులు ఎవరైనా సంబంధిత టూరిజం విభాగాల ద్వారా ఈ టికెట్లను పొందే సౌకర్యం ఉందని టీటీడీ తెలియజేసింది. టూరిజం విభాగాల ద్వారా రావాలనుకునే భక్తులు నేరుగా రాష్ట్ర టూరిజం వెబ్‌సైట్ ద్వారా కూడా దర్శనం ప్యాకేజీ టికెట్లు పొందే అవకాశం ఉందని పేర్కొంది. అయితే కొందరు దళారులు టూరిజం వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసి ఇస్తామని చెప్పి భక్తుల నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై టీటీడీ విజిలెన్స్ విభాగం కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేసింది. అలాగే శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, రూ.50 లడ్డూ ప్రసాదం ధరల్లో ఎటువంటి మార్పు లేదని పేర్కొంది.

కన్న తండ్రే కాలయముడు

- కుమార్తెను గొంతు నులిమి చంపి బావిలో పడేసిన కసాయి
- భార్యపై అనుమానం, చిన్నారి తనకు పుట్టలేదనే భావనతో దారుణం
- అనంతపురం జిల్లా నార్పలలో విషాదం

నార్పల: కన్న తండ్రే కాలయముడయ్యాడు. బిడ్డను గొంతు నులిమి చంపి బావిలో పడేశాడు. భార్యపై అనుమానానికి తోడు కుమార్తె తనకు పుట్టలేదనే భావనతో ఈ దారుణానికి ఒడిగట్టాడు. అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలో చోటుచేసుకున్న ఈ ఘటన జిల్లాలో సంచలనం రేపింది. పోలీసుల కథనం మేరకు..

నార్పల మండల కేంద్రానికి చెందిన గణేష్, అమల భార్యాభర్తలు. వీరికి కుమార్తె పావని (5)తో పాటు నాలుగేళ్ల కుమారుడు సంతానం. కూలి పనులకు వెళుతూ జీవనం సాగిస్తుంటారు. తన కుమార్తె పావని కన్పించడం లేదని ఈ నెల 20న గురువారం గణేష్ నార్పల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు అప్రమత్తమై వెంటనే గాలింపు చేపట్టారు. ఈ కేసును జిల్లా ఎస్పీ గౌతమిశాలి సీరియస్‌గా తీసుకుని ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. కుటుంబ గొడవల కోణంలో దర్యాప్తు సాగించి.. తండ్రి ప్రవర్తనపై అనుమానం వచ్చి..అతని కదలికలపై నిఘా పెట్టగా దారుణం వెలుగు చూసింది.

గొంతు నులిమి చంపేసి..ఆపై నటించి..

గణేష్ తన భార్యపై అనుమానం పెంచుకున్నాడు. కుమార్తె తనకు పుట్టలేదని భావించాడు. కుమార్తెను చంపేసి భార్యపై ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. ఈ క్రమంలోనే గురువారం కుమార్తెను తీసుకుని నార్పల పోలీస్‌స్టేషన్ వెనుక వైపు ఉన్న బావి వద్దకు వెళ్లాడు. గొంతు నులిమి చంపి బావిలో పడేశాడు. తర్వాత తన బిడ్డ కన్పించడం లేదని కన్నీటి పర్యంతమవుతూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గణేష్ ప్రవర్తనపై అనుమానం రావడంతో పోలీసులు అతని కదలికలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో శనివారం ఉదయం పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న బావి వద్ద తచ్చాడుతుండడాన్ని గమనించారు. పోలీసులు అక్కడికి వెళ్లేలోపే పారిపోవడానికి ప్రయత్నించాడు. దీంతో పోలీసులు అతన్ని పట్టుకుని తమదైన శైలిలో విచారించగా..కుమార్తెను చంపి బావిలో పడేసినట్లు అంగీకరించాడు. అతన్ని అరెస్టు చేశారు. చిన్నారి మృతదేహాన్ని బావి నుంచి బయటకు తీయించి..పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లి అమల, బంధువులు గుండెలవిసేలా రోదించారు.

మేఘం మెరిసెను..



ఆకాశ వీధిలో అద్భుతం ఆవిష్కృతమైంది. శనివారం రాత్రి దట్టమైన కారు మబ్బులు కమ్ముకొన్న వేళ ఒక్కసారిగా మేఘం మెరిసింది. ఆ సమయంలో ఆకాశం వర్ణశోభితమైంది. ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేసిన ఈ దృశ్యాలను విజయవాడ నగరంలో 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– కందుల చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

నీట్ రద్దు చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



విజయవాడ లెనిన్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న సీపీఐ నగర శాఖ

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్)/ఏలూరు (ఆర్ఆర్ పేట): నీట్ పరీక్ష పేపర్ లీకయిన నేపథ్యంలో ఆ పరీక్షను రద్దు చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. శనివారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో సీపీఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించింది. ఇందులో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. నీట్ పరీక్ష పేపర్ లీక్‌పై దేశ వ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాలు, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదన్నారు. నీట్ పరీక్షను రద్దు చేసి రాబోయే రోజుల్లో సుప్రీం కోర్టు పర్యవేక్షణలో పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇది 24లక్షల కుటుంబాల సమస్య అని, కేంద్రం తక్షణం స్పందించి నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

సమగ్ర విచారణ చేయాలి

నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఏలూరులో ఎస్ఎఫ్ఐ నేతలు శనివారం ధర్నా నిర్వహించారు. స్థానిక గ్రాండ్ ఆర్య వద్ద నిర్వహించిన ఈ ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడారు. నీట్ పరీక్షలు నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది జరిగిన నీట్ పరీక్షల్లో హరియాణకు చెందిన ఒకే పరీక్షా కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంకు రావడం, వారందరికీ 720కి 720 మార్కులు రావడం ఎన్నో అనుమానాలకు తావిచ్చిందన్నారు. అదే కేంద్రంలో పరీక్ష రాసిన జాన్వీ అనే విద్యార్థిని 179 ప్రశ్నలకు సమాధానాలు రాయగా, అందులో 163 కరెక్ట్ అయ్యాయని, ఆమెకు 636 మార్కులు రావాల్సి ఉండగా 720 మార్కులు ఎలా వచ్చాయనే ప్రశ్న తలెత్తుతోందని చెప్పారు.


దళిత మున్సిపల్ కమిషనర్‌పై టీడీపీ నేతల జులుం

- సీఎం చిత్రపటం పెట్టలేదని నానారభస
- అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఘటన



రాజంపేట: అన్నమయ్య జిల్లా రాజంపేటలో టీడీపీ నేతలు బరితెగించారు. దళిత మున్సిపల్ కమిషనర్ రాంబాబుపై జులుం ప్రదర్శించారు. ఆయనపై దౌర్జన్యానికి దిగి నానారభస చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం రాజంపేట పురపాలక సంఘ కార్యాలయానికి పలువురు టీడీపీ నేతలు మూకుమ్మడిగా తరలివచ్చారు. కార్యాలయంలో సీఎం చంద్రబాబు చిత్రపటం ఎందుకు పెట్టలేదని కమిషనర్‌ను నిలదీశారు. సీఎం చిత్రపటం నిబంధనల మేరకే పెడతామని కమిషనర్ చెబుతున్నప్పటికీ లెక్కచేయకుండా టీడీపీ నేతలు ఆయనపై విరుచుకుపడ్డారు. కార్యాలయంలో అన్నిచోట్ల చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ చిత్రపటాలు కూడా పెట్టాలని హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటాలను ఇంకా ఎందుకు తీయలేదని కమిషనర్‌ను చుట్టుముట్టి వాదనకు దిగారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని టీడీపీ నేతలకు సర్దిచెప్పారు. అనంతరం టీడీపీ నేతలు చంద్రబాబు చిత్రపటం తీసుకువచ్చి కౌన్సిల్ హాల్‌లో పెట్టారు. టీడీపీ నాయకుల వ్యవహారశైలితో అధికారులు, ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కమిషనర్ రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు యూనిఫామ్‌గా చిత్రపటాలు పెట్టాలని ఆదేశాలు వస్తాయని.. వాటికోసం ఎదురు చూస్తున్నామన్నారు. ఈ లోపే టీడీపీ నేతలు కార్యాలయంలోకి వచ్చి ఇష్టానుసారంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్ ఫొటో తీసివేయించాలని టీడీపీ నేతలు కోరారన్నారు. ఇందుకు తాను అది చైర్మన్ చాంబర్ అని, అది ఆయన ఇష్టమని చెప్పానన్నారు.

ఖమేనీ కనుసన్నల్లో...
ఇరాన్‌లో ఎన్నికలకు వేళాయె


ఖమేనీ

రైసీ మరణంతో అధ్యక్ష పదవికి ఎన్నికలు
- 28న ఓటింగ్, 30న ఫలితాల వెల్లడి
- రేసులో ఆరుగురు, నెజాద్‌కు మొండిచేయి

అగ్ర రాజ్యాల ఆంక్షలు. నానాటికీ దిగజారుతున్న ఆర్థిక పరిస్థితి. హక్కుల కోసం రోడ్డెక్కుతున్న మహిళలు. కరడుగట్టిన మతవాద పాలనపై యువతలోనే గాక సర్వత్రా తీవ్రతరమవుతున్న అసంతృప్తి. ఇన్ని గడ్డు సమస్యల నడుమ ఇరాన్‌లో అధ్యక్ష ఎన్నికలకు వేళైంది. మూడున్నర దశాబ్దాలుగా ఇరాన్‌ను ఏకఛత్రంగా పాలిస్తున్న సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ అభీష్టానుసారం ఎంపికైన ఆరుగురు అభ్యర్థులు రేసులో ఉన్నారు. వారిలో ఖమేనీ వీర విధేయుడే పీఠమెక్కడం లాంఛనమే కానుంది. జనాల్లో ఇప్పటికీ తిరుగులేని ఆదరణ ఉన్న మాజీ అధ్యక్షుడు అహ్మదీనెజాద్ తదితరుల అభ్యర్థిత్వాన్ని తిరస్కరించడం ద్వారా జనాకర్షక నేతలెవరూ పోటీలో ఉండకుండా సలక జాగ్రత్తలూ తీసుకున్నారు. దాంతో ఎప్పట్లాగే ఈసారి కూడా ఇరానీలు అధ్యక్ష ఎన్నికలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ పరిస్థితిని ఊహించే ఆరుగురిలో డాక్టర్ మసూద్ పెజెష్కియాన్ రూపంలో ఒక సంస్కరణలవాదిని ఎంపిక చేశారు. ఆయన్ను చూసి జనాలు ఎంతో కొంత పోలింగ్ బూత్‌లకు వస్తారని ఆశిస్తున్నారు. అంతిమంగా విజేత మాత్రం మిగతా ఐదుగురు కరడుగట్టిన మతవాదుల్లోంచే ఒకరు కానున్నారు. అది ఎవరన్నది జూన్ 28న జరిగే పోలింగ్‌లో తేలనుంది.

ప్రభుత్వంపై విమర్శలే ప్రచారాస్త్రాలు

అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ గత మే 19న హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలవడంతో ఇరాన్‌లో ఏడాది ముందుగానే ఎన్నికలు అనివార్యమయ్యాయి. ప్రధాని పదవిని రద్దు చేస్తూ, అధ్యక్ష పదవి స్థాయిని పెంచుతూ 1998లో రాజ్యాంగ సంస్కరణలు చేసిన అనంతరం దేశంలో ముందస్తు ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. ఎన్నడూ లేని విధంగా అభ్యర్థులంతా ఈసారి ప్రభుత్వంపై నేరుగా విమర్శలు ఎక్కుపెడుతుండటం విశేషం. దేశ ఆర్థిక దుస్థితికి ప్రభుత్వ తప్పుడు విధానాలే కారణమని వారంతా బాహాటంగా తప్పుబడుతున్నారు. ఇదంతా ప్రజలను పోలింగ్ బూత్‌కు రప్పించేందుకు ఖమేనీ చేస్తున్న ప్రయత్నాల్లో భాగమేనని చెబుతున్నారు. ఇరాన్‌లో అధ్యక్ష ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగిన దాఖలాలు లేవని అంతర్జాతీయ నిపుణులతో పాటు ఇరాన్ మేధావులు కూడా అంటుంటారు. ఎన్నికల ఫలితాలను ఖమేనీ పూర్తిగా నిర్దేశించడమే గాక తనకు అనుకూలంగా మార్చేస్తారన్నది సర్వత్రా ఉన్న అభిప్రాయం.

ఎన్నిక ఇలా...

ఇరాన్ అధ్యక్షున్ని ప్రత్యక్ష ఓటింగ్ పద్ధతిన ఎన్నుకుంటారు. పదవీకాలం నాలుగేళ్లు. పూర్తి అధికారాలు సుప్రీం లీడర్ ఖమేనీవే అయినా అధ్యక్షునికి కూడా పలు కీలక దేశీయ విధాన నిర్ణయాలతో పాటు కొంతమేరకు విదేశాంగ విధానంపై కూడా చెప్పుకోదగ్గ అధికారాలుంటాయి. 12 మంది మత పెద్దలు తదితరులతో కూడిన గవర్నింగ్ కౌన్సిల్ ఖమేనీ నిర్దేశాలకు లోబడి అధ్యక్ష అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. ఈసారి 80 దరఖాస్తులను వడపోసి ఆరుగురిని మాత్రం పోటీకి అనుమతించింది. తన ఆధిపత్యానికి సవాలుగా మారతారనుకున్న వారెవరికీ అవకాశం దక్కకుండా ఖమేనీ అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు. ఆ క్రమంలోనే బాగా జనాకర్షణ ఉన్న మాజీ అధ్యక్షుడు నెజాద్‌తో పాటు మూడుసార్లు పార్లమెంట్ స్పీకర్‌గా చేసిన అలీ లారిజానీ అభ్యర్థిత్వం కూడా తిరస్కరణకు గురైంది. తిరస్కృత జాబితాలో ఏడుగురు మహిళలు కూడా ఉన్నారు! జూన్ 28న ఓటింగ్ జరగనుంది. 30కల్లా ఫలితాలు వెలువడే అవకాశముంది. ఎవరికీ 50 శాతానికి మించి ఓట్లు రాని పక్షంలో తొలి రెండు స్థానాల్లో నిలిచే అభ్యర్థుల మధ్య తిరిగి ఎన్నిక జరుగుతుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఆ ఆరుగురు

జనరల్ మహమ్మద్ బఖర్ గలీబాఫ్



పార్లమెంట్ స్పీకర్. రాజధాని టెహ్రాన్ మేయర్‌గా, సైనిక విభాగమైన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కమాండర్‌గా, దేశ పోలీస్ చీఫ్‌గా చేసిన అనుభవముంది. పైగా ఖమేనీకి అత్యంత సన్నిహితుడు కూడా. ఆయనతో బంధుత్వమూ ఉందంటారు. దాంతో గలీబాఫ్‌కే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు పరిశీలకులు భావిస్తున్నారు. సైన్యంలోని కీలక అధికారుల మద్దతు అదనపు బలం కానుంది. కాకపోతే ఆయనపై లెక్కలేనన్ని అవినీతి ఆరోపణలున్నాయి. పైగా గతంలో రెండుసార్లు అధ్యక్ష పదవికి పోటీ పడి ఓడారు.

సయీద్ జలిలీ




మాజీ చీఫ్ న్యూక్లియర్ నెగోషియేటర్. ఇరాన్–ఇరాక్ యుద్ధంలో కాళ్లు పోగొట్టుకున్నారు. యుద్ధవీరునిగా దేశమంతటా కాస్తో కూస్తో పేరున్న నేత. ఈయనకూ ఖమేనీ ఆశీర్వాదముందని చెబుతారు. దాంతో జలిలీ అవకాశాలకు గండి కొట్టేందుకు గలీబాఫ్ శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. దీనికి తోడు జనాదరణ విషయంలో మరో అహ్మదీనెజాద్‌లా ఎదిగే సత్తా ఉండటం కూడా జలిలీ అవకాశాలకు గండి కొట్టవచ్చని పరిశీలకుల అభిప్రాయం.

ముస్తాఫా పోర్ మొహమ్మదీ



రేసులో ఉన్న ఆరుగురిలో ఏకైక మతాధికారి కావడం ఈయనకు కలిసొచ్చే అంశం. పైగా 85 ఏళ్ల ఖమేనీ తన వారసుని ఎంపికపై గట్టిగా దృష్టి సారించారు. కుమారుడు కుమారుడు ముజ్తబాకు పగ్గాలు అప్పగించాలని భావిస్తున్నారు. ఈ సమయంలో అధ్యక్ష పదవిలో మత పెద్ద ఉండటం మేలని ఖమేనీ భావించే పక్షంలో మొహమ్మదీకి చాన్సుంటుందని చెబుతున్నారు. కాకపోతే సుప్రీం లీడర్ పదవి కోసం ముజ్తబాతో పోటీ పడే సత్తా ఉండటం మొహమ్మదీకి ప్రతికూలంగా మారవచ్చు.

మసూద్ పెజెష్కియాన్



గట్టి సంస్కరణలవాది. దేశ ఆరోగ్య మంత్రిగా చేశారు. విద్యావంతునిగా మంచి పేరే ఉంది. మితిమీరుతున్న మతవాదంపై ప్రజల్లో ప్రబలుతున్న అసంతృప్తిని చల్లార్చేందుకే ఈయనను అభ్యర్థుల జాబితాలో చేర్చినట్టు చెబుతున్నారు. 2008 నుంచీ పార్లమెంటు సభ్యుడు. అందరికీ ఆమోదయోగ్యమైన కొత్త ముఖం మేలని ఖమేనీ భావిస్తే తప్ప మసూద్‌కు అవకాశాలు తక్కువేనని విశ్లేషకులు అంటున్నారు.

అలీ రజా జకానీ



టెహ్రాన్ మేయర్. గతంలో పలు ఉన్నత పదవులు నిర్వహించారు. పబ్లిక్ పార్కుల్లో మసీదు నిర్మాణాన్ని మద్దతిచ్చి విమర్శలకు గురయ్యారు. 2021లో కూడా అధ్యక్ష పదవికి పోటీ పడ్డా పెద్దగా ఓట్లు సాధించలేదు. ఈసారి కూడా జకానీ పేరు గట్టి పోటీదారుగా పెద్దగా పరిగణనలో లేదు. కాకపోతే ఖమేనీకి వీర విధేయుడు.

ఆమిర్ హొసేన్ గజీజాదే హాషేమీ



ప్రస్తుతం 12 మంది దేశ ఉపాధ్యక్షుల్లో ఒకరు. రిటైరైన సైనికులు, యుద్ధాల్లో మరణించిన సైనికుల కుటుంబాల సంక్షేమ బాధ్యతలు చూస్తున్నారు. దాంతో ఆయా వర్గాల్లో మంచి ఆదరణే ఉంది. కాకపోతే ఈయనకు కూడా ఈసారి అవకాశం ఉండకపోవచ్చని చెబుతున్నారు.

నీట్-యూజీ అవకతవకలపై
సీబీఐ విచారణ

న్యూఢిల్లీ: వైద్య విద్యలో అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-యూజీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై కేంద్రం సీబీఐ విచారణకు ఆదేశించింది. పేపర్ లీకయ్యిందని, నీట్‌ను రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో... ఆరోపణలపై సమగ్ర విచారణ కోసం దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తున్నట్లు విద్యాశాఖ శనివారం రాత్రి ప్రకటించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ ఏడాది మే 5న నీట్–యూజీ పరీక్షను నిర్వహించింది. పేపర్ లీక్ అయ్యిందని, అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తడంతో శనివారం కేంద్ర ప్రభుత్వం పలు నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించింది. నీట్- యూజీలో అవకతవకలు, చీటింగ్, ఒకరికి బదులు మరొకరు పరీక్షలు రాయడం, మాల్‌ప్రాక్టీసు జరిగిందని ఆరోపణలు వచ్చాయి. 'పరీక్షల నిర్వహణలో పారదర్శకత కోసం, సమగ్ర దర్యాప్తు కోసం నీట్-యూజీ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి అప్పగించాలని నిర్ణయించాం' అని విద్యాశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. మే 5న జరిగిన నీట్- యూజీ పరీక్షకు దాదాపు 24 లక్షల మంది హాజరయ్యారు. జూన్ 4న ఫలితాలు ప్రకటించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 67 మందికి 720గాను 720 మార్కులు వచ్చాయి. దాంతో అనుమానాలు తలెత్తాయి. అంతేకాకుండా సమయం నష్టపోయినందుకు ఆరు సెంటర్లలో 1,563 మందికి గ్రేస్ మార్కులు కలిపారు. దీనిపై అభ్యర్థుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకడంతో ప్రభుత్వం వీరి గ్రేస్ మార్కులను రద్దుచేసింది. ఆదివారం వీరికి మళ్లీ పరీక్ష నిర్వహిస్తోంది.

ఎన్‌టీఏ డీజీ సుబోధ్‌పై వేటు


సుబోధ్‌కుమార్

న్యూఢిల్లీ: కీలకమైన నీట్, నెట్ పరీక్షల్లో పేపర్ లీకేజీ ఆరోపణలు దుమారం రేపుతున్నాయి. ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. నీట్, నెట్ పరీక్షలను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ సుబోధ్ సింగ్‌పై శనివారం వేటు వేసింది. ఇండియా ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్, ఎండీ ప్రదీప్ సింగ్ ఖరోలాకు ఎన్‌టీఏ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. యూజీసీ–నెట్ పరీక్ష నిర్వహించిన మరుసటి రోజే, ఈనెల 19న కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. పరీక్షల సమగ్రతకు భంగం వాటిల్లిందని హోంశాఖ తెలుపడంతో యూజీసీ- నెట్‌ను రద్దు చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, పీహెచ్‌డీల ప్రవేశానికి నెట్ పరీక్షను ఏడాదికి రెండుసార్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది.

నేటి నీట్-పీజీ పరీక్ష వాయిదా

న్యూఢిల్లీ: వైద్య విద్యలో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్–పీజీ పరీక్షను కేంద్ర ఆరోగ్య శాఖ శనివారం ఆఖరి నిమిషంలో వాయిదా వేసింది. విద్యార్థుల ప్రయోజనాల కోసమే ముందుజాగ్రత్తగా ఈ చర్య తీసుకున్నామని, వీలైనంత త్వరలో కొత్త తేదీని ప్రకటిస్తామని వెల్లడించింది. ఈ పరీక్ష ఆదివారం జరగాల్సి ఉంది.

సూరజ్ రేవణ్ణపై లైంగిక వేధింపుల కేసు

బనశంకరి: జేడీఎస్‌కు చెందిన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దాడి, నగ్న వీడియోల కేసు దేశ వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. తాజాగా ప్రజ్వల్ తమ్ముడు డాక్టర్ సూరజ్ రేవణ్ణ (36)పై కూడా లైంగిక వేధింపుల కే సు నమోదైంది. ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ తనపై అసహజ లైంగిక దాడికి పాల్పడ్డారని చేతన్ కే.ఎస్. అనే జేడీఎస్ కార్యకర్త శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హాసన్ జిల్లా అరకలగూడుకు చెందిన చేతన్ వీడియోలను కూడా విడుదల చేయడంతో కన్నడ రాజకీయాల్లో మరోసారి సంచల నం చెలరేగింది. లోక్‌సభ ఎన్నికల సమయంలో పరిచయమైన సూరజ్ ఫాంహౌస్‌కు పిలిచి లైంగిక దాడికి యత్నించాడని చేతన్ ఆరోపించాడు.

డబ్బులు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్

చేతన్, అతని బంధువు డబ్బులు డిమాండ్ చేశారని, ఇవ్వకపోతే లైంగిక వేధింపుల కేసు పెడతామని బ్లాక్‌మెయిల్ చేశారని సూరజ్ రేవణ్ణ ముఖ్య అనుచరుడైన శివకుమార్ సైతం శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతో స్నేహం చేసిన చేతన్.. సూరజ్ రేవణ్ణ బ్రిగేడ్‌కు పని చేయడం ప్రారంభించాడని, కుటుంబ ఖర్చులకు డబ్బు ఇవ్వాలని కోరగా తాను నిరాకరించడంతో సూరజ్ రేవణ్ణపై లైంగిక వేధింపుల కేసు పెడతామని బెదిరింపులకు దిగారని శివకుమార్ పేర్కొన్నారు. మొదట రూ. 5 కోట్లు తర్వాత దాన్ని తగ్గించి రూ. 2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారని అన్నా రు. శివకుమార్ ఫిర్యాదుతో చేతన్, అతని బంధువుపై కేసు నమోదైంది.

'నీట్' నిందితులకు నార్కో బ్రెయిన్ మ్యాపింగ్ టెస్టులు!

పాట్నా/దేవగఢ్: నీట్–యూజీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో బిహార్ పోలీసు శాఖ ఆర్థిక నేరాల విభాగం అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నీట్ అసలైన ప్రశ్నపత్రాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) నుంచి సేకరించారు. పేపర్ లీకేజీకి సంబంధించి గత నెలలో పాట్నాలోని ఓ ఇంట్లో సోదాల్లో స్వాధీనం చేసుకున్న ప్రశ్నపత్రాలతో ఈ ప్రశ్నపత్రాలను సరిపోల్చనున్నారు. ఫోరెన్సిక్ టెస్టు తర్వాత సరిపోల్చే ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు చెప్పారు. మరో వైపు ఈ కేసులో అరెస్టయిన నిందితులకు నార్కో అనాలిసిస్, బ్రెయిన్ మ్యాపింగ్ టెస్టులు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాల్లో మనీ లాండరింగ్ కోణం కూడా ఉండడంతో ఈడీ సైతం దర్యాప్తు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

'పరీక్ష'ల సంస్కరణలపై కమిటీ
ఇస్రో మాజీ చైర్మన్ కె.రాధాకృష్ణన్ నేతృత్వం



ఢిల్లీ: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పరీక్షలు పారదర్శకంగా, న్యాయంగా, సాఫీగా నిర్వహించేందుకు ఏడుగురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర విద్యా శాఖ శనివారం ప్రకటించింది. ఈ నిపుణుల కమిటీకి ఇస్రో మాజీ చైర్మన్ కె.రాధాకృష్ణన్ నేతృత్వం వహిస్తారు. పరీక్షల నిర్వహణ ప్రక్రియ, డాటా భద్రతకు చేపట్టాల్సిన చర్యలు, ఎన్‌టీఏ నిర్మాణం, పనితీరుకు సంబంధించి చేపట్టాల్సిన సంస్కరణలను ఈ కమిటీ సిఫారసు చేస్తుంది. రెండు నెలల్లో ఈ కమిటీ తమ నివేదికను విద్యాశాఖకు సమర్పిస్తుంది. నీట్, యూజీసీ- నెట్ పరీక్షల్లో అవకతవకలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేంద్రం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం గమనార్హం.


కమిటీ సభ్యులు:

1. కె.రాధాకృష్ణన్ (ఇస్రో మాజీ చైర్మన్): 2. డాక్టర్ రణదీప్ గులేరియా (ఎయిమ్స్ మాజీ డైరెక్టర్): 3. ప్రొఫెసర్ బీజే రావు (వైస్ చాన్సలర్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్): 4. ప్రొఫెసర్ రామమూర్తి కె. (ఐఐటీ మద్రాస్): 5. పంకజ్ బన్సల్ (పీపుల్స్ స్ట్రాంగ్ సహ వ్యవస్థాపకుడు)
6. ఆదిత్య మిట్టల్ (డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్, ఐఐటీ ఢిల్లీ)
7. గోవింద్ జైస్వాల్ (జాయింట్ సెక్రటరీ, కేంద్ర విద్యాశాఖ)

బిహార్‌లో కూలిన మరో వంతెన

సివన్: బిహార్‌లో మరో వంతెన కూలిపోయింది. సివన్ జిల్లాలో దారౌండా, మహారాజ్‌గంజ్ గ్రామాలను అనుసంధానిస్తూ కాలువపై నిర్మించిన చిన్నపాటి వంతెన శనివారం ఉదయం 5 గంటల సమయంలో కూలింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదని జిల్లా మేజిస్ట్రేట్ ముకుల్‌కుమార్ గుప్తా చెప్పారు. ఇలా చాలా పాత వంతెన అని తెలిపారు. నీటి ప్రవాహం వల్ల పిల్లర్లు బలహీనంగా మారి వంతెన కూలిందని అన్నారు. 1991లో ఈ బ్రిడ్జిని నిర్మించినట్లు స్థానిక అధికారి సూర్యప్రతాప్ సింగ్ వెల్లడించారు. బిహార్‌లో వంతెన కూలడం వారం రోజుల వ్యవధిలో ఇది రెండో ఘటన. అరారియా జిల్లాలో కొత్తగా నిర్మించిన 180 మీటర్ల పొడవైన వంతెన మంగళవారం కూలిపోయిన సంగతి తెలిసిందే.

బాల రామున్ని ప్రతిష్ఠించిన పూజారి మృతి



వారణాసి: అయోధ్య రామాలయంలో బాల రాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రధాన పూజారి ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ (86) శనివారం పరమపదించారు. గత కొద్ది రోజులుగా దీక్షిత్ అనారోగ్యంతో బాధపడుతున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. ఇక్కడి మణికర్ణిక ఘాట్‌లో అంత్యక్రియలు జరుగుతాయని వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 22న అయోధ్య రామాలయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన విషయం తెలిసిందే. వారణాసిలోని ప్రముఖ పండితుల్లో ఒకరైన లక్ష్మీకాంత్ దీక్షిత్ మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన వారు. కాకపోతే ఆయన కుటుంబం కొన్ని తరాలుగా వారణాసిలోనే నివసిస్తోంది.

చైనాలో వరద బీభత్సం: 53 మంది మృతి

బీజింగ్: ఆకస్మిక వర్షాలు, వరదలతో దక్షిణ చైనా వణికిపోతోంది. వర్షాల ధాటికి కొండ చరియలు విరిగిపడుతున్నాయి. బురద ప్రవాహం గ్రామాలను ముంచెత్తుతోంది. వరదల కారణంగా గాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లో 47 మంది, ఫుజియాన్ ప్రావిన్స్‌లో ఆరుగురు మృత్యువాత పడ్డారు. మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. వర్షాలు, వరదల వల్ల భారీగా ఆస్తినష్టం వాటిల్లినట్లు అధికారులు వెల్లడించారు. పెద్ద సంఖ్యలో ఇళ్లు కూలిపోయాయి.

గాజాపై దాడులు... 42 మంది దుర్మరణం

ఖాన్ యూనిస్: గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. షతీ శరణార్థుల శిబిరం, పొరుగునున్న తుఫాపై శుక్ర, శనివారాల్లో జరిగిన దాడుల్లో కనీసం 42 మంది దుర్మరణం పాలైనట్టు పాలస్తీనా మీడియా విభాగం పేర్కొంది. ''యుద్ధం మొదలైన నాటినుంచి గాజాలో మృతుల సంఖ్య 37,500 దాటింది. దాదాపు లక్ష మంది దాకా గాయపడ్డారు'' అని వివరించింది. ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు పశ్చిమ రఫాలోకి మరింతగా చొచ్చుకొస్తున్నాయి. పైనుంచి యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపిస్తున్నాయి. మరోవైపు, గత అక్టోబర్ నుంచి నిరంతరాయంగా జరుగుతున్న దాడుల దెబ్బకు గాజాలో ఆరోగ్య వ్యవస్థ నేలమట్టమైపోయిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ''ఇప్పటిదాకా కనీసం 9,300 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ బందీలుగా పట్టుకుంది. వారితో అత్యంత అమానుషంగా ప్రవర్తిస్తోంది'' అని పాలస్తీనా శనివారం ఆరోపించింది.

అభివృద్ధి భాగస్వామి బంగ్లాదేశ్

సంబంధాలు బలపడాలి: మోదీ
- బంగ్లా ప్రధాని హసీనాతో భేటీ
- సమగ్ర ఆర్థిక ఒప్పందంపై మళ్లీ చర్చలకు నిర్ణయం

న్యూఢిల్లీ: సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం(సీఈపీఏ)పై చర్చలు ప్రారంభించాలని, ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకొనే దిశగా ప్రణాళిక రూపొందించుకోవాలని భారత్, బంగ్లాదేశ్ నిర్ణయించుకున్నాయి. రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత్ వచ్చిన బంగ్లా ప్రధానమంత్రి షేక్ హసీనాతో శనివారం ప్రధాని నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపార వాణిజ్యపరమైన అంశాలపై విస్తృతంగా చర్చించారు. మయన్మార్ పరిణామాలతోపాటు రోహింగ్యా కాందిశీకుల అంశంపై అభిప్రాయాలు పంచుకున్నారు. అనంతరం సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. భారత్‌కు బంగ్లాదేశ్ అతిపెద్ద అభివృద్ధి భాగస్వామి అని మోదీ అన్నారు. బంగ్లాదేశ్‌తో సంబంధ బాంధవ్యాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా సీఈపీఏపై చర్చలు ప్రారంభించామని నిర్ణయించినట్లు తెలిపారు. రక్షణ రంగంలో పరస్పర సహకారంపై విస్తృతంగా చర్చించామన్నారు. రక్షణ ఉత్పత్తుల తయారీ, సైనిక దళాల ఆధునీకరణ విషయంలో ఇరుదేశాలు సహకరించుకోవాలని ఆకాంక్షించారు.

భారత్ విశ్వసనీయ మిత్రదేశం: హసీనా

ఇండో–పసిఫిక్ కార్యక్రమంలో చేరాలన్న బంగ్లాదేశ్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మోదీ చెప్పారు. ''ఇరు దేశాల బంధానికి పౌరుల మధ్య సంబంధాలే పునాది. వైద్య సేవల కోసం వచ్చే బంగ్లా పౌరులకు ఈ–మెడికల్ వీసా కల్పిస్తాం. బంగ్లాదేశ్‌లోని రంగపూర్‌లోని కొత్తగా అసిస్టెంట్ హైకమిషన్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నాం. 1996 నాటి గంగా నది నీటి ఒప్పందాన్ని నవీకరించడానికి సాంకేతిక చర్చలు ప్రారంభిస్తాం. తీస్తా నది పరిరక్షణ, నిర్వహణపై చర్చించడానికి బంగ్లాదేశ్‌కు టెక్నికల్ టీమ్‌ను పంపుతాం'' అని ప్రధాని వివరించారు. సుస్థిరమైన, సౌభాగ్యవంతమైన, ప్రగతిశీల బంగ్లాదేశ్‌ను బంగబంధు షేక్ ముజిబుర్ రెహ్మాన్ కలలుగన్నారని, ఆ కలను నిజం చేయడానికి తమవంతు సహకారం అందిస్తామని నరేంద్ర మోదీ ప్రకటించారు. భారత్ తమకు అతిపెద్ద పొరుగు దేశమని, తమకు అత్యంత విశ్వసనీయ మిత్రదేశమని షేక్ హసీనా పునరుద్ఘాటించారు. భారత్‌తో సంబంధాలకు అత్యధిక విలువ ఇస్తున్నామని ఆమె పునరుద్ఘాటించారు.

10 ఒప్పందాలపై సంతకాలు

డిజిటల్, సముద్రయానం, సముద్ర వనరుల వినియోగం, రైల్వే, అంతరిక్షం, పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ టెక్నాలజీ, ఆరోగ్యం, వైద్య వంటి కీలక రంగాల్లో సహకారం పెంపొందించుకోవడమే లక్ష్యంగా భారత్, బంగ్లాదేశ్ శనివారం 10 ఒప్పందాలపై సంతకాలు చేశాయి.



శనివారం ఢిల్లీలో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో భేటీ అయిన ప్రధాని మోదీ

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో షేక్ హసీనా భేటీ

న్యూఢిల్లీ: వేర్వేరు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకొనే దిశగా భారత్, బంగ్లాదేశ్ వేగంగా ముందుకు సాగుతున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హర్షం వ్యక్తం చేశారు. నూతన రంగాల్లో సహకారం పెంపొందించుకుంటున్నాయని, రానున్న రోజుల్లో ఇరు దేశాల మధ్య సంబంధాలను ఈ సహకారమే నిర్ణయిస్తుందని చెప్పారు. శనివారం రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపది ముర్ముతో బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా సమావేశమయ్యారు. భారత్, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలను బలోపేతం చేసుకొనేలా కలిసి పనిచేయాలని నిర్ణయానికొచ్చారు. షేక్ హసీనాను కలవడం సంతోషంగా ఉందని ముర్ము పేర్కొన్నారు.

పెట్రో జీఎస్టీ ఎంతన్నది...
రాష్ట్రాలే నిర్ణయించుకోవాలి

- ఆర్థిక మంత్రి నిర్మల వ్యాఖ్యలు
- ప్లాట్‌ఫాం టికెట్లకు ఇక నో జీఎస్టీ
- పలు రైల్వే సేవలపై కూడా
- సోలార్ కుక్కర్లు, పాల క్యాన్లపై 12 శాతం
- జీఎస్టీ కౌన్సిల్ భేటీలో నిర్ణయం



న్యూఢిల్లీ: ప్లాట్‌ఫాం టికెట్లకు ఇకపై జీఎస్టీ ఉండబోదు. వాటితో పాటు రిటైరింగ్ రూములు, వెయిటింగ్ రూములు, క్లోక్ రూములు, ప్లాట్‌ఫాంలపై బ్యాటరీ వాహనాలు తదితర రైల్వే సేవలపై కూడా జీఎస్టీ తొలగించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సారథ్యంలో శనివారం జరిగిన జీఎస్టీ కౌన్సిల్ 53వ సమావేశం ఈ మేరకు పలు సిఫార్సులు చేసింది. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడా ఈ సందర్భంగా నిర్మల చర్చలు జరిపారు. కేంద్రం ఇచ్చే 50 ఏళ్ల వడ్డీ లేని రుణాల పథకం ప్రయోజనాలను రాష్ట్రాలు అందిపుచ్చుకోవాలన్నారు. పెట్రోల్, డీజిల్‌ను కూడా జీఎస్టీ పరిధిలోకి తేవాలన్నది కేంద్రం ఉద్దేశమని ఆమె పునరుద్ఘాటించారు. ''అందుకు అంగీకరించాల్సింది ఇక రాష్ట్రాలే. అవి ఒక్కతాటిపైకి వచ్చి చర్చించి పెట్రోల్, డీజిల్‌పై ఎంత శాతం జీఎస్టీ వేయాలో నిర్ణయించుకుని కౌన్సిల్‌కు తెలపాలి'' అని భేటీ అనంతరం నిర్మల మీడియాతో అన్నారు. ''ఇన్‌పుట్ క్రెడిట్ పన్నులో మార్పుచేర్పులు చేయాలని నిర్ణయం జరిగింది. ఇన్‌వాయిసింగ్ తదితరాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఇకపై దేశవ్యాప్తంగా బయోమెట్రిక్‌తో కూడిన ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరి చేస్తున్నాం. జీఎస్టీ చెల్లింపు తుది గడువును ఏప్రిల్ 30 నుంచి జూన్ 30కి పొడిగించాం. తద్వారా వర్తకులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి సంస్థలు, పరిశ్రమలకు లబ్ధి చేకూరుతుంది'' అని మంత్రి వివరించారు. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు...

- అన్ని రకాల సోలార్ కుక్కర్లపై ఇకనుంచి 12 శాతం జీఎస్టీ
- అన్ని రకాల కార్టన్ బాక్సులపై జీఎస్టీ 18 నుంచి 12 శాతానికి తగ్గింపు. జమ్మూ కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల పళ్ల వ్యాపారులకు ప్రయోజనం.
- స్ప్రింకర్లపై జీఎస్టీ 12 శాతానికి తగ్గింపు.
- విద్యా సంస్థల హాస్టళ్లలో కాకుండా బయట ఉండే విద్యార్థులకు నెలకు రూ.20 వేల దాకా దాకా జీఎస్టీ మినహాయింపు
- స్టీల్, అల్యుమినియం, ఇనుప పాల క్యాన్లపై 12 శాతం జీఎస్టీ.
- జీఎస్టీ ఎగవేత తదితర ఉదంతాల్లో జరిమానాలపై వడ్డీ ఎత్తివేత.

ప్రొటెం స్పీకర్‌పై రగడ


భర్తృహరి మహతాబ్

దళితుడిని అవమానించారంటున్న కాంగ్రెస్
చైర్‌పర్సన్ ప్యానెల్‌లో ఉండబోమని విపక్షాల హెచ్చరిక


కె.సురేశ్

న్యూఢిల్లీ: 18వ లోక్‌సభ తొలి సమావేశాలకు ముందే అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం వేడెక్కుతోంది. ప్రొటెం స్పీకర్ ఎంపిక తాజా వివాదానికి కారణమైంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏడుసార్లు ఎంపీ అయిన భర్తృహరి మహతాబ్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించిన విషయం తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. బీజేపీ పార్లమెంటరీ సంప్రదాయాలను తుంగలో తొక్కిందని ఆరోపించింది. తమ పార్టీ ఎంపీ కె.సురేశ్ అందరికంటే సీనియర్ అని, ఆయన ఎనిమిదిసార్లు ఎంపీగా ఎన్నికయ్యారని.. సంప్రదాయం ప్రకారం నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించడానికి ప్రొటెం స్పీకర్‌గా సురేశ్‌ను నియమించాల్సిందని వాదిస్తోంది. దళితుడు కాబట్టే సురేశ్‌ను బీజేపీ పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించింది. వాస్తవానికి 18వ లోక్‌సభలో కె.సురేశ్. వీరేంద్ర కుమార్‌లు ఇద్దరు ఎనిమిదేసి సార్లు ఎంపికైన, అందరికంటే సీనియర్ సభ్యులు. అయితే వీరేంద్ర కుమార్ కేంద్ర మంత్రివర్గంలో చేరడంతో.. సురేశ్ ప్రొటెం స్పీకర్ కావాలి. కానీ బీజేపీ ఏడుసార్లు ఎంపీ అయిన మహతాబ్‌ను ఎంచుకుంది. ఆయనకు సహాయకారిగా ఉండేందుకు కె.సురేశ్, టీఆర్ బాలు (డీఎంకే), సుదీప్ బందోపాధ్యాయ్ (టీఎంసీ), రాధామోహన్ సింగ్, ఫగ్గన్‌సింగ్ కులస్తే (బీజేపీ)లతో ఛైర్ పర్సన్ ప్యానెల్‌ను ఏర్పాటు చేశారు. బీజేపీ వైఖరికి నిరసనగా ఛైర్ పర్సన్ ప్యానెల్‌కు దూరంగా ఉండే అంశాన్ని విపక్షాలకు చెందిన కె.సురేష్, టి.ఆర్. బాలు, సుదీప్ బందోపాధ్యాయ్‌లు పరిశీలిస్తున్నారని విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. దళితుడు కాబట్టే సురేష్‌ను ప్రొటెం స్పీకర్‌గా ఎంపిక చేయలేదనే వాదనను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కొట్టిపారేశారు. సురేష్ ఎనిమిదిసార్లు ఎంపిక అయినప్పటికీ.. ఆయన వరుసగా ఎన్నికైన ఎంపీ కాదని, 1998, 2004 లోక్‌సభల్లో ఆయన సభ్యుడు కాదని పేర్కొన్నారు. మరోవైపు మహతాబ్ ఏడుసార్లు వరుసగా ఎంపీగా గెలిచారని, అందుకే ఆయన్ను ప్రొటెం స్పీకర్‌గా ఎంచుకున్నామని వాదించారు.

ప్రొటెం స్పీకర్ ఎంపికపై అబద్ధాలు చెబుతూ కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగానే గిరిజన మంత్రి కిరణ్ రిజిజును అవమానిస్తోందని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఎదురుదాడికి దిగారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖను చూస్తున్న తొలి గిరిజన మంత్రిని అయినప్పటికీ కాంగ్రెస్ అబద్ధాలు, బెదిరింపులకు లొంగబోనని రిజిజు అన్నారు. 'నిబంధనలను పాటిస్తాని, ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన.. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ నినాదాన్ని అనుసరిస్తా'రని రిజిజు పేర్కొన్నారు. సురేష్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడం పార్లమెంటరీ సంప్రదాయాలను కాలరాసే ప్రయత్నమేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. బీజేపీని 240 సీట్లకే ప్రజలు పరిమితం చేసినా కాషాయపార్టీ ప్రజాస్వామ్యం, సంప్రదింపులు, పార్లమెంటరీ సంప్రదాయాలు, ప్రతిపక్షాలు అంటే ఏమిటనే దానిని అర్థం చేసుకోవడం లేదని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. నిరంకుశ బీజేపీ విపక్ష అభ్యర్థిని ప్రొటెం స్పీకర్‌గా కూడా చూడాలనుకోవడం లేదన్నారు. అందుకే ఫిరాయింపుదారు భర్తృహరి మహతాబ్‌ను ఎంచుకుందన్నారు. మహతాబ్ సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేడీ నుంచి బీజేపీలోకి మారి.. ఆ పార్టీ టికెట్‌పై కటక్ నుంచి గెలుపొందారు.

అందరి దృష్టీ స్పీకర్ ఎన్నికపైనే...

18వ లోక్‌సభ తొలి సమావేశాలు ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతున్న విషయం తెలిసిందే. 24, 25 తేదీల్లో నూతన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుంది. అనంతరం 26న జరిగే స్పీకర్ ఎన్నికపై అందరి దృష్టీ నెలకొంది.

క్లుప్తంగా

గనుల తవ్వకాలకు అనుమతి తగదు



మాట్లాడుతున్న ఎస్‌ఆర్ హిరేమఠ్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో నూతన గనుల తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతిని ఇవ్వడం తగదని సమాజ పరివర్తన సముదాయ అధ్యక్షుడు ఎస్‌ఆర్ హిరేమఠ్ పేర్కొన్నారు. శనివారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బళ్లారి జిల్లా సండూరు వద్ద నూతనంగా గనుల తవ్వకాలకు కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి అనుమతించడాన్ని తప్పుబట్టారు. ఈ విషయంలో గనులు, పర్యావరణ సంరక్షణ మండలి అధ్యక్షురాలు శాలిని రజనీష్‌ను బదిలీ చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించి రెండు చోట్ల అక్రమ గనులు తవ్వడానికి అనుమతులివ్వడం సరికాదన్నారు. అక్రమ గనుల సంరక్షణకు బళ్లారితో పాటు మరో మూడు జిల్లాల్లో ఆందోళనకు శ్రీకారం చుడతామన్నారు. జాన్ వెస్లీ, అస్లాం పాషా, మల్లయ్య జేరబండిలున్నారు.

వైభవంగా ఊయల సేవలు



ఊయల సేవలో పాల్గొన్న భక్తులు

రాయచూరు రూరల్: ఏరువాక పున్నమి సందర్భంగా శనివారం నగరంలోని కందగడ్డ మారెమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. నగరంలో అమ్మవారి ఆలయాలకు భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి గొర్రెలు, మేకపోతులను బలి ఇవ్వడానికి తీసుకొచ్చారు. కుంభ కలశాలతో ముత్తైదువులు దీపాలు మోశారు.

సిలిండర్ పేలుడులో ఒకరి మృతి

సాక్షి,బళ్లారి: కలబుర్గి నగరంలో ఓ హోటల్‌లో శుక్రవారం సిలిండర్ పేలిన ఘటనలో గాయపడిన 10 మందిలో ఒక వ్యక్తి మృతి చెందాడు. కలబుర్గిలోని సప్తగిరి హోటల్‌లో సిలిండర్ పేలడంతో 10 మందికి పైగా తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. దీంతో స్థానికులు వెంటనే గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించగా, వారిలో మల్లికార్జున అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన వారిని బెంగళూరు విక్టోరియా, మీరజ్ ఆస్పత్రులకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

మొక్కల పెంపకం పర్యావరణానికి ఊతం



విద్యార్థులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

రాయచూరు రూరల్: విద్యార్థులు విజ్ఞానంపై జాగృతం కావాలని విజ్ఞానవేత్త కమల్ లోదియా పేర్కొన్నారు. శనివారం తాలూకాలోని ఇడపనూరు ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యా శాఖ, భారత జ్ఞాన విజ్ఞాన సమితి, సైన్స్ కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలతో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సంవాదంలో పాల్గొని మాట్లాడారు. నేడు ఉష్ణోగ్రతలతో పోరాడుతున్న అంశాన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కలు పెంచడం, పరిసరాలను సంరక్షించడం మనందరి కర్తవ్యమన్నారు. సమావేశంలో ఆంజనేయ, హఫీజుల్లా, విజయలక్ష్మి, కాంతా, ప్రమీల, రత్నమ్మ, నరసప్ప, సురేష్, శంకర్, తిమ్మప్పలున్నారు.

ట్రాఫిక్ నియమాలను పాటించాలి



ప్రచారం చేస్తున్న ఉమేష్ కాంబ్లే



రాయచూరు రూరల్: ట్రాఫిక్ నియంత్రణకు ప్రాధాన్యతనిచ్చి ప్రమాదాలను నివారించాలని సదర్ బజార్ పోలీస్ స్టేషన్ సీఐ ఉమేష్ కాంబ్లే పేర్కొన్నారు. శనివారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ అంతరాయం నివారణపై ఏర్పాటు చేసిన అవగాహన జాతాకు శ్రీకారం చుట్టి మాట్లాడారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదం నుంచి రక్షణ పొందాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు.

దేశానికి వెన్నెముక అన్నదాత



రాతిదూలం లాగే పోటీలను ప్రారంభిస్తున్న స్వామీజీ, మున్నూరు కాపు సమాజం నేతలు



ఎద్దుల పోటీలను వీక్షించేందుకు కిక్కిరిసిన జనం

- పల్లెసీమలకు పట్టుకొమ్మలు ఉత్సవాలు
- వేడుకల్లో సచ్చిదానంద సరస్వతి స్వామీజీ

రాయచూరు రూరల్: రైతులు దేశానికి వెన్నెముకలాంటివారని, పల్లెసీమలకు పట్టుకొమ్మలు ముంగారు ఉత్సవాలని హరిహరపుర ఆదిశంకరాచార్య శారదా లక్ష్మీనరసింహ పీఠాధిపతి స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతి మహాస్వామీజీ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఏపీఎంసీ ఆవరణలో మున్నూరు కాపు సమాజం ఆధ్వర్యంలో ముంగారు ఉత్సవాల్లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎద్దులతో రెండు టన్నుల రాతి దూలం లాగే పోటీలను ప్రారంభించి ప్రసంగించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పొలంలో విత్తనాలు చల్లుకొని పంటలు బాగా పండాలని కోరుకుంటూ బసవన్నకు పూజలు చేయడం, వాటిని ఊరేగించడం ఆనవాయితీ అన్నారు. ఎద్దులతో చేపట్టే ముంగారు మున్నూరు కాపు సంబరాలు రాష్ట్రానికి గర్వకారణం అన్నారు. రైతులకు మొదటి పండుగ ఏరువాక పున్నమి ఖరీఫ్ సీజన్‌లో రైతులు పొలాలను పదును చేసుకోవచ్చన్నారు.

అలరించిన నృత్యప్రదర్శనలు

అంతకు ముందు ముంగారు సాంస్కృతిక ఉత్సవాలకు శాంతమల్ల శివాచార్య, మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి శ్రీకారం చుట్టారు. శుక్రవారం రాత్రి మున్నూరు కాపు సమాజం వివిధ కళాకారులతో చేపట్టిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. తెలంగాణ, కర్ణాటక, కేరళ, పంజాబ్, న్యూఢిల్లీ నుంచి వచ్చిన కళా బృందాలు తమ ప్రదర్శనలు చేశాయి. వైజాగ్ నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రతిభను చాటారు. కార్యక్రమంలో లోక్‌సభ సభ్యుడు కుమార నాయక్, మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి, మున్నూరు కాపు సమాజం అధ్యక్షుడు నరసారెడ్డి, బసవరాజరెడ్డి, శేఖర్ రెడ్డి, క్రీడా సహాయ కార్యదర్శి పుల్లా రాజేంద్రరెడ్డి, శ్రీనివాస రెడ్డిలున్నారు.

నంద్యాల జిల్లా ఎద్దులు ప్రథమం

నగరంలో శనివారం ఏపీఎంసీ మైదానంలో ఎద్దులకు నిర్వహించిన రెండు టన్నుల రాతి దూలం లాగే పోటీల్లో నంద్యాల జిల్లా కొత్తూరుకు చెందిన బులుసు సుబ్రమణ్యేశ్వర రెడ్డి ఎద్దులు ప్రథమ బహుమతిగా రూ.90 వేలు, సూర్యాపేట జిల్లా సురనగర ఎస్‌ఆర్‌ఎస్ సోంకి సురేంద్రరెడ్డి ఎద్దులు ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, ప్రకాశం జిల్లా గంగణ్ణపాళెం ఉమా వెంకటేశ్‌రెడ్డి ఎద్దులు తృతీయ బహుమతిగా రూ.65 వేలు, జోగులాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం గోర్లఖాన్‌దొడ్డికి చెందిన కురువ కరెప్ప ఏద్దులు నాలుగో బహుమతిగా రూ.55 వేలు, నంద్యాల జిల్లా కొత్తూరు బులుసు సుబ్రమణ్యేశ్వర రెడ్డి ఎద్దులు ఐదో బహుమతిగా రూ.45 వేలు, కడప జిల్లా మసనపల్లి నందరెడ్డి ఎద్దులు ఆరో బహుమతిగా రూ.35 వేలు, కడప జిల్లా రంగసాయిపాళ్యం మరతల వెంకటరెడ్డి ఎద్దులు ఏడో బహుమతిగా రూ.20 వేలు నగదు పొందారు.



లీలావతి బృందం భరత నాట్య ప్రదర్శన



సమూహ నృత్య ప్రదర్శన చేస్తున్న బాలికలు

నోటికి అదుపు ఉండాలి

- విజయేంద్రకు హైకోర్టు అక్షింతలు

శివాజీనగర: ఎన్నికల సమయంలో మనిషి నాలుక, మెదడు మధ్య వంతెన కూలిపోరాదు. దుర్భాషను వినియోగించరాదని హైకోర్టు సూచించింది. బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర, పార్టీ నేత ప్రశాంత్ మాకనురుకు ఈ మేరకు మందలించింది. లోక్‌సభ ఎన్నికల్లో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీ.కే.శివకుమార్, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ గురించి సామాజిక మాధ్యమాల్లో వారు కించపరిచే పోస్టులు పెట్టారని కాంగ్రెస్ నాయకులు మల్లేశ్వరం ఠాణాలో కేసులు పెట్టారు. వీటిని రద్దు చేయాలని ఇరువురూ హైకోర్టులో అర్జీలు వేశారు. న్యాయమూర్తి కృష్ణ దీక్షిత్ ఆ వీడియోలను చూసి దుర్భాషల మీద అసంతృప్తి వ్యక్తంచేశారు. మాటల్లో ప్రేమ, బాధ్యత, సౌజన్యం, మర్యాద ఉండాలి. ఎన్నికల సమయంలో ప్రజలకు వేడి మీద ఉంటారు. ఆ సమయంలో నోటికి వచ్చినట్లు మాట్లాడి ప్రజలను ఉద్వేగానికి గురిచేయరాదు అని పేర్కొన్నారు. తరువాత ఇద్దరికీ ఉపశమనం కల్పిస్తూ ఎఫ్ఐఆర్‌పై స్టే మంజూరు చేశారు.

నీట్ లీకేజీపై ఎన్‌ఎస్‌యూఐ ర్యాలీ



మండ్య: నీట్ ప్రశ్న పత్రాల లీకేజీని వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మండ్యలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

వాహనాలు సీజ్



చింతామణి: పట్టణంలో పలు ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేసి జరిమానా విధించారు. వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం, లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపుతుండటంతో పోలీసులు పట్టుకుని జరిమానా విధించారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు పెడతామని పోలీసులు హెచ్చరించారు. ఈ సందర్భంగా 50 వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ విజికుమార్ తెలిపారు.

ఆరోగ్యం క్షీణించి చిన్నారి మృతి

సాక్షి,బళ్లారి: బెళగావి జిల్లాలోని రామతీర్థనగర్‌లో ఇటీవల చిన్నారుల అమ్మకాలు సాగించే ముఠాను పట్టుకోగా, వారిలో ఓ నెల రోజుల వయస్సుగల చిన్నారి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. బెళగావి జిల్లాలోని కిత్తూరు పట్టణంలో నకిలీ వైద్యుడు అబ్దుల్ గఫూర్ ఐదు మంది చిన్నారుల అమ్మకాలు సాగిస్తుండగా పోలీసులు వల పన్ని ఈ ముఠాను పట్టుకున్నారు. మృతి చెందిన చిన్నారి నెలలు నిండకనే పుట్టడంతోనే ఆరోగ్యంలో క్షీణించడంతో ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స ఫలించక మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

యోగా ఉత్తమ ఔషధం



యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

మైసూరు: మానసిక ఒత్తిళ్ల నుంచి బయట పడటానికి యోగా ఉత్తమ ఔషధమని, ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావ్ అన్నారు. శనివారం మైసూరు నగరంలోని కళామందిరంలో కర్ణాటక యోగ ఉపాధ్యాయుల సమాఖ్య, కన్నడ సంస్కృతిశాఖ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం, రాష్ట్ర స్థాయి ప్రథమ యోగా సమ్మేళనాన్ని ప్రారంభించి మాట్లాడారు. యోగా సాధన వల్ల కలిగే లాభాలను ఆయన వివరించారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురి అరెస్ట్

హుబ్లీ: నగరంలో ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసి హత్య చేయడానికి పథకం రూపొందించిన డ్రైవర్‌తో పాటు 6 మందిని మారణాయుధాలతో పాటు అరెస్ట్ చేయడంలో పాత హుబ్లీ స్టేషన్ పోలీసుల బృందం విజయవంతమైంది. ఘటన వివరాలను పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార శనివారం మీడియాకు వివరించారు. ఈ నెల 19న రాత్రి సిద్ధరూఢమఠం వద్ద ఈ కృత్యానికి పాల్పడటానికి 7 మంది ముఠా అనుమానాస్పద రీతిలో సంచరిస్తుండటం కనిపించింది. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన పాత హుబ్లీ స్టేషన్ సీఐ సురేష్ యళ్లూర నేతృత్వంలోని బృందం ముందుగా ఇద్దరిని అరెస్ట్ చేసింది. ఈ వేళ నిందితులను విచారించగా హత్య పథకంపై సమాచారం వివరాలు లభ్యం కావడంతో అప్రమత్తమైన పోలీసులు మఫ్టీలో మిగిలిన నిందితులను అరెస్ట్ చేసి పెద్ద దారుణాన్ని తప్పించారు. స్థానిక జగదీశ్ నగర్ మంజునాథ(21), సోనియాగాంధీ నగర్ పవన్(22), అరవింద నగర్ వినాయక దుండి(20), జగదీశ్ నగర్ నాగరాజ(59), రాజప్ప(28)తో పాటు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రెండు కత్తులు, రెండు చాకులు, ఆటో, రెండు బైక్‌లను జప్తు చేశారు. ఘటనకు సంబంధించి మరో నిందితుడు ఆనంద్‌నగర్ నివాసి గణేష బిలాన తప్పించుకొని పరారు కాగా పోలీసులు గాలిస్తున్నారు. పాత కక్షల నేపథ్యంలో దీపక్ ధార్వాడ అనే వ్యక్తి హత్యకు పథకం రూపొందించినట్లుగా నిందితులు నోరు విప్పారన్నారు.



శనివారం బెంగళూరు ప్యాలెస్ మైదానంలో బీజేపీ, జేడీఎస్ కేంద్రమంత్రులను ఇరుపార్టీల నేతలు సన్మానించారు. సోమణ్ణ, హెచ్‌డీ కుమారస్వామి, ప్రహ్లాద్‌జోషి, శోభా కరంద్లాజెలను సత్కరించిన దృశ్యం

గొడవ చేయొద్దన్నందుకు అటవీ అధికారి దారుణ హత్య

హుబ్లీ: గొడవ చేయొద్దని వారించినందుకు తాగిన మత్తులో ఓ అటవీ శాఖ అధికారిని ఐదుగురు దుండగులు దారుణంగా కొట్టి హత్య చేసిన ఘటన యాదగిరిలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు..ఈ నెల 5న యాదగిరి జిల్లా శహాపుర పట్టణంలోని మోటగి బార్ అండ్ రెస్టారెంట్‌లో ఈ హత్య జరిగింది. మహేష్ కనకట్టి దారుణంగా హత్యకు గురైన అటవీ శాఖ అధికారి. కొందరు మద్యం తాగిన మత్తులో ఈ దారుణానికి పాల్పడి పోలీసుల చేతిలో అరెస్ట్ అయ్యారు. రాజు, రేకు నాయక్, తారాసింగ్, నర్సింగ్, ప్రకాష్ అరెస్ట్ అయిన నిందితులు. ఆ రోజున అధికారి మహేష్ కనకట్టి సదరు బార్ అండ్ రెస్టారెంట్‌కు భోజనానికి వెళ్లాడు. అప్పటికే సదరు నిందితులు పీకల దాకా తాగి బార్‌లో చిందులు వేస్తున్నారు. దీంతో సదరు అధికారి వీరిని ఇలా చేయవద్దని బుద్ధి చెప్పబోగా నిందితులకు, అధికారికి మధ్య వాగ్వాదం జరిగింది. నిందితులు చేతికి దొరికిన కర్రలతో కొట్టి, కాళ్లతో తీవ్రంగా తన్ని దారుణ హత్యకు పాల్పడ్డారు. మరుసటి రోజు రెస్టారెంట్ వద్ద పడేసిన మృతదేహాన్ని పోలీసులు స్వాధీనపరచుకుని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి భార్య తన భర్తది హత్య అని ఆరోపించారు. దీంతో అనుమానంతో పోలీసులు సదరు రెస్టారెంట్‌లోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించగా హత్యోదంతం వెలుగు చూసింది. ఐదుగురు నిందితులు ప్రస్తుతం కటకటాల పాలయ్యారు. ఘటనపై శహాపుర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

హైస్కూలు ప్రారంభించాలని 28న ధర్నా



మాట్లాడుతున్న రైత సంఘం నేత నారాయణగౌడ

కోలారు: ముళబాగిలు తాలూకా నంగలి ప్రాథమిక పాఠశాలలో ఉన్నత పాఠశాలను ప్రారంభించాలని విద్యా శాఖను డిమాండ్ చేస్తూ ఈనెల 28న విద్యార్థులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో ధర్నా నిర్వహించాలని రైతు సంఘం పదాధికారులు, తల్లిదండ్రులు తీర్మానించారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నారాయణగౌడ మాట్లాడుతూ నంగలి ప్రాథమిక పాఠశాలలో 350 మంది విద్యార్థులు చదువుతున్నా 8, 9, 10వ తరగతుల కోసం విద్యార్థులు వేరే పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి నంగలిలో ఉన్నత పాఠశాలను ప్రారంభించడానికి మీనమేషాలు లెక్కిస్తున్నారన్నారు. చుట్టుపక్కల ప్రైవేటు పాఠశాలల, ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి డీడీపీఐ ఇక్కడ ఉన్నత పాఠశాల ప్రారంభించడం లేదని ఆరోపించారు. ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు, విద్యార్థులు, తల్లిదండ్రులు, రైతు సంఘం పదాధికారులు పాల్గొన్నారు.



సూర్య నమస్కారాల్లో గిన్నిస్ రికార్డు

కృష్ణరాజపురం: నగరంలోని కృష్ణరాజపురం శ్రీ లక్ష్మి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో కృష్ణరాజపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన యోగాదినోత్సవంలో ఆస్పత్రి సిబ్బందితో పాటు స్థానికులు కలిసి 39 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేసి గిన్నిస్‌బుక్ రికార్డు సాధించారు. ఈ కార్యక్రమంలో వందలాది పాల్గొని ఈ రికార్డు సాధించినట్లు ఆస్పత్రి డైరెక్టర్ సాంబశివ తెలిపారు.

కోలారు వార్తలు...

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్న దృశ్యం

కోలారు : జిల్లాలోని 6 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలను నిర్వహించడానికి పీయూ విద్యా శాఖ అధికారులు ఈనెల 24 నుంచి జులై 5వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లు చేశారు. మొత్తం 3718 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి పేర్లు నమోదు చేసుకున్నారు. 6 పరీక్ష కేంద్రాల్లోను వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తున్నారు. ప్రతి గదిలోను సీసీ కెమెరా, జెడ్పీ కార్యాలయంలో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తున్నారు. గుర్తింపు కార్డులు, హాల్ టికెట్లు ఉన్న వారికి మాత్రమే పరీక్ష కేంద్రంలోనికి అనుమతిస్తున్నారు. అనధికారిక వ్యక్తులు పరీక్ష కేంద్రాల వద్ద కనిపిస్తే ఆయా పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్‌లే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రతి పరీక్ష కేంద్రం చుట్టూ గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. 200 మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేతకు ఆదేశించారు. పరీక్షలను ఎలాంటి గందరగోళం లేకుండా సజావుగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆరోగ్య పరీక్ష శిబిరాల లబ్ధి పొందండి



గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: ఆర్థికంగా వెనుకబడిన వారి కోసం గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాససంద్ర జీపీ అధ్యక్షురాలు గీతా వెంకటేష్ తెలిపారు. శనివారం వైదేహి ఆస్పత్రి, శ్రీనివాససంద్ర జీపీ సహకారంతో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఆరోగ్య రక్షణపై సరైన అవగాహన ఉండదన్నారు. అలాంటి వారికి ఉచిత ఆరోగ్య శిబిరాలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. రోగాలు రాకముందే వాటిని నియంత్రణ చేసుకోవడం మంచిదన్నారు. ఉచిత ఆరోగ్య శిబిరంలో కీళ్లు, ఈసీజీ, రక్త తదితర పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో పీడీఓ విజికుమార్, వైదేహి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ వివాదం.. తీసింది ప్రాణం

- దుండగుల చేతిలో స్వామీజీ హతం



చిన్మయానంద అవధూత స్వామీజీ(ఫైల్)



మార్చురీలో స్వామీజీ మృతదేహం

మాలూరు: భూ వివాదం నేపథ్యంలో స్వామీజీ దారుణ హత్యకు గురైన ఘటన శనివారం సంతహళ్లి గ్రామం వద్ద ఉన్న ఆనందమార్గ ఆశ్రమంలో జరిగింది. ఆచార్య చిన్మయానంద అవధూత స్వామీజీ(65) హత్యకు గురైన వ్యక్తి. మరో గుంపునకు చెందిన ధర్మ ప్రాణానంద, అరుణ్ హంతకులు. వీరిని మాలూరు పోలీసులు అరెస్టు చేశారు. తాలూకాలోని సంతేహళ్లి గ్రామ సమీపంలోని ఆనందమార్గ పాలిటెక్నిక్‌కు చెందిన 4 ఎకరాల భూమి కోసం రెండు గుంపుల మధ్యన చాలా ఏళ్లుగా వివాదం సాగుతోంది. ఇది కోర్టులో ఉండగా ఈ విషయానికి సంబంధించి ఇరు వర్గాల మధ్య గొడవ ప్రారంభ రెండు గుంపులు పరస్పరం కొట్టుకున్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన చిన్మయానంద స్వామీజీని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఆస్పత్రికి వెళుతుండగా చిన్మయానంద మాట్లాడుతూ తాను మూత్రానికి వెళ్లినప్పుడు ధర్మ ప్రాణానంద, అరుణ్ అనే ఇద్దరు ముఖానికి స్ప్రేయర్ చల్లి దుడ్డుకర్రతో తలపై గట్టిగా కొట్టారన్నారు. గంట అనంతరం తనను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకు వచ్చి చేర్పించారన్నారు. ఆనంద మార్గ సంస్థకు చెందిన మరో విద్యా సంస్థను కోలారు తాలూకా కిత్తండూరులో నిర్వహిస్తున్నారు. స్వామీజీ మరణంతో ఆనందమార్గ విద్యార్థులు అనాథలు అయ్యారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలానికి ఎస్పీ ఎం నారాయణ, ఇన్‌స్పెక్టర్ వసంతకుమార్, సిబ్బంది వెళ్లి పరిశీలించారు. మాలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్యాసంబళ్లి జీపీ కాంగ్రెస్ కైవసం



విజయ సంకేతం చూపుతున్న కాంగ్రెస్ సభ్యులు

కేజీఎఫ్: క్యాసంబళ్లి జీపీ అధ్యక్ష స్థానానికి శనివారం నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు అభ్యర్థి బళువనహళ్లి జీపీ సభ్యుడు సునీతా ఆనందరెడ్డి అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. 20 మంది సభ్యులు కలిగిన ఆ జీపీలో అధ్యక్ష స్థానానికి నిర్వహించిన ఎన్నికల్లో సునీతా ఆనందరెడ్డి, శ్రీరామరెడ్డిలు నామినేషన్ దాఖలు చేశారు. 20 మంది సభ్యులు కలిగిన పంచాయతీలో సునీతా ఆనందరెడ్డి 12 ఓట్లు, శ్రీరామరెడ్డి 8 ఓట్లు సాధించడంతో ఎన్నికల అధికారి సునీతా ఆనందరెడ్డి విజయం సాధించినట్లు ప్రకటించారు. ఎన్నిక అనంతరం సునీతా ఆనందరెడ్డి అనుచరులు బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకుని విజయోత్సవం నిర్వహించారు. ఎన్నిక అనంతరం మాట్లాడిన నూతన అధ్యక్షురాలు సునీతా ఆనందరెడ్డి తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మహిషి నివేదిక అమలు చేయరూ



డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు : డాక్టర్ సరోజిని మహిషి పరిష్కృత నివేదికను వెంటనే అమలు చేయాలని నమ్మ కర్ణాటక సేన కార్యకర్తలు డిమాండ్ చేస్తూ డిప్యూటీ కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. సేన సభ్యులు మాట్లాడుతూ 1984న డాక్టర్ సరోజిని మహిషి నేతృత్వంలో సమితిని రచించి 1986లో సదరు సమితి ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఈ నివేదిక రాష్ట్రంలో కన్నడిగుల ఉద్యోగ సమస్య స్వరూపాన్ని అధ్యయన పరిష్కార మార్గాలను సూచించింది. సరోజిని మహిషి నివేదిక తరహాలోనే కొన్ని రాష్ట్రాలు చట్టాలు రూపొందించాయి. తమిళనాడులో స్థానిక భాషికులకు 60 శాతం, ఆంధ్రాలో 80 శాతం రిజర్వేషన్ సౌకర్యాలను కల్పించారు. 2016లో ప్రొఫెసర్ ఎస్‌టీ సిద్దరామయ్య అధ్యక్షతన డాక్టర్ సరోజిని మహిషి నివేదిక పునః పరిశీలన సమితిని రచించారు. నేడు ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు తగ్గి ఐటీ, బీటీ, బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం పునః పరిశీలన సమితి నివేదికను ఆధారంగా చేసుకొని ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాకనహళ్లి నాగరాజు, తాలూకా అధ్యక్షుడు ఎస్‌ఎం రాజు, మహిళా అధ్యక్షురాలు శాంతమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

టాటా ఎస్ వాహనం ఢీ, ముగ్గురు దుర్మరణం



బనశంకరి: టాటా ఎస్ వాహనం స్కూటర్‌ను ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందిన ఘటన హాసన జిల్లా శాంతి గ్రామ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో స్కూటర్‌పై వెళ్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను హాసన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల వివరాలు తెలియరాలేదు.

వాహనం ఢీకొని ఎలుగుబంటి మృతి

దొడ్డబళ్లాపురం: వాహనం ఢీకొని ఎలుగుబంటి మృతి చెందిన సంఘటన మాగడి తాలూకా అత్తింగెరె గేట్ వద్ద చోటుచేసుకుంది. శనివారం తెల్లవారుజామున రోడ్డు దాటుతున్న ఎలుగుబంటిని అపరిచిత వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఎలుగుబంటి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎలుగుబంటి కళేబరాన్ని తరలించారు.

సినిమా టైటిల్ వివాదం.. డైరెక్టర్‌పై కేసు

దొడ్డబళ్లాపురం: డాలి ధనుంజయ్ నటిస్తున్న నాడప్రభు కెంపేగౌడ సినిమా టైటిల్ వివాదం కేసు వరకూ వెళ్లింది. సినిమా డైరెక్టర్ టీఎస్ నాగాభరణపై కేసు నమోదైంది. నిర్మాత కిరణ్ తోటంబైలె నాగాభరణపై ఫిర్యాదు చేసారు. కిరణ్ ధర్మభీరు నాడప్రభు కెంపేగౌడ పేరుతో సినిమా ప్రకటించారు. అయితే నాగాభరణ నాడప్రభు కెంపేగౌడ పేరు రిజిస్టర్ చేయించి సినిమా తీస్తున్నట్టు ప్రకటించారు. దీంతో తన సినిమాకు ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది కలిగించేందుకు తాను ప్రకటించిన సినిమా పేరును పోలిన టైటిల్ ప్రకటించారని నిర్మాత కిరణ్ నాగాభరణపై కేసు పెట్టారు.

జేడీఎస్‌పై కక్ష పూరిత రాజకీయాలు

మైసూరు: రాష్ట్రంలో జేడీఎస్ పార్టీపై కాంగ్రెస్ నాయకులు కక్ష పూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆ పార్టీ మండలి సభ్యుడు సీఎస్ మంజేగౌడ ఆరోపించారు. శనివారం మైసూరులో మీడియాతో మాట్లాడుతూ...జేడీఎస్‌పైన అధికార కాంగ్రెస్ తరచూ ఇలాంటి కుట్రలు చేస్తోందని, పార్టీ గెలవదని, మునిగిపోయే పార్టీని అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి నేతలకు తప్పకుండా బుద్ధి చెబుతామన్నారు. కాంగ్రెస్ నాయకులు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

చాకుతో పొడిచి తండ్రి హత్య

- కుటుంబ గొడవలతో మైనర్ కుమారుడి కిరాతకం

శివమొగ్గ: కుటుంబంలో గొడవల కారణంగా తండ్రిని కుమారుడు చాకుతో పొడిచి హత్య చేసిన ఘటన శివమొగ్గ జిల్లా భద్రావతి తాలుకా అరబిళచి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శుక్రరాజ్ (50) కుమారుడి చేతిలో హత్యకు గురయ్యాడు. వివరాలు...అరబిళచి గ్రామానికి చెందిన శుక్రరాజ్ పొరుగు గ్రామానికి చెందిన శిల్పను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక మైనర్ కుమారుడు. వీరు కులి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. శిల్ప గ్రామ పంచాయతీలో పనికి వెళ్లడాన్ని శుక్రరాజ్ వ్యతిరేకించాడు. ఈ క్రమంలో దంపతుల మధ్య గొడవ జరిగింది. చుట్టుపక్కల వారు సర్ది చెప్పారు. శుక్రవారం రాత్రి మరోసారి దంపతులు తీవ్రంగా గొడవపడ్డారు. తీవ్ర ఆగ్రహంతో వారి మైనర్ కుమారుడు చాకుతో తండ్రిని పొడిచాడు. దీంతో తీవ్ర రక్తస్రావంతో శుక్రరాజ్ మృతి చెందాడు. హోళె హొన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

1092 కేసులు, రూ. 8 లక్షల జరిమానా

శివాజీనగర: నగరంలోని బీఎంటీసీ బస్సుల్లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిని గుర్తించి 1092 కేసులు నమోదు చేసి రూ. 8.25 లక్షల జరిమానా వసూలు చేసినట్లు బీఎంటీసీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బీఎంటీసీ ప్రత్యేక స్క్వాడ్ బృందాలు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గతనెలలో మొత్తం 19,125 సర్వీస్‌లను ఆపి 4064 టికెట్ రహిత ప్రయాణికులను గుర్తించి వారి నుంచి జరిమానా వసూలు చేశారు. అదే విధంగా మహిళలకు కేటాయించిన సీట్లలో కూర్చొని ప్రయాణించిన 500 మందికి జరిమానా విధించారు. మొత్తంగా రూ.8.25 లక్షలు జరిమానా వసూలు చేశారు.

విదేశీ వర్సిటీతో ఒప్పందం

తుమకూరు: నగరంలోని శ్రీ సిద్దార్థ విశ్వ విద్యాలయం.. ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీతో విద్యా ఒప్పందాలు చేసుకున్నారు. పరిశోధన, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగ కల్పన తదితర వాటిపై ఒప్పందాలు జరిగాయి. కార్యక్రమంలో శ్రీ సిద్దార్థ విద్యాసంస్థల పరిపాలన మండలి సభ్యురాలు కన్నికాపరమేశ్వరి, సాహె వివి చాన్సలర్ డాక్టర్.కే.బీ..లింగేగౌడ, ఫ్లోరిడా వర్సిటీ డైరెక్టర్, అధ్యాపకుడు అయ్యంగార్ ఆధ్వర్యంలో ఒప్పందాలు చేసుకున్నారు.

ఫ్రీడంపార్కులో స్మార్ట్ పార్కింగ్

- డిజిటల్ నగదు చెల్లింపులు
- మహిళలకు ప్రత్యేక పార్కింగ్ సౌలభ్యం
- ఉచితంగా డ్రాప్, పికప్
- 600 కార్లు 750 బైకులు పార్కింగ్‌కు అవకాశం

బనశంకరి: మెట్రో నగరాల్లో ట్రాఫిక్‌ను దాటుకుని గమ్యం చేరుకోవడం ఎంత కష్టమో, కారు పార్కు చేసుకోవడం అంతకంటే పెద్ద సవాల్. దీనికి బెంగళూరు నగరం ఏమి మినహాయింపు కాదు. ఈ క్రమంలో దేశంలోనే మొట్టమొదటిసారిగా ప్రభుత్వ రంగంలో అడ్వాన్స్ పార్కింగ్ టెక్నాలజీ అమర్చిన బహుళ అంతస్తుల పార్కింగ్ భవనం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఫ్రీడంపార్కులో నిర్మించిన పార్కింగ్ భవనం బ్రాండ్ బెంగళూరు కల్పనకు అనుగుణంగా ఉంది. ప్రత్యేకత ఏమిటంటే ఇక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తే నిర్ణీత స్థలానికి ఉచితంగా డ్రాప్, పికప్ వ్యవస్థ కల్పించారు. బ్రాండ్ బెంగళూరు పథకంతో బహుళ అంతస్తుల పార్కింగ్ భవనం నిర్మించారు. మూడు అంతస్తులు కలిగిన పార్కింగ్ భవనంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేస్తుంది. పార్కింగ్ భవనంలోకి ప్రవేశించే కార్లకు రెండు లైన్లు, బైకులకు రెండులైన్లు నిర్మించారు. పార్కింగ్ స్థలంలో మరో ప్రత్యేకత కూడా ఉంది. విధానసౌధ, హైకోర్టు, మెజస్టిక్, చిక్కపేట ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఇక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తే వారిని డ్రాప్ చేయడం, పికప్ చేసే ఉచిత వ్యవస్థ కల్పించారు. దీనికోసం టెంపో ట్రావెలర్ వ్యవస్థను సిద్ధం చేశారు. పార్కింగ్‌లో ప్రవేశద్వారం వద్ద వాహనం నెంబరుప్లేట్ కెమెరాలో



భవంతిలో కన్నడ సంస్కృతిని చాటి చెప్పే చిత్రాలు

నిక్షిప్తం కాగానే ప్రవేశానికి అనుమతించే చీటీని డ్రైవరు బటన్ నొక్కడం ద్వారా తీసుకోవచ్చు. ఇక్కడ కెమెరా ఉండగా డ్రైవరు ఛాయాచిత్రం నమోదు అవుతుంది. అనంతరం పార్కింగ్ నుంచి బయటికి వెళ్లే సమయంలో డ్రైవర్ల వీడియో నమోదు అవుతుంది. దీంతో వాహనాలను ఎవరూ తీసుకువస్తున్నారు తీసుకెళుతున్నారనేది నమోదు అవుతుంది. ఇంకా ఎగ్జిట్ మార్గం వద్ద ఆటోమ్యాటిక్ ఫాస్ట్‌ట్యాగ్‌తో నగదు కట్ కానుంది. అంతేగాక యుపీఐ, డిజిటల్ ద్వారా నగదు చెల్లించవచ్చు. నగదు కూడా చెల్లించడానికి అవకాశం కల్పించారు.

600 కార్లు 750 బైకులు పార్కింగ్‌కు అవకాశం

ఇక్కడి పార్కింగ్ భవనంలో 600 కార్లు, 750 బైకులు పార్కింగ్ చేయడానికి తెలుపు రంగులో గీతలు గీసి దీనికి సెన్సార్‌లైట్లు అమర్చారు. పార్కింగ్ స్థలంలో వాహనాలు ఉంటే ఆ స్థలంలో లైట్ ఎరుపు రంగు తిరుగుతుంది. స్థలం ఖాళీకాగానే ఆకుపచ్చ రంగులోకి మారుతుంది. దూరంనుంచి ఎక్కడ ఖాళీ స్థలం ఉంది అనేది సులభంగా గుర్తించి అక్కడ వాహనాలను తీసుకెళ్లి వాహనాలు పార్కింగ్ చేసే వ్యవస్థ కల్పించారు.

పార్కింగ్ సౌలభ్యాలు

ప్రతి అంతస్తులో పూర్తిగా అత్యవసర అగ్నిమాపక వ్యవస్థ కలిగి ఉంది. మహిళలు అనుకూలం కోసం ప్యానిక్ బటన్ అమర్చారు. అత్యవసర సమయంలో ప్యానిక్ బటన్ నొక్కితే సైరన్ మోగుతుంది. తక్షణం పార్కింగ్ నిర్వహణ సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయం చేస్తారు. ప్రతి అంతస్తులో ఆర్‌ఓ ప్లాంటులో శుద్ధి చేసిన తాగునీటి వ్యవస్థ, కాఫీ కారిడార్ వ్యవస్థ ఏర్పాటు చేశారు.

మహిళలకు ప్రత్యేక పార్కింగ్ వ్యవస్థ

మహిళలకు ప్రత్యేకంగా పింక్ పార్కింగ్ వ్యవస్థ, విభిన్న ప్రతిభావంతులకు రిజర్వు పార్కింగ్ స్థలం ఉంది. పార్కింగ్ ఏరియా గోడలను విధానసౌధ, కన్నడనాడు సాంస్కృతిక కళలతో కూడిన రంగులతో అందంగా తీర్చిదిద్దారు. పాలికె పదేళ్ల అవధితో రెండు సంస్థలకు కాంట్రాక్ట్ ఇచ్చింది. పాలికెకు ఏడాదికి రూ. 1.50 కోట్ల ఆదాయం సమకూరనుంది.

పార్కింగ్ చార్జీ వివరాలు

వాహనం	అవధి	చార్జీ
ద్విచక్ర వాహనం	గంటకు	రూ.15
కారు	గంటకు	రూ.40
ద్విచక్ర వాహనం	1-2 గంటలకు	రూ.25
కారు	1-2 గంటలకు	రూ.40
ద్విచక్ర వాహనం	2-4 గంటలకు	రూ.40
కారు	2-4 గంటలకు	రూ.65
ద్విచక్ర వాహనం	4-6 గంటలకు	రూ.55
కారు	4-6 గంటలకు	రూ.90
ద్విచక్ర వాహనం	6-10 గంటలకు	రూ.85
కారు	6-10 గంటలకు	రూ.110
ద్విచక్ర వాహనం	10-12 గంటలకు	రూ.100
కారు	10-12 గంటలకు	రూ.165



సువిశాలమైన పార్కింగ్ ప్రదేశం



అక్రమ పార్కింగ్‌లకు ఇకపై చెక్



ద్విచక్ర వాహనాల కోసం ఏర్పాటు చేసి పార్కింగ్ సెన్సార్లు

కళాశాల భవనం పైనుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

మైసూరు: తల్లిదండ్రులు మందలించడంతో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. మైసూరు నగరంలోని లష్కర్ మోహల్లాకు చెందిన మెహక్ (19) మృతుడు. వివరాలు.. మెహక్.. ఫారూకీ డెంటల్ కళాశాల ల్యాబ్‌లో టెక్నీషియన్ కోర్స్ చేస్తున్నాడు. పరీక్షల్లో తక్కువ మార్కులు రావడంతో కళాశాల లెక్చరర్లు మెహక్ కుటుంబ సభ్యులను పిలిపించి విషయం చెప్పారు. వారు మెహక్‌ను మందలించారు. దీంతో తీవ్ర ఆవేదనతో మెహక్ కళాశాల భవనం నాలుగో అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కబ్జా భూమి స్వాధీనం

మైసూరు: కబ్జాకు గురైన రూ. 15 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని జిల్లా పరిపాలన విభాగం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య సొంత జిల్లా వరుణ సమీపంలోని హారోహళ్లి గ్రామంలోని 10 ఎకరాల భూమిని కరిగౌడ, నారాయణగౌడ, చిక్కలింగయ్య, తిమ్మేగౌడ నకిలీ దాఖలాలతో భూమిని కబ్జా చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ కేవీ రాజేంద్ర ఆదేశాల మేరకు అధికారులు కబ్జా భూమిని స్వాధీనం చేసుకున్నారు.

వృద్ధురాలు దుర్మరణం



మైసూరు: ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా నంజనగూడు పట్టణంలోని బైపాస్ రోడ్డులో చోటుచేసుకుంది. మృతురాలిని మేదార వీధికి చెందిన పార్వతమ్మ (75)గా గుర్తించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

నేరాల నియంత్రణకు కొత్త చట్టాలు

మండ్య: నేరాల నియంత్రణకు కొత్త చట్టాలు అమలు చేస్తామని, ఇందులో శిక్షతో పాటు శిక్షాకాలం పెంచడం జరుగుతుందని సీనియర్ న్యాయమూర్తి ఆనంద్ అన్నారు. మండ్య నగరంలోని జిల్లా జైలులో వివిధ సంఘాల ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వచ్చే ఏడాది జనవరి నుంచి కొత్త చట్టాలు అమల్లోకి వస్తాయని చెప్పారు.

ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవిర్భావ వేడుకలు



గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్‌తో తెలంగాణ ప్రతినిధులు, (కింది ఫొటో) బతుకమ్మతో మహిళలు



బొమ్మనహళ్లి: బెంగళూరు నగరంలోని రాజ్‌భవన్‌లో తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో కర్ణాటక తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మలు తయారు చేసి రాజ్‌భవన్‌కు తీసుకువచ్చి బతుకమ్మ పాటలు పాడి సందడి చేశారు. రాజ్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్రంతో పాటు పది రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ థావర్‌చంద్ గ్లెహోట్ ఆయా రాష్ట్రాలకు చెందిన సంస్కృతి, సంప్రదాయాలకు చెందిన నృత్యాలను వీక్షించారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు రాజ్‌భవన్‌లో నిర్వహించడం, తెలంగాణ రాష్ట్రం పండగ అయిన బతుకమ్మ వేడుకలను ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రజల మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని కర్ణాటక తెలంగాణ కల్చరల్ అసోషియేషన్ సంఘం సభ్యురాలు రేవతి అన్నారు.

నోటు పుస్తకాల వితరణ



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ప్రముఖులు

బనశంకరి: విద్యతోనే జ్ఞానార్జన సాధ్యమని, పది మందికి సేవచేయడం దేవుడి సేవ అని సిద్ధగంగ మఠం సిద్ధలింగమహా స్వామీజీ తెలిపారు. శనివారం జయనగర చంద్రగుప్తమౌర్య క్రీడామైదానంలో రక్షా ఫౌండేషన్ 12వ వార్షిక నోటుపుస్తకాల వితరణ కార్యక్రమంలో సిద్ధలింగమహాస్వామీజీ వివిధ పాఠశాలలకు చెందిన 10 వేల మంది విద్యార్థులకు 2 లక్షల నోటు పుస్తకాలను వితరణ చేసి మాట్లాడారు. సమాజసేవా సంఘాలు సైతం విద్యారంగానికి సేవలు అందిస్తున్నాయని ముఖ్యంగా రక్షా ఫౌండేషన్ విద్యార్థుల కోసం నోటు పుస్తకాలు వితరణ చేయడం శ్లాఘనీయమన్నారు. విద్యార్థులు బాగా చదివి రాణించాలన్నారు. కన్నడ నటుడు కిచ్చసుదీప్ మాట్లాడుతూ.. పిల్లలు దేవుడితో సమానం, వీరితో కలిసి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమైన విషయమన్నారు. అనంతరం ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడుతూ.. విద్య విలువ అందరికీ తెలుసునని ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు రక్షా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు, ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమానం అందించి విద్యారంగానికి ఉత్తమసేవలు అందిస్తుందన్నారు. అనంతరం జయనగర ఎమ్మెల్యే సీకే.రామమూర్తి మాట్లాడుతూ... రక్షా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 12 ఏళ్లుగా నోటు పుస్తకాలను విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలో 90 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమానం, అనాథ ఆశ్రమానికి చెందిన ఇద్దరు విద్యార్థుల దత్తత, ప్రజలు సౌకర్యార్థం ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఉదయ్‌గరుడాచార్, సతీశ్‌రెడ్డి, మాజీ మేయర్ ఎస్‌కే.నటరాజ్, పాలికె మాజీ సభ్యులు పాల్గొన్నారు.

ఆదియోగి వేదికపై బృహత్ యోగా సాధన





ఆదియోగి విగ్రహం ఎదుట యోగా సాధన చేస్తున్న విద్యార్థులు, నటి శ్రీనిధి తదితరులు

చిక్కబళ్లాపురం: అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదియోగి బృహత్ విగ్రహం ఎదుట వెయ్యి మందికి పైగా యోగా శిక్షకులు యోగా సాధన చేశారు. ఎయిర్ కమాండర్ అరుణ్ కుమార్, నటి శ్రీనిధి శెట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు. చిక్కబళ్లాపురం నుంచి వివిధ కళాశాలల విద్యార్థులు, ఐదవ బెటాలియన్‌కు చెందిన బీఎస్ఎఫ్ జవానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమాండర్ అరుణ్ కుమార్, నటి శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ రోజు యోగా సాధన చేయాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందన్నారు.

హోసూరు వార్తలు..

అక్రమ మద్యం విక్రేతల అరెస్టు

కెలమంగలం: అంచెట్టి ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ శాంతి అధ్యక్షతన పోలీసులు అంచెట్టి- హొగేనక్కల్ రోడ్డులోని శేషరాజపురం, అట్టపల్లం తదితర గ్రామాల్లో సోదాలు చేసి మయ్యళగన్, కామరాజ్ అనే ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి 4 లీటర్ల మద్యాన్ని స్వాధీనపరుచుకొన్నారు. అలాగే అక్రమ మద్యం విక్రయిస్తూ పరారీలో ఉన్న మరో వ్యక్తి అంచెట్టికి చెందిన ప్రేమ్‌దాస్‌ను అరెస్ట్ చేశారు.

కల్తీ సారా మరణాలపై ధర్నా



అరెస్ట్ చేస్తున్న పోలీసులు

హోసూరు: తమిళనాడులోని కల్లకురిచ్చి జిల్లాలో కల్తీ సారా తాగి 52 మంది మృతి చెందగా మరో వంద మందికి పైగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుర్ఘటనను వ్యతిరేకిస్తూ హోసూరు పట్టణంలోని రామ్‌నగర్ అన్నావిగ్రహం వద్ద బీజేపీ నేతలు, కార్యకర్తలు ధర్నాకు సిద్ధమయ్యారు. డీఎస్పీ బాబుప్రశాంత్ వందకు పైగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన ప్రారంభించక ముందే అరెస్ట్ చేశారు. డీఎంకే ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే తీవ్ర ప్రాణనష్టం జరిగిందని నేతలు నినాదాలు చేశారు.

ప్రేమ పేరుతో మోసం.. యువతి ఆత్మహత్య

కెలమంగలం: ప్రేమించినట్లు నటించి యువతిని గర్భవతిని చేసి పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన డెంకణీకోట వద్ద జరిగింది. వివరాల మేరకు డెంకణీకోట తాలూకా సీర్తితిమ్మనట్టికి చెందిన యువతి (19), 8వ తరగతి వరకు చదువుకొని ఇంట్లోనే ఉంటూ వచ్చింది. ఆమెకు ఇటీవల అనారోగ్యంగా ఉండడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించారు. ఆమె గర్భంతో ఉన్నట్లు వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు ఆరా తీయగా అదే గ్రామానికి చెందిన రమేష్ కొడుకు సుమన్ (23), ప్రేమించాడని, కానీ పెళ్లి చేసుకోమంటే అంగీకరించడం లేదని తెలిపింది. ఈ నేపథ్యంలో ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. తల్లి ఫిర్యాదు మేరకు డెంకణీకోట మహిళా పోలీసులు కేసు నమోదు చేసి సుమన్‌ను అరెస్ట్ చేశారు.

ఫేస్‌బుక్ మెసేజ్ చూసి రూ. 5 లక్షల నష్టం

క్రిష్ణగిరి: పెట్టుబడికి అధిక లాభం పేరుతో రైతు వద్ద రూ. 5.22 లక్షలు కాజేసిన సైబర్ దొంగల ఉదంతమిది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా పోచ్చంపల్లి సమీపంలోని చిన్నఆగ్రహళ్లికి చెందిన రైతు వీరమణి (31), 20వ తేదీన ఫేస్‌బుక్ ఖాతాకు ఒక మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌లో పెట్టుబడి చేసిన కొద్ది రోజులకే రెండింతల డబ్బు అందజేస్తామని ఉంది, దీంతో ఆ లింక్ ద్వారా రూ. 5.22 లక్షల నగదును జమచేశాడు. నెల రోజులు గడిచినా లాభం, అసలు ఏదీ అందకపోవడంతో మోసపోయినట్లు తెలుసుకుని అతను క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆల్కహాల్ పరిశ్రమల్లో ఆకస్మిక తనిఖీలు



తనిఖీలు నిర్వహించడానికి వచ్చిన పోలీసులు

హోసూరు: హోసూరు పారిశ్రామిక ప్రాంతంలో మెంతాల్, ఆల్కహాల్ వినియోగిస్తున్న పరిశ్రమల్లో సిఫ్‌కాట్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. తమిళనాడులోని కల్లకురిచ్చి జిల్లాలో కల్తీ సారా తాగి 50 మందికి పైగా మృతి చెందిన ఘటనతో హోసూరు ప్రాంతంలో ఔషధాలు, మాత్రలు తయారు చేసే పరిశ్రమల్లో ఆల్కహాల్ వినియోగం, నాణ్యతపై తనిఖీలు చేపట్టారు. సిఫ్‌కాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ నేతృత్వంలో పోలీసులు మొదటి పారిశ్రామిక ప్రాంతం, పూనపల్లి సమీపంలోని ఓ పరిశ్రమల్లో తనిఖీలు చేసి వినియోగం, భద్రపరిచే విధానం, నాణ్యతను పరిశీలించారు.

సారా, గుట్కాలకు అడ్డుకట్ట వేయాలి

హోసూరు: క్రిష్ణగిరి జిల్లాలో నాటుసారా, అక్రమ మద్యం విక్రయాలు, గుట్కా విక్రయాలను సంపూర్ణంగా నిర్మూలించేందుకు పోలీసు, రెవెన్యూశాఖాధికార్లు చర్యలు చేపట్టాలని జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ శరయు సూచించారు. జిల్లా ఎస్పీ తంగదురై నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు నిఘా పెట్టి వీటికి అడ్డుకట్ట వేయాలని తెలిపారు.

హిజ్రాల వినతులు

కాగా, 120 మందికి పైగా హిజ్రాలు కలెక్టర్‌ను కలిశారు. ఓటర్ కార్డులు అందజేయాలని, ఆధార్ కార్డుల్లో పేర్ల మార్పుకు చర్యలు చేపట్టాలని, సంక్షేమ సంఘంలో కొత్తగా చేరే అభ్యర్థులకు గుర్తింపు కార్డులు అందజేయాలని, ఇళ్లపట్టాలు, పశుపోషణకు రుణసహాయం ఇవ్వాలని కోరారు.

ప్రత్యంగిరాదేవికి విశేష పూజలు



ఆలయంలో మిరపకాయల యాగం

హోసూరు: హోసూరు సమీపంలోని మోర్నపల్లి గ్రామంలో వెలసిన రాహు, కేతు, అధర్వణ ప్రత్యంగిరాదేవి ఆలయంలో శుక్రవారం రాత్రి పౌర్ణమి పూజలను నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి రాహు, కేతు సమేత శ్రీ అధర్వణ ప్రత్యంగిరాదేవి మూలవిరాట్‌లను అభిషేకించి విశేషంగా అలంకరించారు. రాత్రి మిరపకాయలతో యాగం చేపట్టారు. ఈ కార్యక్రమంలో హోసూరు, చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సోదరుడి ఇంట్లో పేలిన సిలిండర్

బనశంకరి: ఉత్తర కన్నడ జిల్లా కుమటా ఎమ్మెల్యే దినకరశెట్టి సోదరుడు మధుకర్‌శెటి ఇంట్లో శనివారం గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. ప్రమాదంలో మధుకర్‌శెట్టి భార్య లత గాయపడింది. కుమటానగర కొప్పళకరవాడి వార్డులోని ఉంటున్న మధుకర్‌శెట్టి నివాసంలో వంట సిబ్బంది వంటకు సిద్ధం చేస్తుండగా గ్యాస్ లీక్ కావడం గమనించిన వారు బయటికి వచ్చేశారు. కొద్దిసేపటి సిలిండర్ పేలిపోయింది. మధుకర్‌శెట్టి భార్య లతకు స్వల్పంగా గాయాలయ్యాయి. టీవీతో పాటు లక్షలాది రూపాయలు విలువచేసే వస్తువులు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

కవయిత్రి కమలా కన్నుమూత





కమలా(ఫైల్)

కమలా హంపనా పార్థివ దేహం వద్ద విషణ్ణ వదనంలో కుటుంబ సభ్యులు

గౌరిబిదనూరు: తాలూకా హంపసంద్ర గ్రామానికి చెందిన ప్రసిద్ధ కవి హంపనాగరాజయ్య భార్య కమలా హంపన (89) శుక్రవారం రాత్రి బెంగళూరులోని డాలర్స్ కాలనీలో తమ కుమార్తె ఇంటిలో మృతి చెందారు. వయోభారంతో వచ్చిన అనారోగ్య సమస్యలతో ఆమె బాధపడుతున్నారు. కమలా హంపనా మైసూరు విశ్వవిద్యాలయంలో పీజీ, పీహెచ్‌డీ చేశారు. హంపసంద్ర గ్రామానికి చెందిన జైన వర్గానికి చెందిన హంప నాగరాజయ్యను వివాహం చేసుకొన్నారు. దంపతులిద్దరూ జైన సాహిత్యంపై పరిశోధనలు చేశారు. ఈమె అనేక కృతులను రచించారు. వివిధ బిరుదులను పొందారు. 71వ కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షులుగా పనిచేశారు. 60 సంవత్సరాల పాటు సాహిత్య రంగానికి ఎనలేని సేవలందించారు. ఆమె కోరిక మేరకు ఆమె మృతదేహాన్ని ఎంఎస్ రామయ్య వైద్య కళాశాలకు దానం చేశారు.

క్లుప్తంగా...

అసెంబ్లీ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు

▶ మొదటి పేజీ తరువాయి
వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు)లతో ప్రొటెం స్పీకర్ బుచ్చయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కొద్దిసేపు సభను వాయిదా వేసి, తిరిగి సమావేశమయ్యాక స్పీకర్ ఎన్నికపై ప్రకటన వెలువరించారు. అదే విధంగా సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ అయ్యన్న ప్రకటించారు. రెండ్రోజులపాటు నిర్వహించిన ఈ సభలో సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారాలతో పాటు, స్పీకర్‌ను ఎన్నుకున్నారు.

మా అనుమతితోనే రోడ్డు వేయాలి

టీడీపీ నేతల దౌర్జన్యం


నిలిచిపోయిన చిన్నబిడికి రోడ్డు పనులు

సంబేపల్లి: అన్నమయ్య జిల్లాలో టీడీపీ నేతలు రెచ్చిపోయారు. తాము, తమ నాయకుడు మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి అనుమతి లేకుండా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టకూడదని దౌర్జన్యానికి దిగారు. ఈ మేరకు సంబేపల్లె మండలంలో టీడీపీ నాయకులు రోడ్డు మరమ్మతు పనులను అడ్డుకున్న విషయం వెలుగుచూసింది. సంబేపల్లె మండల పరిధిలోని చిత్తూరు– కర్నూలు జాతీయ రహదారి నుంచి చిన్నబిడికి వరకు చేపడుతున్న బీటీ రోడ్డు అభివృద్ధి పనులు చేయరాదంటూ టీడీపీ నేతలు పనులను నిలిపివేశారు. సంబేపల్లె మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈ రోడ్డు మరమ్మతు టెండర్‌ను దక్కించుకున్నారు. పనులకు మార్చిలో ఒప్పందం చేసుకున్నారు. పనులు ప్రారంభించే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిపేశారు. తిరిగి ఇటీవల కోడ్ తొలగించడంతో అధికారుల అనుమతితో శుక్రవారం పనులు ప్రారంభించారు. దీన్ని ఓర్వలేని కొంతమంది టీడీపీ నాయకులు పనులను చేయకుండా అడ్డుకున్నారు. రోడ్డు పనులు చేస్తున్న ఇటాచి వాహనాన్ని కూడా పోలీసుల సహాయంతో స్టేషన్‌కు తరలించి తమ అధికార దర్పాన్ని ప్రదర్శించారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత రోడ్డు మరమ్మతు పనులు చేస్తుంటే అడ్డుకోవడం చాలా బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

జగనన్న కాలనీకి తాగునీరు బంద్


తాగునీటిని విడిచి పెట్టకుండా కుళాయికి వేసిన సీల్

ఇచ్ఛాపురం రూరల్: శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం మశాఖపురంలో జగనన్న కాలనీకి పునాది రాయి వేసినప్పటి నుంచి ఇంటి నిర్మాణాలను అడ్డుకునేందుకు స్థానిక టీడీపీ నాయకులు ప్రయత్నించి విఫలమయ్యారు. కాలనీలో మౌలిక సదుపాయాల కోసం, నిర్మాణాల కోసం పంచాయతీ నిధుల నుంచి బోరు వేసినప్పటికీ కొంతకాలం నీటిని ఇవ్వకుండా అడ్డుకోగా.. కేసులు పెడతామని అప్పటి ఆర్డీఓ హెచ్చరించడంతో వెనుకంజ వేశారు. కాగా.. సర్పంచ్ ఆశి తులసమ్మ కుమారుడు, టీడీపీ నాయకుడు ఆశి మాధవరావురెడ్డి రెండు రోజుల నుంచి తమకు తాగునీరు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని జగనన్న కాలనీ వాసులు లక్కోజీ లక్ష్మీ, బుడుపు సోనియా ఎంపీడీఓ వైవీ రాజేంద్రప్రసాద్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. తాము వైఎస్సార్‌సీపీ మద్దతుదారులమంటూ తమకు మంచినీరు ఇవ్వకుండా కుళాయి కనెక్షన్ తొలగించి కక్ష సాధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ స్పందించి వెంటనే కాలనీ వాసులకు మంచినీరివ్వాలని పంచాయతీ కార్యదర్శి గఫూర్‌ను ఆదేశించారు.

కరుడుగట్టిన పసుపు యోధుడు

కొత్తగా ఎన్నికైన స్పీకర్‌ను ప్రశంసించిన సీఎం చంద్రబాబు

అల్లరి పిల్లాడిని క్లాస్ లీడర్‌ను చేసినట్లుంది: డిప్యూటీ సీఎం పవన్

సాక్షి, అమరావతి: చింతకాయల అయ్యన్నపాత్రుడు కరుడు గట్టిన పసుపు యోధుడు, ఫైర్‌బ్రాండ్ అని సీఎం చంద్రబాబునాయుడు ప్రశంసించారు. ఆయన నేతృత్వంలో రాజ్యాంగ స్ఫూర్తి, ప్రజాస్వామ్యాన్ని కాపాడేలా శాసనసభ హుందాగా నడుస్తుందని నమ్ముతున్నానన్నారు. అసెంబ్లీ స్పీకర్‌గా శనివారం ఏకగ్రీవంగా ఎన్నికైన అయ్యన్నపాత్రుడును సీఎం అభినందించారు. ఈ సందర్భంగా సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమకు ఘన విజయం అందించడంతో పాటు పెద్ద బాధ్యత అప్పగించారన్నారు. ప్రత్యర్థి పార్టీలకు చెందిన శాసనసభ సభ్యులను ఎగతాళి చేసి అవమానపరచకూడదని సభలోని సభ్యులకు సూచించారు. అయ్యన్నను స్పీకర్ పదవిలో చూడటం గర్వంగా ఉందన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని మాజీ సీఎం ఎన్టీఆర్ ఇచ్చిన పిలుపుతో వచ్చిన అయ్యన్న ఏడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, మంత్రిగా తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక ముద్రవేశారన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధతను ఆయన పుణికిపుచ్చుకున్నారని ప్రశంసించారు.

సీఎంగానే సభలో అడుగుపెట్టా..

సీఎంగానే తిరిగి అసెంబ్లీలో అడుగుపెడతానని 2021 నవంబర్ 19న సభ నుంచి బయటకువెళ్లానని, ప్రజల ఆశీస్సులతో మళ్లీ సీఎంగానే సభలోకి అడుగుపెట్టానని చంద్రబాబు తెలిపారు. తనకు వచ్చిన అవకాశాలు తెలుగు రాష్ట్రాల్లో ఎవరికీ రాలేదన్నారు. 16వ సభను అత్యున్నత సభగా మనం నిర్వహించాలన్నారు. 25 ఏళ్ల కిందట తీసుకున్న నిర్ణయాల ప్రభావంతోనే నేడు హైదరాబాద్ ఉత్తమ నగరంగా నిలిచిందన్నారు. రాజధాని నిర్మాణం, పోలవరం పూర్తిచేయడంతో పాటు, వికసిత్, పేదరికంలేని ఏపీని తీర్చిదిద్దడానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇందులో భాగంగా 2047 నాటికి రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచేలా చట్టసభ ముందుకు సాగాలన్నారు.


స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో సీఎం చంద్రబాబు, అచ్చెన్న, పవన్, బుచ్చయ్య చౌదరి, సత్యకుమార్

ప్రజలు హుందాతనం చూస్తారు

ఇన్ని రోజులు ప్రజలు అయ్యన్నలోని వాడివేడి చూశారని, ఇక మీదట హుందాతనం చూడబోతున్నారని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. ఇకపై తిట్టే అవకాశం ఆయనకులేదని, సభలో తిట్టే వారిని నిలువరించే బాధ్యత ఉందన్నారు. అయ్యన్నను స్పీకర్ చేయడం చూస్తుంటే అల్లరి పిల్లాడిని క్లాస్ లీడర్‌ను చేసినట్లుందన్నారు. గత ప్రభుత్వం అనేక కేసులు పెట్టినప్పటికీ అయ్యన్నపాత్రుడు భయపడలేదని మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్ తెలిపారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆయన ప్రజలకు ఎన్నో సేవలు చేశారని వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు.

హుందాగా మాట్లాడాలి..

శాసనసభలో సభ్యులు హుందాతనంగా మాట్లాడాలి. ప్రస్తుత సభలో 88 మంది ఎమ్మెల్యేలు తొలిసారిగా ఎన్నికయ్యారు. వీరందరికీ అవకాశాలిస్తాను. ప్రజలు, రాష్ట్రం కోసం అందరూ మాట్లాడాలి. కొత్తగా ఎన్నికైన వారందరికీ సభ సంప్రదాయాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తాం. ప్రజలెంతో నమ్మకంతో బాధ్యత ఇచ్చారు. సభ్యులందరూ ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

– చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసనసభ స్పీకర్

హుందాగా నడపాలంటూనే జగన్‌పై అనవసర విమర్శలు..

గత శాసనసభను కౌరవ సభతో పోలుస్తూ.. ప్రస్తుత సభను హుందాగా నడపాలంటూ సీఎం చంద్రబాబు ప్రసంగం ముగిసిన వెంటనే మంత్రులు అనిత, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఫరూక్, నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర సహా ఇతర సభ్యుల ప్రసంగాలన్నీ మాజీ సీఎం జగన్ నామస్మరణతోనే కొనసాగాయి. పదేపదే ఆయన పేరును ప్రస్తావిస్తూ విమర్శించారు. నీతి వాక్యాలు వల్లెవేసిన అధికార పక్ష నాయకులే సభా సంప్రదాయాలకు విరుద్ధంగా సభలోలేని ప్రతిపక్ష నేత పేరును పదేపదే ప్రస్తావిస్తూ అర్థరహిత విమర్శలు చేశారు. టీడీపీ–జనసేన–బీజేపీ నాయకులు ఒకరిని మించి మరొకరు పోటీపడుతూ స్పీకర్‌కు అభినందనలు చెప్పడం కంటే జగన్‌ను తూలనాడటంపైనే ఎక్కువగా దృష్టిసారించారు. అంతకుముందు.. సభను దూషణలు, వెకిలి చేష్టలతో కాకుండా గౌరవంగా నిర్వహించాలని కోరిన చంద్రబాబే.. ప్రతిపక్ష పార్టీ సభ్యులు పిరికితనంతో సభకు రాలేదని వ్యాఖ్యానించడం విశేషం. పవన్ కళ్యాణ్ సైతం ప్రతిపక్ష సభ్యులకు సభకు వచ్చే ధైర్యం లేదని విమర్శించారు. విజయాన్ని తీసుకున్నారుగాని, ఓటమిని తీసుకోలేక పారిపోయారని ఎద్దేవా చేశారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడి ప్రహరీ కూల్చివేత


నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

కనిగిరి రూరల్: టీడీపీ నేతల ఒత్తిడితో ప్రకాశం జిల్లా కనిగిరిలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు శనివారం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడి ప్రహరీని కూల్చివేశారు. కనీసం ముందస్తు సమాచారం, నోటీసులు కానీ ఇవ్వలేదు. గ్రామస్తుల ఫిర్యాదుతో ప్రభుత్వ భూమిలో ఉన్న ఆక్రమణలను తొలగించామని అధికారులు చెబుతున్నా.. దీనికి అధికార పార్టీ నేతల ఒత్తిడే అసలు కారణమని తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. ప్రకాశం జిల్లా కనిగిరి పట్టణంలోని మాచవరం రోడ్డులో సర్వే నంబర్ 634లో బండారు వెంకటేశ్వర్లుకు చెందిన సాగు భూమి ఉంది. ఇందులో 2.18 ఎకరాలకు ఆర్డీవో, తహసీల్దార్ మంజూరు చేసిన పాస్ పుస్తకాలు, క్లియరెన్స్ పత్రాలు అన్నీ ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా ఆ భూమి వెంకటేశ్వర్లు ఆధీనంలోనే ఉంది. దీంతో అ భూమిలో ఆయన తాత్కాలిక ప్రహరీ కట్టుకున్నారు. అయితే అది ప్రభుత్వ భూమి అని ఆరోపిస్తూ ఆర్డీవో పి.జాన్ ఇర్విన్, మున్సిపల్ కమిషనర్ డీవీ రంగారావు పొక్లెయిన్‌తో శనివారం గోడను కూలగొట్టించారు. ఈ క్రమంలో బాధితుడు, కొందరు స్థానికులు అధికారులను అడ్డుకుని ఆందోళన చేశారు. అయినా అధికారులు ఆగకుండా ప్రహరీని పడేశారు. వాస్తవానికి ఆ సర్వే నంబర్ పక్కనే మరో 11 ఎకరాల భూమి ఉంది. అందులో మరికొందరు కట్టడాలు కట్టుకుని ఉన్నారు. వాటిని వదిలేసిన అధికారులు కేవలం తాను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడిననే కారణంతో ప్రహరీని పడగొట్టారని వెంకటేశ్వర్లు ఆరోపించాడు. అధికారుల చర్యతో తనకు సుమారు రూ.10 లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని వాపోయాడు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, సంబంధిత అధికారులపై ప్రైవేట్ కేసులు పెడతానని వెల్లడించాడు.

హోంమంత్రి పర్యటనలో అపశ్రుతి

తిరుపతి క్రైమ్: తిరుమలకు వెళుతున్న రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితకు స్వాగతం పలికేందుకు వచ్చిన బీజేపీ నాయకుడిని కాన్వాయ్‌లోని వాహనం ఢీకొంది. తిరుపతి అలిపిరి గరుడ సర్కిల్ వద్ద శనివారం రాత్రి తిరుపతి నార్త్ మండలం బీజేపీ నాయకుడు ప్రభాకర్ నాయుడు హోం మంత్రికి స్వాగతం పలికేందుకు వేచి ఉన్నారు. వెనుక నుంచి మంత్రి కాన్వాయ్‌లోని వాహనం అతన్ని బలంగా ఢీకొంది. దీంతో ప్రభాకర్ నాయుడు కాలు ఫ్రాక్చర్ అయ్యింది. ఆయన రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఫిలింనగర్‌లో వైఎస్సార్ పేరు తొలగింపు

- విశాఖలో అద్దాలను ధ్వంసం చేసిన టీడీపీ నాయకులు
- ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌ను చేస్తామన్న ఎమ్మెల్యే గంటా

కొమ్మాది: వైజాగ్ ఫిలింనగర్ క్లబ్ సెంటర్‌లో గతంలో ఏర్పాటు చేసిన 'వైఎస్సార్ లాన్స్' పేరును శనివారం సాయంత్రం టీడీపీ నాయకులు తొలగించారు. భవనం అద్దాలను ధ్వంసం చేశారు. త్వరలో దీని పేరు మార్పు చేసి కొత్త బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. ప్రశాంతతకు మారుపేరైన విశాఖలో వైఎస్సార్ పేరును తొలగించడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమానులు తీవ్రంగా ఖండించారు.

కల్చరల్ సెంటర్‌ను ప్రక్షాళన చేస్తాం

భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలో గల వైజాగ్ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో అనర్హులు కూడా సభ్యత్వం తీసుకున్నారని.. వాటిని పరిశీలించి పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ అన్నారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో ఈ ఫిలింనగర్ క్లబ్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. సినిమాకు సంబంధం లేని వారిని కూడా ఈ క్లబ్‌లో సభ్యులుగా చేర్చారన్నారు. ప్రారంభంలో 1,150 మంది సభ్యులుగా ఉండగా.. ఆ తరువాత 1,630 మందికి చేరిందని తెలిపారు. సుమారు రూ.32 కోట్ల మెంబర్‌షిప్ నిధులు ఏమయ్యాయో బయటకు తీస్తామన్నారు. విశాఖలో సినిమా పరిశ్రమ అభివృద్ధి చేస్తామని గతంలో తొట్లకొండపై ఫిలిం క్లబ్ కోసం 15 ఎకరాలు కేటాయించామని, దానిపై బౌద్ధ భిక్షువులు అభ్యంతరం తెలపడంతో రామానాయుడు స్టూడియో ఆనుకుని 5 ఎకరాలు కేటాయించామని తెలిపారు. విశాఖను సినీ హబ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. గత ప్రభుత్వంలో రాడిసన్ హోటల్‌లో 15 శాతం, బేపార్క్‌లో వాటాలు కాజేశారని ఆరోపించారు. సినీ నిర్మాత కేఎస్ రామారావు మాట్లాడుతూ ఇక్కడ ఫిల్మ్ క్లబ్ సెంటర్‌ను తానే ఏర్పాటు చేశానని.. కొన్ని అనివార్య కారణాల వల్ల తప్పుకున్నానని తెలిపారు. ఈ సినిమా క్లబ్‌లో సినిమాలకు సంబంధించిన వారు కాకుండా వేరేవారు ఉండటంతో క్లబ్ అభివృద్ధి చెందలేదన్నారు. మీడియా సమావేశంలో నటుడు, నిర్మాత అశోక్ కుమార్ పాల్గొన్నారు.


వైఎస్సార్ పేరును తొలగిస్తున్న సభ్యులు

ఎక్కువగా మాట్లాడితే నాలుక చీరేస్తాం

- నంద్యాల ప్రథమ పౌరురాలిపై టీడీపీ నేతల దాష్టీకం
- మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నీసాపై దాడికి యత్నం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

నంద్యాల (సిటీ): అధికారమే అండగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోతున్నారు. పోలీసులు కూడా వారికే వత్తాసు పలుకుతుండటంతో కన్నూమిన్నూ కానకుండా బరితెగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్నారు. శనివారం నంద్యాల 29వ వార్డు సచివాలయానికి వెళ్లిన పట్టణ ప్రథమ పౌరురాలు, మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నీసాతో టీడీపీ నాయకులు అనుచితంగా ప్రవర్తించారు. మహిళ అని చూడకుండా దుర్భాషలాడారు. 'ఎక్కువగా మాట్లాడితే నాలుక చీరేస్తాం' అంటూ బెదిరింపులకు దిగారు. మాబున్నీసా 29వ వార్డు కౌన్సిలర్ కావడం గమనార్హం. ఆమె తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులో పర్యటిస్తుండటాన్ని తట్టుకోలేని టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ మంజుల సుబ్బారాయుడు, ఆ పార్టీ కార్యకర్తలు శివశంకర్ యాదవ్, అమ్మన్ని, జయకృష్ణ, రామకృష్ణ, తిమ్మయ్య, జనసేన నేత రవి తదితరులు పరుష పదజాలంతో దాడికి యత్నించారు. 'మీ ప్రభుత్వం లేదు.. మీ ఎమ్మెల్యే లేదు.. ఇప్పుడంతా మా ప్రభుత్వమే.. కాబట్టి మేం చెప్పినట్లు వినాలి' అంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసాను బెదిరించారు. అనంతరం ఈలలు, కేకలతో సచివాలయంలో గందరగోళం సృష్టించారు. అంతే కాకుండా మాజీ సీఎం వైఎస్ జగన్ చిత్రపటంతో కూడిన పథకాలకు సంబంధించిన ఫొటోలకు అప్పటికప్పుడు పసుపు రంగులను వేయించారు. అంతటితో ఆగకుండా 'నువ్వు బాడుగకు ఉన్నది మా బంధువుల ఇంట్లో.. నిన్ను ఇంట్లో ఉండకుండా ఇప్పుడే ఖాళీ చేయిస్తా.. నీ దిక్కు ఉన్న చోట చెప్పుకో' అంటూ సుబ్బారాయుడు ఆమెను బెదిరించారు. దీంతో కన్నీటిపర్యంతమైన చైర్‌పర్సన్ మాబున్నీసా నంద్యాల మూడో పట్టణ పోలీసులను ఆశ్రయించగా వారు ఆమె ఫిర్యాదును పట్టించుకోలేదు. పైగా టీడీపీ కార్యకర్తలు ఆమెపై ఎదురు తప్పుడు కేసులు పెట్టారు.


కన్నీటిపర్యంతమైన మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నీసా

ఎంపీ శ్రీభరత్‌ను రాళ్లతో కొట్టండి

ఉత్తరాంధ్ర ప్రజలకు జనజాగరణ సమితి పిలుపు


వాసు

సీతమ్మధార (విశాఖ ఉత్తర): విశాఖ ఎంపీగా గెలిపిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటామని హామీ ఇచ్చిన టీడీపీ ఎంపీ శ్రీభరత్.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ఆస్తులను అడ్డగోలుగా అమ్మేస్తుంటే నోరు ఎందుకు మెదపడం లేదని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు ప్రశ్నించారు. మాట తప్పిన శ్రీభరత్ ఎక్కడ కనబడితే అక్కడే రాళ్లతో కొట్టండి, అప్పుడు వెంటనే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియ ఆగిపోతుందని సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ క్రియాశీలక భాగస్వామి అయినా కూడా అధికారంలోకి వచ్చిన రెండు వారాల్లోనే బీజేపీ రూ. 475 కోట్ల విశాఖ ఉక్కు ఆస్తులు అమ్మకానికి రంగం సిద్ధం చేసిందని ఆ ప్రకటనలో తెలిపారు. విశాఖ ఎంపీ, శ్రీభరత్ స్వయానా నారా లోకేశ్‌కు తోడల్లుడు గనుక అతడిని రాళ్లతో కొడితే ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోరని పేర్కొన్నారు. కేంద్రంలో టీడీపీ ఎంపీలు మద్దతు లేకుండా ప్రభుత్వాన్ని నడిపే అవకాశం లేదని, అప్పుడు చచ్చినట్లు బీజేపీ విశాఖ స్టీల్‌ప్లాంట్ జోలికి వెళ్లదని తెలిపారు.

జగన్ సీఎం కాలేదనే వేదనతో ఇద్దరు మృతి


బచ్చు కనకారావు, రవి(ఫైల్)

పమిడిముక్కల(పామర్రు)/చంద్రాల(మైలవరం): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కాలేదని తీవ్ర మనోవేదనకు గురైన వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు ఆటో డ్రైవర్లు మరణించారు. కృష్ణాజిల్లా పమిడిముక్కల మండలం రెడ్డిపాలేనికి చెందిన బచ్చు కనకారావు(38) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వైఎస్ జగన్‌కు వీరాభిమాని అయిన కనకారావు వైఎస్సార్‌సీపీ గృహసారథిగా కొనసాగుతున్నాడు. ఎన్నికల ఫలితాలు వచ్చిన నాటినుంచి తమ పార్టీ ఓడిపోయిందని బాధపడుతున్న కనకారావు ఆత్మహత్య చేసుకునేందుకు శుక్రవారం గ్రామ సమీపంలోని అక్కమ్మ చెరువులో దూకాడు. గ్రామస్తులు గుర్తించి అతడిని బయటకు తీసి ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కనకారావుకు తల్లి ఆదమ్మ, భార్య లక్ష్మీకాంతం, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కనకారావు కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు యేనుగ వెంకట రమణకుమారి, మేరుగ లక్ష్మి, పార్టీ నాయకులు కంభపు రాంబాబు పరామర్శించారు. అదేవిధంగా ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం చంద్రాలకు చెందిన ఆటో డ్రైవర్ నల్లమోతు రవి(54) అనే అభిమాని కూడా వైఎస్ జగన్ రెండోసారి సీఎం కాలేదనే ఆవేదనతో గుండెపోటుకు గురై మృతిచెందాడు. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి రవి ఇంటి వద్దే ఉంటూ బాధపడుతున్నాడని, మూడు రోజులుగా ఆహారం తీసుకోవడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు శుక్రవారం రాత్రి గుండెపోటు రాగా, ఆస్పత్రికి తీసుకువెళ్లామని, కొద్దిసేపటి తర్వాత మృతిచెందాడని పేర్కొన్నారు. మృతుడు రవికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

టీడీపీ నాయకుడి బరితెగింపు

- తన ఇంటికి అడ్డుగా ఉందని పంచాయతీ పంపు షెడ్డు కూల్చివేత

కొడవలూరు: అధికారం తెచ్చిన అహంకారంతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో టీడీపీ నేత ఒకరు రెచ్చిపోయాడు. అతడి ఇంటి వాస్తుకు అడ్డుగా ఉందన్న నెపంతో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన పంచాయతీ పంపు షెడ్డు, మీటరు, స్విచ్ బోర్డులను ధ్వంసం చేశాడు. దీంతో రెండు గ్రామాలకు తాగు నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ ఘటన కొడవలూరు మండలం దామేగుంట మజరా గమ్మళ్లపాళెంలో శనివారం జరిగింది. గ్రామంలో రోడ్డు పక్కన ప్రభుత్వ స్థలంలో 1994లో గమ్మళ్లపాళెం, కొండాయపాళెం గ్రామాల తాగునీటి సరఫరాకు పంపు షెడ్ నిర్మించారు. దానికి పక్కనే ప్రభుత్వ స్థలంలోనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఆ పంపు షెడ్డుకు సంబంధించిన మీటరు, స్విచ్ బోర్డు ఏర్పాటు చేశారు. 30 ఏళ్లుగా ఈ పంపు షెడ్డు ఇలాగే ఉంది. అయితే ఈ షెడ్ వెనుక భాగాన టీడీపీ నాయకుడు మడపర్తి రాజగోపాల్ నివాసం ఉంది. అతడికి ఇన్నేళ్లు లేని వాస్తు దోషం ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పుట్టుకొచ్చింది. ఆ షెడ్డు తన ఇంటి వాస్తుకు ప్రతిబంధకంగా ఉందన్న నెపంతో శనివారం వేకువజామున జేసీబీతో షెడ్డును పూర్తిగా కూల్చివేయడంతో పాటు మీటరు, స్విచ్ బోర్డులను సైతం ధ్వంసం చేశాడు. దీంతో రెండు గ్రామాలకు తాగు నీటి సరఫరా నిలిచిపోయింది. ఇదేంటని అడిగితే ఏం చేస్తారో చేస్కోండంటూ సమాధానం చెప్పడం టీడీపీ నేత దాష్టీకానికి అద్దం పడుతోంది. ఈ మేరకు గ్రామ సర్పంచ్ హరిత.. మడపర్తి రాజగోపాల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.


30 ఏళ్ల క్రితం నిర్మించిన పంపు షెడ్డు ధ్వంసమైన అనంతరం..

వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ కట్టెలతో దాడి

తలకు తీవ్ర గాయాలు


కిరణ్‌మోహన్‌రెడ్డి

ధర్మవరం: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బ మండలం మంగళమడకలో శనివారం టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ నేత కిరణ్‌మోహన్‌రెడ్డిపై కట్టెలతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ ఘటనలో బాధితుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. మంగళమడకకు చెందిన సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బయపరెడ్డి గ్రామ ప్రాథమిక పాఠశాలలో పాడైపోయిన నేమ్ బోర్డు స్థానంలో కొత్తది ఏర్పాటు చేస్తున్నారు. ఇది నచ్చని స్థానిక టీడీపీ నేతలు బోర్డు పెట్టొద్దని బయపరెడ్డితో వాగ్వాదానికి దిగారు. ఇదే సమయంలో బయపరెడ్డికి సమీప బంధువు, గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత అయిన కిరణ్‌మోహన్‌రెడ్డి తోట నుంచి అటువైపు వచ్చారు. దీంతో టీడీపీ నేతలు ఉన్నఫళంగా కట్టెలతో ఆయనపై దాడికి దిగారు. దీంతో కిరణ్‌మోహన్‌రెడ్డి తలకు తీవ్ర గాయమైంది. గ్రామస్తులు ఆయన్ను కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టీడీపీ నేతలు గంగాద్రి, అజయ్, కుమార్, కిష్టప్ప, రాజన్న, చెన్నకేశవులు, రంగయ్య, రాజగోపాల్, ప్రశాంత్ తనపై దాడి చేసినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కిరణ్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

కొనసాగిన శిలాఫలకాల ధ్వంసం


తెనాలి 5వ వార్డులో ధ్వంసమైన శిలాఫలకం


ప్రకాశం జిల్లాలో వైఎస్సార్ విగ్రహం చేయి విరగ్గొట్టిన దుండగులు


భీమవరం టూటౌన్‌లో జనసేన, టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన సీసీ రోడ్ల శిలాఫలకం

- రెచ్చిపోయిన టీడీపీ శ్రేణులు
- భీమవరంలో శిలాఫలకాల విధ్వంసం
- ప్రకాశంలో జిల్లాలో వైఎస్సార్ విగ్రహంపై దాష్టీకం

తెనాలి అర్బన్/భీమవరం (ప్రకాశం చౌక్)/నాగులుప్పలపాడు: అధికార మదంతో టీడీపీ నేతలు, కార్యకర్తలు రెచ్చిపోతున్నారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో శనివారం యథేచ్ఛగా గత ప్రభుత్వంలో ఏర్పాటైన అభివృద్ధి శిలాఫలకాలను ధ్వంసం చేశారు. అలాగే దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహాన్ని పగులకొట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు జిల్లా తెనాలి 13వ వార్డులో రూ.20 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా నాడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దాన్ని తాజాగా టీడీపీ కార్యకర్తలు పగులకొట్టారు. అలాగే ఐదో వార్డులో కౌన్సిలర్ తోట రఘురామ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు.

భీమవరంలో టీడీపీ, జనసేన కార్యకర్తల విధ్వంసం..

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో శిలాఫలకాలను జనసేన, టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నాటి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ భీమవరం టూటౌన్‌లో కోట్ల రూపాయలతో సీసీ రోడ్లను నిర్మించి వినియోగంలోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను జనసేన, టీడీపీకి చెందిన అల్లరి మూకలు ధ్వంసం చేశాయి. ప్రశాంతమైన భీమవరంలో ఈ దుశ్చర్య దారుణమని స్థానికులు మండిపడ్డారు.

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం చవటపాలెంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలోని నడిరోడ్డులో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహాన్ని పడగొట్టేందుకు ప్రయత్నించారు. పెద్ద బండరాయితో తొలుత మెడ భాగంలో పగలగొట్టి తల భాగం తీసేయాలని ప్రయత్నించారు. అయితే వీలుకాకపోవడంతో ఎడమ చేతిని బండరాయితో బలంగా కొట్టడంతో ఆ భాగం పూర్తిగా విరిగిపోయింది. వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఫిర్యాదు మేరకు నాగులుప్పలపాడు ఎస్సై బ్రహ్మనాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ ఇంటిపై రాళ్ల దాడి


చేపలుప్పాడలో టీడీపీ నేతల దాడిలో పగిలిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ ఇంటి అద్దాలు

కొమ్మాది (విశాఖ): గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) 4వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ఇంటిపై రాళ్ల దాడి జరిగింది. ఈ ఘటనలో ఆయన ఇంటి అద్దాలు పగిలిపోయాయి. చేపలుప్పాడలో కొండబాబు నివాసం ఉంటున్నారు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆయన ఇంటిపై రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో ఇంటి ఎలివేషన్ అద్దాలు పగిలిపోయాయి. రాత్రి పెద్ద శబ్దాలు రావడంతో బయటకు వచ్చి చూశానని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ కొండబాబు తెలిపారు. అదే సమయంలో కరెంటు లేకపోవడంతో ఎవరు దాడి చేశారో కనబడలేదన్నారు. వెంటనే భీమిలి పోలీసులకు సమాచారమివ్వగా ఇద్దరు కానిస్టేబుళ్లు ఘటనా స్థలానికి వచ్చారని, వారిని చూసి గుర్తు తెలియని వ్యక్తులు పరారైనట్లు తెలిపారు. శనివారం భీమిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఈ దాడులను మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, అవంతి శ్రీనివాసరావు ఖండించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు అండగా ఉంటామని తెలిపారు. దాడులు చేసినవారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తాడిపత్రిలో టీడీపీ నాయకుల బరితెగింపు

తాడిపత్రి టౌన్: అనంతపురం జిల్లాలో టీడీపీ నేతల అరాచకాలకు అంతూపొంతూ ఉండటం లేదు. శనివారం తాడిపత్రి మండలం సజ్జలదిన్నెలో టీడీపీ నేతలు విధ్వంసం సృష్టించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు అనుచరుడు వేణుగోపాల్‌రెడ్డికి చెందిన నాపరాళ్ల ఫ్యాక్టరీలో బండలను ధ్వంసం చేశారు. దాదాపు 20 చదరాల బండలు ధ్వంసం అయినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే గ్రామానికి చెందిన టీడీపీ వారే ధ్వంసం చేసి ఉంటారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అలాగే తాడిపత్రి మండలం గంగాదేవిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రవీంద్రారెడ్డి తన రెండెకరాల పొలంలో నెల క్రితం సాగు చేసిన పత్తి పంటను టీడీపీ వర్గీయులు శనివారం దున్నేసి నాశనం చేశారు. అదే గ్రామానికి చెందిన ఆలూరు రామాంజులరెడ్డి, జూటూరు రామాంజులరెడ్డి ట్రాక్టర్‌తో తన పంటను దున్నేసినట్లు బాధితుడు వాపోయాడు. దాదాపు రూ.30 వేలు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా వారు స్వీకరించలేదు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
ఆదివారం ॥ 23-6-2024





ఈ స్పైడర్ మ్యానుడు చపాతీలు కూడా చేస్తాడు

స్పైడర్ మ్యాన్ అంటే... పది అంతస్తుల బిల్డింగ్ నుంచి అవలీలగా జంప్ చేసేవాడు. అగ్నిగుండంలో హాయిగా మార్నింగ్ వాక్ చేసేవాడు... టోటల్‌గా చెప్పుకోవాలంటే 'స్పైడర్ మాన్' అంటే సాహసాల సాగరం.

'స్పైడర్ మ్యాన్ అంటే అస్తమానం సాహసాలేనా? ఇలా కూడా' అని ఒక జైపూర్ యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో వైరల్ అయింది.

13 మిలియన్‌లకు పైగా వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

'ఇంతకీ అతడు ఏంచేశాడు?' అనే విషయానికి వస్తే....

స్పైడర్‌మ్యాన్ డ్రెస్ వేసుకొని చపాతీలు చేశాడు. ఇల్లు శుభ్రంగా ఊడ్చాడు. గిన్నెలు శుభ్రం చేశాడు. ఎండలో తల మీద ఇటుకలు మోశాడు.

'అసలు సిసలు సాహసాలంటే ఇవే' అన్నారు నెటిజనులు.

'గ్రేట్ పవర్ కమ్స్ గ్రేట్ రెస్పాన్సిబిలిటీ' అంటూ స్పైడర్-మ్యాన్ సినిమాలలోని ఐకానిక్ డైలాగును ఉటంకించారు.

వైరల్

అహో!



వీడియో వైరల్ కావడానికి అసాధారణ అద్భుతాలతో పనిలేదు. 'ఆహో' అనిపిస్తే చాలు. ఇది అలాంటి వైరల్ వీడియోనే. ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్ మార్క్ స్మిత్ తీసిన వీడియో నెటిజనులను మంత్రముగ్ధులను చేసింది. చేపను క్యాచ్ చేస్తున్న ఒక డేగకు సంబంధించిన క్లోజ్-అప్ షాట్ ఇది.

కెమెరామన్‌గా మార్క్ స్మిత్ అద్భుతమైన పనితనం ఈ వీడియోలో కనిపిస్తుంది. ఈ స్టన్నింగ్ వీడియో 124 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.



బ్రెజిల్ టు బెంగాల్

- ప్రేమకు దూరం తెలియదు

ఎక్కడి బ్రెజిల్? ఎక్కడి బెంగాల్?

అయితే ప్రేమ బలంతో సుదూర ప్రాంతాలు కూడా ఇరుగు పొరుగు గ్రామాలు అవుతాయి.

వేలాది కిలోమీటర్లు ప్రయాణం చేసి బ్రెజిల్ అమ్మాయి పశ్చిమ బెంగాల్‌లోని తన ప్రియుడిని వెదుక్కుంటూ వచ్చింది. బెంగాల్‌లోని నాడియా జిల్లాకు చెందిన కార్తీక్‌కు నాలుగు సంవత్సరాల క్రితం సోషల్ మీడియాలో బ్రెజిల్‌కు చెందిన మాన్యులా డి సిల్వాతో పరిచయం అయింది. గూగుల్ సాక్షిగా ఆ పరిచయం ప్రేమగా మారడానికి ఎంతోకాలం పట్టలేదు. భాష సమస్య వల్ల కార్తీక్ తల్లిదండ్రులు మాన్యులాతో మాట్లాడడానికి గూగుల్ ట్రాన్స్‌లేట్ యాప్‌ను ఉపయోగించేవారు. ఈ యాప్‌లో బెంగాలీలో టైప్ చేసి మాన్యులా కోసం ఇంగ్లిష్‌లోకి కన్వర్ట్ చేసేవారు. పెళ్లికి ఇరు కుటుంబాల వారు అంగీకరించారు.

కాబోయే అత్తారింటికి వచ్చిన డి సిల్వా ఇప్పుడిప్పుడే బెంగాలీ వంటకాల రుచులకు అలవాటు పడుతోంది. బెంగాలీ పదాలు నేర్చుకుంటోంది.

బెంగాల్‌లో జరగబోయే కూతురు పెళ్లికి హాజరు కావడానికి బ్రెజిల్‌లోని మాన్యులా తల్లిదండ్రులు సన్నాహాలు చేసుకుంటున్నారు.



నా తల్లివి నువ్వే

ఢిల్లీలోని ఒక అనాథాశ్రమంలో పెరిగింది శివాని. చా...లా సంవత్సరాల తరువాత భర్త, కూతురుతో కలిసి ఆ అనాథాశ్రమానికి వచ్చింది. 'నేను శివానిని. గుర్తున్నానా?' అన్నది గార్డియన్ దగ్గరికి వచ్చి. శివాని చిన్నప్పటి జ్ఞాపకాలు గార్డియన్‌ను చుట్టుముట్టాయి. అంతే....గార్డియన్‌కు ఏడుపు ఆగలేదు. ఆమెను ఓదార్చడానికి ప్రయత్నిస్తూ తాను కూడా ఏడ్చేసింది శివాని. చాలా సేపటి వరకు వారి మధ్య ఏడుపు తప్ప మాటలు లేవు.

ఈ వైరల్ వీడియోలోని భావోద్వేగాలు నెటిజనులను కళ్లనీళ్ల పర్యంతం చేశాయి.

శివాని గతంలోకి వెళితే...

ఆమె తండ్రి మద్యానికి బానిస అయ్యాడు.

తల్లిని హింసించేవాడు. ఈ హింస తట్టుకోలేక భర్త నుంచి విడాకులు తీసుకుంది.

తల్లి ఒకచోట, తండ్రి ఒకచోట. పిల్లల ఆలనాపాలనా చూసేవారు లేరు. చివరికి అనాథలుగా మిగిలారు. వీరి దీనస్థితి చూసి ఒక పుణ్యాత్ముడు అనాథాశ్రమంలో చేర్పించాడు. మూడు సంవత్సరాల తరువాత ఆ పిల్లలను ఒక కుటుంబం దత్తత తీసుకుంది. పెరిగి పెద్దయి జీవితంలో స్థిరపడింది. తన కష్టకాలంలో ఆదుకున్న ఆశ్రమాన్ని, తల్లిలా ఆదరించిన గార్డియన్‌ను చూడడానికి వచ్చింది.

అనాథాశ్రమంలో ఉన్నప్పుడు అక్కడి 'గార్డియన్' అక్కా, తమ్ముళ్లను సొంతబిడ్డల్లా చూసుకుంది.

'నా సొంత తల్లి దగ్గరికి వచ్చినట్లు ఉంది' అని గార్డియన్ గురించి రాసింది శివాని.

ఇద్దరు దొంగల ఫైటింగ్ కథ

దొంగతనం చేయాలంటే పకడ్బందీగా స్కెచ్ వేయాలి. ఈ ఇద్దరు దొంగలకు మాత్రం ఎలాంటి స్కెచ్, పెన్సిల్ అవసరం లేకుండానే బ్రహ్మాండమైన అవకాశం వచ్చింది. ఒక ఇంటి ముందు వారికి కొరియర్ ప్యాకేజీ కనిపించింది. దాన్ని చూడగానే 'యురేక' అంటూ పరుగెత్తుకు వెళ్లారు. ఆ తరువాతే అసలు సీన్ స్టార్ట్ అయింది. 'ఇది నాది' అంటూ ఆ ఇద్దరు దొంగలు వాదులాడుకోవడమే కాదు ఒకరి ముఖంపై ఒకరు పంచ్‌లు ఇచ్చుకున్నారు. ఫైటింగ్ సీన్‌లు ఎన్నో ప్రదర్శించారు. డోర్ బెల్ కెమెరా ఫుటేజీలో రికార్డ్ అయిన ఈ దృశ్యాలను ఇంటి యజమాని షేర్ చేయగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

'దొంగలు ప్యాకేజీని యాదృచ్ఛికంగా చూశారా? లేదా సాంకేతిక మాయాజాలంతో ఫలానా చోటుకి కొరియర్‌లో ప్యాకేజీ రానుందని తెలుసుకున్నారా? రెండోది నిజమైతే చాలా ప్రమాదమే' అంటూ ఆందోళన వ్యక్తం చేశారు నెటిజనులు.



భుక్తి కోసం మనిషి వలస వేల ఏళ్ల క్రితం మొదలెట్టాడు. నేటికీ కొనసాగిస్తూనే ఉన్నాడు. పక్షులు, పశువులు, జంతువులు రుతువుల వల్ల, ఆహార లేమి వల్ల వలస వెళుతుంటాయి. వెళ్లడం వాటి చేతుల్లో ఉన్నా తిరిగి రావడం రాకపోవడం ప్రాప్తం. ఇక్కడ నీటిలో నల్లగా కనిపిస్తున్నది డాల్ఫిన్లు కావు. గజరాజులు. ప్రాణాలకు తెగించి వలస పోతున్నాయి.

ఏ దారెటు పోతుందో ఎవరినీ అడగక



అస్సాంలో బ్రహ్మపుత్ర నది ఇప్పుడు ఉధృతంగా ప్రవహిస్తోంది. అక్కడ కురిసిన భారీ వర్షాలు ప్రవాహాన్ని పీకల్దాకా తెచ్చాయి. బ్రహ్మపుత్ర తీరంలో నివసించే ఏనుగులకు ఇప్పుడు ఆహార సంకటం వచ్చింది. జోర్హాట్ జిల్లాలోని నిమితిఘాట్ దగ్గర ఇవి అడవి మీద ఆధారపడి బతుకుతుంటాయి. వరద వల్ల అవి ఇక ఈ వైపు ఉండటం క్షేమం కాదని తలిచాయి. బ్రహ్మపుత్రకు అవలి వైపు మానవ ఆవాసాలు ఉన్నాయి. అక్కడ ఏదో ఒక ఊరి మీద పడి ఆహారం పొందవచ్చు అని అన్నీ కూడబలుక్కుని తీర్మానించుకున్నాయి. కలిసి కట్టుగా ప్రవాహంలో దూకాయి. ఏనుగులు మంచి ఈతగత్తెలు. కాని ప్రవాహం ఉధృతంగా ఉంటే వాటికీ ప్రమాదమే. ముఖ్యంగా గున్న ఏనుగులను కాపాడుకుంటూ తల్లి ఏనుగులు ఈత చేయాల్సి ఉంటుంది. అందుకే అన్నీ గుంపుగా ఒకదాన్ని ఒకటి కాపాడుకుంటూ ఈదుకుంటూ అవతలి తీరానికి చేరాయి. సచిన్ భరలి అనే వన్యప్రాణి ఫొటోగ్రాఫర్ ఈ వలసను డ్రోన్ ద్వారా చిత్రీకరించాడు. దాదాపు 100 ఏనుగులు బ్రహ్మపుత్రను దాటే అరుదైన సన్నివేశాన్ని చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. అయ్యో అంటున్నారు. మరోవైపు అవతలి తీరంలోని జనం భయంతో ఆందోళన చెందుతున్నారు. అటవీ అధికారులు అక్కడికి చేరుకున్నారు. చేరుకుంటే మాత్రం. ఆకలిని ఆపగలరా? ఆకలితో ఉన్న గజరాజును ఆపి బతగ్గలరా?



ఆహారం కోసం ఉధృతంగా ప్రవహిస్తున్న బ్రహ్మపుత్ర నదిని దాటుతున్న ఏనుగులు

హెల్త్

● పెయిన్‌కిల్లర్స్ అబ్యూజ్

పెయిన్ తగ్గించడమా?... ప్రాణసంకటమా?!!

మోకాళ్లూ, వెన్నుపూసల అరుగుదలకు కారణమయ్యే ఆర్థరైటిస్, స్పాండిలోసిస్ వంటి సమస్యలూ, కొన్ని ఇన్ఫెక్షన్ల తర్వాత కలిగే బాధలూ, నొక్కుకుపోయే నరాలతో కలిగే నొప్పుల తీవ్రత వర్ణించడానికి అలవి కాదు. భరించలేని నొప్పి కలుగుతుంటే ఒకే ఒక మాత్ర వేయగానే ఉపశమనంతో కలిగే హాయి కూడా అంతా ఇంతా కాదు. అందుకే నొప్పి నివారణ మాత్రలకు కొందరు అలవాటు పడతారు. పెయిన్ కిల్లర్స్ అదేపనిగా వాడితే మూత్రపిండాలు దెబ్బతినడంతో పాటు అనేక రకాల సైడ్ ఎఫెక్ట్స్ వస్తుంటాయి. వాటి గురించి తెలుసుకుని, పెయిన్ కిల్లర్స్‌ను విచక్షణతో వాడాలనే అవగాహన కోసం ఈ కథనం.





భరించలేనంత నొప్పి తీవ్రమైన బాధను కలగజేస్తుంది. ఆ నొప్పిని తగ్గించే మందును అదేపనిగా వాడుతూ ఉంటే అంతకు మించిన కీడు తెచ్చిపెడుతుందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. కొందరు మొదటిసారి డాక్టర్ దగ్గరకు వెళ్లినప్పుడు రాసిచ్చిన మందుల్ని పదే పదే వేసుకుంటూ ఉంటారు. దాంతో కొంతకాలానికి కొన్ని అనర్థాలు రావచ్చంటూ హెచ్చరిస్తున్నారు డాక్టర్లు.

నొప్పి నివారణ మందులతో కలిగే దుష్పరిణామాలు...

పొట్టలోపలి పొరలపైన : నొప్పి నివారణ మందులు వేసుకోగానే కడుపు లోపలి పొరలపై మందు దుష్ప్రభావం పడవచ్చు. దాంతో కడుపులో గడబిడ (స్టమక్ అప్‌సెట్), వికారం, ఛాతీలో మంట, కొన్నిసార్లు నీళ్లవిరేచనాలు లేదా మలబద్ధకం వంటివి కలగవచ్చు. నొప్పినివారణ మందుల వాడకం దీర్ఘకాలం పాటు కొనసాగితే పొట్టలోకి తెరచుకునే సన్నటి రక్తనాళాల చివరలతో పాటు కడుపులోని పొరలు దెబ్బతినడం వల్ల కడుపులో పుండ్లు (స్టమక్ అల్సర్స్) రావచ్చు. అందుకే నొప్పి నివారణ మాత్రలను పరగడుపున వేసుకోవద్దని డాక్టర్లు స్పష్టంగా చెబుతారు. ముందుగా కడుపులో రక్షణ పొరను ఏర్పరచే పాంటప్రాజాల్ వంటి మందులను పరగడుపున వాడాక లేదా ఏదైనా తిన్న తర్వాతనే పెయిన్ కిల్లర్స్ వేసుకోవాలని డాక్టర్లు సూచిస్తుంటారు.

హైపర్‌టెన్షన్ ఉన్నవారిలో : హైబీపీతో బాధపడే కొందరిలో పెయిన్ కిల్లర్స్ వల్ల రక్తపోటు మరింత పెరగడంతో ప్రధాన రక్తనాళాల చివరన ఉండే అతి సన్నటి రక్తనాళాలు దెబ్బతినే ప్రమాదముంటుంది. దాంతో గుండె పనితీరుపై ఒత్తిడి పెరగడం కారణంగా గుండెజబ్బులు రావచ్చు.

కాలేయంపై దుష్ప్రభావం : ఒంటిలోకి చేరే ప్రతి పదార్థంలోని విషాలను (టాక్సిన్స్‌ను) మొదట విరిచేసి, వాటిని వేరుచేసేది కాలేయమే. ఆ తర్వాత వడపోత ప్రక్రియ మూత్రపిండాల సహాయంతో జరుగుతుంది. అందుకే ఒంటిలోకి చేరగానే పెయిన్ కిల్లర్స్ దుష్ప్రభావం తొలుత కాలేయం మీదే పడుతుంది.

కిడ్నీలపైన : కడుపులోకి చేరే అన్ని రకాల పదార్థాలు రక్తంలో కలిశాక వాటిని వడపోసే ప్రక్రియను మూత్రపిండాలు నిర్వహిస్తాయి. దాంతో పెయిన్‌కిల్లర్ టాబ్లెట్స్‌లోని హానికర విషపదార్థాల ప్రభావాలు వడపోత సమయంలో మూత్రపిండాలపైన నేరుగా పడతాయి. అందుకే పెయిన్‌కిల్లర్స్ దుష్ప్రభావాలు కిడ్నీలపైనే ఎక్కువ. ఆ కారణంగానే... మిగతా దుష్ప్రభావాలతో పోలిస్తే... పెయిన్ కిల్లర్స్ కిడ్నీలను దెబ్బతీస్తాయనే అవగాహన చాలామందిలో ఎక్కువ. నొప్పినివారణ మందులు అతి సన్నటి రక్తనాళాలను దెబ్బతీసే ప్రమాదం ఉన్నందునా... అలాగే రక్తాన్ని వడపోసే అతి సన్నటి రక్తనాళాల చివర్లు కిడ్నీలో ఉన్న కారణాన ఇవి దెబ్బతినే ప్రమాదం ఎక్కువ. రక్తం వడపోత కార్యక్రమం పూర్తిగా సజావుగా జరగాలంటే కిడ్నీల సామర్థ్యంలో కనీసం 30 శాతమైన సరిగా పనిచేయడం తప్పనిసరి. నొప్పి నివారణ మందులు కిడ్నీల సామర్థ్యాన్ని దెబ్బతీయడం వల్ల 'ఎనాల్జెసిక్ నెఫ్రోపతి' అనే జబ్బుతో పాటు దీర్ఘకాలిక వాడకం 'క్రానిక్ కిడ్నీ డిసీజ్-సీకేడీ'కి దారితీసే ప్రమాదం ఉంది. అయితే కిడ్నీలు దెబ్బతింటూ పోతున్నా, వాటి పనితీరు మందగించే వరకు ఆ విషయమే బాధితుల ఎరుకలోకి రాదు.

రక్తం పైన : ఏ మందు తీసుకున్నా అది అన్ని అవయవాలకు చేరి, తన ప్రభావం చూపడానికి ముందర రక్తంలో ఇంకడం తప్పనిసరి. అప్పుడు రక్తం గడ్డకట్టడానికి ఉపయోగపడే ప్లేట్‌లెట్స్‌పై దుష్ప్రభావం పడినప్పుడు కోయాగ్యులోపతి వంటి ప్రమాదకరమైన పరిస్థితికి దారితీయవచ్చు.

చివరగా... తీవ్రమైన నొప్పిని కలిగించే ఆర్థరైటిస్, ఆస్టియోపోరోసిస్, కొన్ని రకాల క్యాన్సర్లు, స్పాండిలోసిస్ వంటి వ్యాధుల చికిత్సల్లో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. ఔషధాల తయారీలోనూ గణనీయమైన పురోగతి కారణంగా గతం కంటే మెరుగైన, తక్కువ సైడ్‌ఎఫెక్ట్స్ ఉన్న మందులు అందుబాటులోకి వచ్చాయి. వీటితో ఉపశమనం మరింత త్వరితం. దుష్ప్రభావాలూ తక్కువే. అందుకే డాక్టర్లు అప్పుడెప్పుడో రాసిన మందుల చీటీలోని నొప్పి నివారణ మాత్రలను వాడకుండా మరోసారి డాక్టర్‌ను సంప్రదించాలి. దాంతో నొప్పి తగ్గడంతో పాటు దేహంలోని అనేక కీలకమైన అవయవాలను రక్షించుకోవడమూ సాధ్యపడుతుంది.



డాక్టర్ హరికిషన్
సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్

దుష్ప్రభావాల లక్షణాలూ లేదా సూచనలివి...

- ఆకలి లేకపోవడం లేదా అకస్మాత్తుగా బరువు పెరగడం, మలం నల్లగా రావడం, తీవ్రమైన కడుపునొప్పి నొప్పితో మూత్ర విసర్జన జరగడం లేదా మూత్రం చిక్కగా లేదా ఏ రంగూ లేకుండా ఉండటం
- చూపు లేదా వినికిడి సమస్య రావడం

వీటిల్లో ఏది కనిపించినా వెంటనే డాక్టర్‌ను సంప్రదించి తాము వాడుతున్న నొప్పి నివారణ మందుల వివరాలు, తమ లక్షణాలను డాక్టర్‌కు తెలపాలి.

దుష్ప్రభావాలను తగ్గించే కొన్ని జాగ్రత్తలివి...

నొప్పి నివారణ మందులు వాడాల్సి వచ్చినప్పుడు వాటి దుష్పరిణామాలను వీలైనంతగా తగ్గించడానికి కొన్ని జాగ్రత్తలు పాటించాలంటూ డాక్టర్లు సూచిస్తుంటారు. అవి...

- పరగడుపున నొప్పి నివారణ మందుల్ని వాడకూడదు.
- అవి వేసుకున్న తర్వాత మామూలు కంటే కాస్త ఎక్కువ నీరు తాగడం మేలు.
- కొన్ని రోజులు వాడాక నొప్పి తగ్గకపోతే మళ్లీ డాక్టర్ సలహా తర్వాతే వాటిని కొనసాగించాలి.
- పెయిన్ కిల్లర్స్ వాడేవారు డాక్టర్ల పర్యవేక్షణలో ఉంటూ తరచూ మూత్రపిండాలు, బీపీ, గుండె పనితీరును తరచూ పరీక్షింపజేసుకుంటూ ఉండాలి.

మెడి టిప్

తరచూ తలనొప్పి వస్తుంటే...



తరచూ వచ్చే తలనొప్పి నివారణకు అనుసరించాల్సిన సూచనలివి...

■ కంప్యూటర్‌పై లేదా ల్యాప్‌టాప్‌పై పనిచేసేవారు కంటిపై పడే ఒత్తిడిని తగ్గించేందుకు ప్రతి గంట సేపటి తర్వాత కనీసం అయిదు నిమిషాలు బ్రేక్ ఇవ్వడం మేలు ■ కంప్యూటర్ స్క్రీన్‌ను తదేకంగా చూడటం సరికాదు. అప్పుడప్పుడు కాస్త కనురెప్పలు మూస్తూ ఉండాలి ■ కుట్లు, అల్లికల పని చేసేవారు, సంక్లిష్టమైన డిజైన్లు అల్లుతున్నప్పుడు తరచూ బ్రేక్ తీసుకుంటూ ఉండాలి ■ సరిపడని ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి ■ టీ, కాఫీలను చాలా పరిమితంగా మాత్రమే తీసుకోవాలి. చాకొలెట్స్, శీతల పానీయాల విషయంలోనూ పరిమితి పాటించాలి ■ సరిపడని పర్‌ఫ్యూమ్‌లకూ, ఘాటైన వాసనలకు దూరంగా ఉండాలి ■ ఆల్కహాల్, పొగతాగడం వంటి దురలవాట్లు పూర్తిగా మానేయాలి ■ రోజూ కనీసం ఎనిమిది గంటలపాటు ప్రశాంతంగా నిద్ర పోవాలి.

పెర్నీషియస్ అనీమియా అంటే..?

రక్తహీనత (అనీమియా) అనేది రకరకాల కారణాల వల్ల ఏర్పడుతుంది. దాన్ని బట్టి ఆయా రక్తహీనతలకు రకరకాల పేర్లు ఉన్నాయి. ఉదాహరణకు... ఐరన్ తగ్గడం వల్ల వచ్చేది సాధారణ అనీమియా అయితే... ఎముకల్లోని మూలుగ ఫెయిల్యూర్ కారణంగా ఎర్ర రక్తకణాలను పుట్టించే ప్రక్రియ దెబ్బతినడం వల్ల వచ్చే 'అప్లాస్టిక్ అనీమియా'. ఇక డిస్క్ పేపులో ఉండే ఎర్రరక్తకణాలు కొడవలి లేదా నెలవంక షేపులోకి మారడం వల్ల వచ్చేది సికిల్ సెల్ అనీమియా. అలాగే... విటమిన్లలో బి12 అనేది లోపించడం వల్ల కూడా రక్తహీనత ఏర్పడుతుంది. ఇలా విటమిన్ బి12 లోపంతో వచ్చే అనీమియాను 'పెర్నీషియస్ అనీమియా' అంటారు. దీనివల్ల కనిపించే లక్షణాలూ, కలిగే దుష్పరిణామాలూ, అందించాల్సిన చికిత్స వంటి అనేక అంశాలపై అవగాహన కోసం... ఈ కథనం.



సొంత రోగనిరోధక వ్యవస్థ అయిన 'ఆటో ఇమ్యూనిటీ లోపం' కారణంగా కడుపులోని ఇన్‌ట్రిన్సిక్ ఫ్యాక్టర్ అనేది ఉత్పత్తి కాలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ఇన్‌ట్రిన్సిక్ వ్యవస్థ వల్లనే తీసుకున్న ఆహారంలోని విటమిన్ బి12 దేహానికి అందుతుంది. ఎర్ర రక్తకణాల ఉత్పత్తిలో సహాయపడే కొన్ని అంశాల్లో విటమిన్ బి12 కూడా ఒకటి. ఆటో ఇమ్యూన్ ఇన్‌ట్రిన్సిక్ వ్యవస్థలోని లోపం కారణంగా విటమిన్ బి12 అందకపోవడంతో ఎర్రరక్తకణాల ఉత్పాదన జరగదు. ఫలితంగా వచ్చే అనీమియాను 'పెర్నీషియస్ అనీమియా' అంటారు.

పెర్నీషియస్ అనీమియా ముప్పును తెచ్చిపెట్టే కొన్ని సమస్యలు... ● టైప్ 1 డయాబెటిస్ ● హైపో థైరాయిడిజమ్ ● ఎడిసన్స్ డిసీజ్ ● గ్రేవ్స్ డిసీజ్ ● కుటుంబంలో ఈ వ్యాధి ఉండటం ● 60 ఏళ్లకు పైబడిన వయసు.

లక్షణాలు : రక్తహీనత కారణంగా వచ్చే అన్ని లక్షణాలూ ఇందులోనూ కనిపిస్తాయి. ఉదా...
● తీవ్రమైన అలసట, నీరసం, నిస్సత్తువ ● ముఖం, దేహం, కనురెప్పల కింద, అరచేతులు, చర్మం పాలిపోయినట్లుగా కనిపించడం ● తలనొప్పి ● ఛాతీ నొప్పి ● బరువు తగ్గడం

సమస్య తీవ్రత మరీ ఎక్కువగా ఉన్నప్పుడు కనిపించే లక్షణాలు... ● నడక తీరు (గెయిట్) కుదురుగా సాగకపోవడం ● భుజమూ, కాళ్లలో తిమ్మిర్లు కనిపించే పెరిఫెరల్ న్యూరోపతి ● కండరాల బలహీనత ● మతిమరపు ● డిప్రెషన్.

విటమిన్ బి12 లోపం వల్ల కనిపించే లక్షణాలు... ● వికారం, వాంతులు ● ఆకలి లేకపోవడం ● ఛాతీలో మంట ● మలబద్ధకం ● అయోమయంగా అనిపించడం.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు
● కంప్లీట్ బ్లడ్ కౌంట్ ● రక్తంలో విటమిన్ బి12 మోతాదు తెలుసుకోవడం ● ఇన్‌ట్రిన్సిక్ ఫ్యాక్టర్, పెరైటల్ సెల్ యాంటీబాడీల కోసం చేసే రక్తపరీక్షలు.

నివారణ : ● విటమిన్ బి12 ఎక్కువగా దొరికే ఆహారాలు తీసుకోవడం.

చికిత్స : డాక్టర్ సలహా మేరకు... అవసరమైన మోతాదులో అందేలా విటమిన్ బి12 టాబ్లెట్లు లేదా విటమిన్ బి12 ఇంజెక్షన్లు ● ఏదైనా వ్యాధి (అండర్‌లైయింగ్ డిసీజ్) కారణంగా ఇన్‌ట్రిన్సిక్ ఫ్యాక్టర్ లోపం వస్తే... అంటే సీలియాక్ డిసీజ్, క్రోన్స్ డిసీజ్ వంటి కారణాల వల్ల విటమిన్ బి12 లోపం కలిగితే ఆ వ్యాధికి చికిత్స అందించడం.



డాక్టర్
డి.ఎస్.కె. సాహిత్య
కన్సల్టెంట్ హెమటాలజిస్ట్ & హెమటో ఆంకాలజిస్ట్



పారిస్ ఒలింపిక్స్‌కు నగాల్ క్వాలిఫై

భారత నంబర్‌వన్ టెన్నిస్ ఆటగాడు సుమీత్ నగాల్ వరుసగా రెండో ఒలింపిక్స్‌లో పాల్గొనబోతున్నాడు. తాను పారిస్ ఒలింపిక్స్‌కు అధికారికంగా అర్హత సాధించినట్లు నగాల్ స్వయంగా వెల్లడించాడు. '2024 పారిస్ ఒలింపిక్స్‌కు నేను అర్హత సాధించాననే విషయాన్ని ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. నా మనసులో ఒలింపిక్స్‌కు ప్రత్యేక స్థానం ఉంది. కాబట్టి ఇది చెప్పుకోదగ్గ క్షణం. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొనడం నా కెరీర్ విశేషాల్లో చెప్పుకోదగ్గ అంశం. ఆ తర్వాతినుంచి పారిస్ ఒలింపిక్స్ లక్ష్యంగా శ్రమించాను. మెగా ఈవెంట్‌లో సత్తా చాటాలని పట్టుదలగా ఉన్నా' అని నగాల్ ట్వీట్ చేశాడు. గత ఏడాది కాలంగా మంచి ఫామ్‌తో వరుస విజయాలు సాధించిన నగాల్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 71వ స్థానానికి ఎగబాకాడు. రెండు చాలెంజర్ టైటిల్స్ గెలవడంతో పాటు ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రాకు అర్హత సాధించి రెండో రౌండ్ వరకు చేరుకున్నాడు. పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న - శ్రీరామ్ బాలాజీ జోడీ భారత్ తరఫున బరిలోకి దిగనుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో బోపన్న ప్రస్తుతం టాప్-10లో ఉండటంతో తన భాగస్వామిని ఎంచుకునే అవకాశం అతనికి కలిగింది.

బంగ్లాపై విజయభేరి

50 పరుగులతో భారత్ ఘనవిజయం

- సెమీఫైనల్ చేరడం లాంఛనమే!
- పాండ్యా ఆల్‌రౌండ్ ప్రదర్శన
- రాణించిన బుమ్రా, కుల్దీప్
- రేపు ఆస్ట్రేలియాతో పోరు


పాండ్యా



కుల్దీప్

నార్త్‌సౌండ్: భారత్ ఆల్‌రౌండ్ షోకు బంగ్లాదేశ్ తెల్లమొహం వేసింది. బ్యాటింగ్‌లో కలిపికొట్టి, తర్వాత పేస్, స్పిన్‌తో వికెట్లను చెదరగొట్టింది. టి20 ప్రపంచకప్ సూపర్-8 రెండో మ్యాచ్‌లో భారత్ 50 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై జయభేరి మోగించింది. వరుసగా రెండు విజయాలు సాధించిన టీమిండియా ఇక సెమీస్‌కు చేరడం లాంఛనమే. టాస్ నెగ్గిన బంగ్లా ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హార్దిక్ పాండ్యా (27 బంతుల్లో 50 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (28 బంతుల్లో 37; 1 ఫోర్, 3 సిక్స్‌లు), రిషభ్ పంత్ (24 బంతుల్లో 36; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), శివమ్ దూబే (24 బంతుల్లో 34; 3 సిక్స్‌లు) రాణించారు. అనంతరం బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 146 పరుగులే చేసింది. కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ (32 బంతుల్లో 40; 1 ఫోర్, 3 సిక్స్‌లు) కొద్దిగా ప్రతిఘటించగలిగాడు. కుల్దీప్ 3, బుమ్రా, అర్ష్‌దీప్ చెరో 2 వికెట్లు తీశారు. సూపర్-8 దశలో తమ చివరి మ్యాచ్‌లో సోమవారం ఆస్ట్రేలియాతో భారత్ తలపడుతుంది.

కలిసిమెలిసి దంచేసి...

కోహ్లితో ఇన్నింగ్స్ ఆరంభించిన కెప్టెన్ రోహిత్ (11 బంతుల్లో 23; 3 ఫోర్లు, 1 సిక్స్) నాలుగో ఓవర్లోనే అవుటయ్యాడు. ఈ కాసేపట్లోనే వేయాల్సినంత వేగవంతమైన పునాదిని వేసి వెళ్లాడు. ఇక కోహ్లి, పంత్ తమ కెప్టెన్ వేగాన్ని అందిపుచ్చుకోవడంతో పవర్‌ప్లేలో భారత్ 53/1 స్కోరు చేసింది. పవర్‌ప్లే ఆఖరి ఓవర్ (6)లో కోహ్లి కొట్టిన సిక్సర్‌తోనే జట్టు స్కోరు 50కి చేరింది. రిషాద్ వేసిన 8వ ఓవర్లో కోహ్లి మరో సిక్స్ బాదాడు. పంత్ కూడా బౌండరీ కొట్టడంతో 8 బంతుల ఈ సుదీర్ఘ ఓవర్లో 15 పరుగులు వచ్చాయి. ఇది భారత శిబిరాన్ని ఉత్సాహపరిస్తే... మరుసటి 9వ ఓవర్ భారత్‌ను దెబ్బమీద దెబ్బ తీసింది. తొలి బంతికే కోహ్లి, మూడో బంతికి సూర్యకుమార్ (6)లను తన్జీమ్ పెవిలియన్ చేర్చాడు. అయితే ఈ వికెట్ల ప్రభావం ఇన్నింగ్స్‌పై పడకుండా తర్వాత వచ్చిన బ్యాటర్లు చెలరేగారు.

హార్దిక్ మెరుపు ఫిఫ్టీ

11వ ఓవర్ నుంచి శివమ్ దూబే అండతో రిషభ్ పంత్ బ్యాట్ ఝుళిపించాడు. ముస్తఫిజుర్ ఓవర్లో 2 బౌండరీలు, ఓ సిక్స్ బాదాడు. మరుసటి ఓవర్లో రిషాద్‌పై విరుచుకుపడే క్రమంలో 6, 4 కొట్టిన పంత్ అదే జోరులో ఆడేందుకు ప్రయత్నించి అవుటయ్యాడు. 14 ఓవర్లలో భారత్ 120/4 స్కోరు చేసింది. ఆ తర్వాత 6 ఓవర్లలోనే (36 బంతులు) 76 పరుగులు చేసింది. ఇంత స్కోరుకు, ఇన్నింగ్స్ జోరుకు హార్దిక్ పాండ్యా కారణమయ్యాడు. 15వ ఓవర్లో 6, 4తో 14 పరుగులు, 16, 17 ఓవర్లలో దూబే ఒక్కో సిక్సర్‌తో వరుసగా 12 పరుగులు, 9 పరుగులు వచ్చాయి. 18వ ఓవర్లో సిక్స్ కొట్టిన దూబే అవుట్ కాగా, హార్దిక్ మరో భారీ సిక్సర్ బాదడంతో 15 పరుగులొచ్చాయి. తన్జీమ్, ముస్తఫిజుర్ సహా బౌలర్లందరినీ చితకబాదిన హార్దిక్ 27 బంతుల్లో అర్ధసెంచరీ సాధించి నాటౌట్‌గా నిలిచాడు.

నజ్ముల్ ఒక్కడే...

టాప్-3 బ్యాటర్లలో లిటన్ దాస్ (13) విఫలమవగా, తన్జీద్ హసన్ (31 బంతుల్లో 29; 4 ఫోర్లు), కెప్టెన్ నజ్ముల్ మెరుగ్గానే ఆడారు. ఒక వైపు నజ్ముల్ పోరాడినా... మరోవైపు తౌహీద్ హ్రిదయ్ (4), ప్రతీ ప్రపంచకప్ ఆడిన విశేషానుభవజ్ఞుడు షకీబ్ (11), మహ్ముదుల్లా (13) చేతులెత్తేయడంతో బంగ్లా పరాజయం తప్పలేదు. ఆఖర్లో రిషాద్ (10 బంతుల్లో 24; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు .

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) జాకీర్ (బి) షకీబ్ 23; కోహ్లి (బి) తన్జీమ్ హసన్ 37; పంత్ (సి) తన్జీమ్ హసన్ (బి) రిషాద్ 36; సూర్యకుమార్ (సి) లిటన్ దాస్ (బి) తన్జీమ్ హసన్ 6; దూబే (బి) రిషాద్ 34; పాండ్యా నాటౌట్ 50; అక్షర్ నాటౌట్ 3; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 196. వికెట్ల పతనం:** 1-39, 2-71, 3-77, 4-108, 5-161. **బౌలింగ్:** మెహదీ హసన్ 4-0-28-0, షకీబ్ 3-0-37-1, తన్జీమ్ హసన్ 4-0-32-2, ముస్తఫిజుర్ 4-0-48-0, రిషాద్ హుస్సేన్ 3-0-43-2, మహ్ముదుల్లా 2-0-8-0. **బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:** లిటన్ దాస్ (సి) సూర్యకుమార్ (బి) పాండ్యా 13; తన్జీద్ హసన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 29; నజ్ముల్ (సి) అర్ష్‌దీప్ (బి) బుమ్రా 40; తౌహీద్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 4; షకీబ్ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 11; మహ్ముదుల్లా (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 13; జాకిర్ అలీ (సి) కోహ్లి (బి) అర్ష్‌దీప్ 1; రిషాద్ (సి) రోహిత్ (బి) బుమ్రా 24; మెహిది హసన్ నాటౌట్ 5; తన్జీమ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 146. వికెట్ల పతనం:** 1-35, 2-66, 3-76, 4-98, 5-109, 6-110, 7-138, 8-145. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-30-2, బుమ్రా 4-0-13-2, అక్షర్ 2-0-26-0, హార్దిక్ పాండ్యా 3-0-32-1, జడేజా 3-0-24-0, కుల్దీప్ 4-0-19-3.

టి20 ప్రపంచకప్‌లో నేడు


ఆస్ట్రేలియా X అఫ్గానిస్తాన్
వేదిక: కింగ్స్‌టౌన్; ఉ.గం.6.00 నుంచి

ఇంగ్లండ్ X అమెరికా
వేదిక: బ్రిడ్జ్‌టౌన్; రాత్రి గం. 8 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

వెస్టిండీస్ చితక్కొట్టేసింది..!

- 65 బంతుల్లో 130 పరుగుల లక్ష్యఛేదన
- 9 వికెట్ల తేడాతో ఓడిన అమెరికా
- షై హోప్ మెరుపు ఇన్నింగ్స్


షై హోప్

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): మాజీ చాంపియన్, టి20 వరల్డ్ కప్ ఆతిథ్య జట్లలో ఒకటైన వెస్టిండీస్ కీలక పోరుతో సత్తా చాటింది. సూపర్-8 దశ తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో ఓడి ఇబ్బందుల్లో పడ్డ ఆ జట్టు ఇప్పుడు మరో ఆతిథ్య టీమ్ అమెరికాపై చెలరేగిపోయింది. భారీ విజయంతో గ్రూప్ '2'లో తమ రన్‌రేట్‌ను కూడా అమాంతం పెంచుకుంది. టోర్నీలో ఈ మ్యాచ్ ముందు వరకు ప్రతీ సారి స్ఫూర్తిదాయక ప్రదర్శనతో ఎంతో కొంత పోరాటపటిమ కనబర్చిన అమెరికా ఇక్కడ మాత్రం పూర్తిగా చేతులెత్తేసింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో విండీస్ 9 వికెట్ల తేడాతో అమెరికాపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అమెరికా 19.5 ఓవర్లలో 128 పరుగులకే కుప్పకూలింది. ఆండ్రీస్ గూస్ (16 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోస్టన్ ఛేజ్ (3/19), ఆండ్రీ రసెల్ (3/13) ప్రత్యర్థిని పడగొట్టగా, అల్జారి జోసెఫ్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం వెస్టిండీస్ 10.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 130 పరుగులు సాధించి విజయాన్నందుకుంది. షై హోప్ (39 బంతుల్లో 82 నాటౌట్; 4 ఫోర్లు, 8 సిక్స్‌లు) సిక్సర్లతో చెలరేగగా, నికోలస్ పూరన్ (12 బంతుల్లో 27 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించారు. జాన్సన్ చార్లెస్ (15) అవుటైన తర్వాత జత కలిసిన ఈ ద్వయం 23 బంతుల్లో అభేద్యంగా 63 పరుగులు జోడించింది. ఈ క్రమంలో హోప్ టి20 వరల్డ్ కప్ చరిత్రలో విండీస్ తరఫున ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. తాజా ఫలితంతో గ్రూప్ '2'లో దక్షిణాఫ్రికా (0.625), ఇంగ్లండ్ (0.412)లకంటే విండీస్ రన్‌రేట్ (1.814) చాలా ఎక్కువగా వచ్చేసింది. సెమీస్ చేరాలంటే తమ చివరి మ్యాచ్‌లో సోమవారం దక్షిణాఫ్రికాపై గెలిస్తే సరిపోతుంది.

భారత మహిళల జట్టు 'హ్యాట్రిక్'

వరల్డ్ కప్‌లో వరుసగా మూడో స్వర్ణం


సురేఖ, పర్నీత్, అదితి

అంటాల్యా (టర్కీ): వరల్డ్ కప్ ఆర్చరీ స్టేజ్ 3లో భారత మహిళల జట్టు (కాంపౌండ్ విభాగం) స్వర్ణ పతకం గెలుచుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో భారత్ 232-229 స్కోరుతో ఎస్తోనియాపై విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖతో పాటు అదితి గోపీచంద్ స్వామి, పర్నీత్ కౌర్ ఈ జట్టులో సభ్యులుగా ఉన్నారు. తుది పోరులో 4 ఎండ్‌లలో భారత్ వరుసగా 58, 57, 59, 58 పాయింట్లు సాధించగా...ఎస్తోనియా టీమ్ సభ్యులు వరుసగా 57, 57, 58, 57 స్కోర్లు చేసి ఓవరాల్‌గా 3 పాయింట్లతో వెనుకబడ్డారు. మన మహిళల జట్టు ఈ ఏడాది వరుసగా మూడో వరల్డ్ కప్‌లోనూ పసిడి పతకం గెలుచుకొని సత్తా చాటడం విశేషం. వరల్డ్ కప్ స్టేజ్ 1 (షాంఘై), వరల్డ్ కప్ స్టేజ్ 2 (యెజియాన్)లలో కూడా టీమ్ అగ్రస్థానంతో ముగించింది. మరో వైపు పురుషుల కాంపౌండ్ విభాగం ఫైనల్లో ఓడిన భారత ఆర్చర్ ప్రియాన్ష్ రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఫైనల్లో ప్రియాన్ష్ 148-149 స్కోరుతో మైక్ స్కాలెసర్ చేతిలో ఓటమిపాలయ్యాడు.

ఫ్రాన్స్, నెదర్లాండ్స్ మ్యాచ్ 'డ్రా'


గోల్‌ను తిరస్కరించడంతో నిరాశలో డచ్ ఆటగాళ్లు

లీప్‌జిగ్ (జర్మనీ): ప్రతిష్టాత్మక యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో గోల్ నమోదు కాని తొలి 'డ్రా' నమోదైంది. అదీ యూరోప్‌లోని రెండు అగ్రశ్రేణి జట్ల మధ్య మ్యాచ్‌లో కావడం విశేషం. శనివారం గ్రూప్ 'డి'లో భాగంగా ఫ్రాన్స్, నెదర్లాండ్స్ మధ్య మ్యాచ్ 0-0తో 'డ్రా'గా ముగిసింది. హోరాహోరీ సమరంలో ఇరు జట్లు కూడా గోల్ కొట్టడంలో విఫలమయ్యాయి. అయితే మ్యాచ్ కీలక దశలో నెదర్లాండ్స్‌ను దురదృష్టం వెంటాడింది. డచ్ ప్లేయర్ గ్జావీ సైమన్స్ చేసిన గోల్‌ను రిఫరీ తిరస్కరించాడు. సుదీర్ఘ సమయం పాటు వీడియో రీప్లేలు చూసిన తర్వాత ఆ గోల్‌ను 'ఆఫ్‌సైడ్'గా ప్రకటించారు. మరో వైపు తమ స్టార్ ప్లేయర్ ఎంబాపె లేకుండా ఫ్రాన్స్ ఈ మ్యాచ్ బరిలోకి దిగింది. మరో మ్యాచ్‌లో పోర్చుగల్ 3-0 గోల్స్ తేడాతో టర్కీని చిత్తు చేసింది.

సినిమా


ఎస్‌ఆర్‌కె సినిమాకి ఎస్?


సమంత

షారుక్ ఖాన్‌ని బాలీవుడ్‌లో ఎస్‌ఆర్‌కె అని పిలుస్తారని అందరికీ తెలిసిన విషయమే. ఎస్‌ఆర్‌కె సరసన సమంత హీరోయిన్‌గా నటించనున్నారన్నది తాజా టాక్. ఈ చిత్రంలో నటించడానికి సమంత దాదాపు 'ఎస్' చెప్పారట. రాజ్‌కుమార్ హిరానీ దర్శకత్వంలో ఈ సినిమా పొందనుందని టాక్. దేశభక్తి నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచరస్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారట. ఆగస్ట్ 15న ఈ చిత్రం గురించి అధికారిక ప్రకటన వచ్చే చాన్స్ ఉందని భోగట్టా. కాగా... ఇప్పటికే సమంత ఫలానా హిందీ చిత్రంలో నటించనున్నారనే వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే అవేవీ నిజం కాలేదు. కానీ ఎస్‌ఆర్‌కె-సమంత కాంబినేషన్ సినిమా నిజం అవుతుందని హిందీ చిత్రసీమ అంటోంది.

మిషన్ మేకోవర్

సినిమా కథకు తగ్గట్లుగా డైలాగ్స్, డ్యాన్స్, ఫైట్స్ చేయడమే కాదు... క్యారెక్టరైజేషన్‌కు సరిపోయేట్లు హీరోల ఆహార్యం కూడా ఉండాలి... గెటప్ కుదరాలి. అప్పుడే సిల్వర్ స్క్రీన్‌పై కథ ఆడియన్స్‌కు మరింత కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. ఇలా కనెక్ట్ కావడం కోసం కొందరు హీరోలు మేకోవర్ మిషన్‌ను స్టార్ట్ చేశారు. ఇప్పటికే 'తండేల్' కోసం నాగచైతన్య, 'స్వయంభూ'కి నిఖిల్, 'స్వాగ్'కి శ్రీవిష్ణు వంటి హీరోలు మేకోవర్ అయ్యారు. త్వరలో సెట్స్‌కి వెళ్లడానికి మిషన్ మేకోవర్ అంటూ రెడీ అవుతున్న హీరోల గురించి తెలుసుకుందాం.


మహేశ్ బాబు


ఎన్టీఆర్


రామ్ చరణ్


విజయ్ దేవరకొండ

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. సిల్వర్ స్క్రీన్‌పై మహేశ్‌బాబును సరికొత్తగా చూపించాలని రాజమౌళి ఫిక్స్ అయిపోయారు. ఇందుకు తగ్గట్లుగానే మహేశ్ ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. మేకోవర్ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది జనవరిలో మహేశ్ విదేశాలకు వెళ్లొచ్చారు. ఈ సినిమాలో మహేశ్ లుక్, గెటప్ కంప్లీట్ డిఫరెంట్‌గా ఉండేలా రాజమౌళి ప్లాన్ చేశారని తెలుస్తోంది. ఈ చిత్ర కథను ఇప్పటికే పూర్తి చేశారు విజయేంద్రప్రసాద్. పాటల పని కూడా ఆరంభించారు సంగీతదర్శకుడు కీరవాణి. ఈ ఫారెస్ట్ యాక్షన్ అడ్వెంచరస్ మూవీ చిత్రీకరణ ఈ ఏడాదిలోనే ప్రారంభం కానుందనే టాక్ వినిపిస్తోంది. ఈ ఆగస్టు 9న మహేశ్‌బాబు బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా చిత్రీకరణ గురించిన అప్‌డేట్ వచ్చే అవకాశం ఉంది. అలాగే ఈ సినిమాను రెండు భాగాలుగా తీయాలని అనుకుంటున్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. కేఎల్ నారాయణ ఈ సినిమాను నిర్మించనున్నారు.

కొత్త సినిమా మేకోవర్ అంటే చాలు... ఎన్టీఆర్ రెడీ అనేస్తారు. ఈసారి దర్శకుడు ప్రశాంత్ నీల్‌కు ఎన్టీఆర్ ఓకే చెప్పారు. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) రానున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా చిత్రీకరణను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభిస్తామని ఇటీవల మేకర్స్ వెల్లడించారు. అయితే ఈ గ్యాప్‌లో ఈ సినిమా కోసం మేకోవర్ అయ్యేలా ఎన్టీఆర్ ప్లాన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో 'దేవర' సినిమా చేస్తున్నారు ఎన్టీఆర్. వీలైనంత త్వరగా ఈ సినిమా తొలి భాగం షూట్‌ను పూర్తి చేసి, 'డ్రాగన్' మేకోవర్ మీద దృష్టి పెట్టాలనుకుంటున్నారట ఎన్టీఆర్. ఈ సినిమాలో హీరోయిన్‌గా రష్మికా మందన్నా, విలన్‌గా బాబీ డియోల్‌ల పేర్లు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు.

'గేమ్ చేంజర్' సినిమా షూటింగ్‌తో రామ్‌చరణ్ ప్రస్తుతం బిజీ బిజీగా ఉన్నారు. ఈ సినిమాలో తన వంతు షూటింగ్ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత రామ్‌చరణ్ ఆస్ట్రేలియా వెళ్తారు. హాలీడే కోసం కాదు.... బుచ్చిబాబు సన దర్శకత్వంలో హీరోగా నటించనున్న సినిమాలోని క్యారెక్టర్ మేకోవర్ కోసం వెళ్లనున్నారు. ఈ సినిమా చిత్రీకరణను ఆగస్టులో ప్రారంభించనున్నట్లుగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు బుచ్చిబాబు. కాగా రూరల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో సాగే ఈ మూవీలోని గెటప్స్ కోసం చరణ్ ప్రత్యేక్ష శిక్షణ తీసుకోనున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించనున్నారు. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

విజయ్ దేవరకొండను ఇప్పటివరకు అర్బన్, సెమీ అర్బన్ కుర్రాడిగానే ఎక్కువగా సిల్వర్ స్క్రీన్‌పై చూశాం. కానీ తొలిసారి పక్కా పల్లెటూరి కుర్రాడిలా కనిపించేందుకు రెడీ అవుతున్నారు. విజయ్ దేవరకొండ హీరోగా 'రాజావారు రాణిగారు' ఫేమ్ రవికిరణ్ కోలా దర్శకత్వంలో రూరల్ మాస్ డ్రామాగా ఓ మూవీ రానుంది. ఈ సినిమా కోసమే విజయ్ పల్లెటూరి మాస్ కుర్రాడిగా మేకోవర్ కానున్నారు. ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ ఓ సినిమాలో నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తి కాగానే తన కొత్త మేకోవర్ ఆరంభిస్తారట విజయ్.


అఖిల్

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన గత చిత్రం 'ఏజెంట్'. ఈ స్పై మూవీ కోసం అఖిల్ స్పెషల్‌గా మేకోవర్ అయ్యారు. సిక్స్ ప్యాక్ బాడీని డెవలప్ చేశారు. ఈ సినిమా తర్వాత అఖిల్ నటించాల్సిన కొత్త సినిమా గురించిన అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. కానీ అఖిల్ అనే ఓ కొత్త దర్శకుడు తెరకెక్కించనున్న ఫ్యాంటసీ అండ్ పీరియాడికల్ యాక్షన్ మూవీలో అఖిల్ హీరోగా నటిస్తారని, 11వ శతాబ్దం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో ఓ ట్రైబల్ నాయకుడిగా అఖిల్ కనిపిస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ సినిమాలోని తన గెటప్ కోసమే అఖిల్ మేకోవర్ అవుతున్నారు. ఈ మధ్యకాలంలో కాస్త పొడవాటి జుట్టుతో, సరికొత్త ఫిజిక్‌తో అఖిల్ సరికొత్తగా కనిపించడం చర్చనీయాంశమైంది. ఈ మూవీ కోసమే అఖిల్ ఇలా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారట. దాదాపు రూ. వంద కోట్ల బడ్జెట్‌తో యూవీ క్రియేషన్స్, హోంబలే ఫిలింస్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయనే ప్రచారం సాగుతోంది.

ఈ హీరోలే కాదు... కథానుగుణంగా మేకోవర్ అవుతున్న హీరోలు మరికొందరు ఉన్నారు.

రామానుజాచార్యుల చరిత్రతో...

సాయి వెంకట్ నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న సినిమా 'జయహో రామానుజ'. జో శర్మ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో సుమన్, ప్రవల్లిక కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రెండు భాగాలుగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా తొలి భాగం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో జూలై 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన 'జయహో రామానుజ' లిరికల్ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో సాయి వెంకట్ మాట్లాడుతూ– ''మహిళల్ని గౌరవించాలని, కుల మతాలకు అతీతంగా ఐకమత్యంతో మానవాళి మెలగాలని సందేశాన్ని ఇచ్చిన గొప్ప గురువు రామానుజా చార్యుల వారు. ఆయన గొప్పతనం ఈ తరం వారికి తెలియజేయాలనే ఉద్దేశంతో 'జయహో రామానుజ' చిత్రాన్ని రూపొందించాను. సంగీత సాహిత్యాలు బాగుండాలని టైమ్ తీసుకుని ఖర్చుకు వెనకాడకుండా సాంగ్స్ డిజైన్ చేశాం'' అన్నారు. ''జయహో రామానుజ' సినిమా మా నాన్నగారు సాయి వెంకట్‌కి ఒక కల'' అన్నారు నిర్మాత ప్రవల్లిక. ఈ చిత్రానికి సంగీతం: జయసూర్య, వెంకట్, హర్ష.


సాయి వెంకట్

కలలో బీట్ బాగుంది

- సంగీతదర్శకుడు కోటి


మార్కండేయ, కోటి

''కలలో... కలలో.. .' పాట చాలా ఫ్రెష్‌గా ఉంది. ఈ పాట బీట్, లిరిక్స్, నటీనటుల వేషధారణ, నటన అన్నీ బాగా కుదిరాయి. ఈ చిత్రబృందానికి శుభాకాంక్షలు'' అన్నారు సంగీత దర్శకుడు కోటి. నటుడు అలీ ఫ్యామిలీ నుంచి సదన్ హీరోగా పరిచయమవుతున్న 'ప్రణయ గోదారి' చిత్రంలోని 'కలలో... కలలో...' అంటూ సాగే పాటను కోటి రిలీజ్ చేశారు. పీఎల్ విఘ్నేష్ దర్శకత్వంలో పారమళ్ల లింగయ్య నిర్మించిన ఈ చిత్రంలో ప్రియాంకా ప్రసాద్ హీరోయిన్. ''ఫీల్ గుడ్ లవ్‌స్టోరీతో రూపొందించిన ఈ చిత్రంలోని 'కలలో..' అంటూ సాగే ప్రేమ పాటను సహజమైన లొకేషన్స్‌లో చిత్రీకరించాం. వీనుల విందుగా, కనువిందుగా ఉంటుంది. త్వరలో సినిమాని విడుదల చేస్తాం '' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మార్కండేయ, కెమెరా: ఈదర ప్రసాద్.

లక్కు నీ వెంట...

'**ల**క్కు నీ వెంట కుక్క తోక లెక్క ఊపుకుంటూ వచ్చరో లచ్చన్న...' అంటూ మొదలవుతుంది 'పేకమేడలు' సినిమాలోని 'బూమ్ బూమ్ లచ్చన్న' పాట. 'నా పేరు శివ, అంధగారం' సినిమాల ఫేమ్ వినోద్ కిషన్ హీరోగా నటించిన చిత్రం ఇది. ఇందులో అనూషా కృష్ణ హీరోయిన్. రాకేష్ వర్రే నిర్మించిన ఈ చిత్రం జూలైలో విడుదలకు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'బూమ్ బూమ్ లచ్చన్న...' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రసంగీత దర్శకుడు స్మరణ్ సాయి నేతృత్వంలో భార్గవ్ కార్తీక్ సాహిత్యం అందించిన ఈ పాటను మనో పాడారు. రితికా శ్రీనివాస్, జగన్ యోగిరాజ్, అనూష నూతల, గణేష్ తిప్పరాజు, నరేన్ యాదవ్ ఈ సినిమాలోని ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు.


వినోద్, అనూష

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



క్రిస్టియన్ మాల/కట్నప్రసక్తి లేదు/ B.Tech / C.Govt. కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ / 80,000/-PM/6' ఎత్తు /29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-15719]

రజక/కట్నప్రసక్తి లేదు/M.Tech/C.Govt. బ్యాంక్ మేనేజర్/ ఆంధ్రాబ్యాంక్/90,000/-PM/5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-15719]

యాదవ/కట్నప్రసక్తి లేదు/MA/C.Govt. సెక్యూరిటీ ఆఫీసర్/DRDO/90,000/-PM/ 5'11"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-15719]

క్రిస్టియన్ మాల/కట్నప్రసక్తి లేదు/ 28/ 5'9" / B.Tech / C.Govt. మేనేజర్ / యూనియన్ బ్యాంక్/14 Lakhs. PA/ అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-15719]

హిందూ మాదిగ/ M.Tech / C.Govt. స్టేషన్ మాస్టర్ / రైల్వే/50,000/-PM/ 5'11"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-15719]

36 సం॥లు బిజినెస్ చేస్తున్న వరుడికి రెండవ/విడో పిల్లలు ఉన్న వారు అయినా సంప్రదించండి. చౌరీ, కుల ప్రసక్తి లేదు. ఫోన్: 6301943220, 9866724586 [HA-97702]

SC మాల(హిందూ)/2nd మ్యారేజ్ / PG/5'10"/1,60,000/-PM/Own Visa Consultency గల వరునికి తగిన అందమైన వధువు కావలెను. Ph: 8187861989 [H-796085]

కుల, కట్న ప్రసక్తి లేదు/SC మాల/లేట్‌మ్యారేజ్ / 46/5'11"/B.Tech/MBA, LLB, Ph.D,40 K PM కొంచెం శారీరక వైకల్యం కాలు, హైదరాబాద్‌లో స్థిరపడిన వరునికి 1st/2nd వధువు కావలెను. డైరెక్ట్. Ph: 7702438915 [H-796085]

SC మాల & మాదిగ/కట్న ప్రసక్తి లేదు/ B.Tech/C.Govt.మేనేజర్/యూనియన్ బ్యాంక్ /85000/-PM/5'8" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093, 9515755529 [HA-15727]

డైరెక్ట్ కాంటాక్ట్: ఆర్యవైశ్య, 46Yrs/5'.5"/ బిజినెస్, జాబ్, 30Cr. స్థిరాస్తి గల ఏకైక అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను. (నో బ్రోకర్స్). 9182161015, 7680872085. [T-2135]

2వ: కమ్మ MBA, ఆస్తి, IT జాబ్ గల వరునికి చదువు ఆస్తి కుల పట్టింపు లేదు. 32 సం॥ల లోపు వధువు కావలెను. డైరెక్ట్. Ph: 8978609410 [HA-14376]

మాదిగ/A: 28, Ht: 6', M.Tech (IIT), IAS, *A:31, Ht: 6', MBBS, IPS * A: 31, Ht : 6', B.Tech, IFS. Ph: 7396915712. [HA-15727]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్/34y/నెలకు లక్ష రూపాయల ఆదాయం. Hydలో సొంత ఇల్లు/కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి, ఓన్లీ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/విడో OK. కుల, కట్న ప్రసక్తి లేదు. డైరెక్ట్. Ph: 7989079290 [H-801637]

ఆర్యవైశ్య అమ్మాయి కావలెను. 1,2 ఆర్యవైశ్య అబ్బాయి 35 M.Sc., ప్రైవేట్ లెక్చరర్ 30 వేలు ఆస్తి 80 లక్షలు, నల్లగొండ, MIG-9 HB మునుగోడ్ రోడ్, వీరయ్య. సంప్ర॥ 9121325068 [Y-798336]

★★

డైరెక్ట్. 5'5"/ 55Yrs/కాపు. కుల పట్టింపు లేదు. నెలకు రూ. యాభైవేల ఆదాయం కలిగి, సుమారు రూ.40 లక్షల స్థిరాస్తి గల వ్యక్తికి మంచి మనసున్న వధువు కావలెను. పిల్లలు ఉన్నా సంతోషమే! Cont: 8341482731 [H-1177646]

క్రిస్టియన్, మాదిగ, 6'4", B.Tech, Fire SI, 1లక్ష జీతంగల వరునకు అందమైన Govt Employee వధువు కావలెను. నో బ్రోకర్స్. 7382925399 (డైరెక్ట్) [B-1239331]

డైరెక్ట్/45/ప్రభుత్వ ఉద్యోగము చేయుచున్న వరుడికి కుల, మత, వయసు, ఆస్తి ప్రసక్తి లేని వధువు పెళ్ళి లేదా తోడు కొరకు కావలెను. డైరెక్ట్: ఫోన్: 83417 12438. [L-800675]

వరుడు కావలెను



మా వద్ద 1 కోటి నుండి 50 కోట్ల ప్రాపర్టీ గల Govt జాబ్, బిజినెస్ చేస్తున్న 1వ, 2వ వధువులు కలరు. వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం OK. త్వరగా కుదుర్చబడును. Ph: 7207636129 [H-778870]

డైవర్సీ /37yrs/Govt. ఎంప్లాయ్/ 2,65,000/-(pm)/సెటిల్డ్/కుల పట్టింపు లేని అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా OK & ఇల్లరికం OK) సంప్ర : 9032445378 [H-778870]

బ్రాహ్మణ/24/5'3"/B.Sc *27/5'4"/ MBA *30/ 5'3"/B.Sc *27/5'2"/ ఇంటర్/32/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్/ పురోహితులకు త్వరగా కుదుర్చబడును. Ph: 7842635086 [HA-15719]

రెడ్డి/38yr/కుల పట్టింపు లేదు/ ఫెయిర్/ Govt. ఎంప్లాయ్/2,50,000/- (PM)/ వెల్ సెటిల్డ్ & 2 సొంత ఇల్లులు కలిగిన వధువుకి వరుడు కావలెను (1st, 2nd మ్యారేజ్ OK & ఇల్లరికం OK) సంప్ర : 8374802603 [H-778870]

రెడ్డి/2ND (విడో): కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/ Qly: డిగ్రీ, కలర్: తెలుపు/సొంత వ్యాపారము గల అందమైన వధువుకి వరుడు కావలెను 1st or 2nd (ఇల్లరికం OK). Ph: 9032596676 [H-778870]

క్రిస్టియన్ మాల/25 /5'4" / B.Tech/ Govt. Asst.Exq. ఇంజినీర్/ 65000/-PM/ అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6309258463 [HA-15719]

రజక/50 లక్షల ఆస్తి/B.Tech/Govt.Jr. Asst. పంచాయతీరాజ్ Dept/45000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-15719]

క్రిస్టియన్ మాదిగ/ B.Tech / C.Govt. Asst. మేనేజర్/SBI/65000/-PM/5'5" ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-15719]

వడ్డెర/B.Tech / C.Govt. బ్యాంక్ క్లర్క్ /SBI /38000/-PM / 5'4"ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-15719]

క్రిస్టియన్ /B.SC B.Ed/43 Years/5'6" ఎత్తు /అందమైన వధువుకి తగిన క్రిస్టియన్ SWE/Govt. వరుడు కావలెను. సంప్ర : 9848024054, No Mediators [H-778743]

డాక్టర్స్/PG *రెడ్డి/28/గుడ్ ప్రాపర్టీ. *రెడ్డి/29. *కాపు/27/MDS. *Caste No bar-బలిజ నాయుడు/ 27. *SC/29 * టీచర్స్/ 32. *డాక్టర్స్ మ్యాచెస్ కోసం Whatsapp 6304826162 (Trusted Matrimony Consultant) [H-778743]

2వ పెళ్లి/కోట్ల ప్రాపర్టీ కల్గిన 4,00,000PM, బాగా స్థిరపడిన ఎలాంటి కుల భేదాలు లేని వధువుకి అందమైన వరుడు కావలెను (ఇల్లరికం -పిల్లలు ఉన్నా OK) Direct-9182213897 [H-778743]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, ME, MS, 27, 5' 10, Salesforce Developer, H1, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 30, 5' 8", Lead Analyst, 61 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS (USA), MBA (ISB), 30, 5' 11", Manager, 36 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MSc, MS, 32, 6', Data Scientist, 140 K, Canada. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, 24, 5' 10", Data Analyst, 25 Crores, USA, Fair Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BBA, MBA, 25, 5' 2", 10 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 24, 5' 4", Software Developer, 11 L P/A, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 27, 5' 4", SWE, 20 L P/A, 20 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, 29, 5' 11", Data Engineer, 13 L P/A, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBA, 29, 5' 11", Rich Family, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5' 11", Residency Doctor, 10 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 40, 5' 8", Microsoft, 60 L P/A, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBA, 26, 5' 3", Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Govt, MBA, 27, 5' 3", 18 L P/A, 18 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, 24, 5' 9", Doctor, Hyderabad, Fair & Slim. Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, Degree, 33, 5'7", Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

క్రిస్టియన్ మాల/ M.Tech / C.Govt./ కెనరా బ్యాంక్ / మేనేజర్/12 Lak PA/ 5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7207233788 [H-778743]

కమ్మ/విడో/56Y/Eluruలో సొంత ఫ్లాట్లు/ Hyd లో సొంత బిజినెస్, రెంట్స్/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-778870]

రెడ్డి/విడో/58y/5'5"/V.Fair/Govt. టీచర్/సొంత ఇల్లు & రెంట్స్/26 ఎకరాల కొబ్బరి తోట/3L/- PM పిల్లలు లేని సాంప్రదాయక వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. 7287079096 [H-796306]

పద్మశాలి/విడో/59y / తెల్లని ఛాయ/ డిగ్రీ LIC Job / సొంత ఇల్లు గల ఒంటరి వధువుకు కుల ప్రసక్తి లేని స్నేహ పూర్వకమైన వరుడు కావలెను. 9618862631 [H-796306]

FC/విడో /60Y / 5'4"/V.Fair / సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయ్/సొంత ఇల్లు గల సాంప్రదాయకమైన వధువుకి స్నేహ పూర్వకమైన వరుడు కావలెను. 8367233524 [H-796306]

ఆస్తి/కుల పట్టింపు లేని వధువుకి వరుడు కావలెను/58y విడో/5'4"/టైల్స్ బిజినెస్ /1 L/-pm/ సొంత ఇల్లు / ఫైనాన్స్ బిజినెస్/పిల్లలు లేరు. 8142782214 [H-796306]

కుల, ఆస్తి పట్టింపు లేదు/విడో/45y/HRD Officer /1 L PM/సొంత విల్లా/15 ఎ॥ ల్యాండ్స్ /కోట్ల ఆస్తులు కలిగిన అందమైన వెల్‌సెటిల్ వధువుకు వరుడు కావలెను. Ph: 8143837929 [H-796085]

రెండోపెళ్ళి/విడో/ 55y/ గుంటూరు / లెక్చరర్ / Own House రెంట్స్/కోట్ల ప్రాపర్టీ గల పిల్లలు లేని ఏ భాదర బందీలేని ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను (పిల్లలున్నా OK) Ph: 8519803423 [H-796085]

కాపు/56Yrs /2వ పెళ్లి /ఫ్యామిలీ పెన్షన్ /45000/-PM/పిల్లలు లేని వధువుకు కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 8247525381 [HA-15727]

కుల పట్టింపు లేదు/23y & 25y &27y &29y &30y &32y &33y&35y& 36y& 37& 39y&40y& 42y& 43y& 44y&45y&47y&48y& 50y&51y&53y& 55y& 57y& 59y& 'హ సేవా' (Since: 1998) Ph/W: 9291503949 [HA-15727]

రెడ్డి/2nd(కుల, మత, ఆస్తి) ప్రసక్తి లేదు. Age: 30, H:5'4" Degree, Own House, Business, Lands గల అందమైన సాంప్రదాయ వధువుకు 1వ/2వ వరుడు కావలెను. (ఇల్లరికం OK) Ph: 9908279018 [HA-15727]

Muslim Girl(Sheikh), Age: 24, Want Software/Government Employe Aged: 25-30. Ph: 9490405577 [HA-02112]

MUNNURU KAPU/ Bride 30Yrs/ 5'4"/M.Tech / SWE / 6-8Laks PA Seeks Groom SWE & Others Groom. Contact: 9391198332 [H-778743]

★★

క్రిస్టియన్/మాల / 1991 / MDS / కోట్లపైగా ఆస్తి / స్వంత క్లినిక్ / త్వరలో Govt. జాబ్ పొందే అందమైన వధువుకు వెల్ సెటిల్డ్ SWE/ తగిన Govt. ఎంప్లాయ్ / డాక్టర్ వరుడు కావలెను. డైరెక్ట్ © 94416 12898 [B-1264394]

వేదికలు



సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 8555980066 [H-796085]

"శుభమస్తు" మ్యారేజ్ బ్యూరో TM Estd: 1995 గౌడ, ఈడిగ, శెట్టిబలిజ, 1st/2nd, బీసీ/ఎస్‌సీ సంబంధాల్కై సం॥ లింగాల కాంప్లెక్స్ DSNR, HYD వ్యవస్థాపకులు : Late S.శారదా గౌడ్ సం॥ S.రాములు గౌడ్. 8790690309 [H-796306]

ధ్రువ మ్యారేజెస్ అన్ని కులాల వారికి 1వ, 2వ, లేటు, విడో, డైవర్సీ వారికి తగిన సంబంధాలు చూడబడును. Age: 18-70 సం॥లు. Ph: 7702955854 [HA-15721]

www.christianholymatrimony.com ద్వారా క్రైస్తవ వివాహ పరిచయవేదిక జూలై 17, (బుధవారం) ఉ. 10- సా. 4 వరకు సికింద్రాబాద్ YMCAలో, ప్రొఫైల్స్ వాట్సాప్ చేయండి. 7330957771 [HA-97698]

రెడ్డిలకే మాత్రమే. ఫ్రీ రిజిస్ట్రేషన్ /Govt/సాఫ్ట్‌వేర్/గెజిటెడ్/MBBS/PG/NRI/Pvt/బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS 15 సం॥ Exp. Ph: 9989140444 [HA-32366]

Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Subramanyam. Ph: 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15728]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9000487865 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15728]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Subramanyam. Ph: 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15728]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9000487865 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15728]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Subramanyam. Ph: 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15728]

వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 14-07-2024న ఉ॥ 9 గం॥లకు 65వ ఆర్య వైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ॥ 2 గం॥లకు 20వ పునర్ వివాహ పరిచయ వేదిక, విజయవాడ, K.B.N. కాలేజీలో జరుగును. మరియు ఉచిత మెగా మెడికల్ క్యాంప్ కూడా కలదు. © 99895 00130 [B-284]

ఫ్రీ రిజిస్ట్రేషన్: అన్ని కులాల Govt/ SWE/ డాక్టర్స్/ NRI/ బిజినెస్/ PVT/2ndపెళ్లి సంబంధాలకై నిజాయితీగా సర్వీస్. ఈ ప్రకటన 100% నిజం Ph: 9866775306 [H-14341]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్నికులాల SWE, Govt., Doctors, MNC Matches, Late &2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp). [HA-841]

మాదిగ వివాహ పరిచయ వేదిక, ఆదివారం (16-6-24) 10AM-6PM * మంచిర్యాల ఫీ: 1 వెయ్యి Ph: 9347046175 నిర్వహణ : స్వప్న వివాహ వేదిక [H-800496]

Free Register హిందూ మాల/ మాదిగ & క్రిస్టియన్ వధూవరుల online స్వయంవరం July 14th bhavanimatrimony, Hyd. 9704656103/ 9533608887 [HA-878]

పొల్యూషన్ ఆడిట్ కచ్చితంగా చేయాలి

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కాలుష్య నియంత్రణపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, అందుకోసం పొల్యూషన్ ఆడిట్‌కచ్చితంగా చేయాలని ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి పవన్‌కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ఏయే పరిశ్రమల నుంచి ఎంత కాలుష్యం విడుదలవుతుందో సమగ్ర నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. శనివారం తన నివాసంలో అటవీ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి జిల్లాలో కాలుష్యం లెక్కలు తీయాలని, జల, వాయు కాలుష్యాల వివరాలు ఇవ్వాలని సూచించారు. పరిశ్రమల వారీగా కాలుష్యం వివరాలు అందించాలన్నారు. కృష్ణా, గోదావరి తీరాల్లో కాలుష్యం, కాగితపు పరిశ్రమల నుంచి వస్తున్న జల కాలుష్యంపైనా చర్చించారు. ఈ రెండు జీవ నదుల శుద్ధీకరణపైనా దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎర్ర చందనం అక్రమ రవాణాను అరికట్టడానికి టాస్క్‌ఫోర్స్‌ను బలోపేతం చేస్తామన్నారు.

జనసేన కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజా సమస్యలు వినేందుకు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నం ఆయన హెల్ప్‌డెస్క్‌లో కూర్చొని పలు రకాల వినతులు చెప్పుకోవడానికి వచ్చిన బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు పార్టీ కార్యాలయం తెలిపింది. బాధితులతో ఆయన మాట్లాడి సమస్యల పరిష్కారానికి హామీలను ఇచ్చినట్లు పేర్కొంది.

కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ చర్యలు

ఇద్దరు వర్కింగ్ ప్రెసిడెంట్లకు షోకాజ్ నోటీసులు

సాక్షి, అమరావతి: ఏపీ కాంగ్రెస్ పార్టీ చీఫ్ వైఎస్ షర్మిల, ఏఐసీసీ ఇన్చార్జ్ మాణిక్యం ఠాకూర్‌పై ఆరోపణలు చేసిన ఇద్దరు వర్కింగ్ ప్రెసిడెంట్లకు ఆ పార్టీ శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ సజావుగా జరగలేదని, డబ్బులు తీసుకుని పార్టీ టికెట్లు ఇచ్చారని వర్కింగ్ ప్రెసిడెంట్లు సుంకర పద్మశ్రీ, పోచారెడ్డి రాకేష్‌రెడ్డి ఆరోపణలు చేసిన నేపథ్యంలో పార్టీ ఈ నిర్ణయం తీసుకుంది. ఏడు రోజుల్లోగా షోకాజ్ నోటీసుకు తగిన వివరణ ఇవ్వాలని ఏపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ లింగంశెట్టి ఈశ్వరరావు ఆ నోటీసులో పేర్కొన్నారు.

ఆదర్శంగా విద్యుత్ శాఖను తీర్చిదిద్దుతాం

మంత్రి గొట్టిపాటి రవికుమార్

సాక్షి, అమరావతి: దేశంలోనే ఆదర్శంగా ఏపీ విద్యుత్ శాఖను తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఇంధన శాఖ మంత్రిగా సచివాలయంలో శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం మూడు ఫైళ్లపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో కొత్తగా 40,336 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తూ తొలి సంతకం పెట్టారు. ప్రభుత్వ కార్యాలయాలకు దశలవారీగా సోలార్ విద్యుత్ కనెక్షన్ల మంజూరుపై రెండో సంతకం, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ఇంటింటికి మూడు కిలోవాట్ల సోలార్ విద్యుత్ అందించే కార్యక్రమానికి సంబంధించిన ఫైలుపై మూడో సంతకం చేసి విలేకరులతో మాట్లాడారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

విదేశాల్లో లేపాక్షి షోరూంల ఏర్పాటు

మంత్రి ఎస్.సవిత వెల్లడి



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): విదేశాల్లో నివసించే తెలుగువారి కోసం లేపాక్షి హస్తకళల షోరూంలు అక్కడ కూడా ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు రాష్ట్ర చేనేత జౌళి బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని లేపాక్షి ఎంపోరియంను మంత్రి సందర్శించి చేనేత హస్త కళాకృతులను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 16 లేపాక్షి షోరూంలు, ఇతర రాష్ట్రాల్లో 3 షోరూంలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హస్త కళాకృతులకు మార్కెట్ సౌకర్యం కల్పించి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కళాకారులకు జీవనోపాధి కల్పించనున్నట్లు తెలిపారు. అన్నివర్గాల వినియోగదారులకు అవసరమైన కళాకృతులు లేపాక్షి ఎంపోరియంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న లేపాక్షి షోరూంలను ఆధునీకరిస్తామని పేర్కొన్నారు. మంత్రి వెంట రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ ఎం.బాలసుబ్రమణ్యరెడ్డి తదితరులు ఉన్నారు.

హత్యాచారం కేసులో ముగ్గురి అరెస్ట్

గంజాయి మత్తులో యువతిపై ఇద్దరు యువకుల అత్యాచారం

- అనంతరం మొహంపై కొట్టి.. ముక్కు, నోరు మూసి హత్య
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందాల్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్



యువతి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సునీత

చీరాల/చీరాల అర్బన్: బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెం సీతారాంపేటకు చెందిన యువతిపై హత్యాచారం కేసును పోలీసులు ఛేదించారు. అదే గ్రామానికి చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం రాత్రి మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం.. సీతారాంపేటకు చెందిన పొజుల సుచరిత (21) ఇంటర్ వరకు చదివి టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. శుక్రవారం ఉదయం 5.45 గంటలకు ఆ యువతి ఇంటి సమీపంలోని రైల్వే ట్రాక్ సమీపంలో బహిర్భూమికి వెళ్లింది. ఆ తరువాత రైల్వే ట్రాక్ పక్కన ముళ్లపొదల్లో వివస్త్రగా ఆమె మృతదేహం కనిపించింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆమెపై అత్యాచారం జరిపి, హత్య చేశారని హతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీరాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతో పోలీసులు సవాల్‌గా తీసుకుని 10 బృందాలను రంగంలోకి దించి దర్యాప్తు చేపట్టారు.

గంజాయి మత్తులో..

అనుమానితులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టగా.. ఈపూరుపాలెం గ్రామానికే చెందిన దేవరకొండ విజయ్, కారంకి మహేష్, దేవరకొండ శ్రీకాంత్ ఈ దురాగతానికి పాల్పడినట్టు తేలింది. నిందితులు ముగ్గురినీ శనివారం సాయంత్రం చీరాల బైపాస్ రోడ్డు వద్ద హాయ్ రెస్టారెంట్ సమీపంలోని వాడరేవు వెళ్లే రోడ్డులో 50 మీటర్ల దూరంలో అరెస్ట్ చేసినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. గంజాయి మత్తుకు బానిసలైన నిందితులు శుక్రవారం తెల్లవారుజామున రైల్వేట్రాక్ సమీపంలో బహిర్భూమికి వెళ్లిన యువతిని ఏ1 విజయ్, ఏ2 మహేష్ బలవంతంగా చెట్ల పొదల్లోకి లాక్కెళ్లారు. యువతి నోరుమూసి బలవంతంగా అత్యాచారం చేసి అనంతరం ముఖంపై దాడి చేయడంతో పాటు నోరు, ముక్కు మూసి హత్య చేశారన్నారు. ఆ ఇద్దరికీ ఏ3 శ్రీకాంత్ ఆశ్రయం కల్పించాడన్నారు. ముగ్గురు నిందితులకు నేరచరిత్ర ఉందని.. వారిపై చీరాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గతంలో పలు కేసులు నమోదై ఉన్నాయని ఎస్పీ చెప్పారు. అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ ఆధ్వర్యంలో చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ పర్యవేక్షణలో చీరాల రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ దర్యాప్తు చేశారన్నారు. ముగ్గురు నిందితులపై కోర్టులో చార్జిషీట్ వేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారికి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిందితుల్ని కఠినంగా శిక్షించాలి

యువతి హత్యాచార ఘటన సభ్యసమాజం తలదించుకునేలా ఉందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. నిందితుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. యువతి కుటుంబ సభ్యులను శనివారం సునీత పరామర్శించారు. రాష్ట్రంలో ఇటువంటి ఘటనలు జరగడం దారుణమన్నారు. ఆమె వెంట జెడ్పీటీసీ ఆకురాతి పద్మిని, గంజి చిరంజీవి ఉన్నారు. ఇదిలావుండగా.. హత్యాచారానికి గురైన పొజుల సుచరిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి శనివారం పరామర్శించారు. ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి వారికి భరోసా కల్పించారు. యువతిపై హత్యాచార ఘటన దారుణమని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా లావు

సాక్షి, అమరావతి: టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఎంపికయ్యారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో శనివారం టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగింది. లోక్‌సభలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా దగ్గుమళ్ల ప్రసాదరావు, బైరెడ్డి శబరి వ్యవహరిస్తారు. కోశాధికారిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్లమెంటరీ పార్టీ విప్‌గా గంటి హరీష్‌ను నియమించారు. ఈ నెల 24 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతుండటంతో అక్కడ అనుసరించాల్సిన వైఖరి, లేవనెత్తాల్సిన అంశాలపై చర్చించారు.

టాప్ టెన్ విశ్వవిద్యాలయాలు తీసుకురావాలి

రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ఎంపీలందరూ పని చేయాలని సీఎం చంద్రబాబు ఎంపీలకు సూచించారు. ఈసారి లోక్‌సభలో 16 మంది ఎంపీలున్న దృష్ట్యా రాష్ట్రానికి ఎక్కువ నిధులు వచ్చేలా పని చేయాలని కోరారు. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రాజెక్టులు, పథకాలు తీసుకువచ్చేలా కృషి చేయాలని సూచించారు. దేశంలోనే టాప్ టెన్ విశ్వవిద్యాలయాలు, ఆస్పత్రులు, పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. ప్రతీ ఎంపీ కేంద్రంలో ఒక శాఖతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులు పూర్తి కావడానికి సహకరించాలన్నారు. విభజన చట్టంలోని హామీల అమలుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి లోకేశ్, టీడీపీ ఎంపీలు పాల్గొన్నారు.

అధికారులతో జనసేన నేత నాగబాబు సమీక్ష

హాజరైన జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు

పిఠాపురం: జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తాత్కాలిక నివాసంలో ఆయన అన్న నాగబాబు నిర్వహించిన ఈ సమీక్ష సమావేశానికి జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగబాబుకు అధికారులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. నిర్ణయాలు తీసుకునే సమయంలో స్థానిక జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌ను మాత్రమే సంప్రదించాలని అధికారులకు నాగబాబు స్పష్టం చేశారు. స్థానికంగా ప్రజా సమస్యల పరిష్కారానికి త్వరలో పార్టీ తరఫున ఇక్కడ మండల కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అధికారులతో నాగబాబు నిర్వహించిన సమావేశానికి టీడీపీ, బీజేపీ నేతలెవ్వరినీ పిలవలేదు. నాగబాబు అధికారులతో సమీక్ష నిర్వహించడం, పైగా పవన్ గెలుపునకు కృషి చేసిన టీడీపీ, బీజేపీ నేతలను పిలవకపోవడం పట్ల ఆయా పార్టీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. నాగబాబు వైఖరి పిఠాపురం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. కాగా, ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రభుత్వ ఏర్పాటు, మంత్రివర్గ బాధ్యతల స్వీకారం కారణంగా పవన్ బిజీగా ఉండటంతో పిఠాపురానికి ఆయన ఇంకా రాలేదు. ఈ నేపథ్యంలోనే నాగబాబు ఇక్కడి అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు జనసేన నేతలు చెబుతున్నారు.

'పోలవరం' పూర్తికి సహకరించండి

వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కూడా..

- గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు మద్దతు కావాలి
- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల వినతి

సాక్షి, న్యూఢిల్లీ: రాబోయే రోజుల్లో రాష్ట్రానికి ఆర్థికంగా ఏఏ అంశాల్లో సహాయ సహకారాలు అందాలన్న దానిపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించామని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఢిల్లీలో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన కేంద్ర బడ్జెట్ సన్నాహక సమావేశం, 53వ జీఎస్టీ మండలి సమావేశంలో రాష్ట్రం తరఫున ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏపీ భవన్‌లో మీడియాతో కేశవ్ మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తయ్యేందుకు, అమరావతి నిర్మాణానికి సహకారం అందించడంతో పాటు వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి సహకారం ఇవ్వాలని కోరామన్నారు. అంతేగాక.. రాష్ట్రానికి పారిశ్రామిక రాయితీలు, పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుకు సహకారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు. ముఖ్యంగా ఆక్వా పార్కులు, టెక్స్‌టైల్ పార్కులు కేటాయించడంతో పాటు గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు మద్దతివ్వాలని కోరామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తిరుపతి, విశాఖ విమానాశ్రయాలకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని.. ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు సహకారం కావాలని కూడా కోరామన్నారు. వీటితో పాటు రాష్ట్ర విభజనతో వచ్చిన ఆర్థిక సవాళ్లను అధిగమించేందుకు, విశాఖ రైల్వేజోన్‌కు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించడంతో పాటు గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు సహకరించాలని నిర్మలా సీతారామన్‌ను కోరినట్లు పయ్యావుల చెప్పారు.

సహకరించేందుకు కేంద్రం సిద్ధం

అయితే తాము అడిగిన అన్ని అంశాలు ఒకేసారి బడ్జెట్‌లో వస్తాయని భావించట్లేదని.. కానీ, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టుల గురించి కృషిచేస్తామని కేశవ్ తెలిపారు. కేంద్ర బడ్జెట్‌తో ఏమాత్రం సంబంధంలేకుండా రాష్ట్ర బడ్జెట్ ఉంటుందని, అయినా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించేందుకు సిద్ధంగా ఉందని కేశవ్ తెలిపారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని మంత్రిత్వ శాఖల నుంచి వివరాలు సేకరించి కేంద్ర బడ్జెట్ సన్నాహక సమావేశంలో ప్రస్తావించామని ఆయన తెలిపారు. అంతేగాక.. గాడి తప్పిన రాష్ట్రాన్ని నిలబెట్టి పరుగులు పెట్టించాలన్నది సీఎం చంద్రబాబు ఆలోచనన్నారు. త్వరలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజల ముందుంచుతామని ఆయన చెప్పారు. ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేస్తామని పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు.

క్లుప్తంగా...

'రెవిట్ ఆర్కిటెక్చర్' పై అధ్యాపకులకు శిక్షణ

సాక్షి, అమరావతి: అధ్యాపకులు నిత్యం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ విద్యార్థులకు బోధన చేయాలని సాంకేతిక విద్యాశాఖ జేడీ వి.పద్మారావు సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ, సాంకేతిక విద్య, శిక్షణామండలి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్–చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో వీవీఐటీ కళాశాలకు చెందిన సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకులకు 'రెవిట్ ఆర్కిటెక్చర్' అనే అంశంపై వారం రోజులుగా నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ..అధ్యాపకుల శిక్షణ కోసం వీవీఐటీలో పూర్తిస్థాయి సాంకేతిక వనరులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏపీ సాంకేతిక విద్య, శిక్షణ మండలి సెక్రటరీ కె.వి.రమణబాబు, వీవీఐటీ అడ్మిన్ డీన్ ఎస్.కుమారస్వామి, డైరెక్టర్ రావెల నవీన్ పాల్గొన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ సివిల్ విభాగం అధ్యాపకులకు ప్రొఫెసర్ దినేశ్ కుమార్ ఆధ్వర్యంలో రెవిట్ ఆర్కిటెక్చర్, బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్, డాక్యుమెంటేషన్, రెండరింగ్, విజువలైజేషన్ తదితర సాంకేతిక అంశాల్లో శిక్షణ ఇచ్చారు.

రాజధానిని మరోచోట నిర్మించాలి

సీఎం చంద్రబాబుకు మేడా శ్రీనివాస్ లేఖ



చంద్రబాబుకు రాసిన లేఖను చూపుతున్న మేడా శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్‌కు అరిష్టంగా మారిన రాజధాని అమరావతిని మార్చాలని, మరో ప్రాంతంలో మహోన్నత రాజధానిని నిర్మించాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన లేఖ రాశారు. ఆ లేఖను రాజమహేంద్రవరం ఆర్యాపురంలోని తమ పార్టీ కార్యాలయంలో శనివారం మీడియాకు విడుదల చేశారు. 'అమరావతిని రాజధానిగా ప్రకటించినప్పటి నుంచి పాలనతోపాటు ఎన్నో సమస్యలు రాష్ట్రాన్ని వెంటాడుతున్నాయి. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను నిర్వీర్యం చేసి రాజధాని సాకుతో రాష్ట్రానికి నష్టం చేయొద్దు. ప్రకృతి ఆగ్రహానికి గురికావొద్దు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా అమరావతిని రాజధానిగా ఉపసంహరించుకోవాలి. నిపుణుల కమిటీ సూచన మేరకు మరో ప్రాంతంలో రాజధాని నిర్మించాలి' అని శ్రీనివాస్ ఆ లేఖలో తెలిపారు.

భోగాపురం ఎయిర్‌పోర్టు తనిఖీలు జీఎస్టీ స్టాఫ్‌కు అప్పగించాలి

అఖిల భారత సెంట్రల్ టాక్స్ సూపరింటెండెంట్స్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: త్వరలో ప్రారంభంకానున్న భోగాపురం ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ తనిఖీల బాధ్యతను కస్టమ్స్ స్టాఫ్‌కు కాకుండా జీఎస్టీ స్టాఫ్‌కు అప్పగించాలని అఖిల భారత సెంట్రల్ టాక్స్ సూపరింటెండెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. విజయవాడలో శనివారం ఆల్ ఇండియా అసోసియేషన్ ఆఫ్ సెంట్రల్ ట్యాక్స్ గెజిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ విజయవాడ ఎయిర్ పోర్టులో జీఎస్టీ అధికారులే తనిఖీలు నిర్వహిస్తున్నారని, అదే రీతిలో భోగాపురం ఎయిర్‌పోర్టులో కూడా జీఎస్టీ స్టాఫ్‌కే తనిఖీల బాధ్యతను అప్పగించాలని కోరారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి జీఎస్టీ అధికారుల కేడర్ కంట్రోల్ అథారిటీ ప్రస్తుతం హైదరాబాద్ జీఎస్టీ చీఫ్ కమిషనర్ ఆధీనంలో ఉందని, దాన్ని విశాఖపట్నం జీఎస్టీ చీఫ్ కమిషనర్ పరిధిలోకి తేవాలని సమావేశం తీర్మానించింది. వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 50 మంది సెంట్రల్ ట్యాక్స్ సూపరింటెండెంట్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. ఆల్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు హర్ప్రీత్‌సింగ్, లోకనాథ్, రవి మాలిక్, యుగంధర్ కుమార్, మూర్తి, గాదె శ్రీనివాసరెడ్డి, తిలక్, ఈశ్వర్, నవీన్‌రాజు, కుమార్ మాట్లాడారు.

'పీఎం సూర్య ఘర్'కు సమన్వయ కమిటీలు

ఉత్తర్వులు జారీ చేసిన ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

సాక్షి, అమరావతి: పీఎం సూర్యఘర్ పథకం ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ రూఫ్ టాప్ ప్యానెళ్లను అమర్చే కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో కో–ఆర్డినేషన్ (సమన్వయం) కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర కమిటీ (ఎస్ఎల్‌సీసీ) చైర్మన్‌గా చీఫ్ సెక్రటరీ, మెంబర్ కన్వీనర్‌గా స్పెషల్ చీఫ్ సెక్రటరీతో పాటు 10 మంది సభ్యులను నియమించారు. అలాగే జిల్లా కమిటీ (డీఎల్‌సీసీ)లో కలెక్టర్ చైర్ పర్సన్‌గా, ఆరుగురు సభ్యులుంటారు. రాష్ట్రంలో ఈ పథకం అమలు బాధ్యతలను (ఇంప్లిమెంటెడ్ ఏజెన్సీ) ఆంధ్రప్రదేశ్ నూతన పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్ఆర్ఈడీసీఏపీ)కు అప్పగించారు.

రాజ్యాంగ వ్యవస్థలపై రాజకీయ దాడి

ఏపీపీఎస్సీ సభ్యులు రాజీనామా చేయాలని ఒత్తిడి

- జీఏడీ కార్యదర్శి (సర్వీసెస్) పోలా భాస్కర్ మితిమీరిన స్వామి భక్తి
- సర్వీస్ కమిషన్ సభ్యులు ఆరేళ్లు లేదా 62 ఏళ్ల వయసు వరకు కొనసాగే అవకాశం
- కానీ సభ్యులకు ఫోన్లు చేసి బెదిరింపులు.. ఐఏఎస్‌లే విస్తుపోతున్న వైనం
- రాజీనామా చేయకుంటే తప్పుడు కేసులు పెట్టి ఒత్తిడి తేవాలని కుట్ర
- సమాచార హక్కు కమిషనర్లు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌పై కూడా ఒత్తిడి
- గతంలో టీడీపీ పాలనలో వచ్చిన సభ్యులు జగన్ ప్రభుత్వంలోనూ కొనసాగింపు
- ఏపీపీఎస్సీ ఇంటర్వ్యూ బోర్డుల్లోనూ చైర్మన్లుగా బాధ్యతల నిర్వహణ
- ప్రొఫెసర్ పద్మరాజు పదవీ కాలం తర్వాత నన్నయ వర్సిటీ వీసీగా నియామకం
- చివరిరోజు వరకు కొనసాగిన నాటి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి నిమ్మగడ్డ రమేష్
- ఇప్పుడు తద్భిన్నంగా, దుర్మార్గంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం



సాక్షి, అమరావతి : తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే రాజ్యాంగ వ్యవస్థలపై దాడికి దిగింది. రాజ్యాంగబద్ధ పోస్టుల్లో ఉన్న వారు సైతం వెంటనే దిగిపోవాలని ఒత్తిడి తెస్తోంది. ఇదివరకు టీడీపీ ప్రభుత్వ (2014–2019) హయాంలో ఆయా రాజ్యాంగబద్ధ పదవుల్లో నియమితులైన వారు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొనసాగారన్న వాస్తవాన్ని ప్రస్తుత టీడీపీ సర్కారు విస్మరించి కక్ష సాధింపులకు దిగింది. గత ప్రభుత్వంలో ఏపీపీఎస్సీ చైర్మన్‌గా నియమితులైన రిటైర్డ్ డీజీపీ గౌతమ్ సవాంగ్‌తో పాటు ఇతర సభ్యులను, సమాచార హక్కు చట్టం కమిషనర్లతో పాటు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌పై కూడా ఒత్తిడి తెచ్చి రాజీనామాలు చేయాలని తీవ్ర ఒత్తిడి తెస్తోంది. రాజ్యాంగం సృష్టించిన ఈ పోస్టుల్లో నియమితులైన వారు ప్రభుత్వాలు మారినా పదవీ కాలం పూర్తయ్యే వరకు తొలగించడం వీలు కాదు. గతంలో రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఇదే విధానం కొనసాగింది. అలాగే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనూ గత టీడీపీ ప్రభుత్వంలో నియమితులైన ఏపీపీఎస్సీ చైర్మన్, సభ్యులు పూర్తి కాలం కొనసాగారు. కానీ ఇప్పుడు అందుకు భిన్నంగా టీడీపీ ప్రభుత్వం ప్రవర్తిస్తోంది. రాజ్యాంగబద్ధమైన పోస్టుల్లో నియమితులైన వారికి పదవీ కాలం ముగిసే వరకు కొనసాగే అధికారం ఉన్నా వారిపై ఒత్తిడి తెచ్చి పోస్టులకు రాజీనామా చేసి వెళ్లిపోవాలని బెదిరింపులకు దిగుతున్నారు. ఈ బాధ్యతలను సీనియర్ ఐఏఎస్ అధికారి, సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) సర్వీసెస్ కార్యదర్శి పోలా భాస్కర్ తీసుకోవడం విస్మయం కలిగిస్తోంది. ఈ నిర్ణయంపై సాటి ఐఏఎస్ అధికారులే విస్తుపోతున్నారు. మరోపక్క అవసరమైతే సభ్యులపై కేసులు పెట్టి అయినా లొంగ దీసుకోవాలని టీడీపీ రాజకీయ పెద్దలు పావులు కదుపుతున్నారు. గత ప్రభుత్వంలో రాజకీయ పరమైన పదవుల్లో నియమితులైన (నామినేటెడ్) వివిధ బోర్డులు, కార్పొరేషన్ల చైర్మన్లు, సభ్యులు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. అయితే, రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారిని సైతం రాజీనామా చేయాలని ఒత్తిడి తేవడమంటే రాజ్యాంగ వ్యవస్థలపై రాజకీయ దాడేనని ప్రజాస్వామ్యవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియమితులైన వారి పదవీ కాలం

పదవి	పేరు	గడువు (నుంచి-వరకు)	
చైర్మన్	గౌతమ్ సవాంగ్	19-02-2022	09-07-2025
మెంబర్	డాక్టర్ జీవీ సుధీర్‌రెడ్డి	24-10-2019	23-10-2025
మెంబర్	ఎస్.సలాంబాబు	24-10-2019	23-10-2025
మెంబర్	ఏవీ రమణారెడ్డి	24-03-2020	23-10-2026
మెంబర్	పి.సుధీర్	03-05-2021	02-03-2027
మెంబర్	సోనీవుడ్	22-04-2021	21-04-2027
మెంబర్	డాక్టర్ బి.సెలీనా	26-06-2023	25-06-2029
మెంబర్	డాక్టర్ సీపీ శంకర్‌రెడ్డి	20-07-2023	19-07-2029
మెంబర్	సిద్ధం శివరామ్	08-02-2024	07-02-2030

గత టీడీపీ ప్రభుత్వంలో నియమితులై ఆరేళ్లు కొనసాగిన సభ్యులు

పదవి	పేరు	గడువు (నుంచి- వరకు)	
చైర్మన్	ఉదయభాస్కర్	27-11-2015	26-11-2021
మెంబర్	ప్రొ.జి.రంగజనార్ధన	14-09-2016	19-01-2021
(జేఎన్టీయూ వీసీగా అవకాశం రావడంతో రాజీనామా చేశారు)			
మెంబర్	కె.విజయకుమార్	14-09-2016	13-09-2022
మెంబర్	ప్రొ.గుర్రం సుజాత	19-09-2016	19-06-2020
మెంబర్	ప్రొ.కె.పద్మరాజు	14-09-2016	13-09-2022
మెంబర్	సేవారూప	14-09-2016	17-03-2022
మెంబర్	ఎం.వి.రామరాజు	18-02-2019	19-01-2022

పూర్తి కాలం పదవులని తెలిసీ ఒత్తిడి

కేంద్రంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు రాష్ట్రాలకు ప్రత్యేకంగా ఉద్యోగాల భర్తీ కోసం సర్వీస్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని భారత రాజ్యాంగంలోని 315 ఆర్టికల్ చెబుతోంది. దీనికి చైర్మన్, సభ్యులకు నిర్దిష్ట పదవీ కాలాన్ని ఇచ్చింది. ఏపీపీఎస్సీ కూడా అలా ఏర్పడి, చైర్మన్‌కు మూడేళ్లు, సభ్యులకు ఆరేళ్ల వరకు లేదా 62 ఏళ్ల వయసు వచ్చే వరకు (ఏది ముందు పూర్తయితే అది) ఆ బాధ్యతల్లో కొనసాగుతారు. ఫైనాన్స్ కమిషన్, సమాచార హక్కు కమిషన్, రెరా, ఎస్సీ, ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్లు కూడా రాజ్యాంగబద్ధ సంస్థలే. వీటి కమిషనర్లు/చైర్మన్లు, సభ్యులు ప్రభుత్వాలు మారినా వారికి ఇచ్చిన నిర్దిష్ట కాల పరిమితి మేరకు పని చేయాల్సి ఉంటుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014–19 మధ్య నియమితులైన ఏపీపీఎస్సీ సభ్యులు జగన్ ప్రభుత్వంలో 2022 వరకు పూర్తి కాలం కొనసాగారు. అంతేగాక వీరు బోర్డులో కీలక బాధ్యతలు సైతం నిర్వర్తించడంతో పాటు 2018 గ్రూప్–1 ఇంటర్వ్యూలు కూడా పూర్తి చేశారు. ఏపీపీఎస్సీ చైర్మన్‌గా ప్రొఫెసర్ ఉదయ్ భాస్కర్ 2015 నవంబర్ 27 తేదీన నియమితులై 2021 నవంబర్ 26 వరకు పూర్తి కాలం కొనసాగారు. నాడు టీడీపీ ప్రభుత్వం నియమించిన ఆరుగురు సర్వీస్ కమిషన్ సభ్యుల్లో ప్రొఫెసర్ జి.రంగ జనార్ధన మాత్రమే జేఎన్టీయూ వైస్ చాన్సలర్‌గా అవకాశం రావడంతో సభ్యుడిగా రాజీనామా చేశారు. అయినప్పటికీ ప్రొఫెసర్ రంగ జనార్ధన దాదాపు నాలుగేళ్ల నాలుగు నెలల ఐదు రోజుల పాటు కొనసాగారు. మిగిలిన ఐదుగురు సభ్యులు పూర్తి పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఏనాడూ సభ్యులను రాజీనామా చేయాలని గానీ, వారికి ప్రాధాన్యం తగ్గించడం గానీ చేయలేదు. గత టీడీపీ ప్రభుత్వం నియమించిన సభ్యుల్లో ప్రొఫెసర్ పద్మరాజు, విజయకుమార్, సేవారూప, రామరాజు జగన్ ప్రభుత్వంలోనూ కొనసాగారు. వీరిలో ప్రొఫెసర్ పద్మరాజు, విజయకుమార్ ఇద్దరూ 2018 గ్రూప్–1 అభ్యర్థులకు 2022లో ఏపీపీఎస్సీ నిర్వహించిన ఇంటర్వ్యూలకు రెండు బోర్డుల్లో చైర్మన్లుగా వ్యవహరించారు. ప్రొఫెసర్ పద్మరాజు సర్వీస్ కమిషన్ సభ్యుడిగా ఆరేళ్ల కాలాన్ని పూర్తి చేసిన అనంతరం నన్నయ యూనివర్సిటీకి వైస్ చాన్సలర్‌గా నియమించి జగన్ ప్రభుత్వంప్రతిభకు పట్టం కట్టింది. అలాగే అందరు సభ్యులు, చైర్మన్ ప్రొఫెసర్ ఉదయ్‌భాస్కర్ కూడా రాజ్యాంగం కల్పించిన పదవీ కాలం పూర్తి చేసుకుని వైదొలిగారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా ఆయా సభ్యులు పదవీ కాలం పూర్తయిన తర్వాతే వివిధ సామాజిక వర్గాల నుంచి అర్హతలున్న వారు, సమర్థతతో పనిచేసే వారిని, నిరుద్యోగుల కష్టాలు తెలిసిన వారిని ఏపీపీఎస్సీ సభ్యులుగా నియమించింది. కానీ ఇప్పుడు ఐఏఎస్ అధికారి పోలా భాస్కర్.. చంద్రబాబు ప్రభుత్వం తరపున వకాలత్ పుచ్చుకుని సభ్యులను తప్పించేందుకు యత్నిస్తుండటం గమనార్హం.

తప్పుడు కేసులకు రంగం సిద్ధం

ప్రస్తుతమున్న ఏపీపీఎస్సీ చైర్మన్, సభ్యులు మొత్తం 9 మందిని ఎలాగైనా పదవుల్లో నుంచి తప్పించేందుకు ప్రభుత్వ పెద్దలు పావులు కదుపుతున్నట్టు సమాచారం. అవసరమైతే వారిపై ఏదో ఒక కేసు బనాయించాలని చూస్తున్నట్టు తెలిసింది. గ్రూప్–2 మెయిన్స్ కొద్ది రోజులు వాయిదా వేయాల్సిందిగా ఇటీవల ఓ మంత్రిని కలిసి నిరుద్యోగ అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. అయితే, ఇప్పుడున్న సర్వీస్ కమిషన్ సభ్యులను తప్పించి పోస్టులను భర్తీ చేస్తామని సదరు మంత్రి సమాధానమిచ్చారు. అందుకోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆలోచిస్తున్నామని, అవసరమైతే వారిపై ఏదో ఒక కేసు పెట్టి తప్పిస్తామని పేర్కొన్నట్టు తెలిసింది. ఇప్పటికే ఏపీపీఎస్సీ సభ్యుల కుటుంబ వివరాలు, ఆస్తుల వివరాలు సేకరించినట్టు సమాచారం. ప్రస్తుత ప్రభుత్వం రాజకీయంగా కక్ష సాధింపు చర్యలకు దిగుతుందనడానికి పోలా భాస్కర్ ఒత్తిడి, సభ్యుల కుటుంబ వివరాలు సేకరించడమే నిదర్శనంగా కనిపిస్తోంది.

ఎన్నికల ప్రధానాధికారి, స.హ చట్టం సభ్యులపై కూడా..

ఇటీవల ఎన్నికల్లో టీడీపీ గెలిచిన వెంటనే ఆ వర్గం నాయకులు, సానుభూతిపరులు రాష్ట్ర ఎస్టీ కమిషన్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. చైర్మన్‌తో పాటు సభ్యులు కూడా తమ పదవులకు రాజీనామా చేయాలని ఒత్తిడి చేశారు. ఇది రాజ్యాంగబద్ధమైన సంస్థ అని తెలియక టీడీపీ నాయకులు చేసిన అంశంగా చెప్పుకున్నారు. కానీ చట్టం, రాజ్యాంగంపై పూర్తి అవగాహన ఉన్న కొందరు ఐఏఎస్‌లు సైతం ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని, సమాచార హక్కు చట్టం చైర్మన్, సభ్యులను సైతం రాజీనామా చేయాలని ఒత్తిడి తేవడం దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కనిపిస్తుండటం విడ్డూరం. గత టీడీపీ ప్రభుత్వంలో నియమితులై వివాదాస్పద ఎన్నికల ప్రధానాధికారిగా ముద్రపడిన నిమ్మగడ్డ రమేష్ కుమార్ చివరి వరకు తన పదవిలో కొనసాగారు. తన పదవి చివరి రోజు కూడా ఆయన కమిషన్ కార్యాలయంలోనే మధ్యాహ్న భోజనం చేసి సాయంత్రం వైదొలిగారు. అయితే తాజాగా ప్రభుత్వ పెద్దల ప్రాపకం కోసం ఐఏఎస్ అధికారి 'రాజకీయ' బాధ్యతలు తీసుకోవడం రాష్ట్ర సివిల్ సర్వెంట్స్ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారింది. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన అధికారులే అందుకు విరుద్ధంగా ప్రవర్తించడం చూస్తుంటే వచ్చే ఐదేళ్లలో ఇంకెన్ని దారుణాలు చూడాల్సి వస్తుందోనని చట్టం తెలిసిన వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అదే జరిగితే నిరుద్యోగులకు మళ్లీ కష్టాలే!

గత టీడీపీ ప్రభుత్వం నియమించిన సర్వీస్ కమిషన్ సభ్యులు పూర్తి పదవీ కాలం అనంతరం తప్పుకోవడంతో ఖాళీ అయిన సభ్యుల స్థానాలను జగన్ ప్రభుత్వం 2019 అక్టోబర్ నుంచి భర్తీ చేయడం ప్రారంభించింది. ఇలా ఇప్పటి వరకు ఎనిమిది మంది సభ్యులను నియమించింది. వీరు పదవీ కాలం ఆరేళ్లు పూర్తి చేసుకుని వైదొలగాలి. ఈ క్రమంలో వచ్చే ఏడాది జూలైలో చైర్మన్, అక్టోబర్‌లో ఇద్దరు సభ్యులు, 2026 మార్చిలో ఒకరు, 2027 ఏప్రిల్, మే నెలల్లో ఇద్దరు సభ్యులు, 2029 జూన్, జూలైలో మరో ఇద్దరు, 2030 ఫిబ్రవరిలో ఒకరు పదవి నుంచి తప్పుకోవాలి. ఇది రాజ్యాంగం వారికి కల్పించిన హక్కు. కానీ సభ్యులందరినీ ఏదోలా తప్పించి, గతంలో మాదిరిగానే టీడీపీ సభ్యులతో నింపేయాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే జరిగితే ప్రస్తుతం సవ్యంగా సాగుతున్న సర్వీస్ కమిషన్ పనితీరు గతంలో మాదిరిగానే గాడి తప్పడంతో పాటు వివిధ ఉద్యోగ పరీక్షల నిర్వహణ, పోస్టుల భర్తీ వంటివి నిలిచిపోయే ప్రమాదం ఉంది.

కోర్టు ఆదేశాలు తుంగలో తొక్కేస్తారా?

- సీఆర్‌డీఏ అధికారులపై ఏపీ మాజీ ఏఏజీ పొన్నవోలు మండిపాటు
- హైకోర్టు వద్దని చెప్పినా తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం కూల్చివేత
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం టీడీపీ భవనాలను ఎప్పుడూ కూల్చలేదు
- ప్రొవిజినల్ ఆర్డర్స్‌పై అధికారులు కూల్చివేత చేపట్టలేరు
- కోర్టు చెప్పింది ఒకటి.. సీఆర్‌డీఏ చేసింది మరొకటి
- అధికారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునేలా పోరాడతాం

సాక్షి, హైదరాబాద్ : తాడేపల్లిలో కొత్తగా నిర్మిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయాన్ని సీఆర్డీయే అధికారులు కూల్చి వేయడం చట్ట విరుద్ధమని, హైకోర్టు ఉత్తర్వులున్నా లెక్క చేయకుండా వ్యవహరించారని మాజీ అడిషనల్ అడ్వొకేట్ జనరల్, సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను ఖాతరు చేయని దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. శనివారం ఆయన హైదరాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు.



పొన్నవోలు సుధాకర్

'అధికారంలోకి రావడంతోనే టీడీపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు కార్యాలయాలు కట్టుకునేందుకు 2016లో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే 340 జీవో తెచ్చారు. దీని ప్రకారం 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో ఎకరం వెయ్యి రూపాయల చొప్పున చాలా జిల్లాల్లో పార్టీ కార్యాలయాల కోసం భూములు పొందారు. పాలకులు మారిపోయినా చట్టం మాత్రం మారదు. అదే చట్ట ప్రకారం కేంద్ర కార్యాలయ నిర్మాణం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2 ఎకరాలు తీసుకుంది. భవన నిర్మాణానికి అనుమతి కోసం దరఖాస్తు చేశాం. ఈ ప్రభుత్వం రావడంతోనే మాకు ప్రొవిజినల్ ఆర్డర్ జారీ చేశారు. నోటీసుపై 10వ తేదీ అని ఉన్నా, మాకు ఇచ్చింది మాత్రం 15వ తేదీ. దీనిపై హైకోర్టులో లంచ్ మోషన్ దాఖలు చేసి ఉపశమన ఆదేశాలు పొందాం. చట్ట ప్రకారమే ముందుకు సాగాలని న్యాయస్థానం సీఆర్డీయేను ఆదేశించింది. న్యాయ వ్యవస్థ అంటే లెక్కలేనితనంతో ఆ ఆదేశాలను తుంగలో తొక్కారు' అని మండిపడ్డారు.

ప్రజావేదికతో సంబంధం లేదు

ప్రజా వేదికతో కొందరు పోలుస్తుండటం సరికాదని.. దానికి, దీనికి సంబంధం లేదని పొన్నవోలు తెలిపారు. 'నదీ పరివాహక ప్రాంతంలో ఎలాంటి నిర్మాణం చేపట్టడానికి వీల్లేదు. అలా ఎవరు చేసినా అది పూర్తి చట్ట వ్యతిరేకం. అలా చేస్తే ప్రజలు ముంపు సమస్య ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదనే.. చట్ట ప్రకారం నాటి ప్రభుత్వం ముందుకు వెళ్లింది. అంతే తప్ప అందులో కక్ష పూరితం లేదు. వైఎస్సార్‌సీపీకి ప్రభుత్వం ఇచ్చిన భూమిలో నిర్మాణం చేసుకోవడం చట్ట వ్యతిరేకం కాదు. ఈ వివాదం ఇప్పుడు అధికారులకు, కోర్టుకు మధ్య అన్న విధంగా మారింది. అధికారంలో ఉండగా వైఎస్సార్‌సీపీ ఏ ఒక్క అధికారిని ప్రభావితం చేయలేదు. టీడీపీ కట్టుకున్న పార్టీ కార్యాలయాలను కూల్చలేదు. వారు పొందిన స్థలాలను వెనక్కు తీసుకోలేదు. ఐదేళ్లు హుందాగా వ్యవహరించింది. సామాన్యుడు నిర్మాణం కోసం ఎలా అనుమతి పొందుతాడో అలాగే వైఎస్సార్‌సీపీ ముందుకు వెళ్లింది. ఏదేమైనా చట్ట విరుద్ధంగా కోర్టు ఆదేశాలను తుంగలో తొక్కిన అధికారుల్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకునేలా పోరాడతాం' అని వివరించారు.

సీఆర్డీయే ప్రకటనలో అంశాలు వాస్తవం కాదు

తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి సంబంధించి ఈనెల 1వ తేదీనే కన్ఫర్మేషన్ ఆర్డర్ ఇచ్చామంటూ సీఆర్డీయే పేరుతో ఒక ప్రకటన సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతోందన్న విషయం మా దృష్టికి వచ్చిందని పొన్నవోలు సుధాకర్ రెడ్డి అన్నారు. అయితే ఇందులోని అంశాలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయని చెప్పారు. సీఆర్డీయే ప్రొవిజనల్ ఆర్డర్‌పై ఈనెల జూన్ 10వ తేదీ వేసి, మాకు జూన్ 15వ తేదీన ఇచ్చారు. నిన్న (శుక్రవారం) కోర్టులో దీనిపైనే వాదోపవాదాలు జరిగాయన్నారు. చట్టాన్ని ఫాలో అవ్వాల్సిందిగా హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని, ఇందుకు సంబంధించిన పత్రాలను మీ ముందు (మీడియా) ఉంచుతున్నామన్నారు.

కూల్చి వేయము అని కోర్టుకు చెప్పి..

విచారణ సందర్భంగా న్యాయస్థానంలో వాదనలు వినిపిస్తూ ఎలాంటి కూల్చివేతలు చేపట్టబోమని అధికారులు చెప్పారని పొన్నవోలు తెలిపారు. చట్ట ప్రకారమే వ్యవహరిస్తామని చెప్పారన్నారు. రాత్రికి రాత్రే జేసీబీలు తీసుకొచ్చి కూల్చివేత చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సూర్యోదయానికి ముందు.. సూర్యాస్తమయానికి తర్వాత ఎలాంటి కూల్చివేత కార్యక్రమాలు చేపట్టవద్దని హైకోర్టు ఫుల్ బెంచ్ ప్రభుత్వాలకు గతంలోనే తేల్చి చెప్పింది. కన్ఫర్మేషన్ ఆర్డర్ ఇచ్చేంత వరకు కూల్చి వేయడానికి వీల్లేదు. కన్ఫర్మేషన్ ఆర్డర్ ఇచ్చిన తర్వాత అవతలి వారి వాదనలు వినాల్సి ఉంటుంది. అందుకు 15 రోజుల సమయం ఉంటుంది. అయినా ప్రభుత్వం ముందుకు వెళితే.. బాధితులు ట్రిబ్యునల్‌కు కూడా వెళ్లవచ్చు. ట్రిబ్యునల్‌లో మాకు వ్యతిరేకంగా తీర్పు వస్తే.. అప్పుడు ల్యాండ్ వ్యాల్యూపై 20 శాతం ఫైన్ స్వీకరించాలి. అట్లా పర్మిషన్ తీసుకోకుండా కడితే శిక్షార్హులు. కూల్చి వేత అనేది ఆఖరి అస్త్రం. అది కూడా ట్రిబ్యునల్ తీర్పు తర్వాతే. ప్రొవిజినల్ ఆర్డర్ మీద కూల్చి వేయడం చట్ట వ్యతిరేకం. ఇది చట్ట ప్రకారం పాటించాల్సిన విధానం. కానీ, ఇలాంటివేవీ పాటించ లేదు. ఈ కేసులో న్యాయవాదిగా ఉన్న నేనే కోర్టు ఆదేశాలను సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్‌కు మెయిల్ ద్వారా, వాట్సాప్ ద్వారా పంపించా. సీఆర్‌డీఏ చర్య కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది. వారిపై సివిల్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరతాం' అని వెల్లడించారు.

2014-2019 మధ్య పార్టీ ఆఫీస్ నిర్మాణం కోసం టీడీపీ కేటాయించుకున్న స్థలాలు

జిల్లా	విస్తీర్ణం	లీజుకాలం	లీజు రేటు (ఏడాదికి)
వైఎస్సార్ కడప	ఎకరం	33 ఏళ్లు	ఎకరం రూ.1000
శ్రీకాకుళం	2 ఎకరాలు	99 ఏళ్లు	రూ.25 వేలు
గుంటూరు	3.65 ఎకరాలు	99 ఏళ్లు	ఎకరం రూ.1000
విజయనగరం	ఎకరం	33 ఏళ్లు	ఎకరం రూ.1000
గుంటూరు	20 సెంట్లు	33 ఏళ్లు	ఎకరం రూ.1000
కృష్ణా	95 సెంట్లు	33 ఏళ్లు	ఎకరం రూ.1000
ప్రకాశం	ఎకరం 96 సెంట్లు	33 ఏళ్లు	ఎకరం రూ.1000
వైఎస్సార్ కడప	2 ఎకరాలు	33 ఏళ్లు	ఎకరం రూ.1000
చిత్తూరు	ఎకరం 20 సెంట్లు	33 ఏళ్లు	ఎకరం రూ.1000
శ్రీకాకుళం	30 సెంట్లు	33 ఏళ్లు	రేట్లు పేర్కొనలేదు

ప్రభుత్వ బడుల్లో ప్రవేశాల పెంపునకు 'విద్యా ప్రవేశం'

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు (ఎన్‌రోల్‌మెంట్) పెంచేందుకు సమగ్ర శిక్ష ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. ఇందుకోసం 4 వారాల పాటు అన్ని పాఠశాలల పరిధిలో 'విద్యా ప్రవేశం' పేరుతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈ నెల 24 నుంచి జూలై 25 వరకు విద్యా ప్రవేశం కార్యక్రమం కొనసాగాలన్నారు. 1–8 వతరగతి వరకు నూరు శాతం ప్రవేశాల నమోదు, పర్యవేక్షణ కోసం దీక్ష ప్లాట్‌ఫారంను వినియోగించుకోవాలని సూచించారు. బడి ఈడు పిల్లలు ప్రతి ఒక్కరూ పాఠశాలల్లో చేరేలా ప్రోత్సహించేందుకు ఇప్పటికే 'నేను బడికి పోతా' పేరుతో ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించింది. జూలై 12 వరకు గ్రామ, పట్టణ వార్డు స్థాయిలో ఈ కార్యక్రమం కొనసాగుతుంది. 6–14 ఏళ్ల వయసున్న పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించేందుకు 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని అమలు చేస్తుండగా, ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు ఇప్పుడు 'విద్యా ప్రవేశం' డ్రైవ్‌ను ప్రారంభించనున్నారు.

ప్రభుత్వం రూ.2,000 కోట్ల అప్పు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఈ నెల 25వ తేదీన రూ.2,000 కోట్లు అప్పు చేయనుంది. ఇందులో 11 ఏళ్ల కాలపరిమితితో రూ.1,000 కోట్లు, 20 ఏళ్ల కాలపరిమితితో మరో రూ.1,000 కోట్లను రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలను వేలం వేయడం ద్వారా మొత్తం రూ.2,000 కోట్ల రుణాన్ని సేకరించనుంది. ఇందుకు సంబంధించి ఆర్‌బీఐ ఈ నెల 25వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలకు వేలం నిర్వహించనుంది. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.2,000 కోట్లు అప్పు చేయనుంది.

తహసీల్దార్లను పాత జిల్లాలకు కేటాయించాలి

రెవెన్యూ మంత్రిని కోరిన రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లను తిరిగి వారి పాత జిల్లాలకు కేటాయించాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరింది. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రమేష్‌కుమార్ తదితరులు శనివారం మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. తహసీల్దార్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా ఐదు నెలలుగా పనిచేశారని, వారి ఆధ్వర్యంలోనే విజయవంతంగా ఎన్నికల నిర్వహణ జరిగిందని తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం : 23 : జూన్ : 2024

కైవార పౌర్ణమి రథోత్సవం

చింతామణి: కైవారంలో సద్గురు యోగినారేయణ మఠం పుణ్యక్షేత్రంలో వైశాఖ మాస పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ అమరణ నారేయణస్వామి, సద్గురు తాతయ్య ఉత్సవ మూర్తులకు అభిషేకం, మహామంగళారతి చేసి పురవీధుల్లో రథోత్సవం జరిపారు. పలు జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు.


ఆలయ ప్రాంగణంలో రథోత్సవం

న్యూస్‌రీల్

రైలు కింద పడి ఆత్మహత్య


ఘటనాస్థలంలో స్థానికులు, పోలీసులు

గౌరిబిదనూరు: తాలూకాలో కల్లూడి వద్ద సమీపంలో పుటాపుర్లహళ్ళికి చెందిన అంబరీశ్ (32) అనే వ్యక్తి శనివారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఇతనికి 3 సంవత్సరాల క్రితం వివాహమైంది. 2 సంవత్సరాల కూతురు ఉంది. తన చావుకు ఎవరూ కారణం, కాదని నేనే కారణమని వాట్సాప్ స్టేటస్ లో పెట్టుకొన్నాడు. కొద్దినెలల నుంచి బెంగుళూరులోని కంపెనీలో పనికి వెళుతున్నట్లు తెలిసింది. కుటుంబ కలహాల కారణమని అనుమానిస్తున్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

గుర్రపు పందేలకు హైకోర్టు బ్రేక్

శివాజీనగర: బెంగళూరు టర్ఫ్‌క్లబ్ (రేస్‌కోర్సు)లో గుర్రపు పందేల నిర్వహణపై సింగిల్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై శనివారం హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే విధించింది. రేస్‌కోర్సులో షరతులకు మేరకు గుర్రపు పందేలు నిర్వహించేందుకు అనుమతి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ప్రశ్నిస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వీ.అంజారియా, న్యాయమూర్తి కే.వీ.అరవింద్ విచారణ చేశారు. గుర్రపు పందేల నిర్వహణకు అనుమతి ఇచ్చిన సింగిల్ బెంచ్ ఉత్తర్వులను నిలిపివేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

శిరాకు బస్సులు అరకొరే


బస్టాండులో వేచి ఉన్న ప్రయాణికులు

తుమకూరు: జిల్లాలో శిరా పట్టణం మీదుగా రెండు జాతీయ రహదారులు ఉన్నాయి, కానీ వచ్చే బస్సుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. వందలాది ప్రయాణికులు, విద్యార్థులు ప్రతి రోజూ బస్సుల కోసం గంటలకొద్దీ నిరీక్షించాలి, ఒకటీ అరా బస్సు వచ్చినా సీట్లు దొరక్క తీవ్ర అవస్థలు పడాలి. వచ్చె కొన్ని బస్సులు శిరా బైపాస్‌కు వచ్చి వెళ్తాయి తప్ప పట్టణంలోకి వచ్చేది తక్కువ. బెంగళూరు- పూణె హైవేలో రోజూ అనేక బస్సులు ప్రయాణం సాగిస్తుంటాయి, కానీ పట్టణంలోని బస్టాండుకు మాత్రం రావు. అటు తుమకూరుకు, ఇటు బెంగళూరుకు వెళ్లాలని ఎంతోమంది బస్టాండులో ఎదురు చూస్తున్నా ఉపయోగం ఉండదు. శిరాకు ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు అధికారులను డిమాండ్ చేశారు.

సూరజ్‌పై ఫిర్యాదు వస్తే చర్యలు: హోంమంత్రి

బనశంకరి: జేడీఎస్ ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణపై వినబడుతున్న స్వలింగ సంపర్క లైంగికదాడి ఆరోపణల పట్ల ఎలాంటి ఫిర్యాదు నమోదు కాలేదని హోంమంత్రి పరమేశ్వర్ చెప్పారు. శనివారం సదాశివనగరలో విలేకరులతో మాట్లాడుతూ.. సూరజ్ పై అధికారికంగా ఫిర్యాదు చేసిన తక్షణం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధిత యువకుడు హోం మంత్రికి లేఖ రాశామని టీవీల్లో చెప్పారని, కానీ తనకు ఎలాంటి లేఖ అందలేదన్నారు. ప్రస్తుతం తనిఖీ చేస్తున్నామన్నారు. లేఖ రాయడానికి, ఫిర్యాదు చేయడానికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. కాగా, బీజేపీ నేతలు గ్యారంటీ పథకాలు తీసుకోవడం లేదా అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడానికి ప్రైవేటు సంస్థ నుంచి సలహాలు తీసుకుంటున్నామని, ఇది బీజేపీ నేతలకు కడుపు మంటగా ఉందని పరమేశ్వర్ విమర్శించారు.

ముగ్ధ మనోహరం



బొమ్మనహళ్లి: బెంగళూరు మల్లతహళ్ళిలోని కళాగ్రామంలో శనివారం జరిగిన బాలల నృత్య పోటీలు ఆకట్టుకున్నాయి. బాల కళాకారులు భరత నాట్యం, యక్షగానంతో పాటు వివిధ నృత్యాలు ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. వక్తలు మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ కళాకారులు జాతీయ వేదికలపై తమ ప్రదర్శన ఇవ్వాలన్నారు.

పులి గోరు హోదాకు స్వస్తి

- జంతు అవయవాలను వెనక్కి అప్పగిస్తున్న బడాబాబులు
- ప్రభుత్వ హెచ్చరికతో కదలిక


బండీపుర అడవుల్లో పెద్ద పులులు, గోర్ల కోసం వీటిని వేటాడుతున్నారు


పులి గోరు పెండెంట్‌లను ధరించడం ప్రతిష్టగా ఉండేది

బనశంకరి: పులి గోర్లు, చర్మం, ఏనుగు దంతాలు, జింక కొమ్ములతో పాటు వన్యజీవుల కళేబరాలను ఇళ్లలో ఉంచుకోవడం కొందరు ప్రతిష్టగా భావిస్తారు. మరికొందరు వాటిని తరతరాలుగా వస్తుండడంతో ఇంట్లోనే ఉంచుకుంటే, మరికొందరు మూఢ నమ్మకాల మీద మమకారంతో దగ్గర పెట్టుకుంటారు. కానీ అటవీ చట్టాల ప్రకారం అది నేరం . ఎవరి దగ్గరైనా అడవి జంతువుల శరీర భాగాలు ఉంటే వెనక్కి ఇచ్చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఆదేశించింది. రాష్ట్రంలోని 21 అటవీ వలయాల పరిధిలో 192 మంది వన్యజీవుల అవయవాలను వెనక్కి ఇచ్చేశారు.

సెలబ్రిటీల హవా

రాష్ట్రంలో కొద్దిరోజుల క్రితం బిగ్‌బాస్ పోటీదారులు, సినీ నటులు పులి గోర్లను ధరించిన సంఘటనలు ప్రకంపనలు సృష్టించాయి. వారే కాకుండా స్వామీజీలు, నాయకులు, అనేకమంది పులిగోర్లను ధరించి ఉన్న ఫోటోలు వ్యాప్తి చెందాయి. అనేకమంది సెలబ్రిటీలకు ఈ పులి గోరు కంటకంగా మారింది. వారిపై చర్యలు తీసుకోవాలంటూ జనం నుంచి అటవీ శాఖకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వన్యజీవుల అవయవాలను వెనక్కి ఇచ్చేయడానికి గత జనవరిలో ప్రకటించి, ఏప్రిల్ వరకు గడువు ఇచ్చింది. జిల్లా అటవీ అధికారి ఆఫీసు, లేదా పోలీస్ స్టేషన్లలో అప్పగించాలని తెలిపింది.

బెంగళూరులో అధికం

వన్యజీవులకు సంబంధించి ఏ శరీర భాగం సేకరణ వన్యజీవి సంరక్షణా చట్టం- 1972 ప్రకారం నేరం. అటవీశాఖ సర్టిఫికెట్ లేకుండా ఉంచుకోవడం నేరం . అలా ఉన్నవాటిని అటవీశాఖ అధికారికి అప్పగించాలి. లేనిపక్షంలో కఠినచర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. దీంతో భయపడిన చాలామంది పులిగోర్లు, ఏనుగు దంతాలు, జింక కొమ్ములు, పులి, జింక, చిరుతల చర్మాలు, వాటి తలలు తదితరాలను అటవీశాఖ కు అప్పగించారు. వాటి విలువ ప్రపంచ మార్కెట్లో కొన్ని కోట్ల రూపాయలు ఉంటుంది. ఆ తరువాత సెలబ్రిటీలు పులి గోరు ధరించడం దాదాపు మాయమైంది. రాష్ట్రంలో ఇప్పటివరకు 192 మంది వన్యజీవుల వెనక్కి ఇచ్చేస్తే ఇందులో బెంగళూరు వలయంలో ఎక్కువ మంది ఉన్నారు. నగర పరిధిలో 110 మంది పులిచర్మం, పులి గోర్లు తదితర సామగ్రిని అటవీశాఖ కు వెనక్కి ఇచ్చేవారు. శిరసి, శివమొగ్గ, ధారవాడ, మైసూరు ప్రాంతాలు తరువాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే ఇంకా వందలాది మంది వద్ద వారసత్వంగా వస్తున్న జంతువుల భాగాలు ఉంటాయని అంచనా.


కొందరి ఇళ్లలో జింక తల అలంకారం


పులి గోరు ధరించడం చట్టరీత్యా నేరం


వన్యప్రాణుల సంరక్షణపై బెంగళూరులో బాలల ప్రదర్శన (ఫైల్)

చిరుత పట్టివేత

మైసూరు: గ్రామస్తులకు కనిపించి వారికి కంటికి నిద్ర లేకుండా చేసిన చిరుతపులి ఎట్టకేలకు బోనులోకి పడింది. ఈ సంఘటన చామరాజనగర జిల్లా హనూరు తాలూకాలోని గుండాల్ రోడ్డులో జరిగింది. ఓ చిరుతపులి రెండు వారాలుగా పట్టవీరమ్మ దొడ్డి , ఉప్పారలేఔట్, కుంచహళ్ళి చుట్టుపక్కల తిరుగుతోంది. మేకలు, కుక్కలను చంపి తింటోంది. దానిని చూసిన ప్రజలు తీవ్రంగా భయపడ్డారు. జనం ఫిర్యాదుతో అటవీ సిబ్బంది గాలింపు చేపట్టారు. శుక్రవారం రాత్రి గుండాల్ రోడ్డులో కోళ్ల ఫారం వెనుక బోనులోకి పడింది. అటవీ అధికారులు వచ్చి చిరుతను అడవిలోకి తరలించారు.

డీ గ్యాంగ్ టైటిల్‌కు నో

దొడ్డబళ్లాపురం: డీ గ్యాంగ్ పేరుతో టైటిల్ కోసం వచ్చిన అర్జీని రాష్ట్ర చలనచిత్ర వాణిజ్య మండలి తిరస్కరించింది. డైరెక్టర్ రాకి సోమ్లి మాట్లాడుతూ రెండేళ్ల క్రితమే తాను ఈ పేరుతో పాట డైరెక్ట్ చేసానని, అది యూట్యూబ్, సోషల్ మీడియాలో వైరల్ అయ్యిందన్నారు. ఈ పేరుతో తాను అప్పుడే సినిమా నిర్మించాలని అనుకున్నట్టు తెలిపారు. దర్శన్ అరెస్టు తరువాత ఎవరైనా టైటిల్ రిజిస్టర్ చేసుకుంటారనే భయంతో తాను టైటిల్ రిజిస్టర్ చేసుకోవాలని ఆశించానన్నారు. అయితే చాంబర్ వారు నిరాకరించడం బాధగా ఉందన్నారు. డి బాస్ అని దర్శన్‌ను అభిమానులు పిలుచుకుంటారు. రేణుకాస్వామి హత్య కేసుతో డీ గ్యాంగ్ అని దర్శన్, అనుచరులు అపఖ్యాతి పొందారు.

కావేరి నదిలోకి దూకి రైతు ఆత్మహత్య

మైసూరు: అప్పుల బాధను తట్టుకోలేక రైతు ఒకరు కావేరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు, ఈ సంఘటన చామరాజనగర జిల్లాలోని కొళ్ళెగాలలో జరిగింది. నంజనగూడు తాలూకాలోని తగడూరుకు చెందిన రామకృష్ణ (46) శివన సముద్రం వద్ద వంతెన వద్ద పైనుంచి కావేరి నదిలో దూకాడు. రామకృష్ణకు కొంత పొలం ఉండగా, సాగు, కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశాడు. తీర్చే మార్గం లేక కుంగిపోయాడు. పురుగుల మందు తాగి చనిపోవాలని అనుకున్నాడు కానీ ఆ ధైర్యం లేక విరమించుకున్నట్లు భార్య మాదేవి విలపిస్తూ చెప్పింది. చివరికి నదిలోకి దూకాడని తెలిపింది.

రూ.11 వేల కోట్లు ఇవ్వండి

- కేంద్రానికి రాష్ట్రం పలు డిమాండ్లు

శివాజీనగర: కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యమివ్వాలంటూ రాష్ట్రం 7 డిమాండ్లను ముందుంచింది. ఢిల్లీలో జరిగిన కేంద్ర బడ్జెట్ ముందస్తు సమావేశంలో రెవెన్యూ మంత్రి కృష్ణభైరేగౌడ పాల్గొన్నారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు డిమాండ్లను విన్నవించారు. ఆ వివరాలు..

- భద్రా అప్పర్ ప్రాజెక్ట్ నీటి సరఫరా ప్రాజెక్ట్‌కు ఇప్పటికే ప్రకటించిన రూ.5,300 కోట్ల సహాయాన్ని విడుదల చేసి, దానిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలి.
- కర్ణాటకకు ఫైనాన్స్ కమిషన్ సిఫార్సు చేసిన రూ.11,495 కోట్ల నిధులను విడుదల చేయండి.
- బెంగళూరు అభివృద్ధి, కల్యాణ కర్ణాటక అభివృద్ధి కోసం ఎస్టీ ప్యాకేజీను ప్రకటించాలి.
- అంగనవాడి, ఆశా, మధ్యాహ్నం భోజన కార్యకర్తలకు గౌరవ ధనాన్ని పెంచాలి.
- గృహ నిర్మాణాలకు ఇచ్చే సహాయాన్ని నగర ప్రాంతాల్లో రూ.1.5 లక్షల నుంచి 5 లక్షల రూపాయలకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.2 నుంచి రూ. 3 లక్షలకు పెంచాలి.
- రాయచూరుకు ఎయిమ్స్ వైద్యసంస్థను మంజూరు చేయాలి.

బీజేపీ నేత నడ్డాకు ఊరట

శివాజీనగర: గత ఎన్నికల ప్రచారంలో విద్వేషాలను పెంచేలా ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారనే కేసులో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జే.పీ. నడ్డా, పార్టీ ఐటీ ముఖ్యుడు అమిత్ మాళవీయకు హైకోర్టు ఊరటనిచ్చింది. బెంగళూరులోని మల్లేశ్వరం, హైగ్రౌండ్స్ పోలీస్ స్టేషన్‌లలో కేసు నమోదయ్యాయి. దీనిపై బీజేపీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. వారిని విచారణకు పిలువరాదని, ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని న్యాయమూర్తి కృష్ణ ఎస్.దీక్షిత్ ధర్మాసనం ఆదేశించింది.

టికెట్లలో పొరపాట్లతో సీట్లు తగ్గాయి: యడ్డి

శివాజీనగర: లోక్‌సభా ఎన్నికల్లో టికెట్ల పంపిణీలో కొంత గందరగోళం వల్ల తాము మూడు, నాలుగు సీట్లను కోల్పోయామని బీజేపీ మాజీ సీఎం బీ.ఎస్. యడియూరప్ప అన్నారు. శనివారం ప్యాలెస్ మైదానంలో నిర్వహించిన బీజేపీ- జేడీఎస్ ఎంపీల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాల హామీలిచ్చినా కూడా దయనీయమైన ఓటమిని అనుభవించిందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 130-140 సీట్లు గెలిచేలా ఇప్పటి నుంచే ప్రయత్నం ఆరంభించాలి. కార్యకర్తల శ్రమతో ఈ గెలుపు సాధ్యపడింది. టికెట్లు ఇవ్వడంలో జరిగిన పొరపాట్ల వల్ల 3-4 సీట్లను కోల్పోయామని చెప్పారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఆగ్రహాన్ని ప్రజలు ఎన్నికల ద్వారా వ్యక్తం చేశారు. ఎన్‌డీఏను 19 సీట్లలో ప్రజలు గెలిపించారు. ఎంపీలు నియోజకవర్గాల్లో ప్రధాని మోదీని ఆదర్శంగా తీసుకుని పని చేయాల్సి ఉందని పిలుపునిచ్చారు. జిల్లా పంచాయితీ, టీపీ, జీపీ ఎన్నికలలో బీజేపీ- జేడీఎస్ కలసికట్టుగా వెళ్లాలని తెలిపారు.

సబ్బు ఎంత పనిచేసింది?


మహిళను కాపాడేయత్నం చేస్తున్న భర్త, నిస్సహాయంగా బాధితురాలు

- కాలు పెట్టి భవనంపై నుంచి పడిన భార్య
- కాపాడడానికి భర్త విఫలయత్నం

బనశంకరి: అనుకోకుండా సబ్బుపై కాలు పెట్టిన మహిళ మూడంతస్తుల భవనంపై నుంచి కిందికి పడింది. ఆమెను కాపాడడానికి భర్త ఎంతో ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ సంఘటన బెంగళూరులోని డీజే హళ్లి ప్రాంతంలో రెండురోజుల కిందట చోటుచేసుకోగా శనివారం ఆ వీడియో వైరల్ అయ్యింది.

ఎలా జరిగిందంటే..

వివరాలు... డీజే హళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనకనగరలో ఓ భవనంపై రుబాయ్ (27) అనే మహిళ, ఆమె భర్త కలిసి బట్టలు ఉతుకుతున్నారు. ఆమె బట్టలు ఆరవేస్తూ సబ్బుపై కాలు పెట్టడంతో జారి కిందికి పడబోయింది. ఆమె భర్త చేయి పట్టుకుని రక్షించే ప్రయత్నం చేయగా సబ్బు వల్ల చేతులు జారుడుగా ఉండడంతో సాధ్యం కాలేదు. వారిద్దరి ఆర్తనాదాలు విని కింద రోడ్డుపై పెద్దసంఖ్యలో జనం పోగయ్యారు. ఆమె భర్త చేతుల నుంచి జారి కిందపడే సమయంలో ఓ కిటికీని పట్టుకుని కొన్ని క్షణాలు ఉండింది, కానీ మళ్లీ కిందకు పడిపోయింది. నేరుగా కింద రోడ్డుపై నిలిపిన బైక్‌ల మీద పడిపోయింది, జనం చేతులు అడ్డుపెట్టి పట్టుకునే యత్నం చేసినా ఫలితం లేదు. కాళ్లు, తలకు తీవ్ర గాయాలపాలైన మహిళను కొందరు వెంటనే సమీపంలోని విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె తీవ్ర గాయాలతో ఐసీయూలో చికిత్స పొందుతోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


గాయపడిన మహిళను తరలిస్తున్న స్థానికులు

పరప్పన జైలుకు దర్శన్


గళమెత్తిన నటి రమ్య, పోస్ట్‌లో పేర్కొన్న దర్శన్, ప్రజ్వల్-సూరజ్ సోదరులు, యడియూరప్ప


పరప్పన జైలులో దర్శన్, పవిత్ర జంట (ఫైల్)

- ముగిసిన పోలీస్ రిమాండు

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టై గత కొన్ని రోజులుగా పోలీసుల కస్టడీలో ఉన్న నటుడు, చాలెంజింగ్ స్టార్ దర్శన్‌ను జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తూ కోర్టు ఆదేశాలిచ్చింది. శనివారంతో పోలీసు కస్టడీ ముగియడంతో పోలీసులు దర్శన్‌ను కోర్టులో హాజరుపరిచారు. కోర్టు జుడిషియల్ రిమాండ్‌కు ఆదేశించింది. దీంతో దర్శన్‌తో పాటు వినయ్, ప్రదోశ్, ధనరాజ్‌లను కూడా పరప్పన అగ్రహార సెంట్రల్ జైలుకి తరలించారు. వారిని సుమారు 12 రోజుల పాటు ముమ్మరంగా విచారించి హత్య కేసులో పూర్తి సమాచారాన్ని సేకరించారు. అనేక వాహనాలు, వస్తు సామగ్రి, రూ. 30 లక్షల వరకూ నగదును సీజ్ చేశారు. ఈ కేసులో మొత్తం 17 మందిని అరెస్టు చేశారు. కాగా, దర్శన్ 13 ఏళ్ల కిందట భార్యపై దాడి కేసులో అరెస్టయి జైలుపాలయ్యాడు. ఇప్పుడు మళ్లీ అదే జైలుకి వెళ్లాడు. హత్య కేసులో ప్రథమ ముద్దాయి, దర్శన్ ప్రియురాలు పవిత్రగౌడ ఇప్పటికే పరప్పన జైలులో ఉన్నారు.

దర్శన్‌కు కోపం వస్తే విధ్వంసమే

దర్శన్‌కు మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, తగిన వైద్యం అవసరమని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఈ నెల 10వ తేదీన రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టయ్యాక దర్శన్ మానసిక పరిస్థితి చర్చకు వచ్చింది. గతంలో దర్శన్ గొడవపడిన ఘటనలు, షూటింగ్‌లో ఇతరులను కొట్టిన సంగతులు, అతని పట్టలేని ఆగ్రహం చూస్తే మానసిక రోగంతో బాధపడుతున్నారా అనే అనుమానాలు కలుగుతాయి. గతంలో దర్శన్‌కు కౌన్సిలింగ్ ఇచ్చిన మానసిక వైద్యురాలు చంద్రిక ఈ విషయాన్ని చెప్పారు. చిన్నచిన్న విషయాలకు అతిగా స్పందించడం, కోపం రావడం తదితర లక్షణాలు ఉండేవని, అయితే అతడి స్టార్డమ్ కారణంగా అవి పెద్దగా ఎవరూ పట్టించుకోలేదని, అందుకే దర్శన్ ఇంతవరకూ వచ్చాడంటున్నారు. కౌన్సెలింగ్ కొనసాగించి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదంటున్నారు. కోపం వస్తే దర్శన్ విచక్షణ మర్చిపోతారని, ఏం చేస్తున్నాడో అతడికే తెలీదన్నారు. తక్షణం అతడికి కౌన్సెలింగ్, వైద్యం చాలా అవసరమని పలువురు పేర్కొన్నారు.

ఆ నలుగురిపై రమ్య ఫైర్

దర్శన్, ప్రజ్వల్ రేవణ్ణ, సూరజ్ రేవణ్ణ, యడియూరప్పలపై నటి, కాంగ్రెస్ నాయకురాలైన రమ్య ఫైర్ అయ్యారు. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో ఘాటుగా స్పందిస్తూ పోస్టు చేసారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న, చట్టం అంటే గౌరవం లేని శక్తివంతులు, ధనవంతులు, ప్రభావిత వ్యక్తుల దుష్ట బుద్ధి, చెడు వ్యసనాలకు అమాయక మహిళలు, పిల్లలను బలి చేస్తున్నారు, వారి భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇలాంటి ఘోర సత్యాలను వెలుగులోకి తీసుకువచ్చిన మీడియా, కేసులు నమోదు చేసి పనిచేస్తున్న పోలీసులకు అభినందనలు అన్నారు. ఇలాంటి కేసుల విచారణ త్వరగా తేల్చి నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని కోరారు. పోస్టుతో పాటు దర్శన్, ప్రజ్వల్, యడియూరప్ప, ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణల ఫోటోలను పోస్ట్ చేశారు.

క్లుప్తంగా

గనుల తవ్వకాలకు అనుమతి తగదు


మాట్లాడుతున్న ఎస్ఆర్ హిరేమఠ్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో నూతన గనుల తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతిని ఇవ్వడం తగదని సమాజ పరివర్తన సముదాయ అధ్యక్షుడు ఎస్ఆర్ హిరేమఠ్ పేర్కొన్నారు. శనివారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బళ్లారి జిల్లా సండూరు వద్ద నూతనంగా గనుల తవ్వకాలకు కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి అనుమతించడాన్ని తప్పుబట్టారు. ఈ విషయంలో గనులు, పర్యావరణ సంరక్షణ మండలి అధ్యక్షురాలు శాలిని రజనీష్‌ను బదిలీ చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించి రెండు చోట్ల అక్రమ గనులు తవ్వడానికి అనుమతులివ్వడం సరికాదన్నారు. అక్రమ గనుల సంరక్షణకు బళ్లారితో పాటు మరో మూడు జిల్లాల్లో ఆందోళనకు శ్రీకారం చుడతామన్నారు. జాన్ వెస్లీ, అస్లాం పాషా, మల్లయ్య జేరబండిలున్నారు.

వైభవంగా ఊయల సేవలు


ఊయల సేవలో పాల్గొన్న భక్తులు

రాయచూరు రూరల్: ఏరువాక పున్నమి సందర్భంగా శనివారం నగరంలోని కందగడ్డ మారెమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. నగరంలో అమ్మవారి ఆలయాలకు భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి గొర్రెలు, మేకపోతులను బలి ఇవ్వడానికి తీసుకొచ్చారు. కుంభ కలశాలతో ముత్తైదువులు దీపాలు మోశారు.

సిలిండర్ పేలుడులో ఒకరి మృతి

సాక్షి,బళ్లారి: కలబుర్గి నగరంలో ఓ హోటల్‌లో శుక్రవారం సిలిండర్ పేలిన ఘటనలో గాయపడిన 10 మందిలో ఒక వ్యక్తి మృతి చెందాడు. కలబుర్గిలోని సప్తగిరి హోటల్‌లో సిలిండర్ పేలడంతో 10 మందికి పైగా తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. దీంతో స్థానికులు వెంటనే గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించగా, వారిలో మల్లికార్జున అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన వారిని బెంగళూరు విక్టోరియా, మీరజ్ ఆస్పత్రులకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

మొక్కల పెంపకం పర్యావరణానికి ఊతం


విద్యార్థులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

రాయచూరు రూరల్: విద్యార్థులు విజ్ఞానంపై జాగృతం కావాలని విజ్ఞానవేత్త కమల్ లోదియా పేర్కొన్నారు. శనివారం తాలూకాలోని ఇడపనూరు ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యా శాఖ, భారత జ్ఞాన విజ్ఞాన సమితి, సైన్స్ కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలతో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సంవాదంలో పాల్గొని మాట్లాడారు. నేడు ఉష్ణోగ్రతలతో పోరాడుతున్న అంశాన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కలు పెంచడం, పరిసరాలను సంరక్షించడం మనందరి కర్తవ్యమన్నారు. సమావేశంలో ఆంజనేయ, హఫీజుల్లా, విజయలక్ష్మి, కాంతా, ప్రమీల, రత్నమ్మ, నరసప్ప, సురేష్, శంకర్, తిమ్మప్పలున్నారు.

ట్రాఫిక్ నియమాలను పాటించాలి


ప్రచారం చేస్తున్న ఉమేష్ కాంబ్లే



రాయచూరు రూరల్: ట్రాఫిక్ నియంత్రణకు ప్రాధాన్యతనిచ్చి ప్రమాదాలను నివారించాలని సదర్ బజార్ పోలీస్ స్టేషన్ సీఐ ఉమేష్ కాంబ్లే పేర్కొన్నారు. శనివారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ అంతరాయం నివారణపై ఏర్పాటు చేసిన అవగాహన జాతాకు శ్రీకారం చుట్టి మాట్లాడారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదం నుంచి రక్షణ పొందాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు.

దేశానికి వెన్నెముక అన్నదాత



రాతిదూలం లాగే పోటీలను ప్రారంభిస్తున్న స్వామీజీ, మున్నూరు కాపు సమాజం నేతలు


ఎద్దుల పోటీలను వీక్షించేందుకు కిక్కిరిసిన జనం

- పల్లెసీమలకు పట్టుకొమ్మలు ఉత్సవాలు
- వేడుకల్లో సచ్చిదానంద సరస్వతి స్వామీజీ

రాయచూరు రూరల్: రైతులు దేశానికి వెన్నెముకలాంటివారని, పల్లెసీమలకు పట్టుకొమ్మలు ముంగారు ఉత్సవాలని హరిహరపుర ఆదిశంకరాచార్య శారదా లక్ష్మీనరసింహ పీఠాధిపతి స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతి మహాస్వామీజీ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఏపీఎంసీ ఆవరణలో మున్నూరు కాపు సమాజం ఆధ్వర్యంలో ముంగారు ఉత్సవాల్లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎద్దులతో రెండు టన్నుల రాతి దూలం లాగే పోటీలను ప్రారంభించి ప్రసంగించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పొలంలో విత్తనాలు చల్లుకొని పంటలు బాగా పండాలని కోరుకుంటూ బసవన్నకు పూజలు చేయడం, వాటిని ఊరేగించడం ఆనవాయితీ అన్నారు. ఎద్దులతో చేపట్టే ముంగారు మున్నూరు కాపు సంబరాలు రాష్ట్రానికి గర్వకారణం అన్నారు. రైతులకు మొదటి పండుగ ఏరువాక పున్నమి ఖరీఫ్ సీజన్‌లో రైతులు పొలాలను పదును చేసుకోవచ్చన్నారు.

అలరించిన నృత్యప్రదర్శనలు

అంతకు ముందు ముంగారు సాంస్కృతిక ఉత్సవాలకు శాంతమల్ల శివాచార్య, మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి శ్రీకారం చుట్టారు. శుక్రవారం రాత్రి మున్నూరు కాపు సమాజం వివిధ కళాకారులతో చేపట్టిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. తెలంగాణ, కర్ణాటక, కేరళ, పంజాబ్, న్యూఢిల్లీ నుంచి వచ్చిన కళా బృందాలు తమ ప్రదర్శనలు చేశాయి. వైజాగ్ నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రతిభను చాటారు. కార్యక్రమంలో లోక్‌సభ సభ్యుడు కుమార నాయక్, మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి, మున్నూరు కాపు సమాజం అధ్యక్షుడు నరసారెడ్డి, బసవరాజరెడ్డి, శేఖర్ రెడ్డి, క్రీడా సహాయ కార్యదర్శి పుల్లా రాజేంద్రరెడ్డి, శ్రీనివాస రెడ్డిలున్నారు.

నంద్యాల జిల్లా ఎద్దులు ప్రథమం

నగరంలో శనివారం ఏపీఎంసీ మైదానంలో ఎద్దులకు నిర్వహించిన రెండు టన్నుల రాతి దూలం లాగే పోటీల్లో నంద్యాల జిల్లా కొత్తూరుకు చెందిన బులుసు సుబ్రమణ్యేశ్వర రెడ్డి ఎద్దులు ప్రథమ బహుమతిగా రూ.90 వేలు, సూర్యాపేట జిల్లా సురనగర ఎస్ఆర్ఎస్ సోంకి సురేంద్రరెడ్డి ఎద్దులు ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, ప్రకాశం జిల్లా గంగణ్ణపాళెం ఉమా వెంకటేశ్‌రెడ్డి ఎద్దులు తృతీయ బహుమతిగా రూ.65 వేలు, జోగులాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం గోర్లఖాన్‌దొడ్డికి చెందిన కురువ కరెప్ప ఎద్దులు నాలుగో బహుమతిగా రూ.55 వేలు, నంద్యాల జిల్లా కొత్తూరు బులుసు సుబ్రమణ్యేశ్వర రెడ్డి ఎద్దులు ఐదో బహుమతిగా రూ.45 వేలు, కడప జిల్లా మసనపల్లి నందరెడ్డి ఎద్దులు ఆరో బహుమతిగా రూ.35 వేలు, కడప జిల్లా రంగసాయిపాళ్యం మరతల వెంకటరెడ్డి ఎద్దులు ఏడో బహుమతిగా రూ.20 వేలు నగదు పొందారు.


లీలావతి బృందం భరత నాట్య ప్రదర్శన


సమూహ నృత్య ప్రదర్శన చేస్తున్న బాలికలు

కఠోర శబ్దాలకు చెల్లుచీటీ

- 202 బైక్ సైలెన్సర్ల ధ్వంసం

హుబ్లీ: బైక్ తదితర వాహనాలకు అమర్చిన సైలెన్సర్ల ద్వారా కఠోర శబ్దాలను నడివీధుల్లో వినిపిస్తూ సామాన్య ప్రజలకు కిరికిరి కల్పిస్తున్న సంబంధిత రూ.11 లక్షల విలువ చేసే 202 సైలెన్సర్లను పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార సారథ్యంలో బోల్డోజర్‌తో ప్రజల సమక్షంలో తొక్కించి ధ్వంసం చేశారు. ప్రజల్లో జాగృతి కల్పించడానికే ఇలా చేసినట్లు పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. ట్రాఫిక్ నియమాల గురించి చైతన్య పరచడమే ఈ ప్రక్రియ ఉద్దేశం అన్నారు. ప్రజలకు అనవసరంగా ఇబ్బంది కలిగించడంతో అలాంటి కర్కశ శబ్ద బైక్ చోదకులకు గుణపాఠం చెప్పాలన్న ఉద్దేశంతో డీసీపీ, ఏసీపీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసుల బృందం 20 రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణ ద్వారా బైక్‌లు, ఇతర వాహనాలకు ఉన్న ఈ కర్కశ శబ్ద సైలెన్సర్లను జప్తు చేశారు. ఆమేరకు వీటిని ప్రజల ఎదుటే నాశనం చేసి చైతన్యం కల్పించామన్నారు. అంతేగాక ఇలాంటి కర్కశ శబ్దాల తయారీదారులైన మెకానిక్ అంగళ్లతో పాటు ప్రత్యేకించి బాధ్యులైన మెకానిక్‌లకు గట్టి హెచ్చరికలు చేశామన్నారు. ఇంతకు ముందే హెచ్చరికలు జారీ చేసినా కూడా 202 సైలెన్సర్లను జప్తు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆమె డీసీపీ సీఆర్ రవిషా, ట్రాఫిక్ విభాగం ఏసీపీ డాక్టర్ వినోద ముక్తేదార్, దక్షిణ విభాగం ఏసీపీ ఉమేష్ చిక్కమఠ, ఉత్తర విభాగం ఏసీ శివప్రకాష్ నాయక్, ట్రాఫిక్ సీఐలు జాక్సన్ డిసోజా, రమేష్ గోకాక్, మరుళ సిద్దప్ప బృందాన్ని అభినందించారు.

గొడవ చేయొద్దన్నందుకు అటవీ అధికారి దారుణ హత్య

- ఐదుగురు నిందితుల అరెస్ట్

హుబ్లీ: గొడవ చేయొద్దని వారించినందుకు తాగిన మత్తులో ఓ అటవీ శాఖ అధికారిని ఐదుగురు దుండగులు దారుణంగా కొట్టి హత్య చేసిన ఘటన యాదగిరిలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు..ఈ నెల 5న యాదగిరి జిల్లా శహాపుర పట్టణంలోని మోటగి బార్ అండ్ రెస్టారెంట్‌లో ఈ హత్య జరిగింది. మహేష్ కనకట్టి దారుణంగా హత్యకు గురైన అటవీ శాఖ అధికారి. కొందరు మద్యం తాగిన మత్తులో ఈ దారుణానికి పాల్పడి పోలీసుల చేతిలో అరెస్ట్ అయ్యారు. రాజు, రేకు నాయక్, తారాసింగ్, నర్సింగ్, ప్రకాష్ అరెస్ట్ అయిన నిందితులు. వాస్తవంగా ఆ రోజున అధికారి మహేష్ కనకట్టి సదరు బార్ అండ్ రెస్టారెంట్‌కు భోజనానికి వెళ్లాడు. అప్పటికే సదరు నిందితులు పీకలదాకా తాగి బార్‌లో చిందులు వేస్తున్నారు. దీంతో సదరు అధికారి వీరిని ఇలా చేయవద్దని బుద్ధి చెప్పబోగా నిందితులకు, అధికారికి మధ్య వాగ్వాదం జరిగింది. అది చేయి దాటిపోయి నిందితులు చేతికి దొరికిన కర్రలతో కొట్టి, కాళ్లతో తీవ్రంగా తన్ని దారుణ హత్యకు పాల్పడ్డారు. మరుసటి రోజు రెస్టారెంట్ వద్ద పడేసిన మృతదేహాన్ని పోలీసులు స్వాధీనపరచుకుని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి భార్య తన భర్తది హత్య అని ఆరోపించారు. దీంతో అనుమానంతో పోలీసులు సదరు రెస్టారెంట్‌లోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించగా హత్యోదంతం వెలుగు చూసింది. ఐదుగురు నిందితులు ప్రస్తుతం కటకటాల పాలయ్యారు. ఘటనపై శహాపుర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

క్యాసంబళ్లి జీపీ కాంగ్రెస్ కైవసం

కేజీఎఫ్: క్యాసంబళ్లి జీపీ అధ్యక్ష స్థానానికి శనివారం నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు అభ్యర్థి బళవనహళ్లి జీపీ సభ్యుడు సునీతా ఆనందరెడ్డి అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. 20 మంది సభ్యులు కలిగిన ఆ జీపీలో అధ్యక్ష స్థానానికి నిర్వహించిన ఎన్నికల్లో సునీతా ఆనందరెడ్డి, శ్రీరామరెడ్డిలు నామినేషన్ దాఖలు చేశారు. 20 మంది సభ్యులు కలిగిన పంచాయతీలో సునీతా ఆనందరెడ్డి 12 ఓట్లు, శ్రీరామరెడ్డి 8 ఓట్లు సాధించడంతో ఎన్నికల అధికారి సునీతా ఆనందరెడ్డి విజయం సాధించినట్లు ప్రకటించారు. అనంతరం సునీతా ఆనందరెడ్డి అనుచరులు బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకుని విజయోత్సవం జరిపారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురి అరెస్ట్

హుబ్లీ: నగరంలో ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసి హత్య చేయడానికి పథకం రూపొందించిన డ్రైవర్‌తో పాటు 6 మందిని మారణాయుధాలతో పాటు అరెస్ట్ చేయడంలో పాత హుబ్లీ స్టేషన్ పోలీసుల బృందం విజయవంతమైంది. ఘటన వివరాలను పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార శనివారం మీడియాకు వివరించారు. ఈ నెల 19న రాత్రి సిద్ధరూఢమఠం వద్ద ఈ కృత్యానికి పాల్పడటానికి 7 మంది ముఠా అనుమానాస్పద రీతిలో సంచరిస్తుండటం కనిపించింది. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన పాత హుబ్లీ స్టేషన్ సీఐ సురేష్ యళ్లూర నేతృత్వంలోని బృందం ముందుగా ఇద్దరిని అరెస్ట్ చేసింది. ఈ వేళ నిందితులను విచారించగా హత్య పథకంపై సమాచారం వివరాలు లభ్యం కావడంతో అప్రమత్తమైన పోలీసులు మఫ్టీలో మిగిలిన నిందితులను అరెస్ట్ చేసి పెద్ద దారుణాన్ని తప్పించారు. స్థానిక జగదీశ్ నగర్ మంజునాథ(21), సోనియాగాంధీ నగర్ పవన్(22), అరవింద నగర్ వినాయక దుండి(20), జగదీశ్ నగర్ నాగరాజ(59), రాజప్ప(28)తో పాటు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రెండు కత్తులు, రెండు చాకులు, ఆటో, రెండు బైక్‌లను జప్తు చేశారు. ఘటనకు సంబంధించి మరో నిందితుడు ఆనంద్‌నగర్ నివాసి గణేష బిలాన తప్పించుకొని పరారు కాగా పోలీసులు గాలిస్తున్నారు. పాత కక్షల నేపథ్యంలో దీపక్ ధార్వాడ అనే వ్యక్తి హత్యకు పథకం రూపొందించినట్లుగా నిందితులు నోరు విప్పారన్నారు.

నవవధువుపై అత్యాచారయత్నం

- ఎదురు తిరిగినందుకు చాకుతో హత్యాయత్నం
- ఇరుగు పొరుగు రక్షించి ఆస్పత్రిలో చేర్పించిన వైనం
- నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగింత

సాక్షి,బళ్లారి: ఇటీవల వివాహమైన నవవధువుపై ఓ దుర్మార్గుడు అత్యాచారయత్నానికి పాల్పడగా సదరు మహిళ తిరగబడటంతో చాకుతో హత్యాయత్నానికి పాల్పడిన ఘటన దావణగెరె జిల్లాలో చోటు చేసుకుంది. దావణగెరె జిల్లా జగళూరు తాలూకా చిక్కమ్మనహట్టి గ్రామంలోని గొల్లలదొడ్డికి చెందిన ఓ మహిళకు ఇటీవల వివాహమైంది. ఆమె రెండు రోజుల క్రితం పుట్టింటికి రావడంతో పక్కింటి కాటప్ప(30) అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేరని గమనించి మహిళపై అత్యాచారానికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో చాకుతో పొడవడంతో గట్టిగా అరిచింది. దీంతో ఇరుగుపొరుగు వారు వెంటనే అక్కడికి చేరుకోవడంతో అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తి పారిపోవడానికి యత్నించాడు. వెంటనే గ్రామస్తులు కూడా పరుగు తీసి సదరు వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు గాయపడిన మహిళను స్థానిక ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు.

పెట్రో ధరల పెంపుపై నిరసన

హొసపేటె: రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ శనివారం సండూరు తాలూకా బీజేపీ కార్యకర్తలు శనివారం ర్యాలీ చేపట్టారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభించి తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీ సందర్భంగా పార్టీ నేత కేఎస్ దివాకర్ మాట్లాడుతూ సామాన్య ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాన్ని ఖండిస్తున్నామన్నారు. పెట్రోల్, డీజిల్‌తో సహా నిత్యవసర వస్తువుల ధరలు కూడా భారీగా పెంచే అవకాశం ఉందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు పంపాపతి, నానాసాహెబ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నోరూరిస్తున్న నేరేడు పండ్లు

- జోరుగా సాగుతున్న నేరేడుపండ్ల వ్యాపారం
- కిలో ధర రూ.150 నుంచి రూ.200ల పైమాటే
- ప్రతి రైతుకు నేరేడు చెట్ల పెంపకంతో ఆదాయం


రాయల్ సర్కిల్ వద్ద నేరేడుపండ్ల అమ్మకాలు సాగిస్తున్న దృశ్యం


నగరంలో రోడ్డు పక్కన నేరేడుపండ్లను గంపల్లో అమ్ముతున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: ఆయా సీజన్‌లో పండే పండ్లకు మార్కెట్‌లో మంచి గిరాకీతో పాటు ఆయా పండు తినడం వల్ల ఎన్నో రకాలుగా ఆరోగ్య సమస్యలకు మేలు చేకూరుస్తుంటాయి. ఏడాది పాటు కాకుండా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో పండే నేరేడు పండుకు ఘనమైన చరిత్ర ఉంది. నల్లగా, నీలంగా కనిపించే నేరేడు పండ్లు చూస్తే ఎవరికైనా నోరూరుతాయి. అలాంటి నేరేడు పండ్లు ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత దాదాపు మూడు నెలల పాటు మార్కెట్‌లో కనిపిస్తాయి. నేరేడు చెట్లలో కూడా జూన్ నెల ప్రారంభం నుంచి ఆగస్టు నెల వరకు నేరేడు పండ్లు కాయడం ఆనవాయితీ. ఈనేపథ్యంలో గత 15 రోజుల నుంచి నగరంలో నేరేడు పండ్ల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. రాయల్ సర్కిల్, మోతీ సర్కిల్, అనంతపురం రోడ్లలో రోడ్డు పక్కనే గంపల్లో పెట్టుకుని నేరేడు పండ్ల అమ్మకాలు కొనసాగుతుంటాయి. ఉదయమే నేరేడు పండ్లను గంపల్లో తీసుకుని వచ్చి వ్యవసాయ కూలీలు వ్యాపారాలు చేస్తుంటారు. నేరేడు పండ్లు ఎంతో రుచిగా ఉండటంతో పాటు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేకూరుస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు.

ఈ పండ్లకు మారుపేరు డీ.నాగేనహళ్లి

మారుతున్న కాలానుగుణంగా ఆహారపు అలవాట్లు మారిపోవడంతో పాటు శారీరక శ్రమ లేకపోవడంతో వయస్సుతో తేడా లేకుండా చక్కెర వ్యాధితో చాలా మంది ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి వారు ఈ సీజన్‌లో లభించే ఈ నేరేడు పండ్లను వారంలో కనీసం నాలుగు రోజులు తినడం ద్వారా చక్కెర వ్యాధికి కూడా చెక్ పెట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వైద్యులు ధ్రువీకరిస్తున్నారు. రోజురోజుకు నేరేడు పండ్లు కొనుగోలు చేసే వారు కూడా పెరిగిపోతున్నారని చెప్పవచ్చు. నేరేడు పండ్లకు జిల్లాలోని దాసరనాగేనహళ్లి పెట్టింది పేరు. ఈ గ్రామం చిన్నదే అయినా ప్రతి రైతు తమ పొలంలో కనీసం 10 నేరేడు చెట్లను పెంచుతూ ఆదాయం పొందుతున్నారు. సపోటా చెట్లలో అంతర పంటగా నేరేడు చెట్లు పెంచుతూ సీజన్‌లో ఒక్కో చెట్టు నుంచి కనీసం రూ.10 లకు పైగా ఆదాయం లభిస్తుందని నేరేడు చెట్లు పెంచే రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం చెట్టు నుంచి నేరేడు కాయలను కోసిన తర్వాత మరసటి రోజు ఉదయమే గంపల్లో తీసుకుని బళ్లారి నగరానికి చేరుకుని ప్రధాన వీధుల్లో పెట్టుకుని అమ్మకాలు సాగిస్తుంటారు.

రెండు నెలల పాటు భారీ డిమాండ్

నాగేనహళ్లి గ్రామంలోని కూలీలతో పాటు రైతులు కూడా గంపల్లో మోసుకుని వీధుల్లో తిరుగుతూ, నగరంలో ప్రధాన రహదారి రోడ్డు పక్కనే ఉంచుతూ వ్యాపారం చేసుకుని చేతి నిండా డబ్బులు సంపాదించుకుంటున్నారు. ఒక్కో కేజీ నేరేడు పండ్లు ఆకృతిని బట్టి రూ.150 నుంచి రూ.200ల ధర నిర్ణయించారు. గత 15 రోజుల నుంచి నగరంలో విరివిగా నేరేడుపండ్ల అమ్మకాలు సాగుతున్నాయి. మామిడి పండ్ల సీజన్ ముగిసే సమయంలో నేరేడు పండ్లు సీజన్ ప్రారంభం కావడంతో పండ్లు బాగా తినే వారికి నేరేడు పండ్లు కొంత వగరు అనిపించినా ఇందులో ఒక్క చక్కెర వ్యాధికే కాకుండా ఎన్నో రకాలు ఔషధ గుణాలు ఉండటంతో పలు రకాల ఆరోగ్య సమస్యలకు రామబాణంగా పని చేస్తాయని వైద్యులే కాకుండా మన పెద్దలు కూడా చెబుతుండటంతో ఇంకెందుకు ఆలస్యం మరి నేరేడుపండ్ల సీజన్ ముగిసేలోపు ప్రతి రోజు నాలుగు నేరేడుపండ్లు తినేందుకు ప్రయత్నించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా చిన్నపిల్లలకు కూడా ఎంతో మేలు చేకూరుస్తాయని, రోగనిరోధక శక్తిని పెంచుతాయని కూడా చెప్పవచ్చు.

జిల్లా ఇంచార్జి మంత్రిగా జమీర్ అహ్మద్?

సాక్షి,బళ్లారి: వాల్మీకి అభివృద్ధి మండలిలో చోటు చేసుకున్న అక్రమాల నేపథ్యంలో మంత్రి పదవికి నాగేంద్ర రాజీనామా చేయడంతో బళ్లారి జిల్లా ఇంచార్జి మంత్రి పదవి ఖాళీగా ఉంది. దీంతో విజయనగర జిల్లా ఇంచార్జి మంత్రిగా పని చేస్తున్న జమీర్ అహ్మద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి బళ్లారి జిల్లాలో రెండు రోజుల పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం సిద్ధరామయ్యను విలేకరులు అడిగిన ప్రశ్నకు విజయనగర జిల్లా ఇంచార్జి మంత్రి జమీర్‌ను నియమిస్తామని చెప్పారు. దీంతో ఆయన నియామకంపై తగిన సూచనలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అయితే అధికారికంగా ఆదేశాలు రాకపోవడంతో జమీర్‌నే నియమిస్తారా? లేక ఇంకొకరికి బాధ్యతలు అప్పగిస్తారా? అన్న చర్చ సాగుతోంది.

ఆరోగ్యం క్షీణించి చిన్నారి మృతి

సాక్షి,బళ్లారి: బెళగావి జిల్లాలోని రామతీర్థనగర్‌లో ఇటీవల చిన్నారుల అమ్మకాలు సాగించే ముఠాను పట్టుకోగా, వారిలో ఓ నెల రోజుల వయస్సుగల చిన్నారి అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. బెళగావి జిల్లాలోని కిత్తూరు పట్టణంలో నకిలీ వైద్యుడు అబ్దుల్ గఫూర్ ఐదు మంది చిన్నారుల అమ్మకాలు సాగిస్తుండగా పోలీసులు వల పన్ని ఈ ముఠాను పట్టుకున్నారు. మృతి చెందిన చిన్నారి నెలలు నిండకనే పుట్టడంతోనే ఆరోగ్యంలో హెచ్చుతగ్గులు కనిపించడంతో ఆస్పత్రిలో చేర్పించారు. అయితే చికిత్స ఫలించక మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో మృతి చెందిన చిన్నారికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి మృతదేహాన్ని పోలీసులకు అప్పగించారు.

రైతు సమస్యల్ని పరిష్కరిస్తా


ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న దృశ్యం

హొసపేటె: కమలాపుర ఫిర్కా పరిధిలో సుమారు 1700 ఎకరాల బగర్ హుకుం సాగు భూమిలో రైతులకు పట్టాలు పంపిణీ విషయమై ముఖ్యమంత్రితో చర్చించి నిబంధనల ప్రకారం ప్రభుత్వం ద్వారా రైతులకు న్యాయం జరిగేలా చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎమ్మెల్యే గవియప్ప అన్నారు. శనివారం ఆయనను రైతులు కలుసుకుని తమ గోడు వినిపించి పట్టాలు పంపిణీ చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే స్పందించి రైతుల సమస్యలపై తహసీల్దార్, మండల అటవీ సంరక్షణాధికారిని పిలిపించి సమావేశం నిర్వహించి మరింత సమాచారం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమలాపుర ఫిర్కా రైతులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాళెప్ప, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా హనుమక్క


హనుమక్క

హొసపేటె: విజయనగర జిల్లాలో 2023–24వ సంవత్సరపు ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాలు దారుణంగా పడిపోవడంతో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డిప్యూటీ డైరెక్టర్ యువరాజ నాయక్‌ను తక్షణమే సర్వీసు నుంచి సస్పెండ్ చేసినట్లు కర్ణాటక ప్రభుత్వ పాఠశాల విద్యా జాయింట్ డైరెక్టర్ కార్యాలయం హెచ్‌సీ చంద్రశేఖర్ ఆదేశించారు. ప్రస్తుతం విజయనగర జిల్లా పాఠశాల విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ సస్పెన్షన్ కారణంగా ఖాళీగా ఉన్న పోస్టులో అదనపు బాధ్యతలను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ప్రిన్సిపాల్ హనుమక్క నిర్వహించాలని అడ్మినిస్ట్రేటివ్ విభాగం ఆదేశించింది. జిల్లా పాఠశాల విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలను స్వీకరించిన తర్వాత నివేదిక ఇవ్వాలని కోరారు.

మోదీ వల్లే యోగాకు విశ్వ ఆదరణ


యోగా గురువు రామకృష్ణతో స్థానిక ప్రముఖులు

బళ్లారిఅర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా బీజేపీ రైతు మోర్చా ఆధ్వర్యంలో స్థానిక బ్యాంక్ కాలనీలో యోగా గురువు రామకృష్ణ సారథ్యంలో వివిధ యోగాసనాలను ప్రజలకు నేర్పించారు. సూర్యాసనం, ప్రాణాయామం తదితర ప్రక్రియలను రామకృష్ణ చక్కగా వివరించారు. ఈ సందర్భంగా బీజేపీ రైతు మోర్చా జిల్లాధ్యక్షుడు గణపాల్ ఐనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన భారత దేశ ప్రాచీన యోగా పరంపరలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించడానికి ఎంతో కృషి చేశారన్నారు. స్థానిక ప్రముఖులు తిమ్మారెడ్డి, అనితకుమారి, భవిత, మోహన్, వేణుగోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రమీల, గిరి గోవిందరెడ్డి, జయశ్రీ, మమత, తులసీదేవి, విఠల్, డాక్టర్ సాయి ప్రసాద్ రెడ్డి, ప్రవీణ్, గౌతమ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు నైతికత ఉందా?

గంగావతి రూరల్: నగరంలోని శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో శనివారం కేపీసీసీ మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి శైలజా హిరేమఠ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే నిధులు కావాల్సినప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు కావాలి. ఇప్పుడు తన స్వార్థం కోసం కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేరుగా మద్దతు తెలిపిన గాలి జనార్దన్‌రెడ్డి అనంతరం బీజేపీలోకి జంప్ చేసి కాంగ్రెస్ నేతలకు వ్యతిరేకంగా మాట్లాడేందుకు నైతికత ఉందా? అని మండిపడ్డారు. అనంతరం ఎమ్మెల్యే చిత్రపటానికి అవమానం చేయబోతుంటే పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులకు, మహిళా నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. పకీరమ్మ, రేణుకమ్మ దాసర్, ప్రభావతి, యల్లమ్మ, లక్ష్మి కల్మని, రేవతి భావికట్టితో పాటు అనేక మంది మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.